



www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI






గురువారం | 4-7-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 96 | వరంగల్

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, కృష్ణపక్షం; తిథి: త్రయోదశి ఉ. 5.54, చతుర్దశి తె. 4.57 వరకు; నక్షత్రం: మృగశిర తె. 3.54 తదుపరి ఆర్ద్ర; వర్జ్యం: ఉ.9.39-11.15; దుర్ముహూర్తం: ఉ.10.09-11.01, మ.3.21-4.13; అమృతఘడియలు: రా.7.10-8.45; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 5.49; సూర్యాస్తమయం: 6.49

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru




# 'టాప్'లేపిన హార్దిక్ పాండ్యా

ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్

**దుబాయ్:** భారత జట్టు వరల్డ్‌కప్ నెగ్గడంలో కీలకపాత్ర పోషించిన హార్దిక్ పాండ్యా.. టీ20 ఆల్‌రౌండర్ ర్యాంకింగ్స్‌లో టాప్ లేపాడు. బుధవారం తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో ఆల్‌రౌండర్ల విభాగంలో రెండు స్థానాలు మెరుగుపర్చుకొన్న పాండ్యా.. శ్రీలంక ఆటగాడు వనిందు హసరంగ (222 పాయింట్లు)తో సమంగా అగ్రస్థానంలో నిలిచాడు. ఈ క్రమంలో ఆల్‌రౌండర్ల విభాగంలో టాప్ ర్యాంక్‌లో నిలిచిన తొలి భారత ఆటగాడిగా కొత్త రికార్డు సృష్టించాడు. స్టొయినిస్ (ఆస్ట్రేలియా), సికందర్ రజా (జింబాబ్వే), షకీబల్ (బంగ్లాదేశ్) 3,4,5 ర్యాంకుల్లో ఉన్నారు. ఇక బౌలర్ల విభాగంలో బుమ్రా 12 స్థానాలు ఎగబాకి 12వ ర్యాంక్‌లో నిలిచాడు. అక్షర్ పటేల్ ఒక స్థానం మెరుగుపర్చుకొని ఏడో ర్యాంక్‌ను, కుల్దీప్ ఎనిమిదో స్థానాన్ని దక్కించుకొన్నారు. అర్ష్‌దీప్ 4 మెట్లెక్కి 13వ స్థానానికి చేరాడు. సౌతాఫ్రికా పేసర్ ఆన్రిచ్ నోకియా ఏడు స్థానాలు ఎగబాకి రెండో స్థానం సొంతం చేసుకొన్నాడు. ఆదిల్ రషీద్ (ఇంగ్లండ్) టాప్‌లో కొనసాగుతున్నాడు.



# లాహోర్‌లో భారత్-పాక్ మ్యాచ్!

చాంపియన్స్ ట్రోఫీ

**న్యూఢిల్లీ:** వచ్చే ఏడాది పాకిస్థాన్‌లో జరగనున్న చాంపియన్స్ ట్రోఫీ షెడ్యూల్‌ను ఆ దేశ క్రికెట్ బోర్డు పీసీబీ, ఐసీసీకి సమర్పించింది. ఫిబ్రవరి 19న టోర్నీ ఆరంభమై, మార్చి 9వ తేదీన ఫైనల్ నిర్వహించేలా పీసీబీ షెడ్యూల్‌ను ఖరారు చేసింది. గ్రూప్-ఎలోని భారత్-పాక్ మధ్య మార్చి 1వ తేదీన లాహోర్‌లో మ్యాచ్ నిర్వహిస్తామని పీసీబీ షెడ్యూల్‌లో తెలియజేసింది. మొత్తం 15 మ్యాచ్‌ల్లో ఏడు లాహోర్, మూడు కరాచీ, ఐదు మ్యాచ్‌లు రావల్పిండిలో నిర్వహిస్తామని పీసీబీ తెలిపింది. చాంపియన్స్ ట్రోఫీ షెడ్యూల్‌పై బీసీసీఐకి ఐసీసీ సమాచారమిచ్చింది. అయితే, రాజకీయ కారణాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంతో చర్చించి, నిర్ణయం వెల్లడిస్తామని బీసీసీఐ బదులివ్వడంతో పాక్‌లో భారత జట్టు పర్యటనపై సస్పెన్స్ కొనసాగుతోంది.



కొకొ గాఫ్

# రూడ్‌కు షాక్

అల్కారజ్, గాఫ్ ముందంజ

వింబుల్డన్

**లండన్:** వింబుల్డన్‌లో మరో సంచలనం చోటుచేసుకుంది. 8వ సీడ్ కాస్పెర్ రూడ్‌కు రెండో రౌండ్‌లో చుక్కెదురైంది. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో ఇటలీకి చెందిన అన్ సీడెడ్ ఫాగియో ఫోగ్నిని 6-4, 7-5, 6-7 (7), 6-3తో రూడ్ (నార్వే)కు షాకిచ్చాడు. డిఫెండింగ్ చాంప్ అల్కారజ్ 7-6 (5), 6-2, 6-2తో ఉకిక్‌పై సులువుగా నెగ్గి మూడోరౌండ్లో ప్రవేశించాడు. అయితే ఐదో సీడ్ డానిల్ మెద్వెదెవ్ రెండో రౌండ్ దాటేందుకు నాలుగు సెట్లపాటు పోరాడాల్సి వచ్చింది. ముల్లెర్‌తో జరిగిన మ్యాచ్‌లో మెద్వెదెవ్ 6-7 (7), 7-6 (4), 6-4, 7-5తో నెగ్గి గట్టెక్కాడు. మహిళల రెండో రౌండ్‌లో కొకొ గాఫ్ 6-2, 6-1తో టొజోనిని చిత్తు చేసింది. కాగా, డయానా (రష్యా) 6-1, 6-1తో యూఎస్ ఓపెన్ మాజీ చాంప్ స్లోన్ స్టీఫెన్స్‌కు షాకిచ్చి మూడో రౌండ్ చేరింది. లోకల్ స్టార్ ఎమ్మా రదుకాను 6-1, 6-2తో మెర్టెన్స్‌పై, బియాంక ఆండ్రెస్కూ 6-3, 7-6(5)తో 26వ సీడ్ నొస్కోవాపై గెలిచి మూడో రౌండ్లో అడుగుపెట్టారు. ఇక, కొలిన్స్, స్విటోలినా, క్రజికోవా రెండోరౌండ్ చేరారు.

### డబుల్స్‌లో బోపన్న బోణీ.. నగాల్ అవుట్

డబుల్స్‌లో బుధవారం భారత్‌కు మిశ్రమ ఫలితాలు లభించాయి. వెటరన్ స్టార్ రోహన్ బోపన్న-ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) ద్వయం 7-5, 6-4తో నెదర్లాండ్స్ జోడీ రాబిన్ హస్-సాండెర్ అరెన్స్‌పై గెలిచి రెండోరౌండ్ చేరింది. ఇక, ఆరంభరౌండ్లో సుమిత్ నగాల్-దుసాన్ లజోవిక్ (సెర్బియా) జంట 2-6, 2-6తో స్పెయిన్ జోడీ మునార్/మార్టినేజ్ చేతిలో ఓడింది. నగాల్ సింగిల్స్‌లోనూ తొలి రౌండ్‌లోనే ఓడిన సంగతి తెలిసిందే.

## ప్రజ్ఞానందకు మరో డ్రా

**బుఖారెస్ట్ (హంగేరి):** సూపర్ బెట్ క్లాసిక్ చెస్ టోర్నీ ఏడో రౌండ్‌లోనూ భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానందకు డ్రా ఎదురైంది. బుధవారం జరిగిన ఈ రౌండ్‌లో ఇయాన్ నెపోమ్నియాచి (రష్యా)తో తలపడిన ప్రజ్ఞానంద 24 ఎత్తుల్లో పాయింటును పంచుకున్నాడు. గత రౌండ్ గేమ్‌నూ ప్రజ్ఞానంద డ్రా చేసుకున్నాడు. కాగా, గుకేశ్-కరువానా, అనీశ్ గిరి-లగ్రావ్ ఏడో రౌండ్ గేమ్‌లు కూడా డ్రాగా ముగిశాయి.



పారుల్ అరుదైన ఘనత

## పారిస్‌లో.. రెండు ఈవెంట్ల బరిలో

**న్యూఢిల్లీ:** భారత అథ్లెట్ పారుల్ చౌధురికి అరుదైన ఘనత దక్కింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఈ స్టార్ అథ్లెట్ పారిస్ ఒలింపిక్స్‌లో రెండు ఈవెంట్లలో పోటీపడనుంది. ఇప్పటికే మహిళల 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో విశ్వక్రీడలకు అర్హత సాధించిన పారుల్.. తాజాగా 5000 మీటర్ల రేసులోనూ పోటీపడేందుకు బెర్త్ దక్కించుకుంది. దీంతో పారిస్ ఒలింపిక్స్‌లో రెండు ఈవెంట్లలో బరిలోకి దిగుతున్న తొలి భారత ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్‌గా పారుల్ అరుదైన ఘనతను సాధించింది. వరల్డ్ అథ్లెటిక్ సమాఖ్య తాజాగా విడుదలచేసిన ఆటోమేటిక్ క్వాలిఫికేషన్స్ కటాఫ్ ర్యాంకింగ్స్‌లో పారుల్‌కు 5వేల మీటర్ల విభాగంలో 34వ స్థానం దక్కింది. 40లోపు ర్యాంకులో ఉండడంతో పారుల్‌కు ఈ ఈవెంట్‌లోనూ బెర్త్ ఖరారైంది.

## చాంపియన్లు వచ్చేస్తున్నారు..
# సంబరాలకు సిద్ధమా!

ముంబైలో టీమిండియా విక్టరీ పరేడ్ నేడు

భారీగా హాజరుకావాలని రోహిత్ పిలుపు

భారత జట్టును సత్కరించనున్న మోదీ

**ముంబై:** టీ20 వరల్డ్‌కప్ చాంపియన్ భారత్‌కు స్వదేశంలో అపూర్వ స్వాగతం లభించనుంది. సుదీర్ఘ విరామానంతరం జగజ్జేతగా నిలిచిన భారత జట్టు రాక సందర్భంగా గురువారం భారీగా విజయోత్సవ సంబరాలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఓపెన్ టాప్ బస్‌లో రోడ్ షో అనంతరం వాంఖడే స్టేడియంలో జట్టు సభ్యులను సత్కరించనున్నారు. బార్బడోస్ నుంచి ప్రత్యేక విమానంలో బయల్దేరిన రోహిత్ సేన గురువారం ఉదయం 6 గంటలకు న్యూఢిల్లీ విమానాశ్రయానికి చేరుకుంటుంది. హరికేన్ కారణంగా టీమిండియా ప్రయాణం కొంత ఆలస్యమైంది. 'ఎయిరిండియా ప్రత్యేక విమానంలో టీమ్ స్వదేశానికి బయల్దేరింది. హరికేన్ కారణంగా చిక్కుకుపోయిన భారత జర్నలిస్టులు, బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, కార్యదర్శి జై షా కూడా అదే విమానంలో ఉన్నారని బోర్డు ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా చెప్పాడు. ఢిల్లీలో ల్యాండ్ అయిన తర్వాత.. ఉదయం 11 గంటలకు ప్రధాని నరేంద్ర మోదీని ఆయన నివాసంలో ఆటగాళ్లు మర్యాదపూర్వకంగా కలవనున్నారు. ఆ తర్వాత విక్టరీ పరేడ్‌లో పాల్గొనేందుకు ముంబై బయల్దేరతారని శుక్లా చెప్పాడు. సాయంత్రం నారీమన్ పాయింట్ నుంచి వాంఖడే వరకు రోడ్ షో నిర్వహించిన అనంతరం సత్కార కార్యక్రమం జరుగుతుంది. నజరానాగా ప్రకటించిన రూ. 125 కోట్ల చెక్‌ను అక్కడే ఆటగాళ్లకు అందజేయనున్నారు. విక్టరీ పరేడ్‌కు క్రికెట్ ఫ్యాన్స్ భారీ సంఖ్యలో హాజరుకావాలని జై షా పిలుపునిచ్చాడు. 'టీమిండియా గెలుపు సంబరాల్లో భాగమవ్వండి. మెరైన్ డ్రైవ్ నుంచి వాంఖడే వరకు జరిగే జైత్రయాత్రలో పాలుపంచుకోండి' అని షా ఎక్స్‌లో పోస్టు చేశాడు. 2007లో ధోనీ సేన తొలిసారి టీ20 వరల్డ్‌కప్ నెగ్గినప్పుడు నిర్వహించిన సంబరాల ఫొటోను షేర్ చేస్తూ.. మళ్లీ ఇలాంటిదే జరుగుతుందని రాశాడు.

**సంబరాలు చేసుకుందాం: రోహిత్**

కెప్టెన్ రోహిత్ శర్మ కూడా ఫ్యాన్స్‌ను ఆహ్వానిస్తూ సోషల్ మీడియాలో సందేశాన్ని పోస్టు చేశాడు. 'వెస్టిండీస్ నుంచి వచ్చేస్తున్నాం. వరల్డ్‌కప్ ఇంటికి వస్తోంది. ఈ ప్రత్యేక సందర్భాన్ని మీతో పంచుకోవాలనుకొంటున్నాం. అందరం కలసి మెరైన్ డ్రైవ్, వాంఖడేలో విక్టరీ సంబరాలు చేసుకొందాం' అని రోహిత్ తన పోస్ట్‌లో పేర్కొన్నాడు. విమానంలో వరల్డ్‌కప్ ట్రోఫీని పట్టుకొని ఉన్న ఫొటోను అతను షేర్ చేశాడు. జట్టులోని మిగతా ఆటగాళ్లు కూడా విమానంలో ఉన్న ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. కాగా, విండీస్ నుంచి జట్టు రాక కోసం బోయింగ్ 777 విమానాన్ని బీసీసీఐ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.



**టీమిండియా షెడ్యూల్ ఇలా...**

| | |
|---|---|
| ఉదయం 6 గం. | ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు రాక |
| ఉదయం 9 గం. | హోటల్ నుంచి ప్రధాని నివాసానికి |
| 10-12 గం వరకు | ప్రధాని నివాసంలో సత్కారం |
| మధ్యాహ్నం 2 గం. | ముంబైకి ప్రయాణం |
| సాయంత్రం 5 గం. | వాంఖడే స్టేడియానికి రాక |
| 5 నుంచి 7 గం వరకు | ఓపెన్ బస్‌లో విక్టరీ పరేడ్ |
| రాత్రి 7 నుంచి 7.30 | వాంఖడేలో సత్కార కార్యక్రమం |

## క్వార్టర్స్‌కు టర్కీ

2-1తో ఆస్ట్రియాపై గెలుపు

యూరో కప్



డిమిరల్

**లీప్‌జిగ్ (జర్మనీ):** మెరిహ్ డిమిరల్ డబుల్ ధమాకాతో టర్కీ యూరో ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. మంగళవారం రాత్రి జరిగిన రౌండ్-16 మ్యాచ్‌లో టర్కీ 2-1తో ఆస్ట్రియాను ఓడించింది. ఆట ఆరంభమైన తొలి నిమిషంలోనే లభించిన పెనాల్టీ కార్నర్ ద్వారా డిమిరల్ గోల్ చేసి ప్రత్యర్థికి షాకిచ్చాడు. 59వ నిమిషంలో మరో కార్నర్ కిక్‌ను మెరిహ్ హెడర్ ద్వారా గోల్‌లోకి పంపి టర్కీని 2-0తో నిలబెట్టాడు. అయితే, 66వ నిమిషంలో ఆస్ట్రియా ఆటగాడు మైకేల్ గ్రెగోరిష్ గోల్ చేసి ఆధిక్యాన్ని తగ్గించాడు.

**క్వార్టర్స్‌లో ఎవరెవరు?**

**శుక్రవారం**

స్పెయిన్ X జర్మనీ (రాత్రి 9.30)

పోర్చుగల్ X ఫ్రాన్స్ (రాత్రి 12.30)

**శనివారం**

ఇంగ్లండ్ X స్విట్జర్లాండ్ (రాత్రి 9.30)

నెదర్లాండ్స్ X టర్కీ (రాత్రి 12.30)

## బాయ్‌కాట్‌కు తిరగబెట్టిన క్యాన్సర్

**లండన్:** ఇంగ్లండ్‌కు చెందిన దిగ్గజ క్రికెటర్, ప్రసిద్ధ కామెంటేటర్ సర్ జెఫ్రీ బాయ్‌కాట్ (83)కు గొంతు క్యాన్సర్ తిరగబెట్టింది. దీనికి రెండో వారాల్లో అతడికి శస్త్రచికిత్స చేయనున్నారు. 'రెండోసారి క్యాన్సర్ నుంచి కోలుకోవాలంటే మంచి వైద్యం చేయించుకోవడంతో పాటు కొంచెం అదృష్టం కూడా కలిసిరావాలి. సర్జరీ విజయవంతమైనా తిరిగి సాధారణ జీవనం గడపడం కష్టమే. అంతా మంచే జరగాలని ఆశిస్తున్నా' అని తెలిపాడు. కాగా ఈ మాజీ ఓపెనర్ 2002లో జెఫ్రీ తొలిసారి క్యాన్సర్ బారినపడ్డాడు.



## జింబాబ్వే చేరిన గిల్ బృందం

**హరారే:** టీ20 సిరీస్ కోసం శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని టీమిండియా బుధవారం జింబాబ్వే చేరుకుంది. ఇక్కడి ఎయిర్‌పోర్టులో అడుగుపెట్టిన కోచ్ వీవీఎస్ లక్ష్మణ్, సారథి గిల్ సహా జట్టు ఆటగాళ్లందరికీ జింబాబ్వే క్రికెట్ అధికారులు ఘన స్వాగతం పలికారు. జట్టు సభ్యులంతా భారత్ నుంచి నేరుగా వచ్చేయగా, కెప్టెన్ గిల్ మాత్రం న్యూయార్క్ నుంచి ఇక్కడికి వచ్చి జట్టుతో కలిశాడు. ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా సికందర్ రజా సారథ్యంలోని ఆతిథ్య జింబాబ్వే జట్టుతో టీమిండియా ఈనెల 6న తొలి మ్యాచ్ ఆడనుంది. 14వ తేదీతో సిరీస్ ముగియనుంది.

## శ్రీవారి సేవలో మహిళా క్రికెటర్లు

**తిరుమల (ఆంధ్రజ్యోతి):** టీమిండియా మహిళా క్రికెటర్లు బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, షఫాలీ వర్మ, రేణుకా సింగ్, పూజా వస్త్రాకర్, దీప్తీ శర్మ ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు.








**సరికొత్త ఉన్నత శిఖరాలకు సూచీలు.. బ్యాంకింగ్, ఎఫ్‌ఎంసీజీ షేర్ల ర్యాలీ**

**రూ.445 లక్షల కోట్లు దాటిన స్టాక్ మార్కెట్ మదుపరుల సంపద**

**ముంబై:** భారత స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం సరికొత్త ఉన్నత శిఖరాలను అధిరోహించాయి. ఇంట్రాడే ట్రేడింగ్‌లో సెన్సెక్స్ తొలిసారిగా 80,000 కీలక మైలురాయిని దాటగా.. నిఫ్టీ 24,300 స్థాయిని చేరుకుంది. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ షేర్లలో జోరుగా కొనుగోళ్లు జరపడం ఇందుకు దోహదపడింది. 80,000 ఎగువనే ట్రేడింగ్ ఆరంభించిన సెన్సెక్స్.. ఒకదశలో 632.85 పాయింట్ల వృద్ధితో 80,074.30 వద్ద సరికొత్త ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. ట్రేడింగ్ నిలిచేసరికి 545.35 పాయింట్ల లాభంతో 79,986.80 వద్ద స్థిరపడింది. సూచీకిది ఆల్‌టైం గరిష్ఠ ముగింపు. నిఫ్టీ విషయానికొస్తే, ఆరంభ ట్రేడింగ్‌లో 183.4 పాయింట్లు పెరుగుదలతో 24,307.25 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును, చివర్లో 162.65 పాయింట్లు లాభంతో 24,286.50 వద్ద సరికొత్త జీవనకాల గరిష్ఠ ముగింపును నమోదు చేసింది. అప్రతిహతంగా కొనసాగుతున్న ర్యాలీలో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ కూడా సరికొత్త జీవనకాల గరిష్ఠ స్థాయి రూ.445.43 లక్షల కోట్లకు చేరుకుంది. అమెరికన్ కరెన్సీలో ఇది 5.33 లక్షల కోట్ల డాలర్లకు సమానం. మరిన్ని ముఖ్యాంశాలు..

1 సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 23 లాభపడగా.. 6 నష్టపోయాయి. హెచ్‌సీఎల్ టెక్ షేరు యథాతథంగా ముగిసింది. అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ షేరు 2.49 శాతం వృద్ధితో సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. .

1 ప్రైవేట్ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు ఒకదశలో 3.54 శాతం పెరిగి రూ.1,791.90 వద్ద సరికొత్త రికార్డు గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి షేరు 2.18 శాతం లాభంతో రూ.1,768.35 వద్ద ముగిసింది. బ్యాంక్ మార్కెట్ విలువ మరో రూ.28,758 కోట్లు పెరిగి మొత్తం రూ.13.45 లక్షల కోట్లు దాటింది.

1 బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు 0.86 శాతం చొప్పున లాభపడ్డాయి. రంగాలవారీ సూచీల్లో బ్యాంకెక్స్ 1.75 శాతం వృద్ధి చెందగా, ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండెక్స్ 1.55 శాతం పెరిగింది. టెలికాం, సర్వీసెస్, ఇండస్ట్రియల్స్ సూచీలూ ఒక శాతానికి పైగా రాణించాయి.

1 ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ ఒక పైసా తగ్గి 83.49 వద్ద ముగిసింది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ ముడిచమురు పీపా ధర ఒకదశలో 86.25 డాలర్ల స్థాయిలో ట్రేడైంది. కాగా, ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ రేటు 2,359 డాలర్లు, సిల్వర్ 30.62 డాలర్ల స్థాయిలో ట్రేడయ్యాయి.

**బ్రజ్ ఐరన్‌కు 22 శాతం లిస్టింగ్ లాభం:** బ్రజ్ ఐరన్ అండ్ స్టీల్ లిమిటెడ్ లిస్టింగ్‌కు మంచి స్పందన లభించింది. కంపెనీ తనషేర్లను బుధవారం స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.207తో పోలిస్తే, బీఎస్ఈలో కంపెనీ షేరు 15.94 శాతం ప్రీమియంతో రూ.240 వద్ద లిస్టయింది. తొలిరోజు ట్రేడింగ్ నిలిచేసరికి 21.71 శాతం లాభంతో రూ.251.95 వద్ద స్థిరపడింది.

**రికార్డుల ర్యాలీ ఇలా...**

**57** ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 75,000 నుంచి 80,000 స్థాయికి చేరుకుంది. 70,000 నుంచి 75,000 మార్క్‌కు చేరేందుకు 80 ట్రేడింగ్ సెషన్లు పట్టింది.

**థర్డ్ బెస్ట్ 5000 ర్యాలీ**

సూచీకిది మూడో అత్యంత వేగవంతమైన 5,000 పాయింట్ల వృద్ధి.

**138** ట్రేడింగ్ సెషన్లలో 70,000 నుంచి 80,000 స్థాయికి ప్రయాణం

**ఫాస్టెస్ట్ 10,000**

సూచీకిదే అత్యంత వేగవంతమైన 10,000 పాయింట్ల ర్యాలీ.

**22.59%** గడిచిన ఏడాది కాలంలో సూచీ వృద్ధి.

**7,000** ఈ ఏడాదిలో ఇప్పటివరకు లాభపడిన పాయింట్లు

**ఐదేళ్లలో డబుల్**

కేవలం ఐదేళ్ల కాలంలోనే 40,000 నుంచి 80,000 స్థాయికి చేరుకుంది. అంటే, రెట్టింపైంది. 10,000 స్థాయి నుంచి 40,000 మార్క్‌కు చేరుకునేందుకు మాత్రం 19 సంవత్సరాలు పట్టింది.

**సెన్సెక్స్ ప్రస్థానం**

| మైలురాయి | తేదీ |
|---|---|
| 10,000 | 2006 ఫిబ్రవరి 7 |
| 20,000 | 2007 డిసెంబరు 11 |
| 30,000 | 2017 ఏప్రిల్ 26 |
| 40,000 | 2019 జూన్ 3 |
| 50,000 | 2021 ఫిబ్రవరి 3 |
| 60,000 | 2021 సెప్టెంబరు 24 |
| 70,000 | 2023 డిసెంబరు 11 |
| 71,000 | 2023 డిసెంబరు 15 |
| 72,000 | 2023 డిసెంబరు 27 |
| 73,000 | 2024 జనవరి 15 |
| 74,000 | 2024 మార్చి 6 |
| 75,000 | 2024 ఏప్రిల్ 9 |
| 76,000 | 2024 మే 27 |
| 77,000 | 2024 జూన్ 10 |
| 78,000 | 2024 జూన్ 25 |
| 79,000 | 2024 జూన్ 27 |
| 80,000 | 2024 జూలై 3 |

### వచ్చే మూడేళ్లు రిటర్నులు అంతంతే!

ఈక్విటీ మార్కెట్లు వచ్చే మూడేళ్లు ఇన్వెస్టర్లకు పంచే రిటర్నులు గత మూడేళ్ల స్థాయిలో ఉండకపోవచ్చని ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ ఎంఎఫ్ ఎమర్జింగ్ మార్కెట్స్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ ఆర్ జానకిరామన్ అన్నారు. అయినప్పటికీ, వచ్చే మూడేళ్లలో ఈక్విటీ మార్కెట్లు గణ్యమైన, ఇతర అసెట్ క్లాస్‌లతో పోలిస్తే మెరుగైన ప్రతిఫలాలు అందించగలవని ఆయన అభిప్రాయపడ్డారు.



## ఆఫీసు స్పేస్ డిమాండ్
# ఆల్‌టైమ్ హై

హైదరాబాద్‌లో 40 శాతం పెరిగిన లీజు ఒప్పందాలు

**న్యూఢిల్లీ:** ఈ ఏడాది ప్రథమార్థంలో హైదరాబాద్ సహా దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో ఆఫీసు లీజు ఒప్పందాలు రికార్డు స్థాయికి చేరాయి. ఈ కాలంలో ఈ నగరాల్లో 3,35,40,000 చదరపు అడుగుల (ఎస్ఎఫ్‌టీ) లీజు ఒప్పందాలు జరిగాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 29 శాతం ఎక్కువని ప్రముఖ రియల్టీ కన్సల్టెన్సీ సంస్థ జేఎల్ఎల్ ఇండియా తెలిపింది. దీంతో ఈ సంవత్సరం రికార్డు స్థాయిలో 6.5 కోట్ల నుంచి ఏడు కోట్ల ఎస్ఎఫ్‌టీ ఆఫీసు స్పేస్ లీజుకు ఒప్పందాలు జరిగే అవకాశం ఉందని సంస్థ అంచనా.

**హైదరాబాద్ అదుర్స్:** గత ఆరు నెలల్లో హైదరాబాద్‌లో ఆఫీసు స్పేస్ లీజు ఒప్పందాల వృద్ధిరేటు మరింత ఎక్కువగా నమోదైంది. 50 లక్షల ఎస్ఎఫ్‌టీ ఆఫీసు స్పేస్ లీజుకు ఒప్పందాలు జరిగాయి. గత ఏడాది ఇదే కాలంలో నమోదైన 36 లక్షల ఎస్ఎఫ్‌టీతో పోలిస్తే ఇది 40 శాతం ఎక్కువని కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ తాజా నివేదికలో తెలిపింది. ఎంఎన్‌సీలతో పాటు అనేక ప్రముఖ కంపెనీలు హైదరాబాద్‌లో తమ యూనిట్లు ఏర్పాటు చేసేందుకు ఎగబడుతున్నాయి. దీంతో హైదరాబాద్ ఆఫీస్ స్పేస్ మార్కెట్ కళకళలాడుతోంది.

**రూ.21,047 కోట్ల పెట్టుబడులు :** గత ఆరు నెలల్లో సంస్థాగత మదుపరులు భారత రియల్ ఎస్టేట్ రంగంలో 252 కోట్ల డాలర్లు (సుమారు రూ.21,047 కోట్లు) పెట్టుబడి పెట్టారు. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 20 శాతం ఎక్కువని కొలియర్స్ ఇండియా తెలిపింది.

## అవ్రావా ప్రాజెక్టుకు పీఈఎల్ మాడ్యూళ్లు

**హైదరాబాద్:** ఇంటిగ్రేటెడ్ సోలార్ సెల్, సోలార్ మాడ్యూళ్ల తయారీలోని ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్ 350 మెగావాట్ల మాడ్యూళ్ల సరఫరా కోసం అవ్రావా ఎనర్జీతో ఒప్పందం కుదుర్చుకుంది. అవ్రావా ఎనర్జీస్ రాజస్థాన్‌లో నిర్మిస్తున్న సోలార్ ప్రాజెక్టుకు ఈ మాడ్యూళ్లు సరఫరా చేయాల్సి ఉంటుంది. తమ అనుబంధ సంస్థలు ప్రీమియర్ ఎనర్జీస్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రీమియర్ ఎనర్జీస్ ఫోటో వోల్టాయిక్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ ఒప్పందంపై సంతకాలు చేసినట్టు పీఈఎల్ ఒక ప్రకటనలో తెలిపింది. అవ్రావా ఎనర్జీ, ప్రీమియర్ ఎనర్జీ మధ్య ఇదే తొలి భాగస్వామ్యమని కంపెనీ వెల్లడించింది.

## ఏజీఐ గ్రీన్‌ప్యాక్ రూ.230 కోట్ల పెట్టుబడులు

**ప్లాంట్ల నవీకరణ, కొత్త టెక్నాలజీల కోసం వినియోగం**

**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్):** ప్యాకేజింగ్ గ్లాస్ ఉత్పత్తుల తయారీ కంపెనీ ఏజీఐ గ్రీన్‌ప్యాక్ లిమిటెడ్ రూ.230 కోట్ల పెట్టుబడులు పెడుతున్నట్లు ప్రకటించింది. గ్రూప్‌లో ప్రధానంగా ఉన్న ఏజీఐ గ్లాస్‌ప్యాక్, ఏజీఐ ప్లాస్టిక్‌లో ఈ పెట్టుబడులు పెట్టనున్నట్లు సంస్థ సీఈఓ రాజేశ్ ఖోస్లా వెల్లడించారు. ఈ కంపెనీల్లోని ఫర్నేస్‌లను నవీకరించటం, కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీలను అమలు చేసేందుకు ఈ మొత్తాలను వెచ్చించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం కంపెనీ తెలంగాణలోని భువనగిరి, బోరబండ, ఇస్నాపూర్‌లతో పాటు కర్ణాటక, ఉత్తరాఖండ్‌లలో ప్లాంట్లను నిర్వహిస్తోందన్నారు. కాగా భువనగిరి ప్లాంట్ కంపెనీకి చాలా కీలకమైనదని, ఇందులో స్పెషాలిటీ గ్లాస్ ఉత్పత్తులతో పాటు ఫార్మా, ఆల్కహాల్ బెవరేజెస్, ఎఫ్ఎంసీజీ కంపెనీలకు అవసరమైన ఉత్పత్తులను తయారుచేస్తున్నట్లు ఖోస్లా చెప్పారు. భువనగిరి ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యం రోజుకు 154 టన్నులని ఆయన పేర్కొన్నారు. ఇంజక్షన్ వయల్స్‌కు అవసరమైన చిన్న గ్లాస్ బాటిళ్ల నుంచి కెమికల్ పరిశ్రమకు అవసరమైన పెద్ద సైజు గ్లాస్ ఉత్పత్తులను ఇక్కడ తయారు చేస్తున్నట్లు చెప్పారు. అంతేకాకుండా గ్లాస్ ప్యాకేజింగ్ రంగం కోసం ప్రత్యేకంగా ఆర్ అండ్ డీ సెంటర్‌ను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

**ఏటా 25 శాతం వృద్ధి**


గ్లోబల్ గ్లాస్ ఉత్పత్తుల పరిశ్రమ ప్రస్తుతం రూ.5.5 లక్షల కోట్ల స్థాయిలో ఉందని, 2032 నాటికి ఇది 8 లక్షల కోట్లకు చేరుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్లు ఆయన చెప్పారు. కాగా దేశీయంగా ఏటా 25 శాతం వృద్ధిని నమోదు చేస్తూ వస్తోందన్నారు. ప్రజల్లో పర్యావరణం పట్ల అవగాహన పెరుగుతుండటమే ఇందుకు ప్రధాన కారణమని ఆయన తెలిపారు. కాగా కార్యకలాపాల విస్తరణలో భాగంగా దివాలా ప్రక్రియలో ఉన్న హిందుస్థాన్ నేషనల్ గ్లాస్ అండ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌ను కొనుగోలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఖోస్లా తెలిపారు. అయితే ప్రస్తుతం ఈ అంశం సుప్రీంకోర్టు పరిధిలో ఉందని, త్వరలోనే ఇది కొలిక్కి వస్తుందని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ టర్నోవర్ రూ.2,421 కోట్లుగా ఉందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో టర్నోవర్ 25 శాతం వృద్ధి చెందుతుందని అంచనా వేస్తున్నట్లు ఖోస్లా తెలిపారు.

## 'కూ'త ఆగింది

**న్యూఢిల్లీ:** ట్విట్టర్‌కు దేశీయ ప్రత్యామ్నాయంగా వచ్చిన సోషల్ మీడియా వెబ్‌సైట్ 'కూ' మూతపడింది. నిధుల కొరత, భాగస్వామ్యం కోసం ఇతర సంస్థలతో జరిపిన చర్చలు విఫలమవడం ఇందుకు ప్రధాన కారణమని కూ తెలిపింది. 2021లో ట్విట్టర్‌పై కేంద్ర ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేయడంతో అనేక మంది రాజకీయ నేతలు, మంత్రులు, ఉన్నతాధికారులు, సెలబ్రిటీలు కూ సభ్యులయ్యారు. తర్వాత ఆ వివాదం సద్దుమణగడంతో 'కూ' హవా క్రమంగా సన్నగిల్లి చివరికి దుకాణం మూసేసుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది.

## 7సీస్‌లో ఏఐ డివిజన్


**హైదరాబాద్:** గేమింగ్ డెవలప్‌మెంట్‌లోని 7 సీస్ ఎంటర్‌టైన్‌మెంట్ గేమ్ డెవలప్‌మెంట్ సామర్థ్యాలను పెంచేందుకు ప్రత్యేకంగా ఏఐ (కృత్రిమ మేధ) డివిజన్ ఏర్పాటు చేసింది. 7 సీస్ ఏఐ పేరిట ఏర్పాటు చేసిన ఈ విభాగం ఏఐ ఆధారిత గేమింగ్ టూల్‌ను అభివృద్ధి చేస్తుంది. ఇప్పటికే ఈ విభాగంలో ప్రతిభావంతులైన నిపుణులను నియమించారు. వారు ఏఐ టెక్నాలజీలను గేమ్ డెవలప్‌మెంట్‌తో అనుసంధానం చేసే కృషి ప్రారంభించారని కంపెనీ సీఈఓ ఎల్.మారుతీ శంకర్ అన్నారు. ఈ వ్యూహాత్మక చర్య గేమ్ డెవలప్‌మెంట్‌లో నాణ్యతను, ఉత్పాదకతను పెంచుతుందన్నారు.



**బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)**

| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 72,350 ▼ | 66,300 ▼ | 96,000 ▲ |
| ముంబై | 72,230 ▲ | 66,160 ▲ | 89,700 ▲ |

**ఫారం గేటు అమ్మకం ధరలు ( నెక్ 100 గుడ్లు)**



| 4వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 525 | విజయవాడ | 540 |
| వరంగల్ | 527 | గోదావరి | 535 |
| చిత్తూరు | 573 | విశాఖపట్నం | 550 |
| | | డజను గుడ్లు రూ. | 72 |

**ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 107 | విజయవాడ | 118 |
| వరంగల్ | 107 | గుంటూరు | 118 |
| కరీంనగర్ | 107 | ఒంగోలు | 118 |
| మహబూబ్‌నగర్ | 107 | చిత్తూరు | 120 |
| కర్నూలు | 107 | నెల్లూరు | 120 |
| విశాఖపట్నం | 119 | అనంతపురం | 118 |
| గోదావరి | 118 | | |

www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 4-7-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 96 | Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | వరంగల్

## 7 మండలాలను ఏపీకి ఇచ్చిందే మీరు

మీ కల్లబొల్లి మాటల్ని ప్రజలు నమ్మరు

పదేళ్లు ఏం చేశారు?.. హరీశ్‌పై భట్టి ధ్వజం

చంద్రబాబు, రేవంత్‌రెడ్డి సీఎంలే.. గురుశిష్యులు కాదని వ్యాఖ్య

12



ప్రజాభవన్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న భట్టి

## బదిలీలకు పచ్చజెండా

**రేపటి నుంచి 20వ తేదీ వరకు ఉద్యోగుల బదిలీలు**

ఆప్షన్లు స్వీకరించి, కౌన్సెలింగ్ ద్వారా ప్రక్రియ.. ఒక్కో ఉద్యోగికి 5 ఆప్షన్లు

ఆరేళ్ల తర్వాత బదిలీలు.. ఫోకల్ నుంచి నాన్-ఫోకల్ పాయింట్లకు..

80 వేల నుంచి లక్ష మందికి స్థానచలనం!.. టీజీవో, టీఎన్‌జీవో హర్షం

రాబడుల శాఖలు, పోలీసు, రవాణా, అటవీ శాఖలకు ప్రత్యేక మార్గదర్శకాలు

21 నుంచి తిరిగి సాధారణ బదిలీలపై నిషేధం



హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. చాలా కాలం తర్వాత సాధారణ బదిలీలకు పచ్చ జెండా ఊపింది. బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసింది. ఈ నెల 5 నుంచి 20వ తేదీ వరకు బదిలీలు చేపట్టనున్నట్లు ప్రకటించింది. ఈమేరకు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు బుధవారం బదిలీల ఉత్తర్వుల(జీవో నంబర్ 80)ను జారీ చేశారు. ఉద్యోగుల నుంచి ఆప్షన్లు

మిగతా 9వ పేజీలో...

## జగన్ అక్రమాస్తుల కేసుల్లో రోజువారీ విచారణ

**సీబీఐ కోర్టుకు తెలంగాణ హైకోర్టు ఆదేశం**

ఇప్పటిదాకా పురోగతి లేదని వ్యాఖ్య

తదుపరి విచారణ 23కు వాయిదా

దశాబ్దం దాటినా తేలని 'డిశ్చార్జి పిటిషన్లు'

అసలు విచారణ జరిగేదెప్పుడో!



హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసుల విచారణలో ఎలాంటి పురోగతి కనిపించలేదంటూ తెలంగాణ హైకోర్టు పెదవి విరిచింది. ఈ కేసుల్లో రోజు వారీ విచారణ చేపట్టాలని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానాన్ని ఆదేశించింది. ఇందులో పురోగతిపై తదుపరి విచారణ నాటికి నివేదిక సమర్పించాలంటూ.. కేసును ఈనెల 23వ తేదీకి వాయిదా వేసింది. ప్రజాప్రతినిధుల కేసుల్లో విచారణ వేగవంతం చేయాలనే సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు హైకోర్టు

మిగతా 12వ పేజీలో...



ఖర్గే, రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన కేశవరావు

## ఏకాభిప్రాయం కుదర్లే..!

టీపీసీసీ చీఫ్ నియామకం.. మంత్రివర్గ విస్తరణ మరింత జాప్యం

ఆషాఢంలోపు లేనట్లే?.. ఖర్గే, రాహుల్‌తో రేవంత్ చర్చలు

తుది నిర్ణయం తీసుకోని అధిష్ఠానం.. వారం తర్వాత మళ్లీ భేటీ?

**ఖర్గే, రాహుల్ సమక్షంలో కాంగ్రెస్‌లో కే కేశవరావు చేరిక**


**చివరిశ్వాస వరకు కాంగ్రెస్‌లోనే ఉంటా: కేకే**

న్యూఢిల్లీ/హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ)కి కొత్త అధ్యక్షుడి నియామకం, రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ వాయిదా పడ్డాయి! ఆషాఢం లోపే పీసీసీ చీఫ్‌ను నియమించడంతో పాటు మంత్రివర్గ విస్తరణ కూడా ఉంటుందని అందరూ భావించగా.. కాంగ్రెస్ మార్కు రాజకీయం తెరపైకి వచ్చింది! టీపీసీసీ చీఫ్ నియామకం, మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం దాదాపు ఖరారైన తర్వాత.. వాయిదా పడింది! ఈ అంశాలపై పార్టీ నేతల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదని సమాచారం! ఈ క్రమంలోనే బుధవారం వెలువడాల్సిన నిర్ణయం మరి కొన్ని రోజులు వాయిదా పడినట్లు తెలుస్తోంది. టీపీసీసీ అధ్యక్షుడి నియామకం, మంత్రివర్గ విస్తరణపైన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల

మిగతా 11వ పేజీలో...

# అందుకే ఓడించారు

**తప్పుదోవ పట్టించినందుకు తిరస్కరించారు.. అభివృద్ధికే ప్రజలు ఓటేశారు**





రాజ్యసభలో మాట్లాడుతున్న ప్రధాని మోదీ; సభ నుంచి వాకౌట్ చేసి వెళ్తున్న ప్రతిపక్ష ఎంపీలు

రాజ్యాంగాన్ని అవమానించింది కాంగ్రెస్సే..

మూడోసారి ఓడినా తీరు మారలేదు!

అబద్ధాలు ప్రచారం చేసే వారికి.. నిజాలను వినే శక్తి ఉండదు

మణిపూర్ చిచ్చును రాజేసిన వారే.. ఇప్పుడు రాజకీయాలు చేస్తున్నారు

రాజ్యసభలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు

ప్రతిపక్ష సభ్యుల వాకౌట్

ప్రమాదకర సంప్రదాయమన్న ధన్‌ఖడ్

మోదీ అబద్ధాలు చెబుతున్నారు: ఖర్గే

న్యూఢిల్లీ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు బూటకపు ప్రచారాన్ని తిరస్కరించారని, తమను తప్పుదోవ పట్టించేవారిని ఓడించారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. పని చేసే వారినే గెలిపించారన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రాజ్యసభలో జరిగిన చర్చకు బుధవారం ఆయన సమాధానం ఇచ్చారు. పదేళ్లు అధికారంలో ఉన్న ప్రభుత్వం వరసగా మూడోసారి అధికారంలోకి రావడం ఆరు దశాబ్దాల తర్వాత ఇదే మొదటి సారి అని మోదీ చెప్పారు. భారతదేశం స్వయంసమృద్ధి, అభివృద్ధి సాధించేందుకే ప్రజలు మళ్లీ ఎన్డీయేకు అధికారం కట్టబెట్టారని తెలిపారు. ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్‌ను మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకే ఈ తీర్పు ఇచ్చారన్నారు. అధికారంలో ఎవరున్నా దేశం అభివృద్ధి చెందుతుందని, అందులో ఎవరి గొప్పతనమూ లేదని కాంగ్రెస్ చేసిన ప్రకటనను ఆయన తప్పుపట్టారు. పరాజయాల్లో హ్యాట్రిక్ కొట్టినా.. వారి తీరు మారలేదని ఎద్దేవా చేశారు. గతంలో పరిపాలనను గాలికొదిలేసి రిమోట్ కంట్రోల్ ద్వారా అధికారం చెలాయించారని కాంగ్రెస్ నేత సోనియాను ఉద్దేశించి

మిగతా 10వ పేజీలో...

**నీట్‌పై నేడు దేశవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్** 10

రాష్ట్రంలో పలు ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు సెలవు

ప్రకటించిన యాజమాన్యాలు 11



ఫోన్‌ట్యాపింగ్ కేసులో..

## ఎవ్వర్నీ వదలం

ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే నేరమిది

ముమ్మరంగా నిందితుల వేట

హైకోర్టులో ప్రభుత్వం కౌంటర్ దాఖలు

ట్యాపింగ్ బాధిత ప్రముఖుల పేర్ల వెల్లడి

జాబితాలో రేవంత్, పొంగులేటి, ఉత్తమ్, హైకోర్టు జడ్జి శరత్..

ఫోన్ ట్యాపింగ్‌పై రాష్ట్ర సర్కారు దర్యాప్తు చేస్తోంది

వివరాలు పరిశీలించాక స్పందిస్తాం: కేంద్రం అఫిడవిట్

తదుపరి విచారణ 23కు వాయిదా

హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెను సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో బాధితుల పేర్లను రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు సమర్పించింది! ఈ కేసులో ఏ చిన్న విషయాన్నీ వదలకుండా క్షుణ్ణంగా, అత్యంత పారదర్శకంగా దర్యాప్తు చేస్తున్నామని.. తప్పించుకు తిరుగుతున్న నిందితులతో సహా ఎవ్వర్నీ వదిలిపెట్టబోమని ఉన్నత న్యాయస్థానానికి నివేదించింది. ఇన్నాళ్లూ ట్యాపింగ్ బాధితుల పేర్లు మీడియాలో రావడమేగానీ.. ప్రభుత్వం అధికారికంగా వెల్లడించడం ఇదే తొలిసారి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాజకీయ నాయకులు, ప్రముఖులతోపాటు ఏకంగా హైకోర్టు న్యాయమూర్తుల ఫోన్లు సైతం ట్యాపింగ్ చేశారంటూ

మిగతా 11వ పేజీలో...



గవర్నర్‌ను కలిసిన హేమంత్ సోరెన్

## ఝార్ఖండ్ సీఎంగా మళ్లీ హేమంత్ సోరెన్

- కూటమి ఎమ్మెల్యేల ఏకగ్రీవ నిర్ణయం
- సీఎం పదవికి చంపయ్ రాజీనామా
- ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని గవర్నర్‌ను కోరిన హేమంత్ 10

## బిహార్‌లో కూలిన మరో బ్రిడ్జి 10

15 రోజుల్లో ఇది ఏడోది

## ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై క్రిమినల్ కేసు

విధులకు ఆటంకం కలిగించారని జడ్పీ సీఈవో ఫిర్యాదు 9

జడ్పీ సీఈవోపై సీపీకి కౌశిక్ ఫిర్యాదు

## భోలే బాబా పరార్!

తాను వెళ్లాకే తొక్కిసలాట జరిగిందంటూ ప్రకటన

ఇది సంఘ విద్రోహ శక్తుల పనేనని ఆరోపణ

లైంగికదాడి సహా గతంలో ఆయనపై పలు కేసులు

హత్రాస్ ఘటనపై పోలీసుల ఎఫ్ఐఆర్

80 వేల మందికి అనుమతి.. వచ్చింది 2.5 లక్షలు!

బాబా వాహన టైర్ల ధూళి కోసం పలువురి యత్నం

ఈ క్రమంలో తొక్కిసలాట.. పెను విషాదం

రిటైర్డ్ జడ్జితో విచారణ.. కుట్రకోణంపైనా దర్యాప్తు: యోగి

లఖ్‌నవూ, హత్రాస్, జూలై 3: జగమే మాయ.. మిథ్య.. అని నిత్యం ప్రవచనాలు బోధించే భోలే బాబా.. మంగళవారంనాటి హత్రాస్ దుర్ఘటన అనంతరం ఎవరికీ కనపడకుండా మాయమయ్యారు! తనను తాను అపరభగవంతుడిగా అభివర్ణించుకుంటూ చిక్కటి చిరునవ్వులతో నిత్యం భక్తజనానికి దర్శనమిచ్చే ఆయన.. బుధవారం ఉదయం పత్తా లేకుండా పోయారు! ఈ ఘటనపై దర్యాప్తు నిమిత్తం మెయిన్‌పురి జిల్లాలోని భోలేబాబా 'రామ్ కుటీర్ చారిటబుల్ ట్రస్ట్'కు వెళ్లగా.. అక్కడ ఆయన కనిపించలేదని.. ఆయన కోసం గాలిస్తున్నామని పోలీసులు చెబుతున్నారు. అయితే.. కొందరు పోలీసులు మాత్రం

మిగతా 10వ పేజీలో...

## 2 'రాష్ట్ర అతిథి గృహాలు'

ఒకటి బేగంపేటలోని పాత సెక్యూరిటీ భవనంలో

7 కోట్లతో ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో మరొకటి నిర్మాణం

సెక్యూరిటీ భవనానికి 3.3 కోట్లతో మరమ్మతులు

సీఎం క్యాంప్ ఆఫీస్‌పై కొరవడిన స్పష్టత!



ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో నూతన భవన నిర్మాణ పనులు

హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి తెలంగాణకు వచ్చే అతిథుల కోసం సర్కారు రెండు 'రాష్ట్ర అతిథి గృహాల'ను అందుబాటులోకి తీసుకురానుంది. ఇందులో ఒకటి కొత్తగా నిర్మిస్తున్నారు. మరొకటి గతంలో వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు సెక్యూరిటీ కోసం బేగంపేటలో నిర్మించిన భవనం. దాన్ని అతిథి గృహంగా మార్చనున్నారు. కొత్తగా నిర్మిస్తున్న స్టేట్ గెస్ట్ హౌస్‌ను హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం (ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ)లో ఏర్పాటు చేస్తోంది. బేగంపేటలో ఉన్న పాత సెక్యూరిటీ భవనంలో ఏర్పాటు చేయబోయే అతిథి గృహం కోసం రూ.3.30 కోట్లు

మిగతా 12వ పేజీలో...



మేడిగడ్డ బ్యారేజీ వద్ద అర్ధరాత్రి కాఫర్ డ్యాం తొలగిస్తున్న దృశ్యం

## ఏడో బ్లాక్‌లో దెబ్బతిన్న గ్రౌటింగ్?

- గిడ్డర్లు కుంగిపోయాయని ప్రచారం
- మేడిగడ్డలో అర్ధరాత్రి కాఫర్‌డ్యామ్ తొలగింపు
- హడావుడిగా పనులు చేపట్టిన ఎల్‌అండ్‌టీ

మహదేవపూర్ రూరల్, జూలై 3: మేడిగడ్డ బ్యారేజీ వద్ద అర్ధరాత్రి సమయంలో హడావుడిగా పనులు చేశారు. బ్యారేజీ ఏడో బ్లాక్‌లో దెబ్బతిన్న పిల్లర్ల వద్ద మరో సమస్య తలెత్తినట్లు తెలుస్తోంది. దీంతో నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీ బుధవారం అర్ధరాత్రి నివారణ చర్యలు చేపట్టిందన్న చర్చ జరుగుతోంది. ఏడో బ్లాక్‌కు సంబంధించి ఎగువ, దిగువన కట్టడాల్లో కదలికలను నిర్మాణ సంస్థ గుర్తించి తాత్కాలిక కాఫర్ డ్యామ్ తొలగింపును ప్రారంభించినట్లు తెలిసింది. ఇదిలా ఉంటే బ్యారేజీ ఏడో బ్లాక్‌లో పిల్లర్ల కింద ఉన్న గిడ్డర్లు కుంగినట్టు ప్రచారం జరుగుతోంది. ఆ కారణంగానే ఎల్‌అండ్‌టీ అర్ధరాత్రి నివారణ చర్యలకు దిగినట్లు సమాచారం. బ్యారేజీలో కుంగిన ఏడో బ్లాక్ కింద ఏర్పడిన అగాథాన్ని పూడ్చేందుకు చేపట్టిన గ్రౌటింగ్ ప్రక్రియ పూర్తయ్యే

మిగతా 12వ పేజీలో...

## 132 సీట్ల బస్సు



- విమానం తరహాలో సీట్లు.. 'బస్ హోస్టెస్' సేవలు కూడా..
- డీజిల్ బస్సుతో పోలిస్తే నిర్వహణ వ్యయం తక్కువ
- కాలుష్యం, రవాణా ఖర్చు తగ్గించడమే లక్ష్యం 10
- పైలట్ ప్రాజెక్టుపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి

## జైలు నుంచి జనజీవనంలోకి..

రాష్ట్ర ప్రభుత్వ క్షమాభిక్ష పొందిన 213 మంది ఖైదీల విడుదల

చర్లపల్లి జైలు నుంచి అందరూ ఒకేసారి బయటకు 9

70 మందికి పెట్రోల్ బంకుల్లో కొలువు

## యువతిపై ఇద్దరు సహోద్యోగుల అత్యాచారం

సంస్థ వెంచర్‌ను చూసేందుకు యాదగిరిగుట్టకు ముగ్గురు కారులో..

రాత్రి హైదరాబాద్‌కు తిరిగొస్తుండగా దారిలో కారు బ్రేక్‌డౌన్ అంటూ డ్రామా

మత్తుమందు కలిపిన కూల్‌డ్రింక్స్ తాగించి రేప్.. నిందితుల అరెస్ట్ 12

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

## అతివృష్టి... అనావృష్టి...

గత రెండేళ్లుగా ఆలస్యంగా వస్తున్న నైరుతీ రుతుపవనాలు ఈ ఏడాది చాలా త్వరగా వచ్చాయి. వర్షాలు సమృద్ధిగా పడతాయని అందరూ ఆశించారు. కానీ జూన్‌లో ఆశించిన మేర వర్షాలు కురవలేదు. దేశవ్యాప్తంగా జూన్‌లో వర్షపాతం సాధారణంతో పోలిస్తే 11 శాతం తక్కువగా ఉందని తాజా గణాంకాలు చెబుతున్నాయి. అయితే వర్షపాతం లోటు కంటే వివిధ ప్రాంతాల్లో వర్షపాత స్థాయిల్లో ఉన్న భారీ వ్యత్యాసాలు ఎక్కువగా కలవరపెడుతున్నాయి. దేశంలో 49 శాతం జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది. వాటిలో 18 శాతం జిల్లాల్లో వర్షపాతం లోటు 60 శాతానికి పైగా ఉంది. అయితే ఇదే సమయంలో కొన్ని ప్రాంతాలను వరదలు ముంచెత్తుతున్నాయి. జూన్‌లో వర్షాలు తక్కువగా ఉండే లద్దాఖ్ ప్రాంతంలో ఈసారి సాధారణం కంటే 385 శాతం ఎక్కువగా వర్షపాతం నమోదైంది. మొన్నటిదాకా తీవ్రమైన కరువుతో నీటి ఎద్దడిని ఎదుర్కొన్న రాజధాని ఢిల్లీ ఇప్పుడు వరదలతో అతలాకుతలమవుతోంది. సాధారణంగా మంచి వర్షాలు పడే కేరళలో ఈ ఏడాది 25 శాతం లోటు కనిపిస్తోంది.

మొన్న వేసవిలో భారతదేశం గత వందేళ్లలో ఎన్నడూ ఎరుగనంత తీవ్రమైన ఎండల్ని చవిచూసింది. అనేక ప్రాంతాల్లో 50 డిగ్రీలు దాటిన రికార్డు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వడగాడ్పుల వల్ల వందల మంది ప్రాణాలు కోల్పోయారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో ఢిల్లీ, బెంగళూరు సహా అనేక ప్రాంతాల్లో నీటి ఎద్దడి తీవ్ర స్థాయికి చేరింది. ఇప్పుడు వర్షాకాలం వచ్చినా కొన్ని చోట్ల అతివృష్టి, కొన్నిచోట్ల అనావృష్టి కనిపిస్తున్నాయి. భూగోళం వేడెక్కడం, తద్వారా వస్తున్న వాతావరణ మార్పుల వల్లే ఈ వైపరీత్యాలు సంభవిస్తున్నాయని నేడు సామాన్య ప్రజలకు కూడా అర్థమవుతోంది. కానీ తాజా లోక్‌సభ ఎన్నికల్లో గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పులపై రాజకీయ పార్టీల్లోగానీ, సామాన్య ప్రజల్లోగానీ ఎలాంటి చర్చ జరగలేదు. న్యూజిలాండ్‌లోను, కొన్ని ఐరోపా దేశాల్లోను పర్యావరణ సమస్యలు ఎన్నికల్లో ప్రధానాంశాలు అవుతుంటాయి. పర్యావరణపరంగా యాభై, అరవై ఏళ్ల తర్వాత జరగబోయే పరిణామాలు కూడా ఎన్నికల రాజకీయాల్లో చర్చకు వస్తుంటాయి. కానీ మన ఎన్నికలు మాత్రం ఎక్కువగా మతపరమైన, కులపరమైన అంశాల చుట్టే తిరిగాయి. బహిరంగ సభల్లో, రోడ్ షోల్లో వాతావరణ మార్పుల ఊసే ఎక్కడా వినిపించలేదు.

భారతదేశానికి మూడు వైపుల సముద్రం, ఒకవైపు హిమాలయాలు ఉన్నాయి. ఈ కారణంగా వాతావరణ మార్పులతో మన దేశం అత్యధిక నష్టాన్ని ఎదుర్కొనే ప్రమాదం ఉంది. భూగోళం వేడెక్కడం వల్ల సముద్ర మట్టాలు పెరుగుతాయి. దానివల్ల తీర ప్రాంతాల్లో వ్యవసాయ భూములు సాగు యోగ్యం కాకుండా పోతాయి. తాగునీటి సమస్య ఏర్పడుతుంది. డయేరియా, కలరా వంటి వ్యాధులు ప్రబలుతాయి. హిమానీ నదాలు కరిగిపోవడం వల్ల సింధు, బ్రహ్మపుత్ర నదులు ఉగ్రరూపం దాల్చి వరదలతో ముంచెత్తుతాయి. తీవ్రమైన కరవులు, లేదంటే తీవ్రమైన వరదలు ఏర్పడతాయి. ఈ రకమైన వాతావరణాన్ని మనం ఇప్పటికే చవిచూస్తున్నాం. గత ఏడాది కాలంలో దేశంలోని 90 శాతం ప్రాంతాల్లో ఇటువంటి విపరీతపు వాతావరణ పోకడలు కనిపించాయని ఢిల్లీకి చెందిన సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ తన తాజా నివేదికలో తెలిపింది. అయినా మన ఎన్నికల రాజకీయాల్లో ఇవి చర్చనీయాంశాలు కాలేదు.

ప్రధాన జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌లు రెండూ తమ మేనిఫెస్టోల్లో గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పుల గురించి కొంత ప్రస్తావించాయి. శిలాజేతర ఇంధనాల వాడకం ఇప్పటికే 44 శాతం ఉందని, దీనిని మరింత పెంచుతామని ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీ తన మేనిఫెస్టోలో తెలిపింది. 500 గిగావాట్ల పునర్వినియోగ ఇంధన ఉత్పత్తి తమ లక్ష్యమని చెప్పింది. కానీ అందుకు ఎలాంటి గడువునూ పేర్కొనలేదు. కాలుష్యాన్ని అరికట్టడం కోసం విద్యుత్ వాహనాలను విరివిగా వాడుకలోకి తెస్తామన్నది కానీ థర్మల్ విద్యుదుత్పత్తి ద్వారా ఏర్పడే కాలుష్యం గురించి మాట్లాడలేదు. దేశంలో బొగ్గు వినియోగం నానాటికీ పెరుగుతూనే ఉంది. 2023లో భారత్‌లో బొగ్గు వినియోగం మొత్తం ఉత్తర అమెరికా, ఐరోపాల వినియోగం కంటే ఎక్కువగా ఉంది.

గ్లోబల్ వార్మింగ్‌ను, వాతావరణ మార్పుల్ని అడ్డుకోవడానికి ప్రభుత్వాలు భవిష్యత్తులో భారీఎత్తున చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. అలాంటి చర్యలకు ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతుంది. రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో ఆయా అంశాలను ప్రజల్లో చర్చకు పెట్టకపోతే, వాటికి పరిష్కారాలను ఆలోచించకపోతే, వాటిపై ప్రజల్లో ఏకాభిప్రాయాన్ని నిర్మించకపోతే రేపు ఎలాంటి దిద్దుబాటు చర్యలైనా తీసుకోవడం చాలా కష్టమవుతుంది. కానీ మన పార్టీల్లో ఆ అవగాహన కానీ, ఆసక్తిగానీ కనిపించకపోవడం విచారకరం. ప్రకృతి వైపరీత్యాల అతివృష్టిని రాజకీయ శ్రద్ధాసక్తుల అనావృష్టితో ఎదుర్కోవడం అసంభవం.

# ఆధునికులం, నాగరికులం కదా, అట్లా ఉండలేమా?






▪ కె. శ్రీనివాస్

సందర్భం

పోయిన శనివారం నాడు హైదరాబాద్‌లో డేనియల్ ఫెర్నాండెజ్ అనే హాస్యకళాకారుడి ప్రదర్శన చివరి నిమిషంలో రద్దు అయింది. "నువ్వు కనుక ప్రదర్శన నిర్వహిస్తే, నా అనుచరులు వచ్చి దేహశుద్ధి చేస్తారు, మరెప్పుడైనా తెలంగాణ రావాలనుకుంటే యాభైసార్లు ఆలోచిస్తావు" అని బీజేపీ శాసనసభ్యుడు టి. రాజాసింగ్ విడియో ప్రకటన ద్వారా ఆ కమెడియన్‌ను హెచ్చరించడమే ఆ రద్దుకు కారణం. రాజాసింగ్ ఆ ప్రకటనలో పోలీసులకు కూడా గట్టి హెచ్చరిక చేశారు. ఆ ప్రదర్శనకు అనుమతి రద్దు చేయకపోతే, "మరెవరన్నా జైన, హిందూ మతాల మీద జోక్ చేయాలంటే వణికిపోయేంతగా ఆ కమెడియన్‌కు బుద్ధి చెబుతాము" అని ఆయన అన్నారు. ఫెర్నాండెజే తన షోను రద్దు చేసుకున్నారు. తన తాజా విడియో జైనులను నొప్పించినందుకు మరోసారి క్షమాపణలు చెప్పారు.

ఇంతకూ ఆ నొప్పించిన విడియో ఏమిటి? బక్రీద్ సందర్భంగా ఢిల్లీలో కొందరు జైనమతస్థులు వీలయినంత జీవహింస నివారించడం కోసమని, ముస్లిముల వేషంలో వెళ్లి, కోతకు అమ్మకానికి ఉన్న 124 మేకలను కొన్నారు. అందుకోసం 15 లక్షల రూపాయలు సమీకరించుకున్నారు. ఈ వార్త అన్ని పత్రికల్లో, చానెళ్లలో ప్రముఖంగా ప్రచారమయింది కూడా. ఈ ఉదంతం మీద ఫెర్నాండెజ్ చేసిన విడియోలో కొన్ని ఛలోక్తులున్నాయి. దాని మీద వెంటనే ఎన్నో అభ్యంతరాలు ఆ విడియో పోస్టు కిందటే వెలువడ్డాయి. కొందరు బెదిరింపులు, దూషణలు కూడా చేశారు. ఆ హాస్య కళాకారుడు తన క్షమాపణలు కూడా అక్కడే చెప్పారు. అయినప్పటికీ, హైదరాబాద్‌లో మాత్రం రాజాసింగ్ ద్వారా స్పందన తీవ్రంగా వ్యక్తమైంది.

అనేక హాస్య స్ఫోరక ఉదంతాలను ప్రస్తావిస్తూ, అనర్గళంగా చమత్కారాలు గుప్పిస్తూ, ప్రేక్షకులను రంజింప చేసే ప్రదర్శనలు పదిపదిహేనేళ్లుగా ప్రాచుర్యం పొందాయి. ఆ విదూషకుల భాషా విన్యాసం, హాస్యప్రియత్వం చూస్తే ముచ్చట కలుగుతుంది. వీరిలో రాజకీయ నిశితత్వం ఉన్న కమెడియన్లు మరింతగా ఆకట్టుకుంటారు. వీరి కళలో వెక్కిరింత ఒక భాగం కాబట్టి, వివిధ భాషా, మత, ప్రాంత శ్రేణుల అలవాట్లను, సాంస్కృతిక విశేషాలను ప్రస్తావించకతప్పదు. హాస్యానికి, అపహాస్యానికి తేడా పాటించక, గీత దాటే కమెడియన్లు కొందరు ఉంటారు. వారు తరచు వివాదాస్పదమవుతారు. ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించేవారు కూడా, ప్రేక్షకులకు సెన్స్ ఆఫ్ హ్యూమర్ లేకపోవడం వల్ల నిరసనలు ఎదుర్కొంటారు. విస్తృత ప్రజా వర్గాలను ఉద్దేశించి పనిచేసే రకరకాల సమాచార, ప్రసార సాధనాలు, సృజనాత్మక వ్యక్తీకరణలు అన్నీ కూడా ఎక్కడో ఒకచోట ఎప్పుడో ఒకప్పుడు పొరపాటు చేయడమో, కొన్ని వర్గాల నుంచి పొరపాటుగా దాడికి గురికావడమో సహజం. "హాస్య కళాకారుల వృత్తిలోనే ఈ ప్రమాదం ఉన్నది, అందరినీ సమానంగా రంజింపజేయలేము. ఎప్పుడో ఒకసారి అప్రియమైన స్పందనలు ఎదురవుతాయి" అని ఫెర్నాండెజ్ తమ రంగంలోని సమస్యల గురించి చెప్పారు. ఒక కళాకారుడి ప్రదర్శనతో విభేదించవచ్చు, "అభ్యంతరం చెప్పవచ్చు, కానీ, హింస ప్రయోగిస్తామని హెచ్చరించడం సరి కాదు కదా?" అని ఆయన ఆవేదన చెందారు.

నిజంగా మరో మార్గం లేదా? మనోభావాలు గాయపడిన వారు కళాకారులకు తమ నిరసన చెప్పడమూ, ఆ కళాకారుడు తన తప్పును గ్రహించి కానీ, తన చర్యను వివరించి కానీ సమాధానం ఇవ్వడం వంటి ప్రజాస్వామిక పరిష్కారాలు ఇటువంటి సమస్యలకు లభించవా? ఒక కళాకారుడి ప్రదర్శనను రద్దు చేయించడమే న్యాయమైన ప్రతిస్పందనా? తన నియోజకవర్గంలో జైనులు గణనీయంగా ఉండడం రాజాసింగ్ తీవ్ర స్పందనకు ఒక కారణమనుకుందాం. స్వయంగా జైన మతావలంబకులు సమస్యలను ఘర్షణపూర్వకంగా పరిష్కరించుకోవాలనుకునేవారు కాదు. బక్రీద్ బలుల కోసం అంగడిలో ఉన్న మేకలను మారువేషంలో కొనుగోలు చేసి, జీవరక్ష చేద్దామనుకున్నారంటే, వారి సున్నితమైన ఆలోచనా విధానం అర్థం చేసుకోవచ్చు. తమకు రుచించని తీరులో ఛలోక్తులు చెప్పిన కళాకారుడిని ఊళ్లోకి రాకుండా హెచ్చరించాలని వారు కోరుకుంటారా? వాళ్లే కాదు, సాంస్కృతిక జన వైవిధ్యం ఉన్న హైదరాబాద్ నగరం మనోభావాల సున్నితత్వాన్ని, భావప్రకటనా స్వేచ్ఛను సమతుల్యతతో నిర్వహించజాలదా? కళలకు, కళాకారులకు, ఎడతెగని సృజనాత్మకతా ఉత్సవాలకు వేదిక అయిన భాగ్యనగరాన్ని నిషేధాల అంక్షలతో మలినపరచడం సరిఅయినదేనా?

> పార్లమెంటులో రాహుల్‌గాంధీ 'నఫ్రత్'ను వ్యతిరేకిస్తూ ప్రసంగాలు చేస్తారు కానీ, క్షేత్రస్థాయిలో ఆ వైఖరి అమలు కావడానికి కాంగ్రెస్ నేతలు ఏమి చేస్తున్నారు? రాత్రి పదకొండు దాటితే దుకాణాలు కట్టేయాలని కొత్త ప్రభుత్వం కట్టడి చేస్తుంటే, నైట్ లైఫ్ లేని హైదరాబాద్ ఎట్లా అభివృద్ధి చెందుతుందని ఆందోళన చెందే సిటీజనులు, నాగరిక జీవనంపై ఫత్వాల జారీని ఎందుకు సీరియస్‌గా తీసుకోవడం లేదు?

ప్రభుత్వం ఏమి చేసింది? నిమ్మకు నీరెత్తినట్టు ఊరుకుంది. కళాకారుడు తానే షో రద్దుచేసుకునేట్టు వ్యవహరించింది. గతంలో మరో హాస్యప్రదర్శకుడు మునావర్ ఫరూఖీ విషయంలో రాజాసింగ్ ఇటువంటి నిషేధ ప్రకటనే చేసినప్పుడు, అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం, ముఖ్యంగా మంత్రి కేటీఆర్, మంచో చెడో, ఒక స్పష్టమైన వైఖరి తీసుకున్నారు. వివిధ భావాల వ్యక్తీకరణకు ఆస్కారం ఇవ్వడం హైదరాబాదీ సంస్కృతిలో భాగమని భావిస్తూ, ప్రదర్శన జరగడానికి మద్దతు ఇచ్చారు. అప్పుడు ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడిన మాట నిజమే కానీ, సాంకేతికంగా అయినా నిషేధం అమలు జరగలేదు. మరి, కాంగ్రెస్ ప్రభుత్వం ఏమి చేసింది? అసలు తనకు ఒక సాంస్కృతిక విధానం ఉన్నదా? పార్లమెంటులో వారి నాయకుడు 'నఫ్రత్'ను వ్యతిరేకిస్తూ ప్రసంగాలు చేస్తారు కానీ, క్షేత్రస్థాయిలో ఆ వైఖరి అమలు కావడానికి కాంగ్రెస్ నేతలు ఏమి చేస్తున్నారు? రాత్రి పదకొండు దాటితే దుకాణాలు కట్టేయాలని కొత్త ప్రభుత్వం కట్టడి చేస్తుంటే, నైట్ లైఫ్ లేని హైదరాబాద్ ఎట్లా అభివృద్ధి చెందుతుందని ఆందోళన చెందే సిటీజనులు, నాగరిక జీవనంపై ఫత్వాల జారీని ఎందుకు సీరియస్‌గా తీసుకోవడం లేదు?

మునావర్ ఫరూఖీ, డేనియల్ ఫెర్నాండెజ్‌ల భావ ప్రకటనా స్వేచ్ఛ బేషరతుదేమీ కాదు. వారు, ఒక సంస్కారాన్ని, మనోభావాల పట్టింపును కళాకారులుగా పాటించవలసిందే. కానీ, ఆ విలువలో సమస్య వచ్చినప్పుడు చట్టం దాన్ని పరిష్కరించాలి. పౌరసమాజం కూడా కల్పించుకుని, ఉభయ పక్షాలకు నచ్చచెప్పాలి. ఉద్రిక్తతలకు ఆస్కారమిచ్చే శక్తులను ఒంటరి చేయాలి. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటామనే హెచ్చరికలకు ఆస్కారం ఉండకూడదు. అది ఒక ధోరణిగా మారిపోకుండా చూడాలి.

బీఆర్ఎస్ పార్టీకి లోపాయికారీగా బీజేపీతో ఏదన్నా అవగాహన ఉండిందో లేదో కానీ, పైకి మాత్రం ఆ పార్టీ నేత కేసీఆర్ తెలంగాణ మిశ్రమ సంస్కృతిని, వైవిధ్య సామాజిక జీవనాన్ని గొప్పగా ప్రచారం చేసేవారు. అభివృద్ధికి, మత సామరస్యానికి ఉండవలసిన అనివార్య సంబంధం గురించి తనదైన పద్ధతిలో చెప్పేవారు. కొత్త ప్రభుత్వానికి సెక్యులరిజం అన్నది ఒక ఎన్నికల రాజకీయ విలువ మాత్రమేనా అన్న సందేహం కలుగుతున్నది. ఉదాహరణకు, బక్రీద్ ముందూ తరువాతా మెదక్‌లో ఏర్పడిన ఉద్రిక్తత.. ఆ పక్షం నుంచి ఇద్దరిని, ఈ పక్షం నుంచి ఇద్దరిని అరెస్టు చేసి కేసులు పెట్టడమే మతసమానత్వం అనుకుంటే ఎట్లా? జరిగినదానికి బాధ్యులెవరో నిష్పాక్షికంగా కనిపెట్టడం, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా జాగ్రత్తపడడం, ఈ రెంటిలోనూ ప్రభుత్వ వైఫల్యమే కనిపించింది. వెటకారాలు చేసే వృత్తిలో అప్పుడప్పుడు నోరుజారడాలు ఉన్నట్టే, వేర్వేరు మతాలు నివసించే చోట అప్పుడప్పుడు సమస్యలు వస్తాయి. పైగా దేశవ్యాప్తంగా ఉన్న వాతావరణం ప్రభావం తెలంగాణలోనూ ఉంటుంది. ఈ ఉద్రిక్తతలలో జీవించేది, నష్టపోయేది ప్రజలు కదా? ఉభయ మతాల వారితో సంప్రదింపులు జరిపి, ఆవేశాలను చల్లార్చేపని ప్రజాప్రతినిధులు చేయాలి, ప్రభుత్వం ఆ దిశగా ప్రోత్సహించాలి. లేదా, అందరికీ ఆమోదయోగ్యులైన పెద్దమనుషులకు ఆ బాధ్యత అప్పగించాలి. క్షేత్రస్థాయిలో సామరస్యాన్ని కాపాడడం అంటే, ప్రజలతో గాఢమైన సంబంధంలో ఉండి, ప్రమాదకర ధోరణులు కనిపిస్తే వాటిని మొగ్గలోనే తుంచేయడం. వాటి గురించిన అవగాహన కలిగించడం. సమానసంఖ్యలో అరెస్టులు చేయడం కాదు.

బీజేపీ వల్ల ప్రమాదం ఉంటుందని, దానిని గెలవనివ్వవద్దని ప్రచారం చేస్తూ కొన్ని ప్రజాసంఘాలు లోక్‌సభ ఎన్నికల ముందు ప్రచారం చేశాయి. నేరుగా చెప్పకపోయినా, వారు కాంగ్రెస్‌కు అనుకూలంగా ఓటు వేయమని చెప్పిన వారే. అది వారి ఇష్టం. దేశంలోని పరిస్థితుల రీత్యా అది అవసరమైన ఎంపిక అని వారనుకున్నారు. ఆ ప్రచారంలో భాగంగా వారొక బస్సు యాత్ర చేశారు. వివిధ ప్రజావర్గాలను వారున్నచోటునే కలుసుకుని తమ అభిప్రాయాలను వివరించడం పద్ధతిగా పెట్టుకున్నారు. రిటైర్డ్ ఐఎఎస్‌లు, ప్రొఫెసర్లు, సామాజిక కార్యకర్తలు ఆ బృందంలో ఉన్నారు. మహబూబ్ నగర్, వరంగల్ పట్టణాలలో, ఆ బృంద సభ్యులకు అప్రజాస్వామికమయిన, అమర్యాదాకరమైన ఆటంకాలు ఎదురయ్యాయి. అట్లాగే, మత సామరస్యం కోసం గొంతెత్తే కవులు, రచయితలు 'సమూహ' అనే వేదికపై సంఘటితమై తమ రచనలను, అభిప్రాయాలను పంచుకుంటుంటే వరంగల్ లోనే వారి మీద దౌర్జన్యం జరిగింది. ఈ అన్ని చోట్ల ఆయా అధికారులు తమ పాత్రను నిర్వహించనే లేదు. అప్పటికప్పుడు చెదరగొట్టడమో, బాధితులకే నచ్చచెప్పడమో తప్ప. ఒక వైఖరి తీసుకుని, సమస్య పునరావృతం కాకుండా పరిష్కరించడం లేదు. ఈ సంఘటనలన్నీ తెలంగాణలో సామాజిక దౌర్జన్యవాదం పెరిగిపోతోందన్న కలవరం కలిగిస్తున్నాయి. ఉత్తరాది అంతగా చెడిపోలేదు కానీ, హేతువాదుల మీద, ఉదారవాదుల మీద, రకరకాల ప్రగతివాదుల మీద నేరుగానో, సామాజిక మాధ్యమాలలోనో దాడులు జరుగుతూనే ఉన్నాయి. చాప కింద నీరులాగా వ్యాపిస్తున్న ఈ ధోరణులే, రేపు పెను ప్రమాదానికి కారణమవుతాయి.

విద్యుత్ రంగంలో ప్రైవేటు పాత్రధారులను తీసుకురావాలనుకుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ విషయం బాహాటంగా చెప్పి చేస్తే బాగుంటుంది. పాతికేళ్ల కిందట, ఎప్పుడైతే విద్యుత్ బోర్డు, ఉత్పాదక, సరఫరా, పంపిణీ వ్యవస్థలుగా విభజితమయిందో అప్పుడే, ప్రైవేటు ఉద్దేశ్యాలు వెల్లడయ్యాయి. ఆయా సంస్థలు ప్రజల నిత్యావసరాలతో ముడిపడినవి కావడం, లాభదాయకత లేకపోవడంతో ఇంతకాలం ప్రైవేటు సంస్థలు రాలేదు తప్ప, విధానం లేక కాదు. ఇవాళ బిల్లింగ్‌తో ప్రారంభించి అదానీ తెలంగాణ విద్యుత్ రంగంలోకి ప్రవేశిస్తుంటే, దాని రాజకీయ పర్యవసానాలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎదుర్కొనవలసి వుంటుంది. అదానీయే ఒక సమస్య. విద్యుత్ సంస్కరణల అమలుతో ముడిపడిన వ్యవసాయాది రంగాలు మరొక సున్నితమయిన సమస్య. అయితే, అదానీకి అందించిన మొదటి ప్రాంతం హైదరాబాద్ పాతబస్తీ కావడంతో ఒక చిత్రమైన పరిస్థితి ఏర్పడింది. పాత బస్తీలో విద్యుత్ బిల్లుల వసూళ్లు దాదాపుగా జరగవు అనేది ప్రాచుర్యంలో ఉన్న అభిప్రాయం. మైనారిటీల తుష్టీకరణ అంటూ చేసే వాదనల్లో ఇదొక అంశం. బహుశా, అక్కడ విద్యుత్ వినియోగానికి, బిల్లింగ్ జరిగే పరిమాణానికి కొంత అంతరం ఉండి ఉంటుంది. రాష్ట్రంలో ఏ ఏ చోట్ల ఆ అంతరం ఉన్నదో, పాతబస్తీలో ఎంత ఉన్నదో ప్రభుత్వాలు ఎప్పుడూ చెప్పలేదు. ఏది ఏమయినా పాతబస్తీ వాసులు తమ మీద ఉన్న ఆ అభిప్రాయాన్ని తొలగించుకోవడమే మంచిది. వాళ్లు తక్కిన సమాజంతో సంలీనం కావడానికి అది తోడ్పడుతుంది కూడా. అది ఒక అభాండమే గనుక అయితే, అది కూడా తేలిపోతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తన మైనారిటీ అనుకూల ముద్రను కడిగేసుకోవచ్చు. మరి ఇంతటి చొరవ, రాష్ట్రమంతటా ఉన్న మతావేశాల విషయంలో కూడా చూపవచ్చును కదా?

మతపరంగా ఉన్న అన్ని ఉద్రిక్త ప్రాంతాలలోనూ సమస్యను సమూలంగా తొలగించి, శాంతియుత సహజీవన మార్గాలేమిటో అన్వేషించడం ప్రభుత్వం రాజకీయ కర్తవ్యంగా ఉండాలి. ఈ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి తోడ్పడిన పౌరసమాజ ప్రతినిధులు కూడా ఆ బాధ్యత తీసుకోవాలి. లేకపోతే, వారి స్థానాన్ని మరెవరో ఆక్రమిస్తారు. చట్టాలను, సమష్టి నైతికతను కాదని రాజ్యాంగేతర శక్తులుగా అవతరిస్తారు. ఏ సమస్యనైనా నాగరికంగా, ప్రజాస్వామికంగా పరిష్కరించుకోవడంలోనే ప్రత్యామ్నాయ నమూనా రూపొందుతుంది.

## ప్రజా ప్రభుత్వాన్ని కూల్చే కుట్రలు!

తెలంగాణ రాష్ట్రంలో తనకు ఎదురేలేదని, తనను ఎదురించే పార్టీ మరేదీ లేదని, అధికారం శాశ్వతమని విర్రవీగిన కేసీఆర్‌కు గత అసెంబ్లీ ఎన్నికల పరాజయంతో కష్టాలు ప్రారంభమయ్యాయి. అధికారం పోవడంతో ఒక్కో నాయకుడూ పార్టీని వదిలిపోవడం మొదలుపెట్టారు. మున్సిపాలిటీలు, స్థానిక సంస్థల్లో సైతం సొంత పార్టీ నాయకులు అవిశ్వాసాలు పెట్టి కాంగ్రెస్ అభ్యర్థులను మేయర్లుగా, చైర్మన్లుగా గెలిపించుకొని బీఆర్ఎస్ నుంచి జంప్ అవడం ప్రారంభించారు. దీనికితోడు కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాల్పడిన అవినీతి, కుంభకోణాలను తవ్వితీయడం ప్రారంభించింది. తాను ప్రారంభించిన పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని, తన పాలనలో రాష్ట్రం సర్వతోముఖంగా అభివృద్ధి సాధించిందని ఇన్నాళ్లూ ప్రజలను కేసీఆర్ మభ్యపెడుతూ వచ్చారు. కానీ, ఈ పథకాలన్నీ అవినీతితో కుళ్లి కంపు కొడుతున్నాయనీ, ప్రతీ పథకంలోనూ కుంభకోణం జరిగిందనీ వాస్తవాలు బయటకు రావడం కేసీఆర్‌కు మింగుడుపడని అంశంగా మారింది.



> ఇది ఎవరి దయా భిక్షతోనో ఏర్పడిన ప్రభుత్వం కాదు. మెజారిటీ తెలంగాణ ప్రజలు ఆశీర్వదించి ఏర్పాటు చేసిన ప్రజా ప్రభుత్వం. తెలంగాణ అభివృద్ధిని సాకారం చేయటానికి ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టారు. దానిని మర్చిపోయి ఈ ప్రభుత్వాన్ని కూల్చడానికి బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కలిసి కుట్ర చేస్తున్నాయి. ఈ అంశాన్ని తెలంగాణ ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు.

కేసీఆర్ పాలనలోని కుంభకోణాలపై దర్యాప్తు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎంక్వైరీ కమీషన్‌లు వేసింది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో దొంగచాటుగా నాయకులు, వారి కుటుంబ సభ్యుల ఫోన్లు సైతం విన్న వ్యవహారం కథలు కథలుగా బయటకు రావటంతో కేసీఆర్ పరువు గంగలో కలిసిపోయింది. అదేవిధంగా విద్యుత్ కొనుగోళ్లు, థర్మల్ పవర్ ప్లాంట్ల ఏర్పాట్లలో వేల కోట్ల అవినీతి జరిగిందనే అంశం కేసీఆర్‌కు చిక్కులు తెచ్చిపెడుతోంది. ఈ కొనుగోళ్ల అంశం పూర్తిగా కేసీఆర్ కనుసన్నల్లో జరిగిందని అధికారులందరూ జస్టిస్ నరసింహారెడ్డికి చెప్పారు. దీనిపై సమాధానాలివ్వడానికి రావాల్సిందిగా కమిషన్ చైర్మన్ కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారు. దీనిని అవమానంగా భావించి కేసీఆర్ కోర్టుకెళ్లారు. కానీ, చట్ట ప్రకారమే జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ నియామకమైందంటూ కోర్టు కేసీఆర్ పిటిషన్‌ను కొట్టివేయడం ఆయనకు ఎదురుదెబ్బగా పరిణమించింది. అదేవిధంగా దేశమంతా గొప్పగా చాటింపు వేసుకున్న కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే దెబ్బతినడంతో కేసీఆర్ ప్రతిష్ట తెలంగాణలో పూర్తిగా మసకబారింది. దీనిపై బీఆర్ఎస్ ఎన్ని సంజాయిషీలు ఇచ్చుకున్నా ప్రజల్లో ఆయన విశ్వసనీయత పూర్తిగా దెబ్బతిన్నది. దీనిపై దర్యాప్తు కోసం జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను ప్రభుత్వం నియమించింది. రేపో మాపో ఆయన కూడా విచారణకు రావాల్సిందిగా కేసీఆర్‌కు నోటీసులిచ్చే అవకాశముంది. వీటికి తోడు గొర్రెల స్కామ్, మిషన్ భగీరథ, హరితహారం, ధరణి వంటి స్కామ్‌లు కేసీఆర్‌ను చుట్టుముట్టి ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

పులిమీద పుట్రలాగా ఎమ్మెల్యేలు పార్టీని వీడిపోవటం కేసీఆర్‌ను మరింత కష్టాల్లోకి నెడుతున్నది. ఎమ్మెల్యేలను కాపాడుకోవటం కోసం వరుసగా వారితో సమావేశాలు నిర్వహించి భరోసా ఇస్తున్నా వారు పార్టీని వీడటం ఆగటంలేదు. కేసీఆర్‌తో సమావేశానికి ఇష్టంలేని పెళ్లికి వెళ్లినట్లుగా ఈ నాయకులు వెళ్లారు. ఇది చివరి సమావేశమని వీడ్కోలు తీసుకోవటానికి వెళ్లినట్లుగా అనిపిస్తున్నది. ఎందుకంటే ఆయన చెప్పిన మాటలు విని వచ్చారు తప్ప, ఏ ఎమ్మెల్యే కూడా తాము పార్టీ మారబోమని కేసీఆర్‌కు మాట ఇవ్వలేదు.

కనీసం 25 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారతారనే ప్రచారం జరుగుతుండటంతో పార్టీ ఉనికికే ప్రమాదం ఏర్పడుతుందని కేసీఆర్‌కు భయం పట్టుకున్నది. దీనితో వారిని బుజ్జగించడానికి కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగారు. వెంటనే ఎమ్మెల్యేలను ఫామ్‌హౌస్‌కు పిలిపించుకున్నారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేలు కాదు కదా, మంత్రులకు కూడా నెలల తరబడి కేసీఆర్ దొరగారి దర్శనం దొరికేది కాదు. నాయకుల కోసం ప్రగతి భవన్ కోట గేట్లు ఏనాడూ తెరుచుకునేవి కావు. కానీ అధికారం దూరమవడంతో నెత్తికెక్కి ఉన్న అహంకారం కొద్ది కొద్దిగా ఆయనకు దిగిపోతున్నది. తన దగ్గరకు వస్తున్న ఎమ్మెల్యేలతో 'ఒకటి రెండు నెలలు ఓపిక పట్టండి, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉండదు, ఢిల్లీలో ఉన్న బీజేపీకి చెందిన కీలక నేతలు టచ్‌లో ఉన్నారు, రెండు నెలల తర్వాత అధికారంలోకి వస్తాం' అని కేసీఆర్ వారితో అన్నారు. రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చివేయడానికి బీజేపీ, కేసీఆర్ కలిసి పనిచేస్తున్నాయని దీనిని బట్టి స్పష్టంగా అర్థమవుతున్నది. ఇది ఎవరి దయా భిక్షతోనో ఏర్పడిన ప్రభుత్వం కాదు. మెజారిటీ తెలంగాణ ప్రజలు ఆశీర్వదించి ఏర్పాటు చేసిన ప్రజా ప్రభుత్వం. తెలంగాణ అభివృద్ధిని సాకారం చేయటానికి ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టారు. దానిని మర్చిపోయి ఈ ప్రభుత్వాన్ని కూల్చడానికి బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కలిసి కుట్ర చేస్తున్నాయి. ఈ అంశాన్ని తెలంగాణ ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి నెరవేర్చుకుంటూ వస్తున్నది. అతిపెద్ద హామీ అయిన రూ.2లక్షల రైతు రుణ మాఫీ హామీని నెరవేర్చటానికి వడివడిగా అడుగులు వేస్తున్నది. పదేళ్లలో కేసీఆర్ చేసిన విధ్వంసాన్ని సరిచేస్తున్నది. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన ప్రాజెక్టులను ఒక్కొక్కటి తెస్తున్నది. అదేవిధంగా కేసీఆర్ చేసిన అప్పులు, వడ్డీలను తీరుస్తూ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నది. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపటానికి ముఖ్యమంత్రి, మంత్రులు నిరంతరం శ్రమిస్తున్నారు. అదేవిధంగా పదేళ్ళుగా ఇరు రాష్ట్రాల మధ్య నెలకొన్న విభజన సమస్యలు, ఆస్తుల పంపకాలపై ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కలిసి కూర్చొని పరిష్కరించే దిశగా అడుగులు వేస్తున్నారు. ఇటువంటి ప్రజా ప్రభుత్వానికి ప్రజలతోపాటుగా ఎమ్మెల్యేలు కూడా అండగా నిలిచి ఐదేళ్లు నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉన్నది.

పార్టీ మారుతున్న నాయకులపై సుప్రీంకోర్టుకు వెళ్తామని కేసీఆర్ అనటం వంద ఎలుకలు తిన్న పిల్లి కాశీకి పోయినట్లుందన్న సామెత సరిగ్గా సరిపోతుంది. ఫిరాయింపులకు ఆది గురువు, దైవం కేసీఆర్. 2014, 2018లలో ప్రతిపక్ష పార్టీలను మింగి వేశారు. బీఎస్పీ, వైసీపీ, తెలుగుదేశం, కమ్యూనిస్టు, కాంగ్రెస్ పార్టీల ఎమ్మెల్యేలను ఫిరాయింపు చేసుకోవడమే ధ్యేయంగా పాలన చేశారు. వారే ఇప్పుడు ఫిరాయింపులు నేరం, ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వెయ్యాలని ఈ రోజు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. మరి ఈ అనర్హత అంశం ఆ రోజు కేసీఆర్ అండ్ కోకు ఎందుకు గుర్తు రాలేదు?

• బండ్రు శోభారాణి

టీపీసీసీ ఉపాధ్యక్షురాలు

# కులగణనతోనే సార్థకం కొమరయ్య అమరత్వం!



> భూమి, భుక్తి, విముక్తి కోసం అసువులు బాసిన దొడ్డి కొమరయ్య వంటి యోధులను స్మరించుకోవడంతోపాటు వారి ఆశయాల అమలు బాధ్యతను కూడా ప్రభుత్వం తీసుకోవాలి. కొలువుల కోసం కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రంలో బీసీలు తమ జనాభా ఎంతో అంత శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని గెలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పని చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికల్లోకి పోకూడదని బీసీలు గొంతెత్తి గర్జిస్తున్నారు. దొడ్డి కొమరయ్య వర్ధంతి సాక్షిగా బీసీ కులగణనను వెంటనే చేపడతామని ప్రభుత్వం ప్రకటించాలి.

దొడ్డి కొమరయ్య అమరుడై 78 ఏళ్ళు గడిచాక ఆ అమరత్వాన్ని తలుచుకుంటూ ఇప్పటి పరిస్థితి తిలకిస్తే నిజాం పాలన అనంతరం గ్రామాలల్లో పెత్తందారీతనాలు చెలాయించిన ఆధిపత్యవర్గాలు, దొరలు, జమీందారులు, పటేల్, పట్వారీలు ఖద్దరు చొక్కాలు ధరించి జెండాలు మార్చుకుని మళ్ళీ భూమి మీద, సంపదల మీద, రాజకీయాల మీద.. ఇలా అన్ని రంగాల మీద పట్టు సాధించారు. ఏ విముక్తి కోసం దొడ్డి కొమరయ్య నేలకొరిగాడో ఆ ఆశయం పూర్తి కాలేదు. దొడ్డి కొమరయ్యతో పాటుగా నాలుగు వేల మంది వీరులు ప్రాణత్యాగాలు చేసింది బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ, ఆదివాసీ వర్గాల విముక్తి కోసం అన్నది మరువరాదు. వీళ్ళంతా నేటికీ పీడితులు, తాడితులుగా, అన్ని రంగాల్లో అణగదొక్కబడ్డవారు. నేటికీ ప్రభుత్వాలిచ్చే సంక్షేమ పథకాల కోసం ఎదురు చూసేవాళ్ళు, నేటికీ సరైన విద్య, వైద్యం అందక తల్లడిల్లుతున్నారు.

సకల సంపదల సృష్టికర్తలై 60 శాతంగా ఉన్న ఉత్పత్తి కులాల జీవనస్థితిగతులు ఎలా ఉన్నాయో లెక్కలు తీసి కులగణన చేయమని ఎన్నాళ్ళ నుంచో మొరపెట్టుకుంటున్నా దేశపాలకులు దుర్నీతితో వ్యవహరిస్తున్నారు. సమాజంలో సగానికిపైగా ఉన్న బహుజనులు ఎట్లా జీవిస్తున్నారో తెలియాలంటే కులగణన చేయాలి. బ్రిటిష్ ప్రభుత్వం చేసిన కులగణనను స్వాతంత్ర్యం అనంతరం మన పాలకులు విస్మరించటం కంటే ఘోరం మరొకటి లేదు. కులగణన చేస్తే 60 శాతంగా ఉన్న బహుజనులకు చట్టసభల నుంచి స్థానిక సంస్థల వరకు రిజర్వేషన్లు ఇవ్వాలన్న డిమాండ్ ముందుకు వస్తుంది. ఇది ఆధిపత్య వర్గాలకు ఇష్టం ఉండదు. అందుకే అది జరగటం లేదు. సగం మంది ప్రజల జీవన స్థితిగతుల లెక్క చూడమంటే దారుణంగా వ్యవహరిస్తున్న స్థితి వేరే దేశంలో ఎక్కడా కనపడదు. దొడ్డి కొమరయ్య అమరత్వం సాక్షిగా 3000 గ్రామాల్లో ఎర్ర జెండాలు ఎగురవేసి గ్రామరాజ్యాలు స్థాపించుకున్నామని చరిత్ర పేజీలు చెబుతున్నాయి. ఇపుడు వాళ్ళ వారసులైన బహుజనవర్గాలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పిస్తే 6000 గ్రామాలు బీసీల చేతుల్లోకి వస్తాయి. ఇప్పటికీ తెలంగాణ గ్రామాల్లో పెత్తందార్ల రాజ్యాలే కొనసాగుతున్నాయి.

తరతరాలుగా ఓబీసీలు కోల్పోయిన హక్కులను సాధించుకుని చట్టసభల నుంచి స్థానిక సంస్థల వరకు రిజర్వేషన్లు సాధించుకునేందుకు; ఎస్సీ, ఎస్టీల మాదిరిగా జనాభాలో సగ భాగం ఉన్న ఓబీసీలకు చట్టసభల్లో రాజ్యాంగపరంగా రిజర్వేషన్లు పొందేందుకు రాజ్యాంగ సవరణలు జరగాలి. రాజ్యాంగ సవరణ ద్వారా ఓబీసీలకు రాజ్యాంగబద్ధమైన హక్కులను ప్రసాదిస్తూ కొత్త పేజీలు రచించాలి. అందుకు పార్లమెంటు వేదికగా అన్ని పార్టీలు సంపూర్ణ మద్దతు తెలియజేయాలి. అన్ని పార్టీల ఎంపీల మద్దతును కూడగట్టేందుకు ఓబీసీ నేతలు కృషి చేయాలి.

అన్ని పార్టీలు బీసీలకు మద్దతు తెలియజేస్తూ ఎన్నికల్లో సంక్షేమ పథకాలను ప్రకటిస్తారు. అన్ని పార్టీల ఎన్నికల మ్యానిఫెస్టోల నిండా బీసీల కోసమే సంక్షేమ పథకాలని, బడ్జెట్లో నిధులు కేటాయిస్తామని వాగ్దానాలు ఉంటాయి. దేశంలో పేదలైన బీసీల కోసం ఎన్నెన్నో చేస్తామని రాజకీయ పార్టీలు పోటీలు పడతాయి. ఒకరిని మించి మరొక పార్టీ గ్యారంటీ పథకాలను పార్టీ మ్యానిఫెస్టోలో ప్రకటిస్తారు. ఎన్నికలైపోయాక ఓడిన పార్టీ గెలిచిన పార్టీ గ్యారంటీ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష పాత్రను పోషిస్తారు. అధికార పక్షాలు ప్రతిపక్షాలు అమలుగాని హామీలు, ఎన్నికల ప్రహసనాలను చూసీ చూసీ బీసీలకు విసుగొచ్చింది. ఓపిక నశించింది. సహనం బద్దలయ్యే సమయం ఆసన్నమయ్యింది. ఇప్పటికైనా రాజకీయ పార్టీలు కళ్ళు తెరిచి ఓబీసీల చిరకాల డిమాండ్ల సాధనకు కృషి చేయాలి.

పార్లమెంటు సాక్షిగా వెనుకబడిన వర్గాల రిజర్వేషన్ల డిమాండ్‌ను 77 ఏళ్ళుగా రాజకీయ పార్టీలు నీరుగార్చుతూనే ఉన్నాయి. కొల్హాపూర్ సంస్థానాధిపతి ఛత్రపతి సాహూ మహారాజ్ దేశంలో తొలిసారిగా ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ విప్లవాత్మక చర్యకు దిగి నూతన చరిత్రను లిఖించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన దగ్గర్నుంచి ఓబీసీల చట్టసభల రిజర్వేషన్ల డిమాండ్‌ను ఇప్పటి వరకు ఎందుకు పరిష్కరించలేకపోతున్నారన్నది ఆశ్చర్యకరం.

రాజ్యాంగ సవరణ చేయటానికి ఓబీసీలు ఉధృతంగా ఉద్యమించే సమయం ఆసన్నమయ్యింది. పెరియార్ రామస్వామి జరిపిన అలుపెరుగని పోరాటమే ఆనాటి నెహ్రూ ప్రభుత్వాన్ని కదలించింది. అది మామూలు పోరాటం కాదు. రాజ్యాంగంలో ఓబీసీల హక్కులకు సంబంధించి, చట్టసభల నుంచి విద్యా, ఉద్యోగ రిజర్వేషన్ల దాకా చట్టబద్ధత కావాలని రామస్వామి గొంతు విప్పి గర్జించారు. రాజ్యాంగంలో బీసీలకు చట్టబద్ధత కల్పిస్తూ రాజ్యాంగసవరణ జరిపి నూతన చరిత్రను లిఖించాలని రామస్వామి ఇచ్చిన పిలుపునకు తమిళనాడు అగ్నిగుండంగా మారింది. ఆయనను జైల్లో పెట్టారు. వందలాది మందిపై కేసులు నమోదు చేసి జైళ్ళలోకి నెట్టేశారు. చివరకు నెహ్రూ ప్రభుత్వం బీసీల సమగ్ర అధ్యయనం చేసేందుకు కాకాకలేల్కర్ నేతృత్వంలో జాతీయ బీసీ కమీషన్ నియమించారు. విద్యా ఉద్యోగ రిజర్వేషన్లలో కోర్టుల్లో కేసులు వేసి అడ్డుపడకుండా రాజ్యాంగ సవరణ చేసేందుకు రామస్వామి పెరియార్ సుదీర్ఘ పోరాటం జరిపారు. ఇపుడు కూడా బీసీలందరూ ఐకమత్యంతో ఒక్కతాటిపైకి వచ్చి తమ హక్కుల సాధనకు రామస్వామి పెరియార్ స్ఫూర్తితో ఉద్యమించవలసి ఉంది. దేశంలో సగం జనాభాకు సంబంధించిన అత్యంత ముఖ్యమైన ఈ సమస్య పట్ల బీసీలే ముందుకు వెళ్ళి పోరాడాలి. అగ్రవర్ణ ఆధిపత్య భావజాలాలున్న పార్టీల నాయకత్వాలు ఇందుకోసం అంత తొందరగా ముందుకు రావు. ఇందు కోసం తీవ్రమైన ఒత్తిడి తీసుకురావటానికి బీసీలు సంఘటిత శక్తిని ప్రదర్శించే సమయం ఆసన్నమైంది. బహుజనుల విముక్తి కోసం త్యాగాలు చేసిన యోధుల నెత్తుటి సంతకాల సాక్షిగా 'మా వాటా మాకే' అన్న ఏకైక నినాదం స్ఫూర్తితో అన్ని రాజకీయ పార్టీలలోని బీసీలంతా ఒక్కతాటిపైకి రావాలి.

భూమి, భుక్తి, విముక్తి కోసం అసువులు బాసిన దొడ్డి కొమరయ్య వంటి యోధులను స్మరించుకోవడంతోపాటు వారి ఆశయాల అమలు బాధ్యతను కూడా ప్రభుత్వం తీసుకోవాలి. దొడ్డి కొమరయ్యను స్మరించుకోవడమంటే భూసంస్కరణలను అమలు చేయాలి. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్ళయినా అట్టడుగువర్గాలు గ్యారంటీ పథకాల కోసం ఎదురుచూసే స్థితిలోనే ఉన్నారు. వాళ్ళ జీవన ప్రమాణాల ఎదుగుదలకు కృషిచేయాలి. కొలువుల కోసం కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రంలో బీసీలు తమ జనాభా ఎంతో అంత శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. దొడ్డి కొమరయ్య రక్తతర్పణతో 3000 గ్రామాల్లో ఎర్ర జెండా లెగరేసి విముక్తి ప్రాంతాలుగా ప్రకటించారు. మిలటరీ యాక్షన్ తర్వాత అవన్నీ తిరిగి పెత్తందార్లు, అగ్రకులాల చేతుల్లోకి పోయాయి. బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని గెలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పని చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికల్లోకి పోకూడదని బీసీలు గొంతెత్తి గర్జిస్తున్నారు. దొడ్డి కొమరయ్య వర్ధంతి సాక్షిగా బీసీ కులగణనను వెంటనే చేపడతామని ప్రభుత్వం ప్రకటించాలి. బీసీల విద్యా ఉద్యోగ విషయాలలో కోర్టుల జోక్యం లేకుండా ఉండేందుకు రాజ్యాంగసవరణ చేసేందుకు అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేయించాలి. కేంద్రంపై ఒత్తిడి పెంచాలి. బీసీ వృత్తులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించి వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలి. ఈ పనులు చేసినప్పుడు మాత్రమే దొడ్డి కొమరయ్యను, చాకలి ఐలమ్మ, సర్వాయి పాపన్నల త్యాగాలను గౌరవించినట్లవుతుంది. లేకపోతే అమరుల త్యాగాలను కూడా తమ అధికారపీఠాలను కాపాడుకునేందుకు ఉపయోగించుకున్నట్లు అవుతుంది.

• జూలూరు గౌరీశంకర్

తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ చైర్మన్

(నేడు దొడ్డి కొమరయ్య వర్ధంతి)





# పడకేసిన ప్రత్యేక పాలన

## గ్రామ పంచాయతీలను పట్టించుకోని ప్రత్యేకాధికారులు

- వారానికోసారి కూడా గ్రామాలకు రాని వైనం
- నిధుల కొరతతో పంచాయతీలు విలవిల
- పంచాయతీ కార్యదర్శులపైనే పని భారం
- గ్రామాల్లో పేరుకుపోతున్న సమస్యలు
- క్షీణిస్తున్న పారిశుధ్య నిర్వహణతో అనారోగ్యాల బారిన ప్రజలు

హనుమకొండ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో ప్రత్యేకాధికారుల పాలన పడకేసింది. ఒక్కో అధికారికి మూడు, నాలుగు పంచాయతీల బాధ్యతలను అప్పగించడం, వారు చుట్టపు చూపుగా గ్రామాలకు రావడంతో పంచాయతీల పాలన అస్తవ్యస్థంగా మారిపోయింది. మిషన్ భగీరథ పైపులైన్ల లీకేజీలు, చేతిపంపులు మరమ్మతులకు నోచుకోకపోవడం, పారిశుధ్యంపై పర్యవేక్షణ కొరవడడంతో ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు.

### ఐదు నెలలుగా..

ఈ ఏడాది జనవరి నెలాఖరునాటికి సర్పంచుల పదవీ కాలం ముగిసింది. దీంతో పంచాయతీల పాలనావ్యవహారాలను చూసేందుకు ప్రత్యేకాధికారులను ప్రభుత్వం నియమించింది. ప్రత్యేకాధికారుల పాలన మొదలై అయిదు నెలలవుతోంది. నిధులు లేమికి తోడు తమకున్న శాఖాపరమైన విధులే కాకుండా గ్రామాల ప్రత్యేక అధికారుల అదనపు బాధ్యతలు అప్పగించడంతో సదరు అధికారులు పల్లెలను పెద్దగా పట్టించుకోవడం లేదు. నామమాత్రంగానే పల్లెల ముఖం చూడడం లేదు. దీంతో పంచాయతీల్లో పర్యవేక్షణ కొరవడింది. ఫలితంగా స్థానికంగా పంచాయతీ కార్యదర్శులపైనే మొత్తం భారం పడుతున్నది. అభివృద్ధి పనులు పడకేశాయి. మరమ్మతులు అటకెక్కాయి. ప్రత్యేకాధికారుల పాలనకు ముందు పంచాయతీ ఖాతాల్లోని నిధులను సర్పంచులు వాడేసుకున్నారు. ఇప్పుడు పంచాయతీల ఖాతాల్లో ఒక్క పైసా కూడా లేదు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి కొన్ని నెలలుగా నిధులు జమకావడం లేదు. దీంతో పంచాయతీల పాలన మొక్కుబడిగా సాగుతోంది. పారిశుధ్య పనులు పూర్తి స్థాయిలో జరగడం లేదు. గతంలో చేపట్టిన పలు పనులకే నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో ఉండడటంతో కొత్త పనులు చేపట్టే పరిస్థితి లేకుండా పోయింది. ప్రస్తుత వర్షాకాలంలో గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపడకపోతే ప్రజలు జబ్బుల బారిన పడే అవకాశం ఉంది. ఇప్పటికే గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. డెంగీ కేసులు పెద్దసంఖ్యలో నమోదవుతున్నాయి. పారిశుధ్య చర్యలు చర్యలు తీసుకోకపోతే పరిస్థితి చేయిదాటిపోయే ప్రమాదం ఉందని గ్రామీణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### మాతృశాఖకే పరిమితం

గత ఫిబ్రవరి 2 నుంచి ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైంది. మండల, డివిజన్ స్థాయిలోని గెజిటెడ్ ఉద్యోగులకు మూడు కంటే ఎక్కువ పంచాయతీ బాధ్యతలు అప్పగించారు. వారికి ఇప్పటికే పనిభారం అధికంగా ఉండడంతో పంచాయతీల బాధ్యతలను చూడడంలో ఉదాసీనత ప్రదర్శిస్తున్నారు. ప్రధానంగా మిషన్ భగీరథ, నీటిపారుదల శాఖల అధికారులు అయితే తమ మాతృశాఖకే పరిమితమవుతున్నారనే ఆరోపణలున్నాయి. సొంత శాఖ విధులతో పాటు ఉన్నతాధికారులు సమీక్షలు, సమావేశాలకు హాజరుకావడం వంటి బాధ్యతలు కూడా ఉంటాయి. ఇటీవల లోక్‌సభ ఎన్నికలు కూడా జరిగాయి. ఈ విధుల భారం కూడా వారిపైనే పడింది. సెక్టోరియల్ సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌ల బాధ్యలను సైతం వారే మోశారు. ప్రత్యేకాధికారులు వారంలో కనీసం రెండు పర్యాయాలైన గ్రామాలు వెళ్లడం లేదు. ఫలితంగా స్థానిక పంచాయతీ కార్యదర్శులు, ఎంపీవోలు, ఎంపీడీవోలపై అదనపు భారం పడుతున్నది.

### సమస్యల చిట్టా

పంచాయతీలను ప్రత్యేకాధికారులు పట్టించుకోకపోవడంతో అనేక గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మిషన్ భగీరథ పైప్‌లైన్లు చాలా చోట్ల లీకై నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు, పాడైన బోర్లను బాగు చేయించేవారు కరవయ్యారు. పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. హరితహారం మొక్కలు ఎండిపోతున్నాయి. నర్సరీల సంరక్షణ సరిగా జరగడం లేదు. రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు దాదాపు 14 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం నిధులు రెండు నెలలకోసారి మంజూరవుతున్నా సరిపోక పంచాయతీలకు ఇక్కట్లు తప్పడం లేదు. పాలకవర్గం ఉన్న సమయంలో అప్పోసప్పో చేసి గ్రామాల అభివృద్ధికి సర్పంచులు పూనుకునేవారు. బిల్లులు మంజూరైనప్పుడు తీసుకునేవారు. ఇప్పుడు పంచాయతీల్లో నిధుల లేమితో ప్రత్యేకాధికారులు పట్టించుకోవడం లేదు. దీనికితోడు ప్రత్యేక అధికారుల పాలనలో రాజకీయ జోక్యం మితిమీరిపోయింది. గ్రామాలకు మంజూరైన పనుల్లో రాజకీయ పార్టీల నాయకుల జోక్యం పెరిగింది. ఆయా పనులకు సంబంధించి ఒత్తిళ్లు తప్పపోవడంతో అధికారులు మిన్నకుండిపోతున్నారు.

### నిధులకు కటకట

గ్రామ పంచాయతీలు నిధుల కటకటను తీవ్రంగా ఎదుర్కొంటున్నాయి. ఖాతాల్లో డబ్బులు లేక, అత్యవసర పనులకు ఖర్చు చేయలేక సతమతమవుతున్నాయి. పారిశుధ్య కార్మికుల జీతాలు, పైపుల లీకేజీ మరమ్మతు, బోర్ల మరమ్మతు పనులు, పంచాయతీ ట్రాక్టర్ నెలవారీ బ్యాంకు వాయిదా, గ్రామాల్లో విద్యుత్ దీపాలు, నెలనెలా విద్యుత్ బకాయిలు.. ఇవన్నీ కచ్చితంగా చెల్లించాల్సిందే. నిధుల లేకపోవడంతో ఈ బరువు బాధ్యతల గురించి ప్రత్యేకాధికారులు అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. గ్రామ కార్యదర్శులే ఎలాగోలా కార్మికులకు జీతాలు సర్దుబాటు చేస్తున్నారు. ఇప్పటికే ఒక్కో గ్రామపంచాయతీ రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు అప్పు చేసి చెల్లిస్తున్నారు. పంచాయతీల ప్రత్యేకాధికారులు ఖర్చు విషయంలో లెత్తేస్తుండడంతో భారమంతా కార్యదర్శులపైనే పడుతోంది. నాలుగు రోజులు ఉండిపోయేవాళ్లమని ప్రత్యేకాధిరులు దాటవేత ధోరణిని అనుసరిస్తున్నారు.

### మూడు విధాలుగా నిధులు

పంచాయతీలకు మూడు రకాలుగా నిధులు సమకూరుతాయి. అస్తిపన్ను, ఎస్ఎఫ్‌సీ ఖాతా, 15వ ఆర్థిక సంఘం ద్వారా ఈ నిధులు వీటిలో ఉన్నాయి. అవి కూడా సకాలంలో చాలినన్ని సమకూరడం లేదు. పంచాయతీలకు వివిధ రకాల పన్నుల ద్వారా రాబడి వస్తుంది. చాలా గ్రామ పంచాయతీలకు ఇది కూడా చాలినంత రావడం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతీ అయిదు వందల జనాభాకు ఒక గ్రామ పంచాయతీని చేయడంతో ఇంటి పన్నుల ద్వారా వచ్చే ఆదాయం అంతంత మాత్రంగానే

మిగతా 6వ పేజీలో..

### 1,688 గ్రామ పంచాయతీలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 1,688 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 2018లో ఉమ్మడి జిల్లాలో 1,060 పంచాయతీలు మాత్రమే ఉండేవి. కేసీఆర్ ప్రభుత్వం 500 జనాభాకన్నా మించి ఉన్న తండాలను కూడా పంచాయతీలుగా మార్చడంతో వాటి సంఖ్య 1,688కి పెరిగింది. ప్రస్తుతం హనుమకొండ జిల్లాలో 208, వరంగల్ జిల్లాలో 323, జనగామ జిల్లాలో 281, మహబూబాబాద్ జిల్లాలో 461, ములుగు జిల్లాలో 174, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 241 గ్రామ పంచాయతీలున్నాయి. ఈ మొత్తం 1,688 పంచాయతీల్లో 83 మేజర్ గ్రామ పంచాయతీలు. హనుమకొండ, వరంగల్ జిల్లాల పునర్విభజన ఫలితంగా వాటి పరిధిలో అంతకుముందున్న గ్రామ పంచాయతీల సంఖ్యలో మార్పులు జరిగాయి. హనుమకొండ జిల్లాలో పెరగ్గా వరంగల్ జిల్లాలో తగ్గాయి.



జడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్‌కుమార్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

# ప్రజా సేవ ఆత్మ సంతృప్తినిస్తుంది..

- జడ్పీ పాలకవర్గ వీడ్కోలు సమావేశంలో కలెక్టర్ ప్రావీణ్య
- పదవులు, అధికారం శాశ్వతం కాదు : జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్

హనుమకొండ సిటీ, జూలై 3: ఉద్యోగులు, ప్రజాప్రతినిధులకు ప్రజలకు సేవ చేయడం ద్వారా ఆత్మ సంతృప్తి కలుగుతుందని కలెక్టర్ పి.ప్రావీణ్య పేర్కొన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా పరిషత్ పాలకవర్గ వీడ్కోలు సమావేశం ఆడాలత్‌లోని జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగింది. జడ్పీ సీఈవో విద్యాలత అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ ప్రావీణ్యతో పాటు అదనపు కలెక్టర్ రాధిక గుప్తా హాజరై మాట్లాడారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. జీవితంలో చిరస్థాయిగా నిలిచేవి ప్రజలకు చేసిన సేవలే అన్నారు. ఐదేళ్లపాటు అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో పాలకవర్గం చేసిన కృషి అభినందనీయమన్నారు. అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా మాట్లాడుతూ.. బాధ్యతల నిర్వహణ ఒక్కోసారి క్లిష్టతరంగా ఉంటుందని, కానీ ప్రజలకు సేవ చేయాలనే పట్టుదల వీడకుంటే సులభంగా మారుతాయన్నారు.

### ఎదిగినకొద్దీ ఒదిగి ఉండాలి..

అధికారం, పదవులు శాశ్వతం కాదని, ఎదిగినకొద్దీ ఒదిగి ఉండడమే ముఖ్యమని జడ్పీ చైర్మన్ డాక్టరు సుధీర్‌కుమార్ ఉద్ఘాటించారు. అధికారం, పదవులు దక్కినప్పుడు అహంకారానికి చోటు ఉండరాదన్నారు. ప్రజలకు సేవ చేయడానికి ఇదే ముఖ్య సూత్రమన్నారు. ప్రభుత్వాలు వస్తూ ఉంటాయి.. పోతూ ఉంటాయని, మనం పదవిలో ఉన్నప్పుడు ప్రజలకు ఏం చేశామన్నదే ప్రామాణికమన్నారు. అధికార దర్పాన్ని ప్రదర్శిస్తే ప్రజలకు దూరమవుతామన్నారు. ఐదేళ్ల పాలనలో జడ్పీ అధికారులు, ఉద్యోగులు, పాలకవర్గసభ్యుల మధ్య ఆత్మీయ అనుబంధాలు ఏర్పడ్డాయన్నారు. ఈ పరిస్థితి వల్లే అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టడం సాధ్యమన్నారు. ఎక్కడ విజయం సాధించాలన్న కూడా మానవ సంబంధాలకు విలువ ఇవ్వడమే ముఖ్యమనేది గుర్తించాలన్నారు. ఐదేళ్ల పాలన చాలా సంతృప్తిని కలిగించిందని సుధీర్‌కుమార్ పేర్కొన్నారు. జడ్పీటీసీలు, కో-ఆప్షన్ సభ్యులు, జడ్పీలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ఐదేళ్ల పాలన గుర్తులను తమ ప్రసంగాల్లో నెమరేశారు.

### పాలకవర్గ సభ్యులకు సత్కారం

జిల్లా పరిషత్ చైర్మన్ సుధీర్‌కుమార్‌తో పాటు ఇతర పాలకవర్గ సభ్యులకు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, అడిషనల్ కలెక్టర్ రాధికగుప్తా, జడ్పీ సీఈవో విద్యాలత ఇతర అధికారులు శాలువా, పూలమాలలతో సన్మానించారు. మెమొంటోలను అందచేశారు.

# రూ.88లక్షల ప్యాకేజీ

- నిట్ విద్యార్థి రవిషాకు ఉద్యోగం
- మరో 12 మందికి ఒక్కొక్కరికి రూ. 68లక్షల వార్షిక వేతనం



రవి షా

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 3: వరంగల్ నిట్ మరోసారి ప్రతిష్ఠాత్మకంగా విజయాన్ని సాధించింది. నిట్‌లో బీటెక్ ఈసీఈ చదువుతున్న పంజాబ్ రాష్ట్రంలోని లూధియానాకు చెందిన విద్యార్థి రవి షాను అదృష్టం వరించింది. నిట్‌లో నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో బెంగుళూరుకు చెందిన ఓ ఐటీ కంపెనీ రవి షాకు రూ.88లక్షల వార్షిక వేతనాన్ని అందిస్తూ ఉద్యోగాన్ని కట్టబెట్టింది. అలాగే వివిధ విభాగాలకు చెందిన మరో 12 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.68లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలు దక్కాయి. ఈ సందర్భంగా నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి మాట్లాడుతూ.. ఈ ఏడాది (2023-24 విద్యా సంవత్సరం) నిట్ విద్యార్థుల్లో 76 శాతం మందికి క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో ఉద్యోగాలు లభించాయన్నారు. బీటెక్ విద్యార్థులు 82 శాతం ప్లేస్‌మెంట్లు సాధించగా, ఎంటెక్, ఎంసీఏ, ఎంఎస్సీ, ఎంబీఏ తదితర విభాగాలతో కలిపితే మొత్తం ఈ ఏడాది 76 శాతం మందిని ఉద్యోగాలు వరించాయన్నారు. ఈ ఏడాది రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో భాగంగా 10 ప్రభుత్వ రంగ సంస్థలతో కలిసి మొత్తం 250కిపైగా కంపెనీలో పాల్గొన్నాయని తెలిపారు. రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో 1,483 మంది విద్యార్థులు అర్హత సాధించగా, 1,128మంది ఉద్యోగ ఆఫర్లు సాధించారన్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, డేటా అనాలసిస్, డేటా సైన్స్, డేటా ఇంజనీరింగ్, ప్రొడక్ట్ అనాలసిస్, ప్రొడక్ట్ ఇంజనీరింగ్, కన్సల్టెంట్ మేనేజ్‌మెంట్, గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రెయినీ తదితర విభాగాల్లో ఉద్యోగాలు సాధించారన్నారు. ఆగస్టు వరకు మరిన్ని కంపెనీలు వస్తాయని, మరింతమంది విద్యార్థులకు ఉద్యోగావకాశాలు దక్కే అవకాశం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మొత్తం ఉద్యోగాల్లో 54 శాతం ఉద్యోగాలు ఐటీ రంగం కంపెనీల నుంచే అందాయన్నారు. ఈ ఏడాది ఉద్యోగవకాశాలు స్తంభించిపోయినప్పటికీ ఐటీ కంపెనీల నుంచే అత్యధిక ప్యాకేజీలతో కూడిన ఉద్యోగాలను నిట్ విద్యార్థులు సాధించడం హర్షనీయమన్నారు. ఈ సందర్భంగా కెరీర్ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ హెడ్ ప్రొఫెసర్ జె. డేవిడ్సన్ బృందాన్ని ఆయన అభినందించారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

### నిట్‌కు రుణపడి ఉంటాను : రవి షా

వరంగల్ నిట్ క్యాంపస్‌కు రుణపడి ఉంటాను. నాకు మంచి ఉద్యోగానికి ఆఫర్ వచ్చింది. ఇదంతా నిట్ క్యాంపస్ వల్లే సాధ్యమైంది. నిట్‌లోని క్లబ్‌లు, సీనియర్ల నుంచి మంచి మార్గదర్శనం అందింది. నిట్‌లో అధ్యాపకులు, పాఠ్యాంశాలు తోడ్పాటును అందించాయి.




# ఎల్లుండి నుంచి శాకంబరీ ఉత్సవాలు

- భద్రకాళి ఆలయంలో 21వ తేదీ వరకు నిర్వహణ
- ఆలయ ప్రాంగణంలో నవరాత్రి వేడుకల కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ఈవో, ప్రధానార్చకుడు

వరంగల్ కల్చరల్, జూలై 3: చారిత్రక వరంగల్ నగరంలోని భద్రకాళి ఆలయంలో అమ్మవారి శాకంబరీ నవరాత్రి మహోత్సవాలు ఈనెల 6 నుంచి 21వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ప్రధానార్చకుడు భద్రకాళి శేషు తెలిపారు. బుధవారం ఆలయ ప్రాంగణంలోని అన్నపూర్ణ సన్నిదానంలో శాకంబరీ ఉత్సవాలపై మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాన్ని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ఈవో, అర్చకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ ఏడాది భద్రకాళి అమ్మవారి ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి పూర్తి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అమ్మవారి మాఢ వీధుల నిర్మాణ పనులు అత్యంత వేగవంతంగా కొనసాగుతున్నాయని చెప్పారు. ఒకటి, రెండు చిన్న అనుమతులు కూడా వచ్చేస్తాయని, పూర్తిస్థాయిలో పనులు ఆగకుండా కొనసాగుతాయని తెలిపారు. నిధుల కొరత లేకుండా మాఢవీధుల పనులు త్వరగా పూర్తిచేయాలని పేర్కొన్నారు.

ఆలయ ప్రధానార్చకుడు భద్రకాళి శేషు మాట్లాడుతూ.. అమ్మవారికి ఆషాఢ మాసం శనివారం పాడ్యమి రోజున శాకంబరీ ఉత్సవాలు ప్రారంభం అవుతుండగా, వేయి కలశాలతో సహస్ర కలశాభిషేకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ రోజు ఉదయం 4.30 గంటల నుంచి సాయంత్రం వరకు నిత్య పూజలు, గౌరీ గణపతి, మాతృక పూజలు, మంత్ర జపాలు, హోమాలు, వాహన సేవలు, అలంకరణలు కొనసాగుతాయని చెప్పారు. అలాగే ఉదయం, సాయంత్రం అమ్మవారి అలంకరణ, హారతి, తీర్థప్రసాద వితరణ కొనసాగుతుందని అన్నారు. 21న ఆదివారం గురుపౌర్ణమి సందర్భంగా వ్యాస పూజతో పలురకాల శాకములచే కూరగాయలతో శాకంబరీ అలంకరణ నిర్వహించబడునని, భక్తుల దర్శనానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆలయ ఈవో శేషు భారతి మాట్లాడుతూ.. శాకంబరీ ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రతీ రోజు భక్తులందరికీ అన్నప్రసాద వితరణ ఉంటుందని, ఎలాంటి అంతరాయం కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ విజయ్, శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.10కోట్లతో వ్యాపారి పరార్

- బాధితుల్లో వ్యాపారులు, రైతులు
- న్యాయం చేయాలని బాధితుల ధర్నా
- వ్యాపారిపై కేసు నమోదు



ధర్నా చేస్తున్న బాధితులు

వరంగల్ క్రైం, జూలై 3 : చాంబర్ ఆఫ్ కామర్స్ మక్కల సెక్షన్ అధ్యక్షుడు, మహాలక్ష్మీ ట్రేడర్స్ యజమాని ఇమ్మడి మధుకర్ రైతులు, వ్యాపారుల వద్ద రూ.10కోట్ల వరకు వసూలు చేసి పరారయ్యాడు. ఈ సంఘటన వరంగల్‌లో చోటుచేసుకుంది. మధుకర్ ఏనుమాముల మార్కెట్ వద్ద మహాలక్ష్మీ ట్రేడర్స్‌ను ప్రారంభించి వ్యాపారం చేయడంతో పాటు చాంబర్ ఆఫ్ కామర్స్ మక్కల సెక్షన్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. రియల్ వ్యాపారం చేస్తున్నట్లు పలువురిని నమ్మించిన మధుకర్.. వ్యాపారులు, రైతుల నుంచి రూ.10కోట్ల వరకు వసూలు చేసినట్లు తెలిసింది. డబ్బులు ఇచ్చిన వారు తిరిగి ఇవ్వమని మధుకర్‌పై ఒత్తిడి చేయగా ఆయన వారంరోజుల నుంచి కనిపించకుండా పోయాడు. ఏనుమాములలో నివాసం ఉంటున్న ఆయన కుటుంబసభ్యులతో కలిసి పరారయ్యాడు. మధుకర్ బాధితుల్లో ఇప్పటి వరకు 62మంది ఉన్నట్లు తేలింది. మొత్తంగా మధుకర్ పరార్ కావడం ఏనుమాములతో సంచలనం రేపింది. బాధితుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం.

### బాధితుల ధర్నా

మధుకర్ జాడ కోసం వెతికిన బాధితులు.. బుధవారం ఆయన బావమరిది సంతోష్ ఇంటి ఎదుట ధర్నాకు దిగారు. అప్పులు తీసుకునే క్రమంలో మధుకర్ తన బావమరిదితో రియల్ వ్యాపారం చేస్తున్నట్లు తెలిపాడు. మధుకర్ బావమరిది సంతోష్.. ఎస్వీఎన్‌రోడ్‌లో నాలుగంతస్థుల భవనం నిర్మిస్తున్నాడు. ప్రస్తుతం అమెరికాలో ఉన్న సంతోష్.. నగరంలో రియల్ వ్యాపారం చేస్తున్నట్లు తెలిసింది. కాగా, మధుకర్ జాడలేకపోవడంతో, సంతోష్ నిర్మిస్తున్న భవనం ఎదుట బాధితులు ధర్నాకు దిగారు. నిర్మాణ పనులు నిలిపివేయించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులతో చర్చించి న్యాయం చేస్తామని ధర్నా విరమింప చేశారు. ధర్నా చేసిన వారిలో ప్రముఖ వ్యాపారులతో పాటు వివిధ మండలాలకు చెందిన రైతులు పి.సుందర్, దామోదర్, రాజు, శంకర్, అశోక్, హరినాథ్ తదితరున్నారు. ఇదిలా వుండగా, జూన్ 30న మధుకర్ రూ.25లక్షలు ఇవ్వాలని కార్తికేయ ఎంటర్ ప్రైజెస్ యజమాని కృష్ణమూర్తి సైతం ఇంతజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని సీఐ శివకుమార్ ధ్రువీకరించారు. మధుకర్ మోసం చేశాడని బాధితుల నుంచి ఫిర్యాదులు అందాయని తెలిపారు. అతడిపై కేసు నమోదు చేశామన్నారు. మధుకర్‌ను పట్టుకునేందుకు తమ బృందాలను పంపినట్లు ఆయన పేర్కొన్నారు. మధుకర్ విదేశాలకు వెళ్లకుండా పాస్‌పోర్టు కార్యాలయానికి తాము సమాచారం ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. మధుకర్‌ను పట్టుకుని బాధితులకు న్యాయం చేస్తామని సీఐ శివకుమార్ పేర్కొన్నారు.

# ట్రాఫిక్ జంక్షన్లను పరిశీలించిన సీపీ

- మర్కజీ వద్ద డివైడర్లను తొలగించాలని ఆదేశాలు



మర్కజీ జంక్షన్ పరిశీలిస్తున్న కమిషనర్

వరంగల్ క్రైం, జులై 3: ట్రాఫిక్ రద్దీని నియంత్రించడంలో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ బుధవారం నగరంలోని మర్కజీ, అదాలత్ జంక్షన్‌లను పరిశీలించారు. మర్కజీ జంక్షన్ వద్ద డివైడర్లను ఏర్పాటు చేయడంతో వాహనదారులు రాంగ్ రూట్‌లో వెళతున్నారని గమనించారు. నయీం నగర్ నాలా పనులు జరుగుతున్నందున ఇటుగా వాహనాల రద్దీగా ఎక్కువగా ఉంటోందని గుర్తించారు. మర్కజీ జంక్షన్ వద్ద డివైడర్లను తొలగించాలని అధికారులను అంబర్ కిషోర్ ఝూ ఆదేశించారు. కొద్దిరోజులుగా ఈ ప్రాంతంలో ప్రయాణికుల అవస్థలపై ఫిర్యాదులు సైతం రావడంతో కమిషనర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. అనంతరం అదాలత్ సెంటర్‌ను సందర్శించిన కమిషనర్.. పాత సిగ్నల్స్.. కొత్తగా ఏర్పాటు చేసిన సిగ్నల్స్‌కు అడ్డు వస్తున్నట్లు గుర్తించారు. పాత సిగ్నల్స్ తొలగించాలని అధికారులకు సూచించారు. కమిషనర్ వెంట ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, హనుమకొండ, కాజీపేట ట్రాఫిక్ సీఐలు నాగబాబు, షూకుర్, ఎస్ఐ సతీష్ ఉన్నారు.

# సర్వత్రా సమ్మతం

## ములుగు జిల్లాకు 'సమ్మక్క సారలమ్మ' పేరుకు జనామోదం

- పేరు మార్పునకు గ్రామసభల నిర్వహణ
- కలెక్టర్‌కు మినిట్స్ అందజేసిన అధికారులు
- 'రామప్ప' పేరుపెట్టాలని పాలంపేట వాసుల వినతి
- కలెక్టర్‌కు విన్నవించనున్న పరిరక్షణ కమిటీ

ములుగు, జూలై 3: తమ ఆరాధ్య దైవాలైన ఆ వనదేవతలు సమ్మక్క, సారలమ్మ పేరును ములుగు జిల్లాకు పెట్టేందుకు తమకు ఎలాంటి అభ్యంతరాలు లేవని మెజారిటీ ప్రజలు సమ్మతం తెలిపారు. అయితే రామప్ప దేవాలయం తమ ఆత్మగౌరవ ప్రతీక అని.. వనదేవతల పేరును తాము కాదనలేమని, కానీ రామప్ప పేరును కూడా జిల్లాకు పరిశీలించాలంటూ రామప్ప పరిరక్షణ కమిటీ కలెక్టర్‌కు నేరుగా వినతి పత్రం అందజేసింది. ములుగు జిల్లా పేరును సమ్మక్క, సారలమ్మ ములుగు జిల్లాగా మార్చేందుకోసం రాష్ట్రమంత్రి సీతక్క ప్రతిపాదన మేరకు కలెక్టర్ టీఎస్.దివాకర పబ్లిక్ నోటీసును జారీ చేశారు. ఈక్రమంలో జిల్లావ్యాప్తంగా బుధవారం ప్రత్యేక గ్రామసభలు జరిగాయి. వానాకాలం వ్యవసాయ పనులు జోరుగా సాగుతుండటంతో ప్రజలు కొద్దిసంఖ్యలోనే పాల్గొనగా.. గ్రామ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శుల సమక్షంలో జరిగిన ఈ సభల్లో మెజారిటీ ప్రజలు సమ్మక్క, సారలమ్మ పేరుకు అంగీకారం తెలిపారు. వనదేవతలు కొలువైన మేడారంలో జరిగిన సభలో ప్రజలు ఏకవాక్యంగా వనదేవతల పేరుకు జై కొట్టారు. కొందరు రాతపూర్వకంగా అభిప్రాయాలు, అభ్యంతరాలను తెలియజేయగా.. చాలామంది చేతులెత్తి సమ్మతం తెలిపారు. మినిట్స్ నమోదు చేసిన అధికారులు నివేదిక రూపంలో జిల్లా కలెక్టర్‌కు సమర్పించారు.



వాజేడు మండలం చంద్రుపట్లలో చేతులెత్తి సమ్మతం తెలుపుతున్న ప్రజలు

### తెరపైకి రామప్ప పేరు..

వెంకటాపూర్ మండలం పాలంపేటలో జరిగిన గ్రామసభలో పాల్గొన్న స్థానికులు మాత్రం రామప్ప ములుగు జిల్లాగా నామకరణం చేయాలని కోరారు. ఇప్పటికే తాడ్వాయి మండలం, జాతీయ గిరిజన విశ్వవిద్యాలయం, తుపాకులగూడెం బ్యారేజీలకు వనదేవతల పేరు పెట్టారని గుర్తుచేశారు. యునెస్కో గుర్తింపుతో ప్రపంచ ఖ్యాతిపొందిన రామప్ప పేరును ములుగు జిల్లాకు పెట్టడం ద్వారా పురాతన కట్టడ ప్రాముఖ్యత మరింత పెరుగుతుందని రామప్ప పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు ఆకిరెడ్డి రామ్మోహన్‌రావు అన్నారు. ఈ మేరకు పరిరక్షణ కమిటీ ప్రతినిధులు కలెక్టర్‌ను కలిసి నేరుగా వినతిపత్రం సమర్పించనున్నట్లు తెలిపారు.

ఆంధ్రజ్యోతి REQUIRES
DTP ఆపరేటర్లు కావలెను
అర్హత : తెలుగు, ఇంగ్లీష్ టైపింగ్ చేయగలగి ఉండాలి
అనుభవం : కమర్షియల్ అడ్వర్‌టైజ్‌మెంట్‌ను QuarkExpress, Photoshop గ్రాఫిక్స్ నందు ఆకర్షణీయంగా (తెలుగు/ ఇంగ్లీషు) డిజైన్, తెలుగు టైపింగ్ చేయగలిగిన డి.టి.పి. ఆపరేటర్లు మడికొండ యూనిట్‌లో పని చేయుటకు కావలెను.
Interested candidates may Walk-in on 04.07.2024 at Office Premises from 5:00 PM.
Address : Andhra Jyothi Buildings, Sy.No.1054, Madikonda, Hanumakonda -506 142.
Contact : 9866572547



సంధ్య 70 - ఆర్‌.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.30,6.00,9.30
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
తారకరామ 70 - కాచిగూడ 10.45,2.15,5.45,9.15
దేవి 70 - ఆర్‌.టి.సి.క్రాస్‌రోడ్స్ (3D తెలుగు) 8.00,11.40,3.20,7.00,10.30
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
కోణార్క్ 70 - దిల్‌సుఖ్‌నగర్ (3D) 11.00,2.30,6.00,9.30
మల్లికార్జున 70ఎంఎం ఎ/సి - కూకట్‌పల్లి
భ్రమరాంబ 70ఎంఎం ఎ/సి - కూకట్‌పల్లి
అర్జున్ 70ఎంఎం ఎ/సి - కూకట్‌పల్లి
తెలుగు 2D
తెలుగు 3D
హిందీ 3D
GLOBAL CINEMAS RELEASE



వరంగల్
నిజామాబాద్
ఆదిలాబాద్
మహబూబ్‌నగర్
ఖమ్మం
మెదక్
కరీంనగర్
రంగారెడ్డి
నల్గొండ
రాయచూర్


# విజ్ఞాన భాండాగారం.. 'ఆస్కార్' గ్రంథాలయం

- స్వగ్రామం చల్లగరిగలో నిర్మించిన సినీ గేయ రచయిత చంద్రబోస్
- నేడు ప్రారంభోత్సవం.. హాజరవనున్న పలురంగాల ప్రముఖులు

చిట్యాల, జూలై 3: పుట్టిన ఊరిపై మమకారంతో.. గ్రామస్థులకు ఇచ్చిన మాటకు కట్టుబడి.. తాను సాహితీ ఓనమాలు నేర్చుకున్న చోట అధునాతన గ్రంథాలయ భవనాన్ని నిర్మించారు ఆస్కార్ అవార్డు గ్రహీత, ప్రముఖ సినీ గేయ రచయిత కనుకంట్ల చంద్రబోస్. తన తల్లి కనుకుంట్ల మధునమ్మ జ్ఞాపకార్థం రూ. 36 లక్షలతో స్వగ్రామమైన జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగ గ్రామంలో హంగులతో నిర్మించిన ఆ గ్రంథాలయాన్ని గురువారం ప్రారంభించనున్నారు. చంద్రబోస్ పాఠశాల విద్యనభ్యసించే సమయంలో నిత్యం ఇక్కడి గ్రంథాలయంలోని సాహిత్య పుస్తకాలను చదువుకుంటూ, ఆపక్కనే ఉన్న శివాలయంలో సేదతీరే వారని, భజనపాటలు పాడుతూ, సాహిత్యంపై మక్కువ పెంచుకున్నారని ఆయన చిన్ననాటి మిత్రులు తెలిపారు. పదో తరగతి వరకు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదివిన చంద్రబోస్ 1984-85లో పదో తరగతి పూర్తికావడంలో పాలిటెక్నిక్‌లో చేరారు. కొంత కాలం ప్రైవేటు ఉద్యోగం చేసి.. 1994-95లో తాజ్‌మహల్ సినిమాలో మంచు కొండల్లోని చంద్రమా అనే పాటతో సినీ రంగ ప్రవేశం చేశారు. నేనున్నాను సినిమాలో మౌనంగానే ఎదగమని, చీకటితో వెలుగే చెప్పెను అనే రెండు పాటలకు నంది అవార్డులు దక్కించుకన్న చంద్రబోస్ ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలోని నాటు.. నాటు పాటకు ఇటీవల గోల్డెన్ గ్లోబల్ అవార్డుతో పాటు ప్రపంచ ప్రతిష్ఠాత్మక ఆస్కార్ అవార్డును దక్కించుకున్నారు. ఇప్పటివరకు మూడు వేలకు పైగా సినిమా పాటలు రాసిన చంద్రబోస్ తండ్రి నర్సయ్య రిటైర్డు టీచర్ కాగా తల్లి మధునమ్మ మూడేళ్ల క్రితం కన్నుమూశారు. ఆమె జ్ఞాపకార్థం చంద్రబోస్ స్వగ్రామం చల్లగరిగలో 'ఆస్కార్' గ్రంథాలయాన్ని నిర్మించారు.

**అందరి సహకారంతోనే నిర్మించగలిగా : చంద్రబోస్, సినీగేయ రచయిత**

'ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలో నేను రాసిన నాటు.. నాటు.. పాటకు ఆస్కార్ అవార్డు వచ్చిన సమయంలో నా గ్రామంలోని బాల్య మిత్రులు, గ్రామస్థులు అభినందన సభ ఏర్పాటు చేయగా.. నాకు ఎంతో విజ్ఞానాన్ని అందించిన గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరుకోవడాన్ని చూసి ఎంతో బాధపడ్డా.. అమ్మ జ్ఞాపకార్థం నూతన భవనం నిర్మించాలని నిర్ణయించుకున్నా. స్నేహితులు, గ్రామస్థుల సహకారంతో.. మా నాన్న నరసయ్య, అన్నయ్య రాజేందర్ తోడ్పాటుతో అనుకున్న సమయానికి ముందుగానే నిర్మాణం పూర్తయింది' అని చంద్రబోస్ 'ఆంధ్రజ్యోతి'తో పేర్కొన్నారు. ఈ భవనాన్ని గురువారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్‌శర్మతో పాటు పలువురు ప్రముఖుల సమక్షంలో ప్రారంభిస్తున్నామన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న పుస్తకాలకు తోడుగా అన్ని రకాల పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచుతామని, చల్లగరిగ గ్రామస్థులే కాకుండా మండల ప్రజలు ఈ ఆస్కార్ గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఇక గురువారం జరిగే ప్రారంభోత్సవానికి పలురంగాల ప్రముఖులు హాజరవుతున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేశామని గ్రంథాలయాల జిల్లా కార్యదర్శి శ్రీలత తెలిపారు. ఇప్పటివరకు స్థానిక గ్రంథాలయంలో రికార్డు అసిస్టెంట్ మాత్రమే ఉండేవారని, రేపటి నుంచి ప్రత్యేకంగా ఒక అధికారిని నియమిస్తామని ఆమె వెల్లడించారు.



ప్రారంభానికి సిద్ధమైన ఆస్కార్ గ్రంథాలయం, సినీ గేయ రచయిత చంద్రబోస్

## వార్డు ఆఫీసర్లను మాలో చేర్చడం అన్యాయం

**ఆర్‌డీఎంఏకు వినతి పత్రం సమర్పించిన బల్దియా ఉద్యోగులు**


ఆర్‌డీఏఎం షాహిద్‌మసూద్‌ను కలిసిన బల్దియా సిబ్బంది

వరంగల్ కార్పొరేషన్, జూలై 3: ఇటీవల వీఆర్‌ఏలు, వీఆర్‌ఏలుగా పని చేసిన వారిని మునిసిపల్ శాఖతో పాటు వివిధ ప్రభుత్వ విభాగాలలో నింపిన విషయం తెలిసిందే. కాగా, వీరి గత రెవెన్యూ విభాగం సీనియారిటీని లెక్కలోకి తీసుకోకుండా తమ ప్రస్తుత మునిసిపాలిటీ రూల్స్‌లో కలిసి సీనియారిటీ లిస్టులో కలపడం వల్ల తమకు చాలా అన్యాయం జరుగుతుందని వరంగల్ బల్దియా కార్యాలయంతో పాటు సర్కిల్ కార్యాలయాల ఉద్యోగులు తీవ్రంగా ఖండిస్తున్నారు. దీనిపై బుధవారం హనుమకొండ కుడా కార్యాలయంలోని వరంగల్ రీజినల్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ షాహిద్ మసూద్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. కొత్తగా వచ్చిన వార్డు ఆఫీసర్లను తమతో చేర్చడం వల్ల తమ సీనియారిటీ వెనక్కి తగ్గిపోయి ఆలస్యంగా పదోన్నతి పొందే ప్రమాదం ఉందని చెప్పుకొచ్చారు. అంతే కాకుండా బల్దియాలో డిగ్రీలు, పీజీలు చేసిన వ్యక్తులు జూనియర్ అసిస్టెంట్లు, మినిస్టీరియల్ స్టాఫ్‌గా పని చేస్తుండగా ఎస్‌ఎస్‌సీ చదివి వీఆర్‌ఏలు, వీఆర్‌వోలుగా వచ్చి చేరిన వారిని తమతో చేర్చయడం అన్యాయం అని వినతిలో పేర్కొన్నారు. తమకు జరుగుతున్న అన్యాయంపై అధికారులు స్పందించాలని, దీనిపై రాష్ట్ర అధికారులను కలిసి విన్నవిస్తామన్నారు. అంతేకాకుండా కోర్టును ఆశ్రయించి సమస్య పరిష్కారానికి ముందుకు వెళతామన్నారు. ఆర్‌డీఎంఏను కలిసిన వారిలో జాక్ నాయకులు బొట్ల రమేష్, రాజారపు భాస్కర్‌లతో పాటు సుమారు 30 మంది సిబ్బంది ఉన్నారు.

## ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

బాలసముద్రం, జూలై 3: క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉరివేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. న్యూశాయంపేటకు చెందిన సత్తు శ్రీధర్ (40) క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. మంగళవారం తన భార్య ఇంటి ఎదుట పని చేసుకుంటుండగా ఇంట్లో బెడ్‌రూంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు శ్రీధర్ భార్య రాధిక, తండ్రి వీరస్వామి ఆటోలో ఎంజీఎంకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సుబేదారి పోలీసులు తెలిపారు. మృతుడు శ్రీధర్‌కు భార్య రాధిక, ఇద్దరు కుమారులు ఉన్నారు.


సీపీ అంబర్ కిషోర్ ఝాను కలిసిన ఇన్‌స్పెక్టర్లు సువర్ణ, రామకృష్ణ

## సీపీని కలిసిన ఇన్‌స్పెక్టర్లు

వరంగల్ క్రైం, జులై 3: కమిషనరేట్ పరిధిలోని పలు స్టేషన్‌లలో బాధ్యతలు చేపట్టిన ఇన్స్‌పెక్టర్లు.. బుధవారం కమిషనర్ అంబర్ కిషోర్ ఝాను మర్యాద పూర్వకంగా కలిశారు. వరంగల్ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ రామకృష్ణ, సుబేదారి మహిళా పోలీస్‌స్టేషన్ సువర్ణ, పరకాల, గీసుగొండ, ఆత్మకూరు క్రాంతికుమార్, బాబులాల్, సంతోష్ మర్యాదపూర్వకంగా కలిశారు. బాధ్యతలు చేపట్టిన సీఐలను కమిషనర్ అభినందించారు.

**బాలల సంరక్షణ సామాజిక బాధ్యతగా గుర్తించాలి**

బాలల సంరక్షణకు సామాజిక బాధ్యతగా గుర్తించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. ఆపరేషన్ ముస్కాన్ 10వ విడత పోస్టర్స్‌ను సీపీ బుధవారం కమిషనరేట్ కార్యాలయంలో ఆవిష్కరించారు. బాల కార్మికులతో పాటు వేధింపులకు గురవుతున్న బాలలను గుర్తించి వారి ఉజ్వల భవిష్యత్‌కు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ రవికుమార్, హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల బాలల సంరక్షణ సమితి చైర్‌పర్సన్స్ దామోదర్, వసుధ, ఉప్పలయ్య, బాలల పరిరక్షణ అధికారులు ప్రవీణ్, రాజు, రవికాంత్, చైల్డ్‌లైన్ కో-ఆర్డినేటర్స్, ఎన్జీవో ప్రతినిధులు, ఏహెచ్‌టీయూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 9 నుంచి 17 వరకు అయోధ్య, కాశీ పుణ్యక్షేత్ర యాత్ర

గిర్మాజీపేట, జూలై 3: భారత రైల్వే క్యాటరింగ్, టూరిజం కార్పొరేషన్ భారత్ గౌరవ్ పర్యాటక రైలు ఈనెల 9 నుంచి 17వ తేదీ వరకు అయోధ్య కాశీ పుణ్యక్షేత్ర యాత్ర నిర్వహిస్తున్నట్లు ఐఆర్‌సీటీసీ సికింద్రాబాద్ జోనల్ గ్రూపు జనరల్ మేనేజర్ పి.రాజ్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అయోధ్య, కాశీ పుణ్యక్షేత్ర యాత్రలో భాగంగా గయాలోని విష్ణుపాదం దేవాలయం, వారణాసిలోని కాశీ విశాలాక్షి, విశ్వనాథ, అన్నపూర్ణ దేవాలయాలు, గంగా హారతి, సారనాథ్ కట్టడాల సందర్శన, అయోధ్య రామ్ జన్మభూమి, హనుమాన్ గర్హి, సరయూ నది హారతి, ప్రయాగ్‌రాజ్‌లో త్రివేణి సంగమం, మనుమాన్ మందిర్, శంకర్ విమాన మండపం సందర్శన ఉంటుందని తెలిపారు. ఈ పుణ్యయాత్ర 8 రాత్రులు, 9 పగళ్లుగా కొనసాగుతుందని, రోజూ ఉదయం అల్పాహారం, టీ, మధ్యాహ్నం, రాత్రి శాకాహార భోజనంతో పాటు పుణ్యయాత్ర ప్రయాణికులకు జీవిత బీమా సదుపాయం, స్నేహపూరిత, వృత్తిపర గైడ్‌ల సేవలు ఉంటాయని, ఐఆర్‌సీటీసీ మేనేజర్ ఈ రైలులో ఉంటారని అన్నారు. ఈ పుణ్యయాత్ర చార్జీలు ఒక్కొక్కరికి స్లీపర్ రూ. 15,510, మూడవ ఏసీ తరగతి రూ.24,300, రెండవ తరగతి ఏసీ రూ. 31,500 ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అలాగే 5 నుంచి 11 యేళ్లలోపు పిల్లలు ఒక్కొక్కరికి స్లీపర్‌కు రూ.14,140, 3వ తరగతి ఏసీ రూ.23,110, 2వ తరగతి ఏసీ రూ.30,080 ఉంటుందని ఆయా తరగతిల వారీగా నివాస సదుపాయం ఉంటుందని తెలిపారు. ఈ పుణ్యయాత్రకు వెళ్లు ప్రయాణికులు టికెట్ బుకింగ్, పూర్తి వివరాల కోసం ఐఆర్‌సీటీసీ ఫోన్ నంబర్లు 9701360701, 9281495845, 9281495843, 8287932228, 8287932229 లలో సంప్రదించాలని ఐఆర్‌సీటీసీ అధికారి రాజ్‌కుమార్ కోరారు.

## దూరవిద్య డిగ్రీ పరీక్షల్లో 11 మంది డీబార్

కేయూ క్యాంపస్, జూలై 3: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న బీఏ, బీకాం, బీఎస్సీ ఇతర దూరవిద్య డిగ్రీ కోర్సుల పరీక్షల్లో చూచిరాతలకు పాల్పడగా పరీక్షల తనిఖీ అధికారులు 11మంది విద్యార్థులను పట్టుకుని డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్.నరేందర్ బుధవారం తెలిపారు. డీబారైన వారిలో మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇద్దరూ. ఏబీవీ డిగ్రీ కళాశాల జనగామ 6గురు, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మరో ముగ్గురు ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే పరీక్షల నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## ఒలింపియాడ్‌లో అనికేత్‌కు గోల్డ్‌మెడల్


గోల్డ్‌మెడల్ అందుకుంటున్న అనికేత్

కాజీపేట, జూలై 3: ఇటర్నేషనల్ ఇంగ్లీష్ ఒలంపియాడ్‌లో ఫాతిమాగనర్ బిషప్ బెరెట్టా స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్న అనికేత్‌కు గోల్డ్ మెడల్ లభించింది. ఈ మేరకు పాఠశాల ప్రధా నోపాధ్యాయుడు జయప్రతాప్‌రెడ్డి బుధవారం పాఠ శాలలో జరిగిన కార్యక్రమంలో అనికేత్‌కు గోల్డ్‌మె డల్, సర్టిఫికెట్ అందజేశారు. సిల్వర్ జోన్ ఒలం పియాడ్ ఆధ్వర్యంలో 2023 - 24 సంవత్సరానికిగాను నిర్వహించిన పరీక్షలో అనికేత్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.


రేపే బ్రహ్మాండమైన విడుదల

శాంతి 70ఎంఎం - నారాయణగూడ 11.00,2.00,6.00,9.00
మెగా 70 - దిల్‌సుఖ్ నగర్ 11.00,2.00,6.00,9.00
కాక్కూర్ 70 - ఇసిఐఎల్ 11.00,2.00,6.00,9.00
సంఘర్ష 70 - వనస్థలిపురం 11.00,2.00,6.00,9.00
రంగ 70ఎంఎం - జీడిమెట్ల 11.00,2.00,6.00,9.00
SKML MOTION PICTURES THROUGH GANESH BHARI 9296509333/929992173

FAMILY ENTERTAINMENT విజయవంతమైన 2వ వారం


రుక్మిణి 70ఎంఎం - సంగారెడ్డి 11.00,2.00,6.00,9.00
వెంకటరమణ 70ఎంఎం - జడ్చర్ల
శుక్రవారం నుండి
PARAM JYOTHI FILMS 9848028739

## 'మాటిచ్చా.. సరస్వతి గుడిని నిర్మించా'

» 'ఆంధ్రజ్యోతి'తో సినీ గేయ రచయిత చంద్రబోస్

» ఆయన స్వగ్రామం చల్లగరిగలో 'ఆస్కార్ గ్రంథాలయం'



ఆస్కార్ గ్రంథాలయం

చిట్యాల, జూలై 3: ఆస్కార్ అవార్డు గ్రహీత, సినీ గేయ రచయిత కనుకుంట్ల చంద్రబోస్ తన గ్రామ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. తన స్వగ్రామం జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగ గ్రామంలో సొంత నిధులతో ఆస్కార్ పేరిట ఓ గ్రంథాలయాన్ని నిర్మించారు. ఈ ఆస్కార్ గ్రంథాలయ ప్రారంభోత్సవం గురువారం జరగనుంది. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో బుధవారం ఫోన్‌లో మాట్లాడిన చంద్రబోస్.. 'గ్రామస్థులకు ఇచ్చిన మాట ప్రకారం సరస్వతి గుడిని నిర్మించా. చాలా సంతోషంగా ఉంది' అని ఆనందం వ్యక్తం చేశారు. చల్లగరిగలోని తమ ఇంటి పక్కన ఉన్న గ్రంథాలయంలో ఎన్నో సాహిత్య పుస్తకాలు చదివానని, వాటి వల్లే తాను ఉన్నత స్థాయికి ఎదిగానని ఈ సందర్భంగా చెప్పారు. ఆర్‌ఆర్‌ఆర్ సినిమాకు తాను రాసిన నాటునాటు పాటకు ఆస్కార్ అవార్డు రావడంతో బాల్య మిత్రులు, గ్రామ ప్రజలు తనని సన్మానించారని చెప్పారు. ఆ సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతూ గ్రామంలో అత్యాధునిక హంగులతో గ్రంథాలయ భవనం నిర్మిస్తానని ఇచ్చిన మాటను ఈ రోజున నిలబెట్టుకున్నానని వివరించారు. అందరి సహకారంతో రూ. 36లక్షల వ్యయంతో ఎనిమిది నెలల్లో భవనాన్ని సిద్ధం చేసి ఆస్కార్ గ్రంథాలయం అని నామకరణం చేశామని చెప్పారు. కాగా, రచయిత చంద్రబోస్ తన సొంత నిధులతో నిర్మించిన ఆస్కార్ గ్రంథాలయ ప్రారంభోత్సవం గురువారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని గ్రంథాలయాల జిల్లా కార్యదర్శి శ్రీలత తెలిపారు.

## ఇద్దరు రైతుల ఉసురు తీసిన అప్పులు

పెంబి రూరల్, బొంరాస్‌పేట్, జూలై 3: పంటల కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక ఇద్దరు రైతులు బలవన్మరణానికి పాల్పడ్డాడు. నిర్మల్ జిల్లా పెంబి మండలం యాపల్‌గూడ గ్రామానికి చెందిన రైతు అర్క సంతోష్ (28) తనకున్న ఎకరంతో పాటు నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని పత్తి పంట వేశాడు. ఇందుకోసం రూ.లక్షల్లో అప్పు చేశాడు. పత్తి విత్తనా లు మొలకెత్తకపోవడంతో పాటు చేసిన అప్పులు తీర్చాలని బాకీలు ఇచ్చిన వారు వేధించడంతో మనస్తాపానికి గురై మంగళవారం అర్ధరాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వికారాబాద్ జిల్లా మెట్లకుంట గ్రామానికి చెందిన బైరం నర్సింహులు(62)కు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. వారి వివాహాల కోసం చేసిన అప్పులు తీర్చేందుకు తనకు ఉన్న రెండు ఎకరాల పొలంలో ఎకరన్న సీలింగ్ భూమిని అమ్మకానికి పెట్టగా కొనుగోలుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపంతో బుధవారం ఉరేసుకున్నాడు.

## ఉస్మానియా ఆస్పత్రిలో విద్యుత్ అంతరాయం

» టార్చ్‌లైట్ల వెలుగులో శస్త్రచికిత్సలు

మంగళ్‌హాట్, జూలై 3(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా ఆస్పత్రిలో బుధవారం మధ్యాహ్నం విద్యుత్ నిలిచిపోవడంతో రోగులు, వైద్యులు ఉక్కిరిబిక్కిరయ్యారు. శస్త్రచికిత్సలు చేసే సమయంలో అంతరాయం కలగడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ నిలిచిన వెంటనే ప్రారంభం కావాల్సిన జనరేటర్లు సైతం మొరాయించాయి. సిబ్బంది వెంటనే విద్యుత్ విభాగం నిపుణులను రప్పించి అరగంట తర్వాత సేవలను పునరుద్ధరించారు. దీంతో అప్పటివరకు సెల్‌ఫోన్, టార్చ్‌లైట్ల వెలుతురులోనే శస్త్రచికిత్సలను కొనసాగించినట్లు సమాచారం.

# 'జికా'...వస్తోంది జాగ్రత్త

రాష్ట్రాలను అప్రమత్తం చేసిన కేంద్రం.. మహారాష్ట్రలో పెరుగుతున్న కేసులతో ఆందోళన

» సంసిద్ధంగాలేని తెలంగాణ వైద్యశాఖ

» కనీస చర్యలూ తీసుకోని వైనం

» ఇప్పటికే రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల విజృంభణ



హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పొరుగు రాష్ట్రం మహారాష్ట్రలో జికా వైరస్ విజృంభిస్తోంది. రెండు రోజుల క్రితం పుణెలో ఒక్క రోజే ఆరు జికా వైరస్ వ్యాధి (జడ్‌వీడీ) కేసులు నమోదుకావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. దీంతో అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం బుధవారం అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. ఈమేరకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్‌ఎస్) డాక్టర్ అతుల్‌గోయల్ అడ్వైజరీ జారీ చేశారు. జికాపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా గర్భిణులను స్ర్కీనింగ్ చేయాలని కేంద్రం కోరింది. జికా వైరస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయిన గర్భిణుల్లో పిండం ఎదుగుదలను పర్యవేక్షించాలని సూచించింది. ప్రతి ఆస్పత్రిలో కచ్చితంగా ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించాలని, ఆ అధికారి జికా వైరస్ వ్యాప్తికి కారణమయ్యే దోమల పెరుగుదల నివారణకు చర్యలు చేపట్టాలని కోరింది. జికా కేసులు నమోదైతే వెంటనే నేషనల్ సెంటర్ ఫర్ వెక్టర్ బోర్న్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీవీబీడీసీ)కు రిపోర్టు చేయాలని, అనుమానిత నమూనాలను పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపాలని సూచించింది. అలాగే ఐసీఎంఆర్ ఆధ్వర్యంలోని వైరస్ పరిశోధనా కేంద్రాలకు కూడా శాంపిళ్లను పంపాలని ఆదేశించింది.

### అప్రమత్తంగాలేని రాష్ట్ర వైద్యశాఖ..

మహారాష్ట్ర నుంచి తెలంగాణకు రోజూ వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఎంతో అప్రమత్తంగా ఉండాలి. ఇలాంటి మహమ్మారులు వచ్చినప్పుడు వాటిని నియంత్రించే బాధ్యత క్షేత్రస్థాయిలో ప్రజారోగ్య సంచాలకులకే ఉంటుంది. అయితే మన వద్ద ఇంతవరకు అందుకు సంబంధించిన కార్యాచరణేమీ కానరావడంలేదు. ఇప్పటికే రాష్ట్రంలో ఒకవైపు డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి సీజనల్ వ్యాధుల విజృంభణ మొదలైంది. గత ఐదు నెలల్లో మలేరియా, డెంగ్యూ మరణాలు కూడా సంభవించాయి. పటిష్ట పర్యవేక్షణ లేకపోవడంతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో వీటిపై అవగాహన ఉన్న విభాగాధిపతి లేకపోవడం ప్రధాన సమస్యగా మారిందని వైద్యవర్గాలు చెబుతున్నాయి. అందుకే సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### దోమల ద్వారా వ్యాప్తి..

జికా వైరస్ అనేది దోమల ద్వారా సంక్రమించే ఫ్లేవి వైరస్. జికా ప్రధానంగా ఏడెస్ దోమల కాటు ద్వారా వ్యాపిస్తుంది. ఇదే దోమ కుడితే డెంగ్యూ, చికున్‌గున్యా, ఎల్లో ఫీవర్ వైరస్‌లు కూడా సోకుతాయి. జికా సోకితే సాధారణ లక్షణాలే ఉంటాయి. ఇవి 2-7 రోజులపాటు కనిపిస్తాయి. ముఖ్యంగా జ్వరం, దద్దుర్లు, కీళ్ల నొప్పి, కండ్లకలక (ఎరుపు కళ్లు), కండరాలు, తలనొప్పితో పాటు మరికొన్ని తీవ్రమైన సమస్యలు కలుగుతాయి. మైక్రోసెఫాలీ (పుట్టుక లోపం), గులియన్ బారే సిండ్రోమ్ (న్యూరోలాజికల్ డిజార్డర్), మెనింజైటిస్ (మెదడు, వెన్నెముక లైనింగ్ వాపు)లాంటి వాటికి కారణమౌతుంది.

### నివారణ ఎలాగంటే..

దోమల వృద్ధిని నివారించడానికి ఇళ్లు, బహిరంగ ప్రదేశాల చుట్టూ నిలిచిన నీటిని తొలగించాలి. జికా కూడా లైంగికంగా సంక్రమించే అవకాశం ఉన్నందున సురక్షితమైన విధానాలను పాటించాలి. జికాకు నిర్దిష్ట చికిత్స లేదు, కానీ లక్షణాల ఆధారంగా చికిత్సను అందిస్తారు. జికా లక్షణాలు కనిపిస్తే వెంటనే సరైన రోగ నిర్ధారణ పరీక్షలు చేయించుకుని డాక్టర్‌ను సంప్రదించాలి.

# సారూ దయచూపరూ..

» తెలంగాణలో విధుల్లో 2వేల మంది ఆంధ్ర హోంగార్డులు

» స్వరాష్ట్రానికి పంపాలని గతంలో రెండు ప్రభుత్వాలకు పలుమార్లు వినతి

» ఇరు రాష్ట్రాల సీఎంల భేటీ నేపథ్యంలో మరోసారి వేడుకోలు

హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పోలీస్ శాఖలో పనిచేస్తున్న సుమారు 2వేల మంది హోంగార్డుల కుటుంబాలు దయనీయ పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత ఏపీకి చెందిన పలు జిల్లాల నుంచి హోంగార్డులు విధుల్లో చేరారు. అయితే రాష్ట్ర విభజన సమయంలో సుమారు 2 వేల మంది ఏపీ స్థానికత కలిగిన హోంగార్డులు తెలంగాణలోనే ఉండిపోయారు. అలాగే తెలంగాణ స్థానికత కలిగిన సుమారు 500 మందికిపైగా హోంగార్డులు ఏపీలో విధులు నిర్వహిస్తున్నారు. అయితే హోంగార్డుల గౌరవ వేతనం తక్కువ ఉండటం, ఆర్జిత సెలవులు లేకపోవడం కుటుంబాలను నెట్టుకురావడం ఇబ్బందికరంగా ఉంది. తెలంగాణలో గత సీఎం కేసీఆర్ హోంగార్డుల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా అమలు కాలేదు. ఏపీ మాజీ సీఎం దృష్టికి హోంగార్డులు తమ సమస్య తీసుకెళ్లగా సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తామని భరోసా ఇచ్చారు.. కానీ ఉపయోగం లేకుండాపోయింది. తమ సమస్య పరిష్కరించాలని తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా లాభం లేకుండాపోయింది. తాజాగా రెండు రాష్ట్రాల సీఎంలు భేటీకానున్న నేపథ్యంలో దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యపై చర్చించి నిర్ణయం తీసుకోవాలని మరోసారి హోంగార్డులు వేడుకుంటున్నారు. ఏపీ స్థానికత ఉన్న హోంగార్డులు తెలంగాణలో చాలీచాలని వేతనాలతో నెట్టుకొస్తున్నారు. భార్యాపిల్లలు ఇక్కడ, తల్లిదండ్రులు సొంత ఊళ్లో ఉండటంతో వచ్చే కొద్దిపాటి జీతం సరిపోక ఇబ్బందిగా మారిందని, సొంత ఊళ్లకు పంపితే వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులకు తోడుండే ఆస్కారం ఉంటుందని హోంగార్డులు అంటున్నారు. ఏపీలో పనిచేస్తున్న తెలంగాణ ప్రాంత హోంగార్డులు ఇవే సమస్యలు ఎదుర్కొంటున్నారని, వారిని ఇక్కడకు రప్పించి, తమను అక్కడకు పంపాలని కోరుతున్నారు. గతంలో తెలంగాణ ప్రభుత్వం ఇక్కడ పనిచేస్తున్న ఏపీకి చెందిన సుమారు 500 మంది హోంగార్డులకు ఎన్‌వోసీ ఇచ్చినా.. అక్కడి ప్రభుత్వం అంగీకారం తెలపకపోవడంతో వారికి నిరాశే మిగిలింది. హోంగార్డుల విషయంలో పరస్పర బదిలీలకు ఆస్కారం లేకపోవడంతో ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోతున్నామని ఉన్నతాధికారులు చెబుతున్నారు. అయితే మానవతా దృక్పథంతో నిర్ణయం తీసుకోవాలని హోంగార్డులు పోలీస్ ఉన్నతాధికారులు, ప్రభుత్వాల్ని వేడుకుంటున్నారు.

### ఇక్కడ నాన్‌లోకల్.. అక్కడ కోటా వర్తించదు..!

పోలీస్ శాఖలో హోంగార్డుగా పనిచేసే వారికి కానిస్టేబుల్ నియామకాల్లో ప్రత్యేక కోటా ఉంటుంది. అయితే ఏపీ స్థానికత ఉండటంతో తెలంగాణ పోలీస్ నియామకాల్లో వారిని నాన్‌లోకల్‌గా పరిగణించి కోటా వర్తింపజేయడంలేదు. ఏపీ పోలీస్ నియామకాల్లో తెలంగాణలో విధులు నిర్వహిస్తున్నందున కోటా వర్తించదని చెబుతున్నారు. ఉద్యోగ నియామకాల్లోనూ తమ కోటాను ఉపయోగించుకునే పరిస్థితిలేకుండా పోయిందని హోంగార్డులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ ఉద్యోగం వల్ల పిల్లల స్థానికతపైనా ప్రభావం పడుతుందని ఆందోళన చెందుతున్నారు. వీలైనంత త్వరగా తమ సమస్యను పరిష్కరించాలని వేడుకుంటున్నారు.



సిద్దిపేట జిల్లా రాయపోల్‌లో గుర్తించిన సిడితల వీరగల్లు

## తల నరుక్కొంటే.. శివ సన్నిధికి చేరుకుంటామని..

» చాళుక్యులు, రాష్ట్రకూటుల కాలంలో శైవుల్లో ఈ విశ్వాసం

» 'సిరితల వీరగల్లు'గా ప్రశస్తి.. సిద్దిపేట జిల్లా రాయల్‌పోల్‌లో విగ్రహం లభ్యం

రాయపోల్, జూలై 3: ప్రాణార్పన చేస్తే దేవుడి సన్నిధికి చేరుకుంటామని నమ్మడం.. ఓ పదునైన ఆయుధంతో తమ తలను తామే నరుక్కోవడమో.. మరొకరితో నరికించుకోవడమో చేయడం గురించి విన్నారా? 6వ శతాబ్దం నుంచి 12వ శతాబ్దం వరకు నడిచిన చాళుక్యుల కాలంలో, అప్పట్లోనే రాష్ట్రకూటుల హయాంలో శైవభక్తుల్లో ఈ విశ్వాసం ఉండేదట! భాసింపట్టు వేసుకున్న స్థితిలో తలపైన ఉన్న జుట్టు సాయంతో తాటిచెట్టుకో.. వెదురు చెట్టుకో వేలాడుతున్న వ్యక్తితో ఉన్న ఆ శిల్పాన్ని చూస్తున్నారా? ఆ వ్యక్తి చేతులు ముకుళితమై ఉన్నాయి. తల నుంచి మొండెం వేరయినట్లుగా మధ్యలో గ్యాప్‌ను స్పష్టంగా గమనించొచ్చు! ఈ శిల్పాన్ని 'సిడితల వీరగల్లు' అంటారు. శైవభక్తులు ఆత్మబలిదానాలను ధర్మకార్యంగా భావించేవారు. శివసన్నిధికి చేర్చే తక్షణ మార్గంగా ఆత్మబలిదానాలను ఎంచుకునేవారు. పైగా తల నరుక్కొని మరణిస్తే, తమ ప్రాణాలను తీసుకెళ్లేందుకు దేవాంగనలు వస్తారని విశ్వసించేవారు. ఈ శిల్పంలో.. పైన ఇద్దరు మహిళలుండటాన్ని గమనించవచ్చు! ఫొటోలో కనిపిస్తున్న ఈ 'సిడితల వీరగల్లు' సిద్దిపేట జిల్లా రాయపోల్‌లోని పురాతన గణపతి ఆలయం ప్రాంగణంలోనిది. దీన్ని కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధకుడు కొలిపాక శ్రీనివాస్ గుర్తించి.. వివరించారు. మహిళా సిడితల వీరగల్లులు జనగామ జిల్లా లింగపల్లిలో లభించాయి. పురుష సిడితల వీరగల్లులు ఇప్పటిదాకా యాదాద్రి జిల్లా చౌల్లేరులో, వనపర్తి జిల్లా కేంద్రంలో లభించగా రాయపోల్‌లోనిది మూడోది. ఇక సిడితల వీరగల్లులు కాకుండా కేవలం వీరగల్లులూ ఉంటాయి. తోటి ప్రజలను, పాడిపశువులను కాపాడే క్రమంలో అడవి జంతువులతో పోరాడి చనిపోతే, యుద్ధాల్లో పాల్గొని ప్రాణాలు కోల్పోతే వారిని వీరగల్లుగా చెక్కి ప్రజలు ఆరాధించేవారు.

## పెంటారెడ్డి పదవీకాలం ఆర్నెల్లు పొడిగింపు

నీటిపారుదలశాఖలో ఎత్తిపోతల పథకాల సలహాదారుడు కె.పెంటారెడ్డి పదవీ కాలాన్ని మరో ఆర్నెల్ల పాటు పొడిగిస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పెంటారెడ్డి పదవీకాలం పొడిగింపు నిర్ణయం మే 16 నుంచి ఆరునెలల పాటు అమలులో ఉండనుంది.

# క్రీడల అభివృద్ధికి స్పోర్ట్స్ అథారిటీ విశేష కృషి

**ఒలింపిక్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అజీజ్ ఖాన్**

**సందడిగా ప్రారంభమైన ప్రాంతీయ క్రీడా వసతి గృహ ప్రవేశ ఎంపికలు**



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అజీజ్‌ఖాన్

వరంగల్ స్పోర్ట్స్, జూలై 3: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యువతలో అంతర్లీనంగా దాగిఉన్న క్రీడా ప్రతిభను గుర్తిస్తూ, వారిని క్రీడా రంగంలో ప్రోత్సహించడంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) విశేషంగా కృషి చేస్తోందని ఒలంపిక్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అజీజ్‌ఖాన్ స్పష్టం చేశారు. సాట్ ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో హనుమకొండ జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లో నిర్వహిస్తున్న ప్రాంతీయ క్రీడా వసతి గృహంలో ప్రవేశాల కోసం జేఎన్ఎస్‌లో ఏర్పాటు చేసిన ఎంపిక పోటీలను అజీజ్‌ఖాన్ ముఖ్య అతిథిగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాంతీయ క్రీడా వసతి గృహంలో అర్హత సాధించిన క్రీడాకారులు అనుభవజ్ఞులైన కోచ్‌ల పర్యవేక్షణలో తర్ఫీదులు పొందడం ద్వారా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలలో రాణిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రాంతీయ క్రీడా వసతి గృహంలో మౌలిక వసతి, పోషక విలువలతో కూడిన పౌష్టికాహారం అందించడంతో పాటు శాస్త్రీయ పద్ధతుల్లో శిక్షణ అందిస్తామన్నారు. క్రీడారంగంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు ప్రత్యేక గుర్తింపు ఉందని, ఇక్కడి నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జిల్లాకు కీర్తిప్రతిష్టలు తీసువచ్చిన ఘనత మన జిల్లాకు చెందిన క్రీడాకారులు ఉందని, ఈతరం క్రీడాకారులు అదే సంప్రదాయాన్ని కొనసాగించాలని హితవు పలికారు. క్రీడాకారులను ప్రోత్సహించడంలో జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందన్నారు.

డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, హ్యాండ్‌బాల్, రెజ్లింగ్, స్విమ్మింగ్‌లో తొలి రోజు వివిధ క్రీడాంశాలలో బ్యాటరీ పద్ధతిన నిర్వహించిన ఎంపికలో రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి 200 మంది బాలబాలికలు పాల్గొన్నారన్నారు. క్రీడా వసతి గృహంలో నిష్ణాతులైన కోచ్‌ల పర్యవేక్షణలో ప్రణాళికబద్ధంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అదే విధంగా ఖమ్మం జిల్లాలోని అథ్లెటిక్స్ క్రీడా వసతి గృహంలో ప్రవేశాల కోసం జేఎన్ఎస్‌లో వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులకు ఎంపిక పోటీలను నిర్వహించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. క్రీడా వసతి గృహ ప్రవేశాల ఎంపికలు రెండు రోజుల పాటు నిర్వహించనున్న నేపథ్యంలో తొలి రోజు వివిధ జిల్లాలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని, అదే విధంగా గురువారం నిర్వహించనున్న ఎంపిక పోటీలలో ఔత్సాహికులైన విద్యార్థులు పాల్గొనవచ్చునన్నారు.

ఈ కార్యక్రమంలో సాట్ కోచ్‌లు ఎం.డి.గౌస్, ఎస్.స్వర్ణలత, ఎం.రవికుమార్, కె.నర్సింగ్‌రావు, రాజేష్, సుధాకర్, సంతోష్‌చారి, ఆయుష్‌యాదవ్, డీఎస్ఏ కోచ్‌లు నరేందర్, శ్రీమన్నారాయణ, విష్ణువర్ధన్, రాయబారపు నవీన్, కె.రాజు, అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి, అంతర్జాతీయ హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు పోగుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# కడవెండి తిరుగుబాటుకు 78ఏళ్లు

దొర గడీలను గడగడలాడించిన యోధుడు దొడ్డి కొమురయ్య ● నేడు కొమురయ్య 78వ వర్ధంతి



కడవెండిలోని దొడ్డి కొమురయ్య స్మారకస్థూపం

దొడ్డికొమురయ్య (ఊహా చిత్రం)

దేవరుప్పుల, జూలై 3 : భూమికోసం.. భుక్తికోసం.. బానిస బంధనాల విముక్తి కోసం.. వెట్టిచాకిరీ నిర్మూలన కోసం నడుం బిగించి తెలంగాణ గడ్డపై నేలకొరిగిన తొలి అమరుడు దొడ్డి కొమురయ్య. నైజాం సర్కార్ దేశ్‌ముఖ్‌ల కుట్రలతో చిందిన కొమురయ్య రక్తంతో తెలంగాణ రక్త సిక్తమైంది. బాంచెన్‌దొరా అంటూ దొర పెత్తనంలో నలిగిన వాళ్లను బందూకులు చేతబట్టి పోరాడే దిశగా నడిపించిన ధీరుడు దొడ్డి కొమురయ్య. నాడు రజాకార్ల చర్యలను ఎదురొడ్డి పోరాడారు. నాడు దేశ్‌ముఖ్‌ల చర్యలను నిలదీస్తూ వారికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న కొమురయ్యను దేశ్‌ముఖ్‌ల గూండాలు కాల్చి చంపి గురువారానికి 78ఏళ్లు నిండాయి. ఈ కొమురయ్య స్వగ్రామమైన కడవెండిలో వర్ధంతిని నిర్వహించనున్నారు. ఈక్రమంలో తెలంగాణ ప్రాంత తొలి అమరుడు దొడ్డి కొమురయ్య చరిత్రను నేటి తరం తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండి గ్రామంలో 1928వ సంవత్సరంలో దొడ్డి గట్టమ్మ, కొండయ్యల దంపతులకు జన్మించిన కొమురయ్యకు 16వ ఏటా 1944లో కొమురమ్మతో వివాహం జరిగింది. ఈ సమయంలో పాలకుర్తి మండలం విస్నూర్ గ్రామాన్ని కేంద్రంగా చేసుకొని 60 గ్రామాలను దేశ్‌ముఖ్ రాపాక వెంకట రాంచంద్రారెడ్డి, ఆయన భార్య జానమ్మ దొరసాని, కుమారుడు బాబుదొర ప్రజలతో వెట్టిచాకిరీ చేయించుకుంటూ అన్నిరకాలుగా పీడించేవారు. ప్రజల మాన ప్రాణాలతో చెలగాటమాడేవారు. 1943వ సంవత్సరంలో జరిగిన ఆంధ్ర మహాసభలో వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా పోరాడాలని నిర్ణయించుకున్నారు. కడవెండి గ్రామానికి చెందిన నల్ల నర్సింహులు, దొడ్డి మల్లయ్య, దావిద్‌రెడ్డి, వడ్డెనర్సయ్య, నల్ల కొండయ్య, మచ్చ రామయ్య, జంపాల లింగయ్య, పంతం లచ్చయ్య, పాముకుంట్ల ముత్తిలింగం, మాశెట్టి రాంచెంద్రయ్య, ఎర్రంరెడ్డి రాంక్రిష్టారెడ్డి, పైండ్లయాదగిరి తదితరులు నైజాం సర్కారుకు వ్యతిరేకంగా ఉద్యమానికి ఈ ప్రాంతం నుంచి సహకరించారు. 1946లో నైజాం సర్కార్‌కు వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ పోరాటం ప్రారంభమైంది. గ్రామరక్షక దళాల పేరుతో ఆనాడు గుత్పల సంఘాలను ప్రతీ గ్రామంలో ఏర్పాటు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో విస్నూర్ ప్రాంత గ్రామాలతో పాటు కడవెండి గ్రామంలో దేశ్‌ముఖ్ అనుచరుల ఆగడాలకు వ్యతిరేకంగా 1946 జూలై 3న ఉద్యమకారులతో గ్రామ ప్రజలు సమావేశమయ్యారు. జూలై 4న విస్నూర్ దేశ్‌ముఖ్ రాంచంద్రారెడ్డి చర్యలకు నిరసనగా కడవెండి గ్రామ ప్రజలు అస్నాల రాజన్న ఇంటి ఎదుట నుంచి ఊరేగింపుగా బొడ్రాయి వద్దకు వస్తున్న సమయంలో దక్షిణం వైపు ఉన్న ఇంట్లోనుంచి దేశ్‌ముఖ్ గుండాలు తూటాల వర్షం కురిపించారు. ఊరేగింపులో ముందు వరుసలో ఉన్న దొడ్డికొమురయ్య, దొడ్డి మల్లయ్యకు తూటాలు తగిలాయి. కొమురయ్య పొట్టలోకి ఎక్కువ తూటాలు దూసుకు పోవటంతో రాత్రి పది గంటల సమయంలో నేలకొరిగి అమరుడయ్యాడు. కొమురయ్య సోదరుడు దొడ్డి మల్లయ్య ప్రాణాపాయస్థితినుంచి బయట పడ్డాడు. దొడ్డికొమురయ్య వీర మరణంతో తెలంగాణ ప్రాంత మంతా ఉద్యమాలు ఉవ్వెత్తున ఎగశాయి. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో రక్తాన్ని చిందించి నేలకొరిగిన తొలి అమర వీరుడిగా కొమురయ్య పేరు, ఊరు చరిత్ర పుటల్లో నిలిచి పోయింది. దొడ్డికొమురయ్య అమరుడైన నాటినుంచి నేటి వరకు కడవెండి గ్రామంలో ఆయన స్మారక స్థూపం వద్ద వర్ధంతి సభలను విప్లవ, కమ్యూనిస్టు పార్టీలు నిర్వహిస్తూనే ఉన్నాయి. 50వ వర్ధంతి సభను సీపీఐ ఆధ్వర్యంలో 1996లో పెద్ద ఎత్తున నిర్వహించారు. దొడ్డి కొమురయ్య స్మారక భవనం నిర్మిస్తామని సీపీఐ హామీ ఇచ్చి నెరవేర్చింది. ఆయన పేరిట స్మారక భవనం నిర్మించుకోగా పలు కార్యక్రమాలకు ఉపయోగంలోకి వచ్చింది.

### దొడ్డి కొమురయ్య వర్ధంతిని విజయవంతం చేయండి

సీపీఎం, సీపీఐ(ఎం-ఎల్) మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం కడవెండిలో నిర్వహించే తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు సింగారపు రమేష్, సీపీఐ(ఎం-ఎల్) మాస్‌లైన్(ప్రజాపంథా) పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు గడ్డం సదానందం, సీపీఐ మండల కార్యదర్శి జీడి ఎల్లయ్య కోరారు. కొమురయ్య వర్ధంతి కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# కేసముద్రం మీదుగా వేములవాడ, భద్రాచలానికి ఎక్స్‌ప్రెస్ సర్వీసులు

**మహబూబాబాద్ డిపో మేనేజర్ శివప్రసాద్**



కేసముద్రం మీదుగా వేములవాడ బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, జూలై 3: మహబూబాబాద్ జిల్లా కేంద్రం నుంచి కేసముద్రం మీదుగా వేములవాడకు, హనుమకొండ నుంచి కేసముద్రం మీదుగా భద్రాచలం పుణ్యక్షేత్రాలకు రెండు నూతన ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులను ప్రారంభించినట్లు స్థానిక డిపో మేనేజర్ ఎం.శివప్రసాద్ తెలిపారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలకేంద్రంలో సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, ఆర్టీసీ రీజినల్ మేనేజర్ డి.విజయభాను చేతుల మీదుగా ఈ సర్వీసులను ప్రారంభించినట్ల వివరించారు. మహబూబాబాద్ నుంచి వేములవాడకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సు స్థానిక డిపో నుంచి ఉదయం 6.15 గంటలకు బయలుదేరి కేసముద్రంకు చేరుకుని అక్కడి నుంచి ఉదయం 7 గంటలకు బయలుదేరి నెక్కొండ, వరంగల్, కరీంనగర్ మీదుగా ఉదయం 11.30 గంటలకు వేములవాడకు చేరుకుంటుందని తెలిపారు. తిరిగి అక్కడి నుంచి మధ్యాహ్నం 12 గంటలకు మానుకోటకు బస్సు బయలుదేరుతుందని వరంగల్, నెక్కొండ, కేసముద్రం మీదుగా సాయంత్రం 5.30 గంటలకు మానుకోటకు చేరుకుంటుందన్నారు. మహబూబాబాద్ నుంచి వేములవాడకు టిక్కెట్ ధర రూ.250, కేసముద్రం నుంచి రూ.230, నెక్కొండ నుంచి రూ.200 టిక్కెట్ ధర ఉంటుందన్నారు.

### హనుమకొండ నుంచి భద్రాచలం సర్వీస్ ఇలా..

హనుమకొండ నుంచి భద్రాచలం వెళ్లే బస్సు అక్కడ నుంచి ఉదయం 8.15 గంటలకు బయలు దేరి, నెక్కొండ మీదుగా కేసముద్రంకు 9.40 గంటలకు చేరుకుంటుందని ఆర్టీసీ డీఎం శివప్రసాద్ తెలిపారు. కేసముద్రం నుంచి మహబూబాబాద్ జిల్లా కేంద్రం మీదుగా మధ్యాహ్నం 1.30 గంటలకు భద్రాచలానికి చేరుకుంటుందని పేర్కొన్నారు. తిరిగి భద్రాచలం నుంచి మధ్యాహ్నం 2 గంటలకు బస్సు బయలుదేరుతుందని తెలిపారు. హనుమకొండ నుంచి భద్రాచలానికి టిక్కెట్ ధర రూ.270, నెక్కొండ నుంచి రూ.220, కేసముద్రం నుంచి భద్రాచలానికి రూ.190 టిక్కెట్ ధర ఉంటుందని వివరించారు. ఈ సదవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# విద్యుత్ బిల్లుల చెల్లింపుపై ఆందోళన వద్దు

**అధికారిక వెబ్‌సైట్‌లోని ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా చెల్లించొచ్చు**

**బిల్లుల చెల్లింపు బీబీపీఎస్‌లోకి కొనసాగుతున్న 'ఆన్‌బోర్డింగ్'**

**ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి**



హనుమకొండ టౌన్, జూలై 3: విద్యుత్ చెల్లింపులపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. థర్డ్ పార్టీ యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించొద్దని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రకటించినప్పటి నుంచి వినియోగదారుల్లో ఆందోళన మొదలైంది. కొంతమంది ఆన్‌లైన్ చెల్లింపులకు ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం యాప్‌లను ఆశ్రయిస్తుంటే 'టెక్నికల్ ఇష్యూ' అని వచ్చి బిల్లు చెల్లింపు జరగడం లేదు. ఈ విషయాన్ని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి దృష్టికి బుధవారం తీసుకెళ్లగా ఆయన స్పందించారు. భారత్ బిల్ పేమెంట్ సిస్టం (బీబీపీఎస్)లో బిల్లులు చెల్లించేందుకు ఆన్‌బోర్డింగ్ ప్రక్రియ కొనసాగుతోందని, అతి త్వరలోనే క్రమబద్ధీకరించబడుతుందన్నారు. ప్రస్తుతం వినియోగదారులు టీజీ ఎన్పీడీసీఎల్ అధికారిక వెబ్‌సైట్‌లోని గూగుల్ పే, ఫోన్‌పే పేమెంట్ ప్లాట్‌ఫారమ్‌ను ఎంచుకొని చెల్లింపులు చేయొచ్చన్నారు. లేదా టీజీ ఎన్పీడీసీఎల్ యాప్ ద్వారానైనా బిల్లు చెల్లించవచ్చన్నారు. క్రమబద్ధీకరణ తర్వాత పూర్తి వివరాలను వినియోగదారులకు అందుబాటులో ఉంచుతామన్నారు.

### సబ్‌స్టేషన్లను రక్షణ బృందాలు తనిఖీ చేయాలి

ప్రతీ సబ్‌స్టేషన్‌ను విధిగా రక్షణ బృందాలు తనిఖీ చేయాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి సూచించారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని ఉమ్మడి ఐదు జిల్లాల నోడల్ ఆఫీసర్లు, టెక్నికల్, ఎంఆర్‌టీ డీఈలతో బుధవారం సీఎండీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. సబ్‌స్టేషన్లతో పాటు ఎల్‌టీ, హెచ్‌టీ, సిటీ సర్వీసులను తనిఖీ చేయాలని ఆదేశించారు. ప్రతీ సర్కిల్‌లో ఒక మోడల్ ఎస్‌పీఎం షెడ్డును తీర్చిదిద్దాలన్నారు. హనుమకొండ ములుగురోడ్డులో పైలట్ ప్రాజెక్టుగా ఒక ఆధునాతమైన ఎస్‌పీఎం షెడ్డును ఏర్పాటు చేస్తున్నామన్నారు ప్రతీ సిబ్బందితో పెప్ టాక్ నిర్వహించాలన్నారు. రైతులకు, వినియోగదారులకు విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పించాలన్నారు. ఫిర్యాదులకు 18004250028 టోల్‌ఫ్రీ నెంబర్ లేదా 1912 సంప్రదించాలన్నారు. ఈ కార్య క్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్స్, సీజీఎంలు, జీఎంలు పాల్గొన్నారు.

## రామకృష్ణకు సముచిత స్థానం కల్పించాలి..



ఎమ్మెల్యే రేవూరికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రెడ్డికాలనీ, జూలై 3: డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణకు రాజ్యసభ ఎంపీ లేదా ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని ఏబీఎస్, డీబీఎఫ్ నేతలు కలకోటి మహేందర్, మాదాసి సురేశ్‌లు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాదాసి సుదర్శన్, మోరే ఐలయ్య, మాట్ల మురళి, మాదాసి నవీన్, దార ప్రమీల, దార పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఇంజనీర్‌కు వినతి పత్రం అందజేస్తున్న అయోధ్యపురం రైతులు

## పరిహారం ఇప్పించండి..

### రైల్వే చీఫ్ ఇంజనీర్‌కు అయోధ్యపురం రైతుల వినతి

మడికొండ, జూన్ 3: అయోధ్యపురం శివారులోని రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్‌ను బుధవారం సౌత్ సెంట్రల్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ సి.మధుసూదన్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా కాజీపేట మండలం అయోధ్యపురం గ్రామానికి చెందిన రైతులు కలిసి వినతి పత్రం అందజేశారు. రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్ స్థాపన కోసం భూములు కోల్పోయిన ఎనిమిది మంది రైతులు ప్రభుత్వం నుంచి తమకు అందాల్సిన పరిహారం ఇప్పించాలని, అలాగే భూములు కోల్పోయిన ప్రతీ కుటుంబానికి వ్యాగన్ వర్క్‌షాప్‌లో ఉద్యోగం కల్పించాలని వినతి పత్రంలో కోరారు. అందుకు స్పందించిన ఆయన విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గాదం యాదగిరి, జేరిపోతుల శ్రీనివాస్, ఉల్లెంగల శ్రీనివాస్, బాధిత రైతులు కాగిత రమ, కాగిత ప్రవీణ్, మామిళ్ల రాములు, మామిళ్ల క్రిష్ణ, మామిళ్ల రవి, మామిళ్ల భిక్షపతి, మామిళ్ల శంకరయ్య, భైరబోయిన వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ క్రైంపై అవగాహన పెంచుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ ప్రతాప్

మడికొండ, జూన్ 3: విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని మడికొండ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్ తెలిపారు. బుధవారం పోలీసుల ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఇన్‌స్పెక్టర్ ప్రతాప్ మాట్లాడుతూ... సైబర్ నేరస్థులు ఆకర్షణీయ ప్రకటనలతో ఫోన్ వినియోగదారులకు మాయచేసి ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారన్నారు. అలాంటి మోసాలపై అప్రమత్తంగా ఉండాలని అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే లింక్‌లు క్లిక్ చేయకుండా, అపరిచితులకు మన వివరాలు తెలుప కుండా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు మాధవరెడ్డి, హెడ్ కానిస్టేబుళ్ళు గుండబత్తిన జయరాజ్, రాజు, కానిస్టేబుల్ సతీష్, ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, జూలై 3: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా గురువారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా జరగదని హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కేయూసీ సబ్‌స్టేషన్ పరిధిలోని బొక్కలగడ్డ, శ్రీనగర్‌కాలనీ, పోచమ్మకుంట, కమ్మరివాడ ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మచిలీబజార్ సబ్‌స్టేషన్ పరిధిలోని అలంకార్ సర్కిల్, హెచ్‌పీ గ్యాస్ ఏరియా, సిక్కువాడ ఏరియాలో ఉదయం 10.30 నుంచి 12.30 వరకు, అమృత థియేటర్ ఏరియా, ఏనుగుల గడ్డ, సుధానగర్ ఏరియాలో ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని డీఈ పేర్కొన్నారు.

**వరంగల్‌లో..**

వరంగల్ డివిజన్‌లోని మట్టెవాడ ఫీడర్ పరిధిలోని ఎల్లంబజార్, మట్టెవాడ, విశ్వకర్మ వీధి ఏరియాలో ఉదయం 8.30 నుంచి 11.30 వరకు, మహంకాళీ ఫీడర్ పరిధిలోని రంగశాయిపేట, ఉర్సు, ఖమ్మం రోడ్డు ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని డీఈ శంకేసి మల్లిఖార్జున్ ఒక ప్రకటనలో తెలిపారు.

## అధికారులు నిజాయితీగా పని చేయాలి

### స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



వీడ్కోలు సమావేశంలో ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ధర్మసాగర్, జూలై 3: ప్రభుత్వ అధికారులు నిజాయితీతో ప్రజల కోసం పని చేయాలని స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే కడియం శ్రీహరి సూచించారు. బుధవారం ధర్మసాగర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీటీసీల వీడ్కోలు సమావేశం, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రతీ అధికారి నిజాయితీగా పని చేసేందుకు ప్రయత్నం చేయాలని, అధికారులు ఎవరైనా తప్పు చేస్తే మరుసటి రోజే ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ వస్తుందని ఆయన హెచ్చరించారు. ఎవరైనా తన పేరు చెప్పి బెదిరిస్తే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ధర్మసాగర్ చెరువు, దేవునూర్ గుట్టలను కలుపుకొని ఏకో టూరిజంగా చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుపోయామని, త్వరలో ధర్మసాగర్ రూపు రేఖలు మారుతాయన్నారు.

ధర్మసాగర్ సోషల్‌వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల ధర్మసాగర్ నుంచి హంటర్‌రోడ్డుకు తరలించారని తన దృష్టికి రాలేదని, గురుకులాన్ని తిరిగి ధర్మసాగర్‌కు తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామాలకు సంబంధించిన సమస్యలుంటే నేరుగా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించే ప్రయత్నం చేస్తామన్నారు. కాగా, నేటితో ఎంపీటీసీ పదవీ కాలం ముగియడంతో ఎంపీపీ కవిత, జడ్పీటీసీ శ్రీలత, ఎంపీటీసీలను ఎమ్మెల్యే కడియం శ్రీహరి సన్మానించారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కల్యాణలక్ష్మికి సంబంధించిన 80 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అనిల్ కుమార్, తహసీల్దార్ సత్యనారాయణ, ఆర్‌ఐలు కిరణ్, శ్రీనివాస్, సూపరిం టెండెంట్ రాంబాబు, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## మూఢనమ్మకాల నిర్మూలనకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి

హనుమకొండ టౌన్, జూలై 3: మూఢనమ్మకాల నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టం తీసుకొచ్చి ప్రజలను దొంగస్వాములు, బురిడీ బాబాల నుంచి కాపాడాలని జనవిజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి, రాష్ట్రపతి అవార్డు గ్రహిత పరికిపండ్ల వేణు విజ్ఞప్తి చేశారు. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం హత్రస్ జిల్లాలో బోలే బాబా పాదాల చెంత ఉన్న మట్టిని సేకరించి తీసుకెళ్లేందుకు జరిగిన తొక్కిసలాటలో ఒకరిపై ఒకరు పడి ఊపిరాడక మరణించడం మనస్సును కదిలించిందన్నారు. ఇలాంటి మూఢనమ్మకాలను పెంచి పోషిస్తున్న బాబాల నుంచి ప్రజలను కాపాడాలంటే మూఢ నిర్మూలన ప్రత్యేక చట్టం ద్వారానే సాధ్యమవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన కొత్త చట్టాల మాదిరిగానే ప్రత్యేక చట్టం తీసుకొచ్చి మూఢనమ్మకాలకు చరమగీతం పాడాలన్నారు

## విభజన చట్టంపై సీఎంల సమావేశాన్ని స్వాగతిస్తున్నాం

కాళోజీ జంక్షన్, జూలై 3: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య సమస్యల పరిష్కారం కోసం జూలై 6న ఉభయ రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం జరుగడాన్ని స్వాగతిస్తున్నట్లు ప్రజా వేదిక రాష్ట్ర చైర్మన్ తిరునహరి శేషు ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రాష్ట్రాలు విడిపోయి దశాబ్దకాలం అవుతున్నా విభజన చట్టంలో పొందుపరిచిన హామీలు నెరవేరకపోవడం సంస్థలు, కార్పొరేషన్ల విభజన జరుగకపోవడం పలు సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడం రెండు రాష్ట్రాలకు మంచిది కాదని అభిప్రాయపడ్డారు. రైల్వే ప్రాజెక్టులు, ఉక్కు పరిశ్రమ జాతీయ విద్యాసంస్థల విషయంలో రెండు రా ష్ట్రాలకు అన్యాయం జరిగిందన్నారు. ఏపీ పోలీసులు నాగార్జున డ్యామ్‌పైకి వచ్చి అనధికారికంగా గేట్లు ఎత్తి నీళ్ల విడుదల చేసిన సంఘటనలు, ఉద్రిక్తతలు పునరావృతం కాకుండా ఇద్దరు సీఎం మధ్య చర్చలు జరుగాలని కోరారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్, పోతిరెడ్డి పాడు హెడ్ రెగ్యులేటరీ ద్వారా నీటి తొలగింపు చౌర్యం తదితర అంశాలపై సమావేశంలో చర్చకు రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తిరునహరి శేషు తెలిపారు.

## నేటి విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలి





సమావేశంలో మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

వరంగల్ ఎడ్యుకేషన్/బాలసముద్రం జూలై 3: విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపు మేరకు దేశంలోని విద్యా సంస్థల బంద్‌కు మద్దతుగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కేజీ టూ పీజీ విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ, యూఎస్ఎఫ్ఐ, ఏఐఎఫ్‌డీఎస్ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

దేశంలోని విద్యారంగం, పరీక్షల నిర్వహణ పట్ల మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్యవైఖరిని నిరసిస్తూ దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా విద్యా సంస్థల బంద్‌కు పిలుపునిస్తున్నామన్నారు. నీట్, నెట్ పరీక్షల పేపర్ల లీకేజీలతో నష్టపోయి ఆందోళన చెందుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు భరోసా కల్పించడంలో మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. పరీక్షల లీకేజీలకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తితో సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎన్‌టీఏను రద్దు చేయాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని, కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ, యూఎస్ఎఫ్ఐ, ఏఐఎఫ్‌డీఎస్ సంఘాల ప్రతినిధులు బి. సంతోష్, బి.నర్సింహారావు, ఎం.శ్రీకాంత్, డి.రంజిత్, పి.సతీష్, ఎం.రాజేష్, నాయకులు ప్రణీత్‌గౌడ్, రవితేజ, వినయ్, కుమార్, చరణ్, స్టాలిన్, మహేష్, ముషరఫ్, రమేష్, రాకేష్, మహేష్ తదతరులు పాల్గొన్నారు.

## అదనపు కమిషనర్‌గా కృష్ణారెడ్డి బాధ్యతల స్వీకరణ



కృష్ణారెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఉద్యోగులు

వరంగల్ కార్పొరేషన్, జూలై 3: గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్‌గా నిమ్మ కృష్ణారెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన కృష్ణారెడ్డి.. వివిధ హోదాల్లో సిద్దిపేట, తాండూరు, జహీరాబాద్, సదాశివ్‌పేట, గజ్వేల్‌లో పని చేశారు. ప్రస్తుతం వరంగల్ కాశిబుగ్గ సర్కిల్‌తో పాటు బల్దియా ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనర్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తారు. బాధ్యతలు చేపట్టిన తర్వాత కృష్ణారెడ్డి బల్దియా కార్యాలయం ఆవరణలోని మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. అలాగే బల్దియా కార్యాలయంలో అదనపు కమిషనర్‌గా అదనపు బాధ్యతలు చేపట్టిన కృష్ణారెడ్డిని బల్దియా మినిస్టీరియల్ ఉద్యోగులు కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఏసీని కలిసిన వారిలో బాకం సంతోష్, రావుల ఆనందం, ఉమా దేవేందర్, హబీబ్ పాష, రామకృష్ణ, రవికుమార్, సుఖద, గిరిబాబు, సునీల్, సందీప్, అనీల్‌కుమార్, సూర్యనారాయణ, అనిల్‌కుమార్‌లు ఉన్నారు.

## బల్దియాలో కరెంటు బంద్

### రెండు గంటల పాటు నిలిచిన పౌర సేవలు

### ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలు



బల్దియా కార్యాలయంలో అలుముకున్న చీకటి

వరంగల్ కార్పొరేషన్, జూలై 3: గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయంలో బుధవారం విద్యుత్ అంతరాయం ఏర్పడింది. దీంతో రెండు గంటల పాటు ప్రజలకు అందించాల్సిన సేవలు నిలిచిపోయాయి. కార్యాలయాల్లో చీకటి కమ్ముకోవడంతోపాటు ఉక్కపోతకు తట్టుకోలేక అధికారులు, సిబ్బంది బయటకు వచ్చి సేదతీరారు. ప్రధానంగా ప్రధాన కార్యాలయంలోని ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రం, మీసేవ, టౌన్‌ప్లానింగ్, పబ్లిక్ హెల్త్, కౌన్సిల్ హాల్, ఇంజనీరింగ్, ట్యాక్సీల విభాగం, హార్టికల్చర్ విభాగంలో సేవలు రెండు గంటల పాటు నిలిచిపోయాయి. ఇంత పెద్ద కార్యాలయంలో జనరేటర్ కూడా లేకుండా పోయిందని ప్రజలు మండిపడ్డారు. విద్యుత్ అంతరాయం ఏర్పడడంతో ప్రజాపాలన దరఖాస్తుల కేంద్రం వద్ద ప్రజల రద్దీ పెరిగింది. కంప్యూటర్లు, ప్రింటర్లు పని చేయకపోవడంతో ప్రజలు పెద్దగా కేకలు వేశారు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి చేరడంతో ఎలక్ట్రికల్ సిబ్బందిని పిలిపించి సాంకేతిక లోపాన్ని సరిదిద్దారు. రెండు గంటల తర్వాత కరెంటు రావడంతో ఎక్కడిన పనులను అక్కడ పునఃప్రారంభించారు.

## మా ఇంటిని మాకు ఇప్పించండి

### ఓ ఆటో డ్రైవర్ దంపతుల కన్నీరు



తమకు న్యాయం చేయాలని పోలీసులను వేడుకుంటుంన్న ఆటో డ్రైవర్ దంపతులు

బాలసముద్రం, జూన్ 3: ముగ్గురు ఆడ పిల్లలున్నారని, వారి భవిష్యత్ కోసం అప్పులు చేసి ఇల్లు కొన్నామని, అమ్మిన వారే తమ కుటుంబాన్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారని హనుమకొండ రెవెన్యూ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ మామిడి సుభాష్ మాధవి దపంతులు పోలీసులను వేడుకుంటున్నారు. 2021 కరోనా సమయంలో కిరాణం షాపులో నష్టం రావడంతో గతంలో ఉన్న ఇల్లు అమ్ముకుని అప్పులు కట్టుకొని ఆటో నడుపుతూ కిరాయి ఇంట్లో ఉంటున్నట్లు తెలిపారు. హనుమకొండలోని రెవెన్యూ కాలనీకి చెందిన శీలం రమణ, విజయలకు చెందిన 73 గజాల ఇళ్లను 2023 అగస్టులో రూ.21లక్షలకు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. రమణ సోదరుడు రమణకు అతడికి మధ్య ఉన్న వ్యక్తిగత గొడవలతో ఇంటికి తాళం వేసి అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నట్టు సుభాష్ దంపతులు తెలిపారు.

ఈ విషయమై ఇల్లు కొనుగోలు చేసిన మామిడి సుభాష్ - మాధవిలు తమకు న్యాయం చేయాలని మంత్రి కొండా సురేఖను కలిసి తమ గోడు చెప్పుకున్నట్లు తెలిపారు. వెంటనే మంత్రి పోలీసులకు చెప్పినా పోలీసులు తమకు న్యాయం చేయలేదని వాపోయారు. సుబేదారి సీఐని కలిస్తే మేం ఏంచేస్తామని అన్నట్లు తెలిపారు. ఇంటి వద్దకు వెళ్తే తమను చంపుతామని బెదిరించి తమ కుటుంబంపై దాడి చేసినట్లు సుభాష్, మాధవి దంపతులు కన్నీటి పర్యంతమైయ్యారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. ముగ్గురు ఆడపిల్లలతో కిరాయి ఇంట్లో ఉంటూ పిల్లలను చదివించలేక ఇబ్బందుల్లో ఉన్న తమకు పోలీస్ ఉన్నతాధికారులు నాయ్యం చేసి తాము కొనుగోలు చేసిన ఇంటిని తమకు ఇప్పించాలని వేడుకుంటుంన్నారు.

## యూపీ ఘటనకు బీజేపీ ప్రభుత్వం బాధ్యత వహించాలి

### సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు





సమావేశంలో మాట్లాడుతున్న తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

బాలసముద్రం, జూలై 3: యూపీలో జరిగిన ఘటనకు బీజేపీ ప్రభుత్వం బాధ్యత వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడారు. యూపీలోని హత్రస్ జిల్లాలో భోలేబాబా ఆధ్యాత్మిక కార్యక్రమంలో జరిగిన తొక్కిసలాట ఘటనలో భక్తులు మృతి చెందడం బాధాకరమని అన్నారు. ఈ ఘటనకు బీజేపీ ప్రభుత్వం బాధ్యత వహించి మృతుల ఒక్కో కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్ గ్రేసియా ప్రకటించాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. దేశంలో బీజేపీ పాలిత రాష్ట్రాలలోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని అన్నారు. బీజేపీ హిందూత్వం పేరుతో ప్రజలపై మూడనమ్మకాలను పెంచి పోషిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నట్లు విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, నాయకులు ఆదరి శ్రీనివాస్, వేల్పుల సారంగపాణి, బాషబోయిన సంతోష్, ఉట్కూరి ప్రవీణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ ఉద్యోగికి రిటైర్‌మెంట్ సహజం

హనుమకొండ టౌన్, జూలై 3: ప్రతీ ఉద్యోగికి రిటైర్‌మెంట్ సహజమని, భావి జీవితంలో కుటుంబసభ్యులతో సంతోషంగా గడపాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. సీజీఎం (ఆపరేషన్) వి.మోహన్‌రావు ఉద్యోగ విరమణ ఆత్మీయ సన్మాన కార్యక్రమం మంగళవారం రాత్రి నక్కలగుట్టలోని విద్యుత్‌భవన్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఎండీ హాజరై మాట్లాడుతూ.. మారుతున్న కాలనుగుణంగా సాంకేతికతను జోడించి సంస్థ కోసం సేవలందించిన వ్యక్తి మోహన్‌రావు అని కొనియాడారు. అనంతరం శాలువా, మెమొంటోతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు బి.అశోక్‌కుమార్, టి.సదర్‌లాల్, తిరుపతిరెడ్డి, మధుసూదన్, సిజీఎంలు, జీఎంలు, ఎస్ఈలు, ఉద్యోగ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిలో హద్దురాళ్ల ఏర్పాటు



హద్దు రాళ్లు పాతిస్తున్న తహసీల్దార్ విక్రమ్‌కుమార్

ఐనవోలు, జులై 3: ఐనవోలు రెవెన్యూ శివారులో ఇళ్ల స్థలాల కోసం కొనుగోలు చేసిన భూమిని స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ విక్రమ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రం సమీపంలో సర్వే నెంబర్ 1150లో 1.07 ఎకరాలు, 1163లో 0.34 గుంటలు మొత్తం 2.01 ఎకరాల ప్రైవేటు భూమిని నివాస గృహాల కోసం గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఎల్‌పీఎస్ పథకం ద్వారా కొనుగోలు చేసింది. ఈ భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించుకోగా బుధవారం రెవెన్యూ, గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి వెళ్లి ప్రభుత్వ భూమికి హద్దులు నిర్ణయించి రాళ్లు పాతి చుట్టు ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ఇది ప్రభుత్వ భూమి అని బోర్డును ఏర్పాటు చేశారు.

## రైతు భరోసాను చిన్న, సన్నకారు రైతులకే ఇవ్వాలి



మాట్లాడుతున్న సొసైటీ వైస్ చైర్మన్ చందర్‌రావు

ఐనవోలు, జులై 3: రైతు భరోసా చిన్న, సన్నకారు రైతులు 5 ఎకరాల వరకు ఇవ్వాలని రైతులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. నందనం రైతు సేవా సహకార సంఘం కార్యాలయంలో రైతు భరోసా పథకంపై రైతుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు మహాజన సభను నిర్వహించారు. సొసైటీ వైస్ చైర్మర్ టి.చందర్‌రావు అధ్యక్షతన జరిగన సభలో రైతులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సభలో డీసీవో నాగేశ్వర్‌రావు, ఏవో ఆడెపు కవిత, డీసీసీ ఐనవోలు బ్రాంచ్ మేనేజర్ శ్రావణ్‌కుమా ర్, సొసైటీ డైరెక్టర్లు బుచ్చిరెడ్డి, చిరంజీవి, సంపత్‌రావు, రాంచంద్రయ్య, ఎసోబు, ఎలేంద్ర, సీఈవో సంపత్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

## కొమురయ్య వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలి

ఐనవోలు, జులై 3: దొడ్డి కొమురయ్య వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని జీఎంపీఎస్ మండల ప్రధాన కార్యదర్శి నల్ల బెట్ట చిన్న రాజు డిమాండ్ చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తొలి అమరుడైన కొమురయ్య విగ్రహాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలన్నారు. ఈ నెల 4న కొమురయ్య వర్ధంతి సభలను నిర్వహించాలని సంఘాలకు పిలుపునిచ్చారు.

## కోతుల దాడిలో మహిళకు తీవ్రగాయాలు

ఐనవోలు, జులై 3: కోతుల దాడిలో వృద్ధ మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన ఐనవోలులో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన వృద్ధురాలు ఆగ పాటి లచ్చమ్మ బుధవారం ఉదయం వ్యవసాయ కూలీ పనులకు రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తోంది. ఈ క్రమంలో రైస్‌మిల్ వద్ద సు మారు 20 కోతులు ఆమెపై దాడిచేసి తలపై తీవ్రంగా గాయపరిచాయి. 9 నుంచి 12 ఇంచుల పొడువునా తలకు కాట్లుపడ్డాయి. గాయపడిన ఆమెను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో వైద్యులు పరీక్షించి 12 కుట్లు వేశారు. తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడినట్లు తెలిపారు. గ్రామంలో కోతుల బెడద తీవ్రంగా ఉందని వాటిని పట్టి అడవిలో వదిలేయాలని స్థానికులు కోరుతున్నారు.

## పడకేసిన 'ప్రత్యేక' పాలన

(3వ పేజీ తరువాయి)

ఉంటోంది. ఆస్తి పన్ను జమ చేసుకునే ఖాతా, పన్నుల రాబడికి మించి ఖర్చులుండడంతో ఈ ఖాతా ఎప్పుడు ఖాళీగానే ఉంటోంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే ప్రత్యేక నిధులు పద్నాలుగు నెలలుగా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఆస్తిపన్ను, ఎస్ఎఫ్‌సీ ఖాతాల్లో జమయ్యే మొత్తం ట్రెజరీ ద్వారా డ్రాచేయాల్సి ఉంటుంది. కానీ గత సర్కారు హయాంలో ఎస్ఎఫ్‌సీ నిధులు అరకొరగా విడుదల చేసింది. ఇక 15వ ఆర్థిక సంఘం నిధుల విషయానికి వస్తే.. ఇందులో కేంద్ర ప్రభుత్వం నేరుగా పంచాయతీలకు గ్రామ జనాభా ప్రాతిపదికన జమ చేస్తుంది. ప్రతీ నాలుగు నెలలకోసారి వీటిని అందజేస్తుంది. కేవలం ఈ నిధులు మాత్రమే పంచాయతీలకు అందుతుండడంతో వీటిని ప్రత్యేక పనులకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. నిబంధనల మేరకు ఖర్చు చేయని నిధులు.. ఆయా ఖాతాల్లో మిగిలిపోగా మార్చిలో వాటిని రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకున్నది.

## బల్దియాలో అంతర్గత బదిలీలు

వరంగల్ కార్పొరేషన్, జూలై 3: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థలో బుధవారం అంతర్గత బదిలీలు జరిగాయి. ముగ్గురికి స్థానచలనం కల్పిస్తూ బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఉత్తర్వులు జారీ చేశారు. కమిషనర్ సీసీగా టౌన్‌ప్లానింగ్ విభాగంలో పనిచేస్తున్న వినయ్‌ని నియమించారు. ప్రస్తుతం సమద్‌తో పాటు ప్రశాంత్ సీసీలుగా పని చేస్తుండగా ప్రశాంత్‌ను కమిషనర్ క్యాంపు కార్యాలయానికి బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న అనిల్‌ను బల్దియా ప్రధాన కార్యాలయంలోని జీ-1 సెక్షన్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేసేందుకు స్థానచలనం కల్పించారు.


ఆంధ్రజ్యోతి Classifieds

Wanted Real Estate Health Jobs Beautician For Sale

**WANTED TEACHERS**

★ Wanted Teacher's To teach 1st to 6th English, Maths, Science, Computer. 6th to 10th Maths, Wardens M/F, Cooks, AVSHS, Dharmaram, WGL. Cont : 9848672108

AJW-188406

**PLOT FOR SALE**

★ KLN Reddy Colony, DCB Bank ప్రక్కన గల 50Ft Road Facingతో 600 Yards. Commercial Plot అమ్మకమునకు గలదు. Genuine Parties Can Contact : 7981257380

AJW-188412

**WANTED**

★ Wanted English from 7th to 10th Class & 1st to 6th Class Teacher. Well Experience & English fluency must. Contact : RATNAM HIGH SCHOOL, Rangashaipet. Cell : 9441412898

AJW-188353

**LEASE / RENT**

★ మంచి రన్నింగ్ కండిషన్‌లో ఉన్న సిమెంట్ బ్రిక్స్ కంపెనీ కిరాయికి ఇవ్వబడును. సంప్ర॥ 9949016005

AJM-11699

**WANTED**

★ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పని చేయుటకు టెలికాలర్స్, రిసెప్షనిస్ట్, సిస్టమ్ ఆపరేటర్స్ అర్జంటుగా కావలెను. Salary : 8000 - 11000. సం.ప్ర॥ 9440414616

AJW-188408

**డాక్యుమెంట్ పోయినది**

★ కాసబోయిన వజ్ర, భర్త : కాసబోయిన దూదయ్య, ఇ.నెం.2-119, దేవన్నపేట, హసన్‌పర్తి, హన్మకొండ గారికి చెందిన డాక్యుమెంట్ నెం. 3085/2009 & 6751/2010 గలవి హన్మకొండ, సుబేదారిలోని జిరాక్స్ సెంటర్‌కు జిరాక్స్ కొరకు వస్తుండగా మార్గమధ్యంలో పోయినది. దొరికిన వారు తిరిగి అందజేసిన ఎడల తగిన పారితోషికం ఇవ్వబడును. సం.ప్ర॥ 8317607327

AJW-188359

**సెక్యూరిటి గార్డ్స్ కావలెను**

★ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పని చేయుటకు సెక్యూరిటిగార్డ్స్ మరియు సూపర్‌వైజర్స్ అర్జెంటుగ కావలెను. జీతం : 12000 - 14000. సం.ప్ర॥ 8309693457

AJW-188402

**CHANGE OF NAME**

★ I, RAZIYA SULTHANA SAYYAD (Old Name) H.No.3-1-291/1, Kakatiya Colony, Hanumakonda, Town & Dist-506001.T.S. have changed my name as RAZIYA SULTANA (New Name) W/o. SYED YAKOOB ALI for all purposes.

AJW-5712

**కావలెను**

★ స్వచ్ఛంద సంస్థలో వంట చేయుటకు పని మనుషులు కావలెను. భోజనం మరియు వసతి కల్పించబడును. సం.ప్ర॥ 9849038142, 9502252206

AJW-14250

**పాఠకులకు ముఖ్య గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో విజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడీవీటీ

**ప్రకటనల కొరకు సంప్రదించండి**

హన్మకొండ
9985400013
8978510273

వరంగల్
9985406150
9985408173

జనగామ
9866431354

మహబూబాబాద్
9985418040

తొర్రూర్
9985418040

నర్సంపేట
9985418040

భూపాలపల్లి
9985401232

పరకాల
9985401232

# ఆ ఆలోచనలను కట్టడి చేసేదెలా?

నేను 19 ఏళ్ల కాలేజ్ స్టూడెంట్‌ని. మనసు లైంగిక ఆలోచ నల మీదకు పరుగులు తీస్తోంది. దాంతో చదువు మీద ధ్యాస తగ్గుతోంది. అసలు ఇదేమైనా జబ్బా? ఇలాంటి భావనల్ని ఎలా నియంత్రించుకోవాలి?

- ఓ సోదరి, హైదరాబాద్.

Q A

కౌన్సెలింగ్



యవ్వనంలో సెక్స్ గురించిన ఆలోచనలు కలగటం అత్యంత సహజం. ఇలా అందరికీ జరుగుతుంది. అయితే ఎప్పుడూ సెక్స్ గురించే ఆలోచిస్తూ ఉండటం మాత్రం కరెక్ట్ కాదు. అలా ఆలోచించే కొద్దీ అవే ఆలోచనలు పదేపదే కలుగుతూ ఉంటాయి. దాంతో కోరిక పెరిగి మీరేం పని చేస్తున్నా బ్యాక్‌గ్రౌండ్‌లో ఆ ఆలోచనలు నడుస్తూనే ఉంటాయి. సెక్స్ ఆలోచనలను నియంత్రించటానికి ఈ మార్గాలను అనుసరించండి.

- లైంగిక ఆలోచనల్ని ప్రేరేపించే అంశాలు ఎన్నో ఉంటాయి. వాటిని గుర్తించి ఆ అవకాశాలను నియంత్రించగలిగితే సెక్స్ ఆలోచనలు తగ్గుతాయి. ఒత్తిడి, పదే పదే సెక్స్ గురించి ఆలోచించటం లైంగిక ఆలోచనలకు ప్రధాన ప్రేరేపణలు. కాబట్టి వాటికి దూరంగా ఉండండి.
- విల్ పవర్ పెంచుకోండి. నిజంగానే సెక్స్ గురించి ఆలోచించకుండా ఉండాలనుకుంటే మీకు మీరే ఓ ఒప్పందం చేసుకోండి. దానికి కట్టుబడి ఉండండి.
- సెక్స్ గురించి ఆలోచించే సమయాన్ని ఏదైనా క్రియేటివ్ పనికి కేటాయించండి. రాయటం, చదవటం, పెయింటింగ్, స్కల్ప్‌టింగ్, సంగీతం వినటం, ఆటలాడటం... ఇలా ఇష్టమైన అభిరుచి వైపు మనసు మళ్లించండి.
- ఒకవేళ ఇలాంటి హాబీలకు అనువైన ప్రదేశంలో రోజులో ఎక్కువ సమయం గడిపే పనైతే చేసే పని మీద మనసు పెట్టండి. చేస్తున్న పని మీద ఇష్టం పెంచుకుంటే వేరే విషయాల మీదకు మనసు వెళ్లదు.
- ఖాళీ సమయం లేకుండా చూసుకోండి. ఖాళీ దొరికితే మనసు పరిపరివిధాల పోతుంది. కాబట్టి ఆ అవకాశం దొరక్కుండా రోజంతటినీ వీలైనన్ని ఎక్కువ యాక్టివిటీస్‌కు కేటాయించండి.

డాక్టర్. షర్మిల మజుందార్
కన్సల్టెంట్ సెక్సాలజిస్ట్,
mili77@gmail.com



హైదరాబాద్‌లో తొలి ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఒకటైన ఫెర్నాండెజ్ ఆసుపత్రిది డెబ్బై ఆరేళ్ళ చరిత్ర... ఆ వారసత్వాన్నే కాదు తన తల్లితండ్రులు నిర్దేశించిన విలువలను కూడా రాజీ లేకుండా కొనసాగిస్తున్నారు ఫెర్నాండెజ్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ **డాక్టర్ ఎవిటా ఫెర్నాండెజ్**. మిడ్‌వైఫరీ (మంత్రసాని) వ్యవస్థను బలోపేతం చేసిన, ప్రభుత్వ వైద్య సంస్థల కోసం శిక్షణ అందిస్తున్న ప్రైవేటు ఆసుపత్రిగా ఘనతను అందుకున్నా... బిడ్డను కన్న తల్లి కళ్ళలో కనిపించే ఆనందాన్ని చూడడం కన్నా గొప్ప అనుభూతి మరెక్కడా దొరకదంటున్న ఆమె 'నవ్య'తో ప్రత్యేకంగా పంచుకున్న విశేషాలివి.

# వాళ్లంతా నా పిల్లలే..

"నేనూ డాక్టర్ కావాలనుకుంటున్నా... ఎనిమిదేళ్ళ వయసులో ఈ మాట నేను చెప్పగానే మా అమ్మ ఆశ్చర్యపోయారు. "నువ్వు డాక్టర్ అవ్వాలనుకుంటున్నావా? అది చాలా కష్టమైన జీవితం" అన్నారామె. "అవును! నేనూ మీలా డాక్టరే కావాలనుకుంటున్నాను" అన్నాను. కచ్చితంగానే చెబుతున్నావా? అది చాలా కష్టం. నిద్రలేని రాత్రులు ఎన్నో ఉంటాయి" అన్నారు. "లేదు! డాక్టరే అవుతాను" అని స్పష్టంగా చెప్పాను. నేను వేరే ఏదైనా చేస్తే బాగుంటుందని నా తల్లితండ్రులు అనుకున్నారు. నా సిస్టర్స్ డాక్టర్లు అవ్వాలనుకోలేదు. కానీ నేను దృఢంగా నిశ్చయించుకున్నాను. ఎందుకంటే వైద్యులుగా నా తల్లితండ్రుల్లో కనిపించే ఆనందాన్ని నేను గమనించాను. మా అమ్మ లూర్ధ్ ఫెర్నాండెజ్, నాన్న లెస్లీ ఫెర్నాండెజ్ వైద్యులు. అమ్మ హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆసుపత్రిలో పని చేశారు. తరువాత... 1948లో... బొగ్గులకుంటలో సొంతంగా ఆసుపత్రిని ప్రారంభించారు. ఇది హైదరాబాద్‌లో బహుశా రెండవ ప్రైవేట్ ఆసుపత్రి. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి అప్పటికి కొన్ని రోజులే అయింది. నైజాం రాష్ట్రంలో పరిస్థితులు అల్లకల్లోలంగా ఉన్నాయి. అటువంటి సమయంలో ఇద్దరు యువ వైద్యులు ఒక ప్రైవేట్ ఆసుపత్రిని ప్రారంభించడం ఊహకు అందని విషయం, ఎంతో సాహసోపేతమైన నిర్ణయం. వైద్యులుగా నా తల్లితండ్రులు క్షణం తీరికలేకుండా ఉండేవాళ్ళు. మా కుటుంబం కలిసి భోజనం చేయడానికి కేవలం రాత్రి పూట మాత్రమే వీలయ్యేది. ఆ సమయంలో వారి అనుభవాలను పంచుకొనేవారు. ప్రజలకు చికిత్స చేయడంలో ఉన్న ఆనందం, డబ్బు ఇచ్చుకోలేనివారికి సాయం చెయ్యడంలో ఉన్న సంతోషం, బాధలో ఉన్న వారికి స్వస్థత చేకూర్చడంలో ఉన్న సంతృప్తి... ఇవన్నీ వారి



మాటల్లో వ్యక్తమయ్యేవి. కొన్నిసార్లు ఏ శిశువైనా మరణించినప్పుడు... ఆ సంగతి చెబుతూ మా అమ్మ కన్నీళ్ళు పెట్టుకొనేవారు. ఇవన్నీ నాలో స్థిరంగా నాటుకుపోయాయి. వైద్యురాలు కావాలనే నా ఆకాంక్షకు ఇవన్నీ బీజం వేశాయి. ఆ నిర్ణయం తీసుకున్నందుకు నేను ఇప్పటికీ ఎంతో సంతోషిస్తూ ఉంటాను.

## నన్ను చూసి చాలామంది నవ్వుకున్నారు...

నేను కాలేజీ చదువు పూర్తిచేసేసరికి తెలంగాణ ఉద్యమం మొదలైంది. తెలంగాణలో కాలేజీలన్నీ మూతపడ్డాయి. దాంతో వేరే రాష్ట్రాల్లో మెడికల్ సీటు కోసం అప్లై చేశాను. బెంగళూరు సెయింట్ జాన్స్ మెడికల్ కాలేజీలో సీటు వచ్చింది. అక్కడ చదువుకున్నాను. ఎంబిబిఎస్ పూర్తి చేశాక... హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలో డిప్లమా చేశాను. ఏడాది పాటు సుల్తాన్ బజార్ ఆసుపత్రిలో పని చేశాను. ఆ తరువాత... "నువ్వు దేశం బయటకు వెళ్ళి... ప్రపంచ వైద్యరంగం ఎలా ఉందో పరిశీలించు" అని నా తల్లితండ్రులు సూచించారు. అప్పుడు నేను పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోసం యుకెలోని 'రాయల్ కాలేజీ ఆఫ్ అబ్స్టెట్రిషన్ అండ్ గైనకాలజిస్ట్స్'కు అప్లై చేశాను. రెండేళ్ళ పాటు గాంధీ ఆసుపత్రిలో ఎవరి నేతృత్వంలో పని చేశానో... ఆయన రాయల్ కాలేజీలో మెంబర్‌గా ఉన్నారు. "మీరు ఇప్పటికే మా మెంబర్ దగ్గర పని చేశారు కాబట్టి... యూకే రానక్కర్లేదు. ఈ రెండేళ్ళ కోర్సు మీరు కొనసాగిస్తున్నట్టే పరిగణిస్తాం" అని కాలేజీ యాజమాన్యం చెప్పింది. నేను చేయాల్సిందల్లా పరీక్షకు హాజరు కావడమే. తరువాత యూకే వెళ్ళి... అక్కడి వైద్య వ్యవస్థపై అవగాహన సంపాదించాను. పరీక్ష రాసి, రాయల్ కాలేజీలో మెంబర్‌షిప్ తీసుకొని వచ్చాను. 1984లో మా ఆసుపత్రిలోనే వైద్యురాలుగా చేరాను. 1985లో ఆసుపత్రి నిర్వహణ బాధ్యతలు తీసుకున్నాను. దాన్ని రెండు పడకలతో మా తల్లితండ్రులు ప్రారంభించారు. నేను బాధ్యతలు చేపట్టేసరికి 35 బెడ్స్ ఉన్నాయి. అప్పట్లో ఆర్థోపెడిక్స్, ఇఎన్‌టి, జనరల్ సర్జరీ... ఇలా అనేక ఇతర విభాగాల్లో సేవలు అందించేవారు. పూర్తిస్థాయి నర్సింగ్ హోమ్‌గా ఉండేది. నేను కేవలం ప్రెగ్నెన్సీ అండ్ ఛైల్డ్ బర్త్ కోసమే మా ఆసుపత్రిని ప్రత్యేకంగా రూపుదిద్దాలనుకున్నాను. ఆ మేరకు రెండేళ్ళలో పూర్తిగా మార్పులు తెచ్చాను. ఒక వైద్య బృందాన్ని తయారు చేసి... ఫెర్నాండెజ్ ఆసుపత్రిని మదర్ కేర్ సెంటర్‌గా మార్చాను. గర్భిణులకు, బాలింతలకు, నవజాత శిశువులకు 24 గంటలూ సేవలు అందించడం అవసరమనేది నా ఉద్దేశం. అప్పుడు చాలామంది నన్ను చూసి నవ్వుకున్నారు. ఎందుకంటే 'సింగిల్ స్పెషాలిటీ ఆసుపత్రి' అనే కాన్సెప్ట్ అప్పటికి లేదు. అదీ కాకుండా... గర్భిణులు, శిశువుల సంరక్షణ, ప్రసవాలు అనేవి లాభదాయకమైన సేవలుగా పరిగణించేవారు కాదు. పెద్ద ఆసుపత్రుల్లో అది కేవలం ఒక చిన్న విభాగంగా మాత్రమే ఉండేది. మహిళలకు, పిల్లలకు ప్రత్యేకించిన ఆసుపత్రులను నేను బ్రిటన్‌లో చూశాను. ఆ కాన్సెప్ట్‌ను ఇక్కడికి తెచ్చాను. 1992 నాటికి... పేషెంట్స్ సంఖ్య బాగా పెరగడంతో... పాత ఆసుపత్రి సరిపోని పరిస్థితి... దాని స్థానంలో ప్రస్తుతం (బొగ్గుల కుంట) ఉన్న ఆసుపత్రిని నిర్మించాం. 2007లో రెండో ఆసుపత్రిని, 2011లో మరో ఆసుపత్రిని నిర్మించాం. మూడు ఓపీ కేంద్రాలు నడుస్తున్నాయి.

> ### గొప్ప గౌరవం
>
> ఇతర ప్రాంతాలకు కూడా మా సేవలను విస్తరిస్తున్నాం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోరిక మేరకు అక్కడ కూడా మిడ్‌వైఫరీ శిక్షణ ఇస్తున్నాం. అక్కడ రెండు ట్రైనింగ్ స్కూల్స్ ఉన్నాయి. ఇటీవల తెనాలిలో 'ఇ-సేఫ్' అనే పేరుతో కార్యక్రమాలు నిర్వహించాం. తెనాలి ప్రాజెక్ట్ విషయానికి వస్తే... డబ్ల్యూహెచ్‌ఓ, యూనివర్సిటీ ఆఫ్ లివర్‌పూల్, మెడికల్ కౌన్సిల్ ఆఫ్ యూకే, ఫెర్నాండెజ్ ఆసుపత్రి కలిసి... టాంజానియాలో, ఇండియాలో ఈ ప్రాజెక్ట్ నిర్వహిస్తున్నాం.

## ప్రభుత్వాలతో చేతులు కలిపి...

మేము చేపట్టిన ప్రతిష్టాత్మకమైన కార్యక్రమాల్లో మిడ్‌వైఫరీ (మంత్రసాని) వ్యవస్థ ఒకటి. సుమారు పాతికేళ్ళ క్రితం వందలో అరవై నుంచి డెబ్భై మంది తల్లులకు కాంప్లికేషన్స్ ఉండేవి. వారిని మేం జాగ్రత్తగా చూసుకొనేవాళ్ళం. ఈ సంగతి ఆనోటా ఈనోటా వ్యాపించింది. క్లిష్టమైన ప్రెగ్నెన్సీ కేసులను మా దగ్గరకు పంపించేవారు. కర్నూలు, విజయవాడ లాంటి ప్రాంతాల నుంచి కూడా మాకు పేషెంట్స్ వచ్చేవారు. కొన్ని కేసుల్లో తల్లులను మేము కాపాడలేకపోయేవాళ్ళం. 'దీని గురించి ఏం చెయ్యాలా?' అని ఆలోచిస్తున్నప్పుడు... మిడ్‌వైఫ్స్ విధానాన్ని అమలు చేస్తే బాగుంటుందనిపించింది. ప్రసూతి వైద్యులు, మంత్రసానులు కలిసి పని చేస్తే... ప్రసూతి మరణాలను తగ్గించవచ్చని అనుకున్నాను. అప్పటికి ఆ వ్యవస్థ మన దేశంలోని ఆసుపత్రుల్లో అంతగా లేదు.

> ### ఇది చాలా పెద్ద బాధ్యత...
>
> 1992 నుంచి 2018 వరకూ... 'డాక్టర్ లెస్లీ జె ఫెర్నాండెజ్ మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్ట్' కింద మా కార్యకలాపాలు సాగాయి. 2018లో ఫెర్నాండెజ్ సంస్థలు... లాభాపేక్షలేని సంస్థలుగా... కొత్తగా ఏర్పాటు చేసిన 'ఫెర్నాండెజ్ హాస్పిటల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్' కింద రిజిస్టర్ అయ్యాయి. 2011లోనే మా ఆసుపత్రిలో ఏడాదికి నాలుగు నుంచి అయిదువేల జననాలు జరిగేవి. అప్పుడు నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్, మినిస్ట్రీ ఆఫ్ హెల్త్... మేం ఏం చేస్తున్నామో పరిశీలించడానికి ఒక బృందాన్ని పంపించాయి. ఎందుకంటే మాది కాంప్లికేటెడ్ కేసులకి రిఫరల్ ఆసుపత్రిగా ఉంది. వాళ్ళు పరిశీలించిన తరువాత... "ఇప్పుడు మీది ఒక టీచింగ్ హాస్పిటల్. కాబట్టి వైద్యులకు, ఇతర సిబ్బందికి మీరు బోధన చేయాల్సి ఉంది" అని చెప్పారు. దాంతో గత పదకొండు, పన్నెండేళ్ళ నుంచి బోధనను కొనసాగిస్తున్నాం. ఈ విధంగా చేస్తున్న ఏకైక ఆసుపత్రి దేశంలో మాదే. ఇది చాలా పెద్ద బాధ్యత. దాదాపు దశాబ్దంగా మా కార్యక్రమాల్ని ఇతర ఆసుపత్రుల్లో అమలు చేస్తున్నందుకు మేం చాలా సంతోషిస్తున్నాం.



> ### ఇంటర్నెట్ లేని ప్రదేశాలకు వెళ్తా...
>
> నేను ఒంటరిగా, వివాహానికి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాను. ఆసుపత్రే గత ముప్పై, నలభై ఏళ్ళుగా నా కుటుంబం. మా ఆసుపత్రుల్లో పుట్టిన వారంతా నా పిల్లలే కదా! వాళ్ళ సంఖ్య రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. ఇక నాకు సంగీతమన్నా, ప్రయాణాలన్నా ఇష్టం. పుస్తకాలు బాగా చదువుతాను. ఇంటర్నెట్ కూడా అందుబాటులో లేని ప్రదేశాలకు వెళ్ళడాన్ని ఇష్టపడతాను. లాంగ్ డిస్టెన్స్ డ్రైవింగ్ ఇష్టం. కేరళ, కన్యాకుమారి... ఇలా పలు ప్రాంతాలకు డ్రైవర్ లేకుండా... ముగ్గురు, నలుగురు మహిళలం కలిసి వెళ్తా ఉంటాం. ఇవి నాలో ఒత్తిడిని తగ్గించడానికి దోహదం చేస్తాయి. నా భవిష్యత్ ప్రణాళికలంటారా... ప్రతి చోటా మా ఆసుపత్రిని ఏర్పాటు చేయడమే నా ఆశయం. యాభై పడకలున్న చిన్న ఆసుపత్రుల్ని ఏర్పాటు చేయాలి, హైదరాబాద్ బయటి ప్రాంతాలకు విస్తరించాలి... ఇదీ నా కోరిక.

యూకే నుంచి సహకారం తీసుకున్నాం. నిజానికి 1990ల చివర్లోనో, 2000లలోనో కేంద్ర ప్రభుత్వం కొన్ని రాష్ట్రాల్లో ఈ దిశగా ప్రయత్నాలు చేసినా... విజయవంతం కాలేదు. మా ఆసుపత్రిలో ప్రారంభించిన మిడ్‌వైఫరీ ప్రోగ్రాం సఫలం కావడంతో... తెలంగాణలోని నర్సులకు శిక్షణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఈ సంగతి ఢిల్లీలోని పెద్దలకు తెలిసి... పరిశీలన కోసం ఒక బృందాన్ని పంపారు. ప్రసవాలలో, గర్భిణుల సంరక్షణలో మిడ్‌వైఫ్స్ విధానం వల్ల కలిగే ప్రయోజనాలను, దాని వల్ల ప్రభుత్వాసుపత్రుల్లో మారిన వాతావరణాన్ని వారు గమనించారు. ఆ తరువాత దేశవ్యాప్తంగా ఉన్న వైద్య సంస్థల్లో మిడ్‌వైఫరీని ప్రవేశపెట్టాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది. దేశవ్యాప్తంగా 14 శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసింది. దేశంలోని మొట్టమొదటి మిడ్‌వైఫరీ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ మాదే. ఇప్పటివరకూ పది రాష్ట్రాల్లో మేము శిక్షణ ఇచ్చాం. ప్రతి రాష్ట్రంలో ఆరు నుంచి పది మంది ఈ శిక్షణ తీసుకొని... ఒక్కొక్కరూ మరో పదిమందికి శిక్షణ అందిస్తారు. ప్రభుత్వాలతో కలిసి పని చెయ్యడం ఒక ప్రైవేటు ఆసుపత్రిగా మాకు దక్కిన గౌరవం.

## పేదలే నిజమైన వివిపీలు...

76 ఏళ్ళ క్రితం ఏ విలువలతో మా తల్లితండ్రులు ఆ ఆసుపత్రిని ప్రారంభించారో... ఆ విలువలు ఇప్పటికీ మా సంస్థలో సజీవంగా ఉన్నాయి. అవిచ్ఛిన్నంగా కొనసాగుతున్నాయి. ప్రాణాలకు విలువ ఇవ్వాలి, డబ్బు లేకపోవడం అనే కారణంతో ఎవరినీ వెనక్కి పంపకూడదు. దయతో, ఆప్యాయతతో వ్యవహరించాలి. ఇవీ వారు నిర్దేశించిన విలువలు. ఆ విలువలే మమ్మల్ని నిలబెడుతున్నాయి. మా ఆసుపత్రికి కొందరు మహిళలు వస్తూ ఉంటారు. "ఇరవయ్యేళ్ళ క్రితం మీరే మా డాక్టర్. మా అమ్మాయిని మీరే చూడాలి" అంటారు. ఇలా మూడు... కొన్నిసార్లు నాలుగు తరాల వారికి కూడా మేము సేవలు అందిస్తున్నాం. ఇప్పుడు హైదరాబాద్‌లో ఎన్నో ఆసుపత్రులున్నాయి. కానీ కొందరు వ్యక్తులు ఇప్పటికీ ఆ విశ్వాసంతో, నమ్మకంతో మా దగ్గరకే వస్తూ ఉంటారు. మాకు ఇంతకన్నా గొప్ప గౌరవం, ప్రశంస మరేం ఉంటుంది? ఇన్నేళ్ళలో మేము కేవలం మూడు ఆసుపత్రులే ఎందుకు నడుపుతున్నామంటే... మేము దీనిలో గొప్ప లాభాలు ఆశించడం లేదు. మా ఆదాయం పెరిగినప్పుడు దాన్ని చూపించి... బ్యాంకుల్లో రుణాలు తీసుకొని, తరువాతి ఆసుపత్రిని ప్రారంభించాం. కాబట్టి మా విస్తరణ చాలా నెమ్మదిగా జరిగింది. అయినప్పటికీ, నాణ్యతలో, విలువలలో ఏమాత్రం రాజీ పడకుండా చూసుకుంటున్నాం. మా బొగ్గులకుంట ఆసుపత్రిలో... డబ్బు చెల్లించలేని వారికీ, చెల్లించేవారికీ కూడా సేవలు అందిస్తాం. చెల్లింపు చేయలేనివారి కోసం ఎప్పుడూ 11 బెడ్స్ ప్రత్యేకంగా ఉంటాయి. మా ఆసుపత్రుల్లో వేరే వాటికి అలాంటి పేషెంట్స్ వచ్చినప్పుడు... వారిని ఇక్కడికి రిఫర్ చేస్తారు. మా దృష్టిలో పేదలే నిజమైన వివిపీలు. ఎందుకంటే వారు గట్టిగా తమ గొంతు వినిపించలేరు. వారికి చిన్న సాయం చేసినా... ఎంతో సంతోషిస్తారు, కృతజ్ఞత చూపిస్తారు. వాళ్ళు చిన్న మొత్తాలైనా సరే... తమకు ఉన్నదానిలో కొంత చెల్లించి... తమ హుందాతనాన్నీ, కృతజ్ఞతనూ ప్రదర్శిస్తారు. ఇది చాలామంది సంపన్నులలో కనిపించదు. కాబట్టి సంపన్నుల మాదిరిగానే వారికీ తగిన సంరక్షణ, గౌరవం ఇవ్వాలి. దీన్ని మా ఆసుపత్రి సంస్కృతిలో భాగం చేశాం.

• కృష్ణశర్మ



HYDERABAD | HANAMKONDA | KHAMMAM | KARIMNAGAR | VIJAYAWADA | VIZAG | KAKINADA | NELLORE
GUNTUR | BHIMAVARAM | RAJAHMUNDRY | VIZIANAGARAM | ELURU | BENGALURU | COIMBATORE | INDORE
CONNECT WITH US: 040 2300 0115 | CUSTOMER CARE: 92900 60707 | FOLLOW US ON

ముఖేష్ అంబానీ గారాల కూతురు... **ఈషా అంబానీ పీరామల్.**
'అంబానీ' వారసురాలిగా ప్రపంచానికి పరిచయమైనా...
వ్యాపార రంగంలో తనదైన ముద్రతో తండ్రికి తగ్గ తనయ అనిపించుకొంటోంది.
కోరుకున్నది ఎంతటి విలువైన వస్తువైనా... క్షణాల్లో కళ్ల ఆమె ముందు ప్రత్యక్షం అవుతుంది.
కానీ వాటన్నిటి కంటే విలువైనది... అమూల్యమైనది... ఆమె 'ఆర్ట్ హౌస్'లో ఒకటుంది.
ఈషా కళాత్మక హృదయానికి... ఆమెలోని అమ్మతనానికి... నిలువెత్తు రూపం ఆ కళాకృతి.

# కళాత్మక హృదయం

అమ్మానాన్నలతో విదేశాలు వెళ్లినప్పుడల్లా సాధ్యమైనన్ని మ్యూజియంలు, ఆర్ట్ ఎగ్జిబిషన్లు సందర్శించేవారు ఈషా అంబానీ. ఆ అనుభవాలు తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడానికి తోడ్పడ్డాయంటారు ఆమె. కళలపై ఉన్న మక్కువతో గత ఏడాది ముంబయిలో 'నీతా ముఖేష్ అంబానీ కల్చరల్ సెంటర్' (ఎన్ఎంఏసీసీ)లో 'ఆర్ట్ హౌస్'ను ప్రారంభించారు. పదహారు వేల చదరపు అడుగులతో, నాలుగు అంతస్తుల్లో ఏర్పాటు చేసిన ఈ 'ఆర్ట్ హౌస్'... ఈషా కళాత్మక హృదయానికి నిదర్శనం. దీని వెనుక ఆమె ఆసక్తి, కృషి మాత్రమే కాదు... తల్లి నీతా అంబానీ నుంచి పొందిన ప్రేరణ కూడా ఉంది.

'నాకు ప్రధాన స్ఫూర్తి మా అమ్మ. నచ్చింది ఎంచుకోవడంలోనే కాదు... ఆ దారిలో నడవడానికి అంకితభావంతో కృషి చేయాలని నన్ను, నా సోదరులనూ అమ్మ ఎప్పుడూ ప్రోత్సహిస్తుంటుంది. స్కెచింగ్, డ్రాయింగ్, పెయింటింగ్ నా అభిరుచులు. మనసు ప్రశాంతతను కోరుకున్నప్పుడు చిత్రకళే నాకు అద్భుతమైన ఉపశమనం' అంటున్న ఈషా 'ఆర్ట్ హౌస్'లో ఇంగ్లిష్ ఆర్టిస్ట్ ట్రేసీ ఎమిన్, అమెరికన్ పెయింటర్ జెనిఫర్ గూయిడీ తదితర ప్రపంచ ప్రసిద్ధ కళాకారుల చిత్రాలు కొలువై ఉన్నాయి. ఈషా గ్రాడ్యుయేట్ అయిన సందర్భంగా... ట్రేసీ ఎమిన్ గీసిన చిత్రాన్ని నీతా అంబానీ బహుమతిగా ఇచ్చారు. ఆ బహుమతి తనకు ఎప్పటికీ ప్రత్యేకమే అంటుంది ఈషా. అలాగే జెనిఫర్ అబ్‌స్ట్రాక్ట్ పెయింటింగ్‌ను ఆమె భర్త ఆనంద్ పిరమళ్... పెళ్లి కానుకగా ఇచ్చారు.

ఇవేకాదు... కొన్నేళ్లుగా ఈషా సేకరించిన ప్రముఖుల చిత్రాలు, శిల్పాలు ఎన్నో 'ఆర్ట్ హౌస్'లో ఆకట్టుకొంటాయి. అమెరికన్ కళాకారుడు రాబర్ట్ ఇండియానా ప్రసిద్ధ 'లవ్' ప్రతిమ లోపలికి అడుగు పెట్టగానే అబ్బుర పరుస్తుంది. సుబోధ్ గుప్తా, రవీందర్‌రెడ్డి కళాకృతులు, ఈషా గదిలో ఎఫ్ఎన్ సౌజా భారీ పెయింటింగ్ కనిపిస్తాయి. మీ అభిమాన చిత్రకారుడు ఎవరని ఆమెను అడిగితే... 'చాలా మంది ఉన్నారు. కానీ ప్రధానంగా నా మద్దతు మహిళా కళాకారులకే. ముఖ్యంగా భారతీయ మహిళా చిత్రకారులను ప్రోత్సహిస్తాను. భారతీ ఖేర్, రితిక మర్చంట్, రానా బేగమ్ వంటి కళాకారుల చిత్రాలు నన్ను ఆకట్టుకొంటాయి. అలాగే మా ఇంట్లో ఉండే కళాకృతులన్నీ నాకు నచ్చుతాయి. ఎందుకంటే అన్నీ ఇష్టపడి సేకరించినవే కదా' అంటారు ఈషా.



అయితే కళ్లముందు ఎన్ని అద్భుత కళాఖండాలు ఉన్నా... ఆమె చూపు మాత్రం ఒక 'చిత్రం' ముందు ఆగిపోతుంది. 'ఆ చిత్రాన్ని ఎన్నిసార్లు చూసినా నాకు విసుగు పుట్టదు. అలానే చూస్తూ ఉండిపోతాను. అది నాకు అత్యంత ఇష్టమైన, మనసుకు నచ్చిన కళాకృతి. అది మరేదో కాదు... మా పిల్లల అరచేతి ముద్రలు. కాగితంపై వేసిన ఈ హ్యాండ్ ప్రింట్స్ మా ఇంటి ఫ్రిజ్ డోర్‌కు అతికించి పెట్టుకున్నాను. ఎందుకంటే ఎప్పుడూ కనిపిస్తూ ఉండాలని. దాన్ని చూసినప్పుడు ఒక తల్లిగా నా హృదయం ఉప్పొంగుతుంది. మనసు పరవశిస్తుంది' అంటూ ఎంతో భావోద్వేగంతో చెబుతారు ఈషా. అలాగే నిశ్చితార్థం నాడు భర్త తొడిగిన వజ్రపు ఉంగరం కూడా తనకు అంతే ప్రత్యేకమంటారు. ఆమె వద్ద విలువైన ఆభరణాల కలెక్షన్ కూడా తక్కువేంలేదు. ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన అన్‌కట్ డైమండ్ నెక్లెస్, ఒక చిన్న దేశం జీడీపీకి సమానమైన విలువగల వజ్రాలు పొదిగిన బెల్ట్, అమూల్యమైన రత్నాలు అద్దిన బ్లౌజ్... ఇలా ఎన్నో ఖరీదైన, ప్రత్యేకమైన ఆభరణాలు ఈషా దగ్గర లెక్కకు మించే ఉన్నాయి. కానీ మనసుకు దగ్గరైనది తన పిల్లల హ్యాండ్ ప్రింట్స్ మాత్రమే.

ముంబయిలోనే పుట్టి పెరిగిన ఈషా 'ధీరూభాయ్



అంబానీ ఇంటర్నేషనల్ స్కూల్'లో పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేశారు. అమెరికాలోని 'ఏలే యూనివర్సిటీ'లో సైకాలజీ డిగ్రీ, 'స్టాన్‌ఫోర్డ్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ బిజినెస్' నుంచి ఎంబీఏ పట్టాలు పొందారు. చదువు అవ్వగానే తండ్రి వ్యాపారాల్లో భాగస్వామి అయ్యారు. ప్రస్తుతం 32 ఏళ్ల ఈషా 'రిలయన్స్ రీటైల్ వెంచర్స్ లిమిటెడ్, రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ లిమిటెడ్, జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్, రిలయన్స్ ఫౌండేషన్, ధీరూభాయ్ అంబానీ ఇంటర్నేషనల్ స్కూల్' బోర్డ్ ఆఫ్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. వినూత్నమైన, సృజనాత్మకమైన ఆలోచనలతో రిలయన్స్ రిటైల్‌ను కొత్త పుంతలు తొక్కించారు. కొన్ని ప్రముఖ బ్రాండ్లను కొనుగోలు చేసి, ఈకామర్స్ వేదికైన 'అజియో' కిందకు తీసుకువచ్చారు. తద్వారా తమ మార్కెట్ పరిధి పెంచి, వ్యాపారాన్ని విస్తరించారు. రిలయన్స్ ఫౌండేషన్ ద్వారా దేశీయ కళలు, కళాకారులను ప్రోత్సహిస్తున్నారు. పేద మహిళల సాధికారత కోసం, చిన్నారుల విద్య కోసం కృషి చేస్తున్నారు.

ఇదిలావుంటే... ఆరేళ్ల కిందట ఆనంద్ పీరామల్‌ను పెళ్లి చేసుకున్న ఈషా... తాను కూడా ఐవీఎఫ్ బేబీనేనని, ఇప్పుడిది సాధారణమని, దీన్ని దాచిపెట్టాల్సిన అవసరం లేదని ఇటీవల ఓ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారు. 'ప్రపంచంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నప్పుడు... దాన్ని పిల్లలు కనడానికి ఎందుకు ఉపయోగించకూడదు? వాస్తవానికి ఇది సంతోషించదగ్గ విషయం. దాచుకోవాల్సింది కాదు. ఐవీఎఫ్ ద్వారా నాకు కవలలు పుట్టారని చెప్పడానికి నేను ఏమాత్రం సంకోచించను. ఎందుకంటే ఇప్పుడిది సాధారణమైపోయింది. పిల్లల కోసం ఐవీఎఫ్‌ను ఆశ్రయించే జంటలు ఆ విషయాన్ని చెప్పుకోవడానికి సంశయించాల్సిన అవసరం లేదు' అంటున్న ఈషా, ఆనంద్ దంపతులు పెళ్లయిన నాలుగేళ్లకు ఐవీఎఫ్ ద్వారా కవలలకు జన్మనిచ్చారు.

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
గురువారం • 4 జులై 2024
cinema@andhrajyothy.com

# అమితాబ్ అశ్వత్థామ అయ్యారు ఇలా..





పాన్ ఇండియా లేటెస్ట్ సంచలనం 'కల్కి 2898 ఏ.డీ'. బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులతో దూసుకుపోతోందీ చిత్రం. ఇందులో బాలీవుడ్ నటుడు అమితాబ్ 'అశ్వత్థామ' పాత్రను పోషించారు. 81 ఏళ్ల వయసులోనూ ఆయన చేసిన పోరాటాలు సినిమాకే హైలైట్‌గా నిలిచాయి. ఈ సినిమాలో ఆయన లుక్ కోసం ప్రతీరోజు మేకప్ వేసుకోవడానికి మూడు గంటలు, తీయడానికి మరో మూడు గంటలు.. మొత్తంగా ఆరు గంటలు వెచ్చించేవారని చిత్ర బృందం తెలిపింది. తాజాగా, అమితాబ్, 'అశ్వత్థామ' క్యారెక్టర్ కోసం సిద్ధమయ్యేటప్పుడు తీసిన ఫొటోలను మేకప్ డిపార్ట్‌మెంట్ సభ్యులు ఇన్‌స్టాలో షేర్ చేశారు. "లెజెండ్ అమితాబ్ పోరాట యోధుడు 'అశ్వత్థామ'గా మారే సమయంలో తీసిన ఫొటోలివి" అంటూ బిహైండ్ ద సీన్స్‌ను పోస్ట్ చేశారు. కాగా, ప్రభాస్ నటించిన ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌కు నాగ్‌అశ్విన్ దర్శకత్వం వహించగా, అశ్వనీ దత్ నిర్మించారు. జూన్ 27న విడుదలైన ఈ సినిమా ఇప్పటికే గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద రూ.600 కోట్ల పైచిలుకు కలెక్షన్లు సాధించి.. మరింత భారీ విజయం దిశగా సాగుతోంది.



# అదీ ఆయన గొప్ప మనసు

జానీమాస్టర్

టాలీవుడ్ డాన్సర్స్ యూనియన్‌లోని 500 మంది సభ్యులు, వారి కుటుంబాలకు ఆరోగ్యబీమా అందించేందుకు రామ్‌చరణ్ ముందుకొచ్చారు. ఈ విషయాన్ని జానీమాస్టర్ సోషల్ మీడియా వేదికగా తెలిపారు. ఎప్పుడో ఓ మాట అడిగితే గుర్తుపెట్టుకొని మరీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఇన్ని కుటుంబాలకు సాయం చేసేందుకు రామ్‌చరణ్ ముందుకు వచ్చారని అభినందించారు. చిరంజీవి సైతం తన ఆశీస్సులు అందించారని చెప్పారు. మా డాన్సర్స్ అసోషియేషన్ తరఫున అన్న, వదిన (రామ్‌చరణ్, ఉపాసన)కు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. 'మీలాంటి గొప్ప మనసున్న వ్యక్తులతో కలసి పనిచేయడం నా అదృష్టం' అని జానీమాస్టర్ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. నా పుట్టిన రోజు సందర్భంగా రామ్‌చరణ్ నన్ను స్వయంగా ఇంటికి పిలిచి అభినందనలు తెలిపారని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామ్‌చరణ్, ఉపాసన దంపతులతో దిగిన ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేశారు.

# ట్రయాంగిల్ క్రైమ్ ఎంటర్‌టైనర్

ఎఫ్ 2, ఎఫ్ 3 చిత్రాల సూపర్ హిట్ కాంబో విక్టరీ వెంకటేశ్, దర్శకుడు అనిల్ రావిపూడి, దిల్ రాజు హ్యాట్రిక్ ఇవ్వడం కోసం మళ్లీ చేతులు కలిపారు. దిల్ రాజు సమర్పణలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బేనరుపై శిరీష్ నిర్మించే ఈ చిత్రం షూటింగ్ బుధవారం రామానాయుడు స్టూడియోలో ప్రారంభమైంది. వెంకటేశ్, మీనాక్షి చౌదరిపై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు నిర్మాత సురేశ్‌బాబు కెమెరా స్విచ్ ఆన్



చేయగా, మరో నిర్మాత అల్లు అరవింద్ తొలి క్లాప్ ఇచ్చారు. సీనియర్ దర్శకుడు రాఘవేంద్రరావు గౌరవ దర్శకత్వం వహించారు. మరో దర్శకుడు వంశీ పైడిపల్లి స్క్రిప్ట్ అందజేశారు. హీరో, అతని మాజీ ప్రేయసి, భార్య.. ఈ మూడు పాత్రల మధ్య తిరిగే ట్రయాంగిల్ క్రైమ్ ఎంటర్‌టైనర్ ఇదని దర్శకనిర్మాతలు చెప్పారు. ఈ సినిమాలో వెంకటేశ్ సరసన మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేశ్ నటిస్తున్నారు. ఉపేంద్ర లిమాయే, రాజేంద్రప్రసాద్, సాయికుమార్, నరేశ్, వి.టి. గణేశ్, మురళీధర్ గౌడ్, పమ్మి సాయి, ఆనంద్‌రాజ్, చైతన్య జొన్నలగడ్డ, మహేశ్ బాలరాజ్ ఇతర ముఖ్య తారాగణం. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఫొటోగ్రఫీ: సమీర్ రెడ్డి, ఎడిటింగ్: తమ్మిరాజు, సహ రచయితలు: ఎస్.కృష్ణ, జి.ఆదినారాయణ.

# ఇది మనందరి కథ



నివేద థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజా ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం '35 చిన్న కథ కాదు'. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే కథ ఇది. హృదయాలను కదిలించే భావోద్వేగాలతో దర్శకుడు నందకిశోర్ ఈ సినిమాను రూపొందించారు. ఆగస్టు 15న ఈ చిత్రం విడుదలవుతున్న సందర్భంగా బుధవారం టీజర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాతల్లో ఒకరైన రానా దగ్గుబాటి మాట్లాడుతూ 'నందు ఈ కథ చెప్పినప్పుడు నాకు నేను గుర్తుకు వచ్చాను. నా కోసం అమ్మ పడిన కష్టం స్ఫురణకు వచ్చింది. ఇది మన అందరి కథ. చాలా మంది లైఫ్ ఇలాగే ఉంటుంది. కమర్షియల్ సినిమాలు చాలా వస్తుంటాయి కానీ ఇటువంటి చిత్రాలు చాలా అరుదు. నివేదకి కథ నచ్చితే ఆ కథతోనే ఉంటుంది. సినిమా బాగా రావడానికి ఎంతో సపోర్ట్ చేస్తుంది. అందరికీ కనెక్ట్ అయ్యే సినిమా ఇది' అన్నారు. 'నా కెరీర్‌లో బెస్ట్ అంతా రామానాయుడు స్టూడియోలోనే జరిగింది. ఇండస్ట్రీకి వచ్చిన తర్వాత నాకు రానా మొదట పరిచయమయ్యారు. నా కెరీర్‌లో చాలా స్పెషల్ ఫిల్మ్ '35.. చిన్న కథ కాదు'. ఇందులో మదర్ రోల్ పోషించా. ఇంతవరకూ నేను చేసిన పాత్రలకు చాలా భిన్నమైంది' అన్నారు. మనసుని కదలించే సినిమా ఇదని నటుడు విశ్వదేవ్ చెప్పారు. ఈ సినిమాను రానా నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లారని చిత్ర నిర్మాత సృజన్ యరబోలు చెప్పారు. ఇది చిన్న సినిమా కాదనీ.. చాలా పెద్ద సినిమా అని ఆయన తెలిపారు.

# ఆగస్టులో సెట్స్‌పైకి



'కల్కి 2898 ఏడీ' చిత్రం సూపర్‌హిట్ అయిన ఆనందంలో ఉన్న ప్రభాస్ అభిమానులకు మరో తీపి కబురు. ఆయన కథానాయకుడిగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కిన 'సలార్' ఫ్రాంఛైజీలో వస్తున్న 'సలార్ 2' చిత్రం సెట్స్ పైకి వెళ్లేందుకు సిద్ధమైందని సమాచారం. ఆగస్టు 10 నుంచి ప్రశాంత్ నీల్ చిత్రీకరణ కొనసాగించేందుకు సన్నాహాలు చేస్తున్నారట. 15 రోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో ప్రభాస్, పృథ్వీరాజ్‌పై భారీ యాక్షన్ సీక్వెన్స్‌ను తెరకెక్కించనున్నారని తెలుస్తోంది. 'కల్కి 2898 ఏడీ' విడుదలవ్వడంతో ప్రభాస్ కూడా 'సలార్ 2' పై దృష్టి పెట్టనున్నారు. ఈ చిత్రం 2025లో ప్రేక్షకుల ముందుకు రానుంది. 'సలార్' తొలి భాగం సూపర్ హిట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. మేకర్స్ ఈ చిత్రానికి కొనసాగింపుగా 'సలార్: శౌర్యాంగపర్వ' పేరుతో రెండో భాగాన్ని ప్రకటించారు. అయితే తొలిభాగాన్ని తెరకెక్కించే సమయంలోనే రెండో భాగానికి సంబంధించి దాదాపు 20 శాతం చిత్రీకరణ పూర్తి చేసినట్లు తెలుస్తోంది. శ్రుతీహాసన్ కథానాయికగా నటిస్తుండగా, హోంబలే ఫిల్మ్స్ నిర్మిస్తోంది.


# సైకో స్టోరీ



రక్షిత్ అట్లూరి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఆపరేషన్ రావణ్'. న్యూ ఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా దర్శకుడు వెంకట సత్య తెలుగు, తమిళ భాషల్లో రూపొందిస్తున్నారు. రాధిక శరత్‌కుమార్ ఓ ముఖ్య పాత్ర పోషిస్తున్న ఈ చిత్రాన్ని ధ్యాన్ అట్లూరి నిర్మిస్తున్నారు. సంగీర్తన విపిన్ హీరోయిన్. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని ఆగస్టు 2న విడుదల చేయనున్నట్లు నిర్మాత ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ పై 'ఎ సైకో స్టోరీ' అని క్యాప్షన్ పెట్టారు. యాక్షన్ సీక్వెన్స్‌లోని హీరో రక్షిత్ స్టిల్‌తో డిజైన్ చేసిన ఈ పోస్టర్ ఆసక్తికరంగా ఉంది. ఈ చిత్ర విజయంపై యూనిట్ కాన్ఫిడెంట్‌గా ఉంది. చరణ్‌రాజ్, కాంచి, రాకెట్ రాఘవ, రఘు కుంచె, విద్యాసాగర్, టీవీ 5 మూర్తి, కార్తీక్ తదితరులు నటించిన ఈ చిత్రానికి మాటలు: లక్ష్మీ లోహిత్ పూజారి, సంగీతం: శరవణ వాసుదేవన్, ఫొటోగ్రఫీ: నాని చమిడిశెట్టి, ఎడిటింగ్: సత్య గిద్దుటూరి , ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: శ్రీపాల్ చొల్లేటి.

# లేడీ క్యారెక్టర్‌లో విష్వక్‌సేన్



సినిమా సినిమాకు వైవిధ్యమైన కథాంశాలను ఎంచుకుని మెప్పిస్తున్న విష్వక్‌సేన్.. లేడీ క్యారెక్టర్‌లో కనిపించనున్న చిత్రం 'లైలా'. అయితే ఇందులో ఆయన సినిమా మొత్తం ఇదే గెటప్‌లో ఉంటారా.. కేవలం కొద్ది సేపు మాత్రమే ఈ లుక్‌లో కనిపిస్తారా అనేది సినిమా రిలీజ్ అయ్యేవరకు వేచి చూడాల్సిందే. ఫస్ట్ లుక్‌తోనే విపరీతమైన బజ్‌ను క్రియేట్ చేసిన ఈ 'లైలా' క్యారెక్టర్ థియేటర్లలోకి వచ్చాక ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు రామ్‌నారాయణ్ దర్శకత్వం వహిస్తున్నారు, సాహు గారపాటి నిర్మిస్తున్నారు. బుధవారం ఈ సినిమాని ప్రారంభించి ఇందులో విష్వక్‌సేన్ పోషించే 'లైలా' 'ఐ' లుక్‌ను విడుదల చేశారు. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు కె. రాఘవేంద్రరావు క్లాప్ ఇవ్వగా, దర్శకుడు హరీశ్ శంకర్ కెమెరా స్విచ్చాన్ చేశారు. వెంకట సతీశ్‌కిలారు, జెమిని కిరణ్ స్క్రిప్ట్‌ను అందించారు. ఈ సినిమాలో కథానాయికగా ఆకాంక్ష శర్మ నటిస్తోంది. ఈ చిత్రానికి ఎడిటర్: అన్వర్ అలీ, డీఓపీ: రిచర్డ్ ప్రసాద్, సంగీతం: జిబ్రాన్.

# ఆ సమయం వస్తే నేనే చెప్తా



'రన్ రాజా రన్' చిత్రంతో తెలుగుతెరకు పరిచయమయ్యారు సీరత్‌కపూర్. చాలా గ్యాప్ తర్వాత 'మనమే' చిత్రంలో ఓ ప్రత్యేక పాత్రలో మెప్పించారు. నటిగా, గాయనిగా రాణిస్తోన్న సీరత్.. ఈ మధ్య లవ్‌లో పడ్డారని.. అమన్ సింగ్ అనే నటుడితో డేటింగ్‌లో ఉన్నారంటూ రూమర్స్ వస్తున్నాయి. ఈ విషయమై ఓ విలేఖరి ఆమెను ప్రశ్నించగా.. ఇలా సమాధానమిచ్చారు. 'ప్రస్తుతం నా ఫోకస్ అంతా కెరీర్, ఫ్యామిలీ పైనే ఉంది. నేను ఏ విషయాన్ని దాచుకునే వ్యక్తిని కాదు. ఒకవేళ నా వ్యక్తిగత జీవితం గురించి మీ అందరికీ ఏ విషయమైనా తెలియాల్సిన సమయం వస్తే నేనే ముందుగా చెప్తాను. సినిమాల ఎంపికలో నా మనసు మాట వింటా. సినిమాల్లో నేను పోషించే పాత్రలు చాలా బాగుంటాయని అభిమానులు ప్రశంసిస్తుంటారు. అది నాకెంతో ఆనందాన్నిస్తుంది. ఈ ప్రశంసలు.. గుర్తింపు.. నేను పోషించే పాత్రలను మరింతగా అచితూచి ఎంచుకునేలా చేస్తాయి' అని చెప్పారు. రకుల్ ప్రీత్‌సింగ్ సోదరుడిగా ఇండస్ట్రీలో అడుగుపెట్టిన అమన్.. నటుడిగా సినిమాల్లో పలు సినిమాల్లో నటించారు. సీరత్ కపూర్ ఆలపించిన 'ఆవో నా' పాటలో సీరత్‌తో కలసి నటించారు. ఈ పాటలో వారిద్దరి కెమెస్ట్రీ అందరినీ ఆకట్టుకుంది.

# బేబీజాన్‌కు అతిథిగా



తమిళ దర్శకుడు అట్లీ నిర్మాతగా రూపొందుతున్న బాలీవుడ్ చిత్రం 'బేబీ జాన్'. విజయ్ హీరోగా అట్లీ దర్శకత్వం వహించిన తమిళ బ్లాక్‌బస్టర్ 'థెరీ' చిత్రానికి ఇది రీమేక్. కలీస్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌తో కీర్తి సురేశ్ కథానాయికగా బాలీవుడ్ అరంగేట్రం చేస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. అయితే హిందీ చిత్రసీమలోఈ సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికర వార్త వినిపిస్తోంది. 'బేబీజాన్'లో సల్మాన్‌ఖాన్ అతిథి పాత్రలో కనిపించనున్నారని టాక్. ఆయన కోసమే ప్రత్యేకంగా అట్లీ ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను డిజైన్ చేశారట. దీన్ని ఆగస్టులో వరుణ్‌ధావన్, సల్మాన్‌ఖాన్‌పై చిత్రీకరించనున్నారని బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. అయితే దీనిపై చిత్రబృందం అధికారికంగా స్పందించాల్సి ఉంది. ఈ ఏడాది క్రిస్మస్‌కు 'బేబీ జాన్' ప్రేక్షకుల ముందుకు రానుంది. మరోవైపు సల్మాన్‌ఖాన్‌తో అట్లీ ఓ సినిమా చేస్తున్నట్లు కొన్నాళ్లుగా ప్రచారంలో ఉంది. ఇందులో కమల్‌హాసన్ కీలకపాత్రలో నటిస్తున్నారనే వార్తలు వినిపించాయి. కానీ ఈ కాంబినేషన్‌పై ఇప్పటివరకూ ఎలాంటి ప్రకటనా రాలేదు.

# తెలుగు అభిమానుల్ని మిస్ అవుతున్నా



**నటి రకుల్ ప్రీత్ సింగ్ 'భారతీయుడు 2' చిత్రంతో ప్రేక్షకులను పలకరించడానికి సిద్ధమయ్యారు. 12న విడుదలవుతున్న ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఇన్‌స్టాగ్రామ్‌లో 'ఆస్క్ మీ ఎనీథింగ్' సెషన్ నిర్వహించారు. ఇందులో అభిమానులతో పలు విషయాలను ఆమె షేర్ చేసుకున్నారు.**

'టాప్ డైరెక్టర్ శంకర్ సినిమాలో నటించడం నా అదృష్టం. ఆయనతో పనిచేయాలనే కోరిక ఈ సినిమాతో నెరవేరింది. ఈ సినిమా విడుదల కోసం చాలా ఆతృతగా ఎదురుచూస్తున్నాను. ఆయన తెరపై సృష్టించే క్యారెక్టర్స్ అద్భుతంగా ఉంటాయి. సెట్‌లో ఆయన ఆలోచనలు, దర్శకత్వ పటిమను చూసి ఆశ్చర్యపోయేదాన్ని. ఈ సినిమా షూటింగ్ సమయంలో ఆయన నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. తెలుగులో నటించి చాలా కాలమైంది. తెలుగు అభిమానుల్ని మిస్ అవుతున్నా. ప్రస్తుతం తెలుగులో సినిమా చేయడానికే కొన్ని కథలు వింటున్నా. నచ్చిన స్క్రిప్ట్ దొరగ్గానే నటిస్తాను" అని చెప్పారు.

# భయ పెడుతున్న భామ



అప్సరా రాణి, విజయ్‌శంకర్, వరుణ్ సందేశ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న చిత్రం 'రాచరికం'. సురేశ్ లంకలపల్లి దర్శకత్వంలో ఈశ్వర్ నిర్మిస్తున్నారు. షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకుని ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉందీ చిత్రం. హీరోయిన్ అప్సరా రాణి స్పెషల్ పోస్టర్‌ను బుధవారం విడుదల చేశారు. కాళీ మాత ఉగ్రరూపం దాల్చితే ఎలా ఉంటుందో ఆ పోస్టర్‌లో అప్సర అంత భయంకరంగా కనిపించారు. థ్రిల్లింగ్ కాన్సెప్ట్‌తో, సగటు ప్రేక్షకుడిని కట్టిపడేసే సన్నివేశాలతో చిత్రం రూపొందుతోందని దర్శకుడు చెప్పారు. వరుణ్ సందేశ్ పోషించిన మాస్ రోల్ పూనకాలు తెప్పిస్తుందన్నారు. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాత చెప్పారు. హైపర్ ఆది, రంగస్థలం మహేశ్, విజయరామరాజు, శ్రీకాంత్ అయ్యంగార్, ప్రాచీ థాకర్ తదితరులు నటించిన ఈ చిత్రానికి మాటలు: రామ్‌ప్రసాద్, సంగీతం: వెంగి, ఫొటోగ్రఫీ: ఆర్య సాయికృష్ణ.

# ఆకట్టుకునే అన్నాచెల్లెళ్ల కథతో



అన్నాచెల్లెళ్ల అనుబంధం నేపథ్యంలో ఇంటిల్లిపాదిని ఆకట్టుకునే గ్రామీణ కథాంశంతో రూపొందుతున్న చిత్రం 'చిట్టి పొట్టి'. భాస్కర గ్రూప్ ఆఫ్ మీడియా బేనర్‌పై భాస్కర్ యాదవ్ దాసరి స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. రామ్ మిట్టకంటి, పవిత్ర, కస్వి ప్రధాన పాత్రల్లో నటించారు. త్వరలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవలే చిత్రబృందం గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'కుటుంబ అనుబంధాల నేపథ్యంలో ఈ చిత్రం రూపొందుతోంది. ఒక ఆడబిడ్డకు పుట్టింటిపై ఉన్న మమకారాన్ని తెలిపే చిత్రమిది. మహిళల గొప్పతనం నేపథ్యంలో కథ సాగుతుంది. ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులకు కనెక్ట్ అవుతుంద'ని చెప్పారు. కాంతమ్మ, ఆచారి, హర్ష కీలకపాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీతం: శ్రీ వెంకట్, సినిమాటోగ్రఫీ: జోషీ, ఎడిటర్: బాలకృష్ణ బోయ

# చౌకీదార్ చిత్రీకరణ మొదలు



పృథ్వీ అంబర్ కథానాయకుడిగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'చౌకీదార్' చిత్రీకరణ బుధవారం ప్రారంభమైంది. బెంగళూరులోని బండే మహంకాళి ఆలయంలో పూజా కార్యక్రమాలతో చిత్రీకరణ ప్రారంభించారు. నిర్మాత కల్లహళ్లి చంద్రశేఖర్ క్లాప్ ఇచ్చారు. కీలకపాత్ర పోషిస్తున్న సాయికుమార్ కెమెరా స్విచ్చాన్ చేశారు. ఈ చిత్రంలో ధన్యా రామ్‌కుమార్ కథానాయికగా నటిస్తున్నారు. చంద్రశేఖర్ బండియప్ప దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఈ చిత్రంలో పృథ్వీ యాక్షన్ రోల్ చేస్తున్నారు. ఆయన పాత్ర కొత్త తరహాలో ఉండబోతోంది. తన పాత్రలో వైవిధ్యం చూపేందుకు ఆయన చాలా కష్టపడుతున్నారు. పృథ్వీ అంబర్ మాట్లాడుతూ 'ఒక్క రోజులో టీజర్‌ను చిత్రీకరించాం. చాలా సరదాగా అనిపించింది. ఈ చిత్రంలో చాలా జీవిత అనుభవాలు ఉన్నాయి. మంచి ఫ్యామిలీ ఎలిమెంట్స్ కథలో ఉన్నాయి' అన్నారు. సాయికుమార్ మాట్లాడుతూ 'నాకు చాలా సంతోషంగా ఉంది. వచ్చే ఏడాది 50 ఏళ్లు పూర్తవుతున్నాయి. చౌకీదార్ కథ ఎమోషనల్ డ్రామా. ఇది చాలా మంచి సబ్జెక్ట్' అన్నారు. 'ఇది చక్కని ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. షూటింగ్ త్వరలో ప్రారంభమౌతుంది. పలు భాషల్లో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నామని నిర్మాత చెప్పారు. సచిన్ బస్రూర్ సంగీతాన్ని అందిస్తున్నారు.

# బదిలీలకు పచ్చజెండా

(మొదటి పేజీ తరువాయి)



స్వీకరించి, కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేయనున్నారు. దీనికి సంబంధించి బదిలీల షెడ్యూలు, మార్గదర్శకాలు జారీ చేశారు. బదిలీలు చేపట్టే సాధికారత గల అధికారులను కూడా ప్రకటించారు. ఫలితంగా రాష్ట్రంలోని గెజిటెడ్, నాన్-గెజిటెడ్, నాల్గో తరగతి ఉద్యోగుల బదిలీలు జరగనున్నాయి. టీచర్లు మినహాయించి ఈ మూడు కేడర్లకు సంబంధించి రాష్ట్రంలో ప్రస్తుతం 2.5 లక్షల మంది ఉద్యోగులున్నారు. వీరిలో దాదాపు 80 వేల నుంచి లక్ష మంది వరకు ఉద్యోగులు, అధికారులు బదిలీ అవుతారని అంచనా. సుదీర్ఘ కాలం తర్వాత నిషేధాన్ని ఎత్తివేసి, బదిలీలకు అవకాశం కల్పించడం పట్ల వివిధ ఉద్యోగ, అధికార సంఘాలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నాయి. అయితే... ఒక ప్రదేశంలో రెండేళ్ల సర్వీసు పూర్తయిన ఉద్యోగి... బదిలీ కోసం దరఖాస్తు చేసుకోవడానికి అర్హుడవుతాడని ప్రభుత్వం ప్రకటించింది. ఒకే ప్రదేశంలో నాలుగేళ్లకు మించి పని చేస్తున్న ఉద్యోగులను తప్పనిసరిగా బదిలీ చేయాలని ఆదేశించింది. ప్రతి కేడర్‌లో 40 శాతానికి మించి బదిలీలు చేయవద్దని తెలిపింది. బదిలీ ఉత్తర్వులు అందుకున్న మూడో రోజు నుంచి ఉద్యోగి రిలీవ్ అయినట్లుగానే భావిస్తామని ప్రకటించింది. ఈ నెల 21 నుంచి సాధారణ బదిలీలపై తిరిగి నిషేధం అమల్లోకి వస్తుందని ప్రకటించింది.

### ఆరేళ్ల కిందట బదిలీలు

రాష్ట్రంలోని ఉద్యోగులు చాలా కాలం నుంచి బదిలీల కోసం ఎదురు చూస్తున్నారు. ముఖ్యంగా 317 జీవో కింద బదిలీ అయి, రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులు సొంత ప్రాంతాలకు వెళ్లాలని ఆశ పడుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలను పెద్దగా పట్టించుకోలేదు. తన పదేళ్ల కాలంలో ఒకేఒకసారి 2018లో సాధారణ బదిలీలు చేపట్టింది. అది కూడా శాసన సభ ఎన్నికలకు ముందు హడావుడిగా బదిలీలు చేపట్టి, కేవలం 20 శాతం మందినే బదిలీ చేసింది. అప్పట్లో అందరికీ సరైన అవకాశాలు రాలేదని ఉద్యోగ సంఘాలు విరుచుకుపడ్డాయి. ఆ తర్వాత 2021లో కొత్త జిల్లాలకు ఉద్యోగుల సర్దుబాటులో భాగంగా 317 జీవోను తెచ్చింది. ఈ జీవో ఇప్పటికీ వివాదాస్పదంగానే ఉంది. ఉమ్మడి జిల్లాల నుంచి కొత్త జిల్లాలకు చాలా మంది ఉద్యోగులను సర్దుబాటు చేశారు. దాంతో తాము సొంత జిల్లాలను వదులుకోవాల్సి వచ్చిందని, సీనియారిటీ దెబ్బ తిన్నదంటూ ఉద్యోగులు వాపోయారు. అప్పటి నుంచి సాధారణ బదిలీలపై నిషేధాన్ని ఎత్తివేయాలంటూ ఉద్యోగ సంఘాలు బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినా కనికరించలేదు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటంతో సాధారణ బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసింది. అంటే ఆరేళ్ల తర్వాత ఉద్యోగులకు మళ్లీ బదిలీల అవకాశం లభించింది.

### ముందుగానే జాబితాలను ప్రదర్శనకు పెట్టాలి

ముందుగా విభాగాధిపతులు, బదిలీ చేసే అధికారమున్న అధికారులు(కాంపిటెంట్ అథారిటీ)... తమ శాఖ, విభాగంలోని బదిలీలకు అర్హులైన ఉద్యోగుల జాబితాలను కేడర్లవారిగా ప్రదర్శనకు పెట్టాలి. ఉద్యోగుల నుంచి ఆప్షన్లు స్వీకరించడానికి ముందుగానే తమ శాఖల్లోని ఖాళీల వివరాలను ప్రకటించాలి. తప్పనిసరిగా బదిలీ చేయాల్సిన ఉద్యోగుల వివరాలను కూడా ముందుగానే వెల్లడించాలి. బదిలీ కోరుకునే ప్రదేశాలకు సంబంధించి ఒక్కో ఉద్యోగికి ఐదు ఆప్షన్లు ఇవ్వాలి. ప్రతి ప్రాంతంలో కనీసమాత్రంగా ఉద్యోగులు ఉండేలా చూసుకున్న తర్వాతే బదిలీలకు అవకాశం కల్పించాలి. సమస్యాత్మక ప్రాంతాలకు ఎక్కువ దరఖాస్తులు రాని సందర్భంలో లాటరీ పద్ధతిని అనుసరించాలి. అన్ని రకాల బదిలీలు కౌన్సెలింగ్ ద్వారానే నిర్వహించాలి.

### రాబడుల శాఖకు ప్రత్యేక మార్గదర్శకాలు

రాబడుల శాఖలైన వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, స్టాంపులు-రిజిస్ట్రేషన్లలోని బదిలీలకు ప్రత్యేక మార్గదర్శకాలను అనుసరించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ శాఖల్లో 2007లో జారీ చేసిన జీవో 143 ప్రకారం ఈ బదిలీలు చేపట్టాలని తెలిపింది. రవాణా, అటవీ శాఖల బదిలీల కోసం 2007, 2008లలో జారీ చేసిన జీవోలు 147, 81లలోని మార్గదర్శకాలను అనుసరించాల్సి ఉంటుంది. పోలీసు బదిలీల కోసం ప్రత్యేక మార్గదర్శకాలను జారీ చేసుకోవాలని సూచించింది.

### ఉద్యోగ సంఘాల హర్షం

సాధారణ బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసి, బదిలీలకు ప్రభుత్వం అవకాశం కల్పించడం పట్ల తెలంగాణ గెజిటెడ్ అధికారుల(టీజీవో) సంఘం, తెలంగాణ నాన్-గెజిటెడ్ అధికాల(టీఎన్‌జీవో) సంఘం హర్షం వ్యక్తం చేశాయి. పార్లమెంటు ఎన్నికల సందర్భంలో బదిలీ అయిన ఎంపీడీవోలు, తహసిల్దార్లు, ఇతర ఉద్యోగులను తిరిగి తమ పాత ప్రాంతాలకు పంపించిన తర్వాతనే వారి నుంచి సాధారణ బదిలీల ఆప్షన్లు స్వీకరించాలని టీజీవోల సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఏలూరి శ్రీనివాసరావు, సత్యనారాయణ డిమాండ్ చేశారు. బదిలీలకు అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి టీఎన్‌జీవోల సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మారం జగదీశ్, ముజీబ్ కృతజ్ఞతలు తెలిపారు.

**బదిలీల షెడ్యూలు**

| తేది | బదిలీల ప్రక్రియ ఇలా... |
|---|---|
| 5.7.2024 నుంచి 8.7.2024 వరకు (మొదటి నాలుగు రోజులు) | బదిలీల ప్రక్రియను ఖరారు చేయడం, ఆయా శాఖల్లో ఉన్న ఖాళీలు, తప్పనిసరిగా బదిలీ చేయాల్సిన ఉద్యోగుల జాబితాల ప్రదర్శన |
| 9.7.2024 నుంచి 12.7.2024 వరకు | కోరుకున్న ప్రదేశాలకు ఆప్షన్ ఇస్తూ ఉద్యోగులు దరఖాస్తు చేసుకోవాలి |
| 13.7.2024 నుంచి 18.7.2024 వరకు | దరఖాస్తుల పరిశీలన, కౌన్సెలింగ్ ద్వారా మాస్టర్ జాబితా తయారీ |
| 19.7.2024 నుంచి 20.7.2024 వరకు (చివరి రెండు రోజులు) | బదిలీల ఉత్తర్వుల జారీ. ఈ ఉత్తర్వులు అందినప్పటి నుంచి మూడో దినాన్ని పాత స్థానం నుంచి ఉద్యోగి రిలీవ్ అయినట్లుగానే భావిస్తారు |

**బదిలీల మార్గదర్శకాలు ఇవీ**

- ఒకే చోట 30.6.2024 నాటికి రెండేళ్ల సర్వీసు పూర్తయిన ఉద్యోగి బదిలీకి అర్హుడు. రెండేళ్ల లోపు సర్వీసు ఉన్నవారిని బదిలీ చేయడానికి వీల్లేదు. భార్యాభర్తల(స్పౌజ్) కేసులకు ఈ నిబంధన వర్తించదు.
- జూన్ 30 నాటికి ఒక చోట నాలుగేళ్ల సర్వీసు పూర్తయిన ఉద్యోగిని తప్పనిసరిగా బదిలీ చేయాలి. 2025 సంవత్సరం జూన్ 30లోపు పదవీ విరమణ పొందే ఉద్యోగులను బదిలీ చేయొద్దు. ఒకవేళ వారు ఏదైనా కారణంతో బదిలీ కోరుకుంటే మాత్రం అంగీకరించాలి.
- ఒక కేడర్‌లో 40 శాతానికి మించి బదిలీలు చేయొద్దు. అలా చేస్తే... పనిపై ప్రభావం పడుతుంది.
- ఒక ప్రదేశం(గ్రామం, పట్టణం, నగరం) కావాలంటూ ఒకరికంటే ఎక్కువ మంది దరఖాస్తు చేసుకుంటే... ప్రాధాన్య క్రమంలో అవకాశం కల్పించాలి. అంటే... స్పౌజ్ కేసులు, 2025 సంవత్సరం జూన్ 30కు ముందు రిటైర్ అయ్యేవారు, 70 శాతానికి మించి అంగవైకల్యం ఉన్నవారు, మానసిక దుర్బలత పిల్లలున్నవారు, వితంతువులు, క్యాన్సర్, న్యూరోసర్జరీ, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్, లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్, ఓపెన్ హార్ట్ సర్జరీ, బోన్ టీబీ సంబంధిత చికిత్సలు/శస్త్ర చికిత్సలు పొందుతున్నవారు, సమస్యాత్మక ప్రాంతాల్లో దీర్ఘకాలికంగా పని చేస్తున్నవారికి వరుస క్రమంలో బదిలీలకు అవకాశం కల్పించాలి.
- గుర్తింపు పొందిన ఉద్యోగ, అధికార సంఘాల ఆఫీస్ బేరర్ల బదిలీల విషయంలో 2012లో జారీ చేసిన సర్క్యులర్ నిబంధనలను అమలు చేస్తారు.
- బదిలీలు తప్పనిసరిగా ఫోకల్ పాయింట్ నుంచి నాన్-ఫోకల్ పాయింటుకు, నాన్-ఫోకల్ పాయింటు నుంచి ఫోకల్ పాయింటుకు జరగాలి.

# ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై క్రిమినల్ కేసు

- విధులకు ఆటంకం కల్పించారని జడ్పీ సీఈవో ఫిర్యాదు
- బీఎన్ఎస్ 221, 126(2) సెక్షన్ల కింద నమోదు
- మరోవైపు జడ్పీ సీఈవోపై సీపీకి కౌశిక్‌రెడ్డి ఫిర్యాదు

కరీంనగర్ క్రైం, జూలై 3: ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదైంది. కరీంనగర్ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతితోపాటు తనను అడ్డుకోవడమే కాకుండా విధులకు ఆటంకం కలిగించారంటూ ఆయనపై జడ్పీ సీఈవో శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. ఈమేరకు కరీంనగర్ ఒకటో టౌన్ పోలీసులు మంగళవారం రాత్రి పాడి కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు. జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం సందర్భంగా డీఈవోపై చర్యలు తీసుకోవాలంటూ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారు. సమావేశం నుంచి బయటకు వెళుతున్న కలెక్టర్, ఇతర అధికారులను అడ్డుకోవడంతోపాటు సమావేశ మందిరంలో భైఠాయించి ఆందోళన చేశారు. తమ విధులకు ఆటంకం కల్పించారంటూ జడ్పీ సీఈవో ఫిర్యాదు చేయగా.. బీఎన్ఎస్ 221, 126(2) సెక్షన్ల ప్రకారం క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ టౌన్ ఏసీపీ జి.నరేందర్ తెలిపారు. కాగా, తన విధులకు ఆటంకం కలిగించి, ప్రొటోకాల్ ఉల్లంఘించిన జడ్పీ సీఈవో శ్రీనివాస్‌పై కేసు నమోదు చేయాలంటూ కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతికి కౌశిక్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. కానీ, జడ్పీ సీఈవో శ్రీనివాస్.. తన వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా వ్యవహరించారని ఆరోపించారు. ఈ విషయమై తక్షణమే విచారణ చేసి, చర్యలు తీసుకోవాలని కోరారు.

## అవినీతిని ప్రశ్నిస్తే కేసులు పెడతారా?

- ప్రభుత్వ ప్రోద్బలంతోనే ఎమ్మెల్యేలపై కేసులు : కేటీఆర్

హైదరాబాద్, జూలై3 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ హయాంలో జరుగుతున్న అవినీతిని ప్రశ్నిస్తున్నందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కార్యకర్తలపై అక్రమ కేసు లు పెడతారా? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. ప్రజాపాలన అంటే ప్రశ్నించే ప్రజాప్రతినిధులపై అక్రమకేసులు పెట్టడమేనా? అని ఓ ప్రకటనలో నిలదీశారు ప్రభుత్వ అవినీతిపై పోరాటం చేస్తున్నందుకే ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై అక్రమ కేసు పెట్టారని ఆరోపించారు. జడ్పీ సమావేశంలో కౌశిక్‌రెడ్డి నిరసన తెలిపితే కేసు పెట్టడమేంటని నిలదీశారు. కౌశిక్‌రెడ్డి పేర్కొన్న అంశాలపై దృష్టిపెట్టకపోగా.. ప్రతిపక్షాల నోరు మూయించాలనే కుట్రతో అక్రమ కేసులు పెడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ పెద్ద ల ఒత్తిడితోనే ఈ కేసు పెట్టారని విమర్శించారు. కాగా, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవాలక్ష్మిపై పోలీసులు అక్రమ కేసు నమోదు చేయడాన్ని కేటీఆర్ ఖండించారు. ఈ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

### ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే

కాంగ్రెస్ సర్కారు వైఫల్యం వల్లే సిరిసిల్లలో మరో చేనేత కార్మికుడు పల్లె యాదగిరి ఆత్మహత్య చేసుకున్నాడని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో చేనేత రంగం పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోయిందని ధ్వజమెత్తారు. ఆత్మహత్య చేసుకున్న యాదగిరి కుటుంబానికి 25లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

## ఏసీబీ వలలో గోపాల్‌పేట తహసీల్దార్

వనపర్తి క్రైమ్, జూలై 3: వనపర్తి జిల్లా గోపాల్‌పేట తహసీల్దార్ శ్రీనివాసులు రూ. 8 వేలు లంచం తీసుకుంటూ బుధవారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. గోపాల్‌పేట మండలం జింకల బీడు తండాకు చెందిన మూడావత్ పాండుకు పొలికెపాడు గ్రామంలో 30 గుంటల భూమి ఉంది. అందులో 15 గుంటల వ్యవసాయ భూమిని కోళ్ల ఫారం కోసం నాన్ అగ్రికల్చర్‌గా మార్చుకునేందుకు తహసీల్దార్ శ్రీనివాస్ దగ్గరకు వెళ్లారు. అందుకు రూ. 15 వేలు లంచం ఇవ్వాలని తహసీల్దార్ డిమాండ్ చేయగా.. బాధితుడు రూ. 8 వేలు ఇచ్చేందుకు అంగీకరించాడు. ఈ విషయమై బాధితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. వారి సూచన మేరకు బుధవారం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాడు. అతడి నుంచి తహసీల్దార్ రూ.8 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. తహసీల్దార్‌ను కస్టడీలోకి తీసుకొని గురువారంనాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు. అనంతరం గోపాల్‌పేటలో గల తహసీల్దార్ అద్దె ఇంట్లో సోదాలు జరిపారు.


**తెలంగాణ ప్రభుత్వం**
**గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ**
టెండరు కోరుతూ ప్రకటన
NIT.NO.SE/TW/HYD/3 to 12 & 277 to 576/2024-25, తేది: 02.07.2024, పని పేరు: కొన్ని భవనాల పనులు 15 నం.ల కొరకు రూ.3685.10 లక్షలు, బిడ్ దాఖలకు ప్రారంభ తేది: 06.07.2024న సా.5.00గం.లకు మరియు బిడ్ దాఖలకు ముగింపు తేది: 22.07.2024న మ.3.00గం.లకు, మరిన్ని వివరాలకు 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ @https://tender.telangana.gov.in// లో చూడవచ్చును. ఫోన్. నం: 9492770365. సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, గిరిజన సంక్షేమం, హైదరాబాద్
DIPR RO No: 231-DP/CL/ADVT/1/2024-25, తేది:03.07.2024

**తెలంగాణ ప్రభుత్వం మైనారిటీస్ సంక్షేమ శాఖ నాగర్ కర్నూల్**
**తెలంగాణ మైనారిటీస్ సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ**
:: టెండరు ప్రకటన
Rc. No. A/33/DMWO/TMREIS/2024-25. తేది: 03.07.2024
నాగర్ కర్నూల్ జిల్లాలోని (04) తెలంగాణ మైనారిటీస్ గురుకుల పాఠశాల/ కళాశాలలకు 2024-25 విద్యా సంవత్సరమునకు గాను నిత్యావసర వస్తువులు కిరాణం, కూరగాయలు, పండ్లు, గుడ్లు, మరియు చికెన్ పంపిణీ చేయుటకు గాను టెండర్లు ఆహ్వానించడం జరుగుతుంది. అన్ని టెండర్ల యొక్క ఫారము ధర Rs. 2,000/- కావున టెండర్ల ప్రక్రియలో పాల్గొనదలచిన వారు "DISTRICT MINORITIES WELFARE OFFICER, NAGARKURNOOL" పేరు మీద D.D.ని తీసి ఆ D.D.ని చెల్లించి ఫారమును ఆయా మైనారిటీస్ గురుకుల బాలుర పాఠశాల/ కళాశాల అచ్చంపేట్, నాగర్ కర్నూల్, మరియు మైనారిటీస్ గురుకుల బాలికల పాఠశాల/ కళాశాల కల్వకుర్తి, కొల్లాపూర్ నందు పనివేళల్లో తేది: 02.07.2024 నుండి 09.07.2024 సాయంత్రం 5:00 గం.ల వరకు పొందగలరు. అన్ని సీల్డ్ టెండర్లను తేది: 10.07.2024 నుండి తేది: 15.07.2024 సాయంత్రం 5:00 గం.ల లోపు ఆయా మైనారిటీస్ గురుకుల (బాలుర & బాలికల) పాఠశాల నందు టెండర్ బాక్సులలో వెయ్యగలరు. అన్ని టెండర్లను తేది: 16.07.2024 నాడు మధ్యాహ్నం 03:00 గంటలకు (Integrated District Offices Complex-IDOC Building, Nagarkurnool) అడిషనల్ కలెక్టర్ గారి కార్యాలయం నందు DPC సమక్షంలో తెరువబడును. టెండరు తేదిని మార్చుటకు లేదా రద్దు చేయుటకు అడిషనల్ కలెక్టర్ గారికి పూర్తి అధికారం కలదు. తదుపరి వివరాలకు అచ్చంపేట్ ప్రిన్సిపాల్: 9248646114, 9493450226, నాగర్ కర్నూల్ ప్రిన్సిపాల్: 9966418025, 8328163389 కల్వకుర్తి ప్రిన్సిపాల్: 7331170833, 7207998974 కొల్లాపూర్: 7995067922, 7382532129 సెంబర్లను సంప్రదించగలరు.
DIPR RO No. 1457-PP/CL/ADVT/1/2024-25, తేది:03.07.2024 సం/- జిల్లా మైనారిటీస్ సంక్షేమ అధికారి (FAC), నాగర్ కర్నూల్ జిల్లా

**తెలంగాణ ప్రభుత్వం**
**(వైద్య మరియు ఆరోగ్య శాఖ)**
Rc.No.A1/218/2024, తేది.28.06.2024
**టెండర్ ప్రకటన**
2024-2025 సంవత్సరానికి టెండర్ ప్రారంభమైన తేది నుండి ఒక సంవత్సరం పాటు వరంగల్ ప్రాంతీయ కంటి ఆసుపత్రికి (I) డ్రగ్స్ & మెడిసిన్స్ (II) సర్జికల్స్ & కన్స్యూమబుల్స్ సరఫరా కొరకు ఆమోదించబడిన మెడికల్ ఏజెన్సీల నుండి సీల్డు టెండర్లు కోరుచున్నారు. టెండర్ నియమాలతో పాటు దరఖాస్తును సూపరింటెండెంట్ కార్యాలయం, ప్రాంతీయ కంటి ఆసుపత్రి, వరంగల్‌లో డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా "సూపరింటెండెంట్, రీజనల్ ఐ హాస్పిటల్, వరంగల్" పేరున రూ.2,000/- (రూపాయలు రెండు వేలు మాత్రమే) చెల్లించి పొందవచ్చు, అది వాపసు ఇవ్వబడదు. 1. టెండర్ దరఖాస్తు ఫారమ్ ధర: "సూపరింటెండెంట్, రీజనల్ ఐ హాస్పిటల్, వరంగల్" పేరున డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా రూ.2,000/- (రూపాయలు రెండు వేలు మాత్రమే), 2. టెండర్ దరఖాస్తు ఫారమ్‌ల విక్రయం: 04.07.2024 నుండి 09.07.2024 వరకు ఉ.11.00 గం.ల నుండి సా.04.00 గం.ల వరకు (అన్ని పని దినాలలో), 3. టెండర్ల స్వీకరణ చివరి తేది: 15.07.2024, 4. టెండర్లు తెరవడం: 18.07.2024
సం/-సూపరింటెండెంట్, ప్రాంతీయ కంటి ఆసుపత్రి వరంగల్
DIPR RO No.1451-PP/CL/ADVT/1/2024-25, తేది.03.07.2024


# జైలు నుంచి జనజీవనంలోకి..

- రాష్ట్ర ప్రభుత్వ క్షమాభిక్ష పొందిన 213 మంది ఖైదీల విడుదల
- చర్లపల్లి జైలు నుంచి అందరూ ఒకేసారి బయటకు
- 70 మందికి పెట్రోల్ బంకుల్లో కొలువు

కుషాయిగూడ, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం క్షమాభిక్ష ప్రసాదించిన 213 మంది ఖైదీలు జైలు నుంచి బుధవారం విడుదలయ్యారు. క్షమాభిక్ష పొందిన ఖైదీలు రాష్ట్రంలోని వివిధ జైళ్లలో ఉండడంతో అందరినీ చర్లపల్లి కారాగారానికి చేర్చిన అధికారులు ఒకేసారి విడుదల చేశారు. ఇలా జరగడం జైళ్ల శాఖ చరిత్రలో ఇదే తొలిసారి. క్షమాభిక్ష పొందిన వారిలో 35 మంది మహిళలు, 205 మంది జీవిత ఖైదీలు, ఎనిమిది మంది దీర్ఘకాల శిక్ష అనుభవిస్తున్న వారు ఉన్నారు. ఇందులో చర్లపల్లి కేంద్ర కారాగారం నుంచి 61 మంది, ఓపెన్ ఎయిర్ జైలు నుంచి 31, చంచల్‌గూడ సెంట్రల్ జైలు నుంచి 27, మహిళా జైలు నుంచి 35, వరంగల్ సెంట్రల్ జైలు నుంచి 20, నిజామాబాద్ సెంట్రల్ జైలు నుంచి 15 మంది విడుదలయ్యారు. అలాగే, సంగారెడ్డి సెంట్రల్ జైలు నుంచి ఒకరు, మహబూబ్‌నగర్ జిల్లా జైలు నుంచి ఇద్దరు, ఆదిలాబాద్ జైలు నుంచి ముగ్గురు, కరీంనగర్ జిల్లా జైలు నుంచి ఏడుగురు, ఖమ్మం జిల్లా జైలు నుంచి నలుగురు, ఆసిఫాబాద్ స్పెషల్ సబ్ జైలు నుంచి ముగ్గురు, నల్లగొండ డిస్ట్రిక్ జైలు నుంచి నలుగురు విడుదలయ్యారు. ఈ సందర్భంగా చర్లపల్లి కేంద్ర కారాగారం ఆవరణలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ పి.సౌమ్య మిశ్రా విడుదలవుతున్న ఖైదీలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వ కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సమాజంలో సత్ప్రవర్తనతో మెలగాలని, ప్రశాంత జీవితం గడపాలని వారికి హితవు పలికారు. కాగా, క్షమాభిక్షపై విడుదలైన వారిలో ముగ్గురు మహిళలు సహా 70 మందికి జైళ్ల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంకుల్లో ఉద్యోగం ఇచ్చారు. మరో ఎనిమిది మంది మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. మిగిలిన వారికి కూడా త్వరలోనే ఉపాధి కల్పిస్తామని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జైళ్లశాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్‌లు వై.రాజేష్ (అడ్మిన్), ఎన్.మురళీ బాబు (వెల్ఫేర్), డీఐజీలు డాక్టర్ డి.శ్రీనివాస్ (హైదరాబాద్ రేంజ్), ఎం.సంపత్ (వరంగల్ రేంజ్), చర్లపల్లి సూపరింటెండెంట్ సంతోష్ కుమార్ రాయ్, చంచల్‌గూడ సూపరింటెండెంట్ నవాబ్ శివకుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



జైళ్లశాఖ డీజీ సౌమ్య మిశ్రాకు అభివాదం చేస్తున్న విడుదలైన ఖైదీలు

### పన్నెండేళ్ల తర్వాత నా భర్త ఇంటికి





క్షణికావేశంలో తన భర్త చేసిన నేరం తమని పన్నెండేళ్లు విడదీసిందని కరీంనగర్ జిల్లా ధర్మపురి మండలం, దమ్మన్నపేటకు చెందిన ఆకుల జ్యోతి చెప్పారు. తన భర్త ఆకుల చంద్రయ్య విడుదల సందర్భంగా చర్లపల్లి కారాగారానికి వచ్చిన జ్యోతి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఉమ్మడి కుటుంబంలో జరిగిన గొడవలో తన భర్త చంద్రయ్య చేతిలో అతని సోదరుడు మరణించిన విషయం ఇంకా తమ కళ్ల ముందే ఉందని చెప్పారు. చంద్రయ్య జైలుకి వెళ్లే సమయానికి రెండు నెలల పిల్లాడైన తమ కుమారుడు ఇప్పటిదాకా తండ్రిని సరిగా చూసింది లేదన్నారు. కూలి పని చేసుకుంటూ అత్త రాజవ్వ సహకారంతో కొడుకును పన్నెండేళ్లుగా పెంచానని చెప్పారు.

## ఆర్థిక ఇబ్బందులతో నేత కార్మికుడి ఆత్మహత్య

సిరిసిల్ల క్రైం, జూలై 3: ఆర్థిక ఇబ్బందులతో నేత కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సిరిసిల్లలోని బీవై నగర్‌లో చోటు చేసుకుంది.జిల్లా కేంద్రానికి చెందిన యాదగిరి 30 ఏళ్లుగా సైజింగ్, వార్పింగ్ కార్మికుడిగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభంతో పనిలేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. కుమార్తె వివాహంతోపాటు పలు సందర్భాల్లో చేసిన అప్పులు రూ.8లక్షల వరకు పేరుకుపోయాయి. ఈ నేపథ్యంలో భార్యతో గొడవ జరగ్గా.. ఆమె తల్లిగారింటికి వెళ్లింది. దీంతో మనస్తాపం చెందిన యాదగిరి వారం క్రితం రసాయనం తాగి ఆత్మహత్యకు యత్నించాడు. తాజాగా బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో యాదగిరి ఉరేసుకున్నాడు. కుటుంబ కలహాలతోనే యాదగిరి ఆత్మహత్య చేసుకున్నాడని చేనేత, జౌళిశాఖ ఏడీ సాగర్ ఓ ప్రకటనలో తెలిపారు.

## హాస్టల్ విద్యార్థి అనుమానాస్పద మృతి

- ఆస్పత్రికి తరలించేలోపే మృతి
- వార్డెన్‌ను సస్పెండ్ చేసిన ఆర్డీవో



శ్యామ్ కుమార్

ఆత్మకూరు(ఎస్), జూలై 3: సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో బుధవారం ఓ విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. సూర్యాపేట పట్టణానికి చెందిన విద్యార్థి మెల్లం శ్యామ్‌కుమార్(13)కు తల్లిదండ్రులిద్దరూ మృతి చెందటంతో తన పెద్దమ్మ చప్పల సైదమ్మ వద్ద ఉంటున్నాడు. గతే ఏడాది ఆత్మకూరు(ఎస్) మోడల్ స్కూల్‌లో చేరి మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో ఉంటున్నాడు. బుధవారం తెల్లవారుజామున హాస్టల్‌లో శ్యామ్‌కుమార్ వాంతులు చేసుకుని కడుపునొప్పితో బాధపడ్డాడు. తీవ్ర అస్వస్థతతో కన్పించగా విద్యార్థులు హాస్టల్ సిబ్బంది సహాయంతో సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు. శ్యామ్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సైదమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఆర్డీవో రాజేంద్రకుమార్, డీఎస్పీ రవి బుధవారం ఉదయం హాస్టల్‌ను తనిఖీ చేశారు. వార్డెన్ సక్రమంగా విధులకు రావడం లేదని గుర్తించి సస్పెండ్ చేస్తున్నట్లు ఆర్డీవో తెలిపారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని విద్యార్థి సంఘాల నేతలు హాస్టల్ ఎదుట ఆందోళన నిర్వహించారు.

## బొగ్గు బ్లాకులు సింగరేణికి ఇవ్వాలి

- కేంద్రం దిగిరాకపోతే సకల జనుల సమ్మె
- సింగరేణి కార్మిక సంఘాల ఐక్య వేదిక

పంజాగుట్ట, జూలై 3 (ఆంధ్రజ్యోతి): బొగ్గు గనులు వేలం వేయకుండా సింగరేణికి ఇవ్వాలని సింగరేణి కార్మిక సంఘాల ఐక్య వేదిక డిమాండ్ చేసింది. కేంద్రం దిగారాకపోతే సకల జనుల సమ్మెకు సిద్ధమని హెచ్చరించింది. కేంద్రం తలపెట్టిన బొగ్గు బ్లాకుల వేలంపాటకు వ్యతిరేకంగా సింగరేణి కార్మిక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం బొగ్గు ఉమ్మడి ఆస్తి అని, ప్రైవేటీకరణ చేయడం కుదరదని టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. సింగరేణికి అసాధారణమైన చరిత్ర ఉందని, దానిని కాపాడాల్సిన బాధ్యత గనుల మంత్రిగా కిషన్‌రెడ్డికి ఉందని ప్రొఫెసర్ హరగోపాల్ పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ మాట్లాడుతూ, ఈ విషయం రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని, మీ గొంతులో గొంతుకనై పనిచేస్తానని హామీ ఇచ్చారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క మాట్లాడుతూ, కేంద్రం తీసుకున్న నిర్ణయం ప్రజలందరినీ గందరగోళ పరిచేలా ఉందన్నారు. ఐఎఫ్టీయూ జాతీయ నాయకులు శ్రీనివాస్ మాట్లాడుతూ, జాతి సంపదను అమ్మే వారు దేశ ద్రోహులని, ఐక్యంగా ఉంటే మిగతా బ్లాకుల వేలంపాటను ఆపగలమని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం రెండు కంపెనీలకు దొంగచాటుగా పనులు అప్పగించిందని వేదిక కన్వీనర్, హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. కేంద్రం స్పందించకపోతే సకల జనుల సమ్మెకు సిద్ధమని హెచ్చరించారు.



తహసీల్దార్‌ను అడ్డుకుంటున్న రైతు ప్రభాకర్ కుటుంబసభ్యులు

## మా కొడుకు చనిపోయాక.. విధులు గుర్తొచ్చాయా?

- చింతకాని తహసీల్దార్‌ను అడ్డుకున్న రైతు ప్రభాకర్ తల్లిదండ్రులు
- భూమిని పరిశీలించేందుకు వెళ్లిన తహసీల్దార్

చింతకాని, జూలై 3 : "నా కొడుకు చనిపోయాక.. మీకు ఉద్యోగం గుర్తొచ్చిందా సార్.. మేం ఫిర్యాదు చేసిన వెంటనే మీరు స్పందించి ఉంటే మావాడు మాకు దక్కేవాడు. ఇప్పుడు అతడి పిల్లలకు దిక్కెవరు." అంటూ తహసీల్దార్‌ను ఖమ్మం జిల్లాలో ఆత్మహత్యకు పాల్పడ్డ రైతు బోజెడ్ల ప్రభాకర్ తల్లిదండ్రులు ప్రశ్నించారు. చింతకాని మండలం పొద్దుటూరుకు చెందిన బోజెడ్ల ప్రభాకర్ తమ పొలంలో కొందరు ఎక్స్‌కవేటర్లతో గుంతలు చేసి పాడు చేశారని ఆరోపిస్తూ సోమవారం ఓ సెల్ఫీ వీడియో రికార్డు చేసి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే.. రాష్ట్ర ప్రభుత్వం ఈ వ్యవహారంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టడంతో పోలీసులు కేసు విచారణను ముమ్మరం చేశారు. ఈ క్రమంలో బుధవారం ప్రభాకర్‌కు చెందిన వివాదాస్పద భూమిని పరిశీలించేందుకు వెళ్లిన తహసీల్దార్ రమేష్‌ను.. ప్రభాకర్ కుటుంబసభ్యులు తహసీల్దార్‌ను అడ్డుకున్నారు. తాము ఫిర్యాదు చేసిన వెంటనే స్పందిస్తే తమకు న్యాయం జరిగేదని ఆయనతో అన్నారు. తమకు న్యాయం చేయాలని ప్రభాకర్ కుమారుడు, కుమార్తె తహసీల్దార్ కాళ్లపై పడి వేడుకున్నారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారు. తమ భూమిలో అనుమతి లేకుండా గోతులు తీసిన పొక్లెయిన్‌లను వెంటనే సీజ్ చేయాలని, తన కొడుకు మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ప్రభాకర్ తండ్రి వీరభద్రం ఎస్ఐ నాగుల్‌మీరాను కోరారు.


**ANDHRA PRADESH STATE CIVIL SUPPLIES CORPORATION LIMITED**
Head Office: 10-152/1, Ashoknagar, Bandar Road, Vijayawada-520007
**SHORT TENDER NOTICE**
PDS.3/FR Chakki Atta/2024 Date: 03.07.2024
**EMPANELMENT AND APPOINTMENT OF MILLER CUM SUPPLIER (CHAKKI ATTA MILLS) FOR CONVERSION OF WHEAT INTO FORTIFIED CHAKKI ATTA AND SUPPLY OF 20302.224 MTS AT MLS POINTS FOR THREE (03) ZONES THROUGH AP E PROCUREMENT.**
Andhra Pradesh State Civil Supplies Corporation Ltd invites Short Tenders for empanelment and appointment of suppliers for supply of **20302.224 MTS** of Fortified Chakki Atta in 1 kg Art work designed packets, with secondary packing in 50 kg new poly woven bags under PDS for the months of **August, 2024 to July, 2025** to all the MLS Points of three Zones comprising of (26) districts in Andhra Pradesh State.
All the interested Millers cum Suppliers in All Over India may visit **www.apscscl.in & www.apeprocurement.gov.in** to view and download tender documents at free of cost.
Interested bidders/tenderers to submit bids should be registered in website **www.apeprocurement.gov.in** and should also obtain digital signature certificates from any certifying authority in India. The details and procedure for obtaining Digital Signature Certificates are mentioned in the **www.apeprocurement.gov.in** or **contact the helpdesk of procurement portal Phone: 08645-246370/71/72/73/74.**
Last date for registration and completion of formalities for the e-auction shall be up to **11.07.2024 at 5.00 p.m** and the tentative date of online e-reverse auction through ap e-procurement platform would be **15.07.2024 at 11 a.m onwards.**
**Sd/- VC & MANAGING DIRECTOR**

**తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి**
ప్రాంతీయ కార్యాలయం, నిజామాబాదు
డోర్ నం: 6-2-190, సుభాష్ నగర్, నిజామాబాదు జిల్లా 503002, ఫోన్ నం. 08462-237774
**పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ ప్రకటన**
భారత ప్రభుత్వ పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ యొక్క S.O.1533(E) తేది: 14 సెప్టెంబర్ 2006 మరియు తదుపరి సవరణకు అనుగుణంగా, మెస్సర్స్ నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (NHAI), వారు నిజామాబాద్ నుండి జగదల్‌పూర్ వరకు ఉన్న ఎన్‌హెచ్-63లో గల ఆర్మూర్ - జగిత్యాల్ మంచిర్యాల సెక్షన్ (కిమీ 29+100 నుండి కిమీ 160+995 వరకు) నాలుగు వరుసల రహదారి అభివృద్ధి విషయమై కేంద్ర ప్రభుత్వ పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ నుండి పర్యావరణ అనుమతి (EC) కొరకు, పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిమిత్తం ఈ ప్రకటన జారీచేయబడుచున్నది. ప్రతిపాదిత ప్రాజెక్ట్ వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

| | | |
|---|---|---|
| 1 | కంపెనీ పేరు, ఫోన్ నం. మరియు చిరునామా | తెలంగాణ రాష్ట్రంలో నిజామాబాద్ - జగదల్‌పూర్ ఇంటర్ కారిడార్ (ICR) రహదారి ఎన్ హెచ్-63లో గల ఆర్మూర్ - జగిత్యాల్ - మంచిర్యాల సెక్షన్ (కిమీ 29+100 నుండి కిమీ 160+995 వరకు), ఎన్ హెచ్ (ఓ) క్రింద హైబ్రిడ్ యాన్యుటీ విధానములో నాలుగు వరుసల రహదారి అభివృద్ధి. M/s.నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (NHAI) ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ యూనిట్ (PIU), బ్లాక్ D-7 (A&B), MCC కాలనీ, మంచిర్యాల, తెలంగాణ -504209 సెల్ నం: 9481353756 |
| 2 | ప్రతిపాదిత ప్రాజెక్టు పేరు మరియు ప్రాజెక్టు స్థల వివరాలు. | ప్రాజెక్ట్ రహదారి ఆర్మూర్ బైపాస్ (ఎన్ హెచ్-44) వద్ద ప్రారంభమవుతుంది మరియు హైదరాబాదు-మంచిర్యాల కూడలి వద్ద ముగుస్తుంది. ప్రాజెక్ట్ రహదారి తెలంగాణ రాష్ట్రంలోని నిజామాబాద్, జగిత్యాల మరియు మంచిర్యాల జిల్లాల గుండా వెళుతుంది. రహదారి మొత్తం పొడవు 131.895 కి.మీ. ఈ ప్రాజెక్ట్ నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్, వేల్పూర్, మోర్తాడ్ కమ్మర్ పల్లి మండలాల్లోని గల 10 గ్రామాల మీదుగా వెళుతుంది. ఈ ప్రతిపాదిత ప్రాజెక్టు మొత్తం విస్తీర్ణం: 568.53 హెక్టార్లు. ● ప్రభుత్వ భూమి- 28.49 హెక్టార్లు. ● ప్రైవేట్ భూమి - 522.6394 హెక్టార్లు, ● అటవీ భూమి- 17.4 హెక్టార్లు. |
| 3 | సంప్రదించవలసిన అధికారిక వ్యక్తిపేరు, చిరునామా, ఫోన్ నెంబరు మరియు ఇ-మెయిల్ | శ్రీ కె.ఎన్. అజయ్ మతి కుమార్, ప్రాజెక్ట్ డైరెక్టర్, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (NHAI) PIU, బ్లాక్ D-7 (A&B), MCC కాలనీ, మంచిర్యాల, తెలంగాణ - 504209 సెల్ నెం: 9481353756. ఇ-మెయిల్: piumancherial@gmail.com |
| 4 | EIA కన్సల్టెంట్ యొక్క పేరు మరియు చిరునామా | M/s. ఆక్రో డిజైన్ & ఇంజనీరింగ్, ఘజియాబాద్. |
| 5 | ప్రాజెక్ట్ వ్యయం | రూ. 5354.12 కోట్లు |
| 6 | కార్యాచరణ | జాతీయ రహదారి (నాలుగు వరుసల అభివృద్ధి). |
| 7 | పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ జరుగు తేదీ, సమయం మరియు ప్రదేశం | తేది : 07.08.2024, సమయం: ఉదయం 11.00 గంటలకు. ప్రదేశం: G.K.R.S కన్వెన్షన్ హాల్, పెర్కిట్ గ్రామం, ఆర్మూర్ మండలం, నిజామాబాద్ జిల్లా. |
| 8 | ప్రజల పరిశీలన నిమిత్తం ప్రాజెక్టు యొక్క సంగ్రహ నివేదిక మరియు ప్రాజెక్టు వలన పర్యావరణం పై ప్రభావం మరియు పరిరక్షణ ప్రణాళిక లభ్యమగు కార్యాలయములు. | (i) జిల్లా కలెక్టర్ / మేజిస్ట్రేట్ కార్యాలయం, నిజామాబాద్, నిజామాబాద్ జిల్లా. (ii) జిల్లా పరిశ్రమల కేంద్రం, నిజామాబాద్, నిజామాబాద్ జిల్లా.(iii) ముఖ్య కార్యనిర్వహణాధికారి, జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయం, నిజామాబాద్, నిజామాబాద్ జిల్లా.(iv) రెవిన్యూ డివిజనల్ కార్యాలయం, ఆర్మూర్, నిజామాబాద్ జిల్లా. (v) పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ, ప్రాంతీయ కార్యాలయం, 3వ అంతస్తు అరణ్యభవన్, RBI ఎదురుగా, సైఫాబాద్, హైదరాబాద్-500004 (vi) సభ్య కార్యదర్శి కార్యాలయం, తెలంగాణా కాలుష్య నియంత్రణ మండలి, బోర్డు కార్యాలయం, ఎ-3, ఇండస్ట్రియల్ ఎస్టేట్, పర్యావరణ భవన్, సనత్‌నగర్, హైదరాబాద్-500018 (vii) జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ కార్యాలయం, తెలంగాణా కాలుష్య నియంత్రణ మండలి, జోనల్ ఆఫీస్, [illegible], రామచంద్రాపురం,సంగారెడ్డి జిల్లా.(viii) పర్యావరణ ఇంజనీర్ కార్యాలయం, తెలంగాణా కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం, 6-2-190, సుభాష్ నగర్, నిజామాబాద్-503 002 (ix) తహశీల్దార్ కార్యాలయం, ఆర్మూర్ మండలం, నిజామాబాద్ జిల్లా. (x) తహశీల్దార్ కార్యాలయం, వేల్పూర్ మండలం, నిజామాబాద్ జిల్లా.(xi) తహశీల్దార్ కార్యాలయం, మోర్తాడ్ మండలం, నిజామాబాద్ జిల్లా.(xii) తహశీల్దార్ కార్యాలయం, కమ్మర్ పల్లి మండలం, నిజామాబాద్ జిల్లా. (xiii) గ్రామపంచాయితీ కార్యాలయాలు - నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్ మండలంలో గల కొత్తఆర్మూర్, పెర్కిట్ & చేపూర్ గ్రామాలు.(xiv) గ్రామపంచాయితీ కార్యాలయాలు-నిజామాబాద్ జిల్లాలోని వేల్పూర్ మండలంలో గల [illegible] గ్రామాలు.(xv) గ్రామపంచాయితీ కార్యాలయాలు-నిజామాబాద్ జిల్లాలోని మోర్తాడ్ మండలంలో గల మోర్తాడ్ [illegible] గ్రామాలు.(xvi) గ్రామపంచాయితీ కార్యాలయం, కమ్మర్ పల్లి గ్రామం మండలం, నిజామాబాద్ జిల్లా. |

పత్రిక ప్రకటన ప్రచురించిన తేది నుండి 30 రోజులలోపు ప్రాజెక్టు ప్రాంత నివాసితులు, పర్యావరణ బృందాలు మరియు ఇతరులు, ప్రజల సమస్యలపై సూచనలు, సలహాలు, అభిప్రాయాలు, వ్యాఖ్యలు మరియు అభ్యంతరాలు ఏమైనా ఉంటే వ్రాతపూర్వకంగా సమర్పించవచ్చు లేదా ఇ-మెయిల్ ee-nzb-tspcb@telangana.gov.in నకు పంపవచ్చును. ఆసక్తి ఉన్నవారు పైన తెలిపిన తేది మరియు వేదిక నందు జరుగు బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొనవచ్చు మరియు ప్రాజెక్ట్ యొక్క సంక్షిప్త నివేదిక (తెలుగు మరియు ఆంగ్లంలో) తెలంగాణా కాలుష్య నియంత్రణ మండలి అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరచబడ్డాయి. ప్రజాభిప్రాయ సేకరణ యొక్క ఈ ప్రకటన EIA నోటిఫికేషన్, 2006 యొక్క అనుబంధం - IV ప్రకారం జారీ చేయబడుతుంది మరియు ఈ ప్రకటన ఖర్చును ప్రాజెక్ట్ ప్రతిపాదికులు భరిస్తారు.
సం/- పర్యావరణ ఇంజనీర్, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయము, నిజామాబాద్.
స్థలము: నిజామాబాద్, తేది:04.07.2024
DIPR R.O. No.1448-PP/CL/ADVT/1/2024-25, తేది. 03.07.2024

## 'హత్రాస్'పై సుప్రీం కోర్టులో పిటిషన్

» ఘటనపై రష్యా అధ్యక్షుడు పుతిన్ సంతాపం

న్యూఢిల్లీ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): హత్రాస్ దారుణంపై దర్యాప్తునకు సుప్రీం కోర్టు రిటైర్డ్ జడ్జి పర్యవేక్షణలో ఐదుగురు సభ్యులతో కూడిన నిపుణుల కమిటీని నియమించాలని కోరుతూ సుప్రీంకోర్టులో బుధవారం ఒక పిటిషన్ దాఖలైంది. న్యాయవాది విశాల్ తివారి ఈ పిటిషన్ వేశారు. తొక్కిసలాట ఘటనపై యథాతథ నివేదికను సమర్పించేలా యూపీ ప్రభుత్వాన్ని ఆదేశించాలని, ఏర్పాట్లలో నిర్లక్ష్యంగా వ్యవహరించి ఘటనకు కారణమైన అధికారులపై చర్యలు చేపట్టాలని కోరారు. పెద్ద సంఖ్యలో ప్రజలు గుమిగూడే సందర్భాల్లో తగు మార్గదర్శకాలు పాటించేలా రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేయాలన్నారు. మరోవైపు, హత్రాస్ ఘటనపై సీబీఐ దర్యాప్తు జరిపించాలని కోరుతూ అలహాబాద్ హైకోర్టులో పిల్ దాఖలైంది. తొక్కిసలాటకు అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఈ పిల్ దాఖలు చేసిన న్యాయవాది గౌరవ్ ద్వివేది పేర్కొన్నారు. కాగా, హత్రాస్ విషాదంపై రష్యా అధ్యక్షుడు పుతిన్ సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీలకు ఆయన ఒక సందేశం పంపించారు.

## అగ్నివీర్ అమరుల పరిహారంపై రాజ్‌నాథ్‌వి అబద్ధాలు

» రాహుల్ గాంధీ ఆరోపణ.. ఖండించిన ఆర్మీ

న్యూఢిల్లీ, జూలై 3: అమరులైన అగ్నివీర్‌ల కుటుంబాలకు పరిహారం విషయమై పార్లమెంట్ సాక్షిగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అబద్ధాలాడారని రాహుల్ గాంధీ మండిపడ్డారు. అందుకు ఆయన క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. 'అమరుడైన ఓ అగ్నివీర్ కుటుంబానికి రూ.కోటి పరిహారం అందించామని రాజ్‌నాథ్ అన్నారు. అయితే తమ కుటుంబానికి ఏ సాయం అందలేదని ఆ అగ్నివీర్ అజయ్ తండ్రే చెప్పారు' అంటూ 'ఎక్స్'లో రాహుల్ ఓ వీడియో షేర్ చేశారు. రాహుల్ ఆరోపణల నేపథ్యంలో ఆర్మీ స్పందించింది. అజయ్ సింగ్ కుటుంబానికి రూ.98 లక్షలు పరిహారంగా చెల్లించినట్లు వెల్లడించింది. 'అగ్నివీర్ స్కీంలోని నిబంధనల మేరకు మరో రూ.67 లక్షల వరకు పరిహారం, ఇతర ప్రయోజనాలు, పోలీసు ధ్రువీకరణ అయిపోగానే సెటిల్ చేస్తాం. దీంతో మొత్తం రూ.1.65 కోట్లు అవుతుంది' అని ఆర్మీ 'ఎక్స్'లో వెల్లడించింది. కాగా, రాహుల్ గాంధీ పార్లమెంటులో ఇటీవల హిందువుల గురించి చేసిన వ్యాఖ్యలపై బిహార్‌లో కేసు నమోదైంది.

## నీట్‌పై నేడు దేశవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్

న్యూఢిల్లీ, జూలై 3: జాతీయ పరీక్ష ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్వహిస్తోన్న పోటీ పరీక్షల్లో అవకతవకలకు నిరసనగా వామపక్ష విద్యార్థి సంఘాలు ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ గురువారం దేశ వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చాయి. నీట్, యూజీసీ నెట్ పరీక్షల్లో అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశాయి. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఇండియా కూటమి పార్టీల విద్యార్థి సంఘాలు బుధవారం ధర్నా చేశాయి. కాగా, నీట్ విషయంలో అబద్ధాలు ప్రచారం చేస్తూ ప్రతిపక్షాలు విద్యార్థులను తప్పుదోవ పట్టిస్తున్నాయని ధర్మేంద్ర ప్రధాన్ ఆరోపించారు. మరోవైపు, నీట్ పేపర్ల లీక్ కేసులో కీలక కుట్రదారుగా ఆరోపిస్తూ అమన్‌సింగ్ అనే వ్యక్తిని జార్ఖండ్‌లోని ధన్‌బాద్‌లో సీబీఐ అరెస్టు చేసింది.

## నీట్ రద్దు చేయాల్సిందే: తమిళ నటుడు విజయ్

చెన్నై, జూలై 3 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు, రాష్ట్ర సిలబస్‌లో చదివిన విద్యార్థులకు నీట్ చేటు కలిగిస్తుందే తప్ప మేలు కలిగించదని, ఇలాంటి పరిస్థితుల్లో ఆ పరీక్షను రద్దు చేయడమే శ్రేయస్కరమని తమిళగ వెట్రి కళగం అధినేత, ప్రముఖ సినీ హీరో విజయ్ పేర్కొన్నారు. నీట్ పరీక్షలు రాష్ట్ర హక్కులకు వ్యతిరేకమైనదని, విద్యను మునుపటిలా రాష్ట్రాల జాబితాలోనే చేర్చాలని డిమాండ్ చేశారు. ఒకే దేశం, ఒకే సిలబస్, ఒకే పరీక్ష అనే సిద్ధాంతం రాష్ట్ర హక్కులకు వ్యతిరేకమే కాకుండా విద్యార్థి లోకానికి తీరని ముప్పు కలిగిస్తుందన్నారు. రాష్ట్రాలకు సంబంధించిన సిలబస్‌తో చదివే విద్యార్థులకు కేంద్ర సిలబస్‌తో కూడిన పరీక్షలు నిర్వహించడం న్యాయమేనా అని ప్రశ్నించారు.

## నాలుగు నెలలకోసారి ప్రజ్వల్ హెచ్ఐవీ టెస్ట్

బెంగళూరు, జూలై 3(ఆంధ్రజ్యోతి): పలువురు మహిళలపై లైంగిక దౌర్జన్యాల కేసులో అరెస్టైన జేడీఎస్ మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ వ్యవహారాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. ప్రజ్వల్ ప్రతి నాలుగు నెలలకోసారి హెచ్ఐవీ టెస్టులు చేయించుకునేవాడని సిట్ విచారణలో వెలుగు చూసినట్లు తెలిసింది. ఎక్కువ మంది మహిళలతో లైంగిక చర్యల్లో పాల్గొన్నందుకే ఇలా హెచ్ఐవీ టెస్టులు చేయించుకున్నాడని భావిస్తున్నారు. లైంగిక దాడుల వ్యవహారంలో ప్రజ్వల్‌పై నాలుగు కేసులు నమోదయ్యాయి. హాసన్ జిల్లా హొళెనరసీపురలోని నివాసంలో పలువురు మహిళలతో లైంగిక చర్యలలో పాల్గొని.. మొబైల్‌లో చిత్రీకరించుకున్నట్టు సిట్ విచారణలో నిర్ధారణ అయింది. హెచ్ఐవీ పరీక్షలు చేయించుకోవడం లైంగిక దాడుల కేసులకు బలమైన సాక్ష్యం కానుంది. కాగా.. అసహజ శృంగారం, లైంగిక వేధింపుల కేసులో జైల్లో ఉన్న ప్రజ్వల్ సోదరుడు సూరజ్ రేవణ్ణ జ్యుడీషియల్ కస్టడీని కోర్టు ఈ నెల 18 వరకు పొడిగించింది.

## కుర్తాళం పీఠాధిపతికి అస్వస్థత



చెన్నై, జూలై 3 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని తెన్‌కాశి జిల్లా కుర్తాళంలో ఉన్న శ్రీ సిద్ధేశ్వరి పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి(88) అనారోగ్యంతో చెన్నైలోని కావేరి ఆసుపత్రిలో చేరారు. ఛాతినొప్పితో మంగళవారం ఆసుపత్రిలో చేరిన ఆయనకు కరోనరీ యాంజియోగ్రఫీ నిర్వహించిన వైద్యులు.. ఎలక్టివ్ యాంజియోప్లాస్టీ చికిత్స అందించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం స్థిరంగా ఉందని వైద్యులు ప్రకటించారు. కాగా వైద్యుల పర్యవేక్షణలో విశ్రాంతి తీసుకుంటున్న సిద్ధేశ్వరానందను కలుసుకునేందుకు భక్తులెవ్వరూ ప్రయత్నించవద్దని పీఠం నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

## వైఫై సేవలను పునరుద్ధరించండి: రైల్వే బోర్డు

న్యూఢిల్లీ, జూలై 3: వివిధ రైల్వే స్టేషన్లలో కొన్ని కారణాల వల్ల వైఫై సేవలు నిలిచిపోయాయని సమస్యను గుర్తించి తక్షణమే ఇంటర్‌నెట్ సేవలను పునరుద్ధరించాలని రైల్వే బోర్డు కోరింది. ఈ మేరకు 17 జోన్ల జనరల్ మేనేజర్ల(సిగ్నల్, టెలికమ్యూనికేషన్)కు బుధవారం లేఖ రాసింది. "దేశంలో 6,108 రైల్వేస్టేషన్లలో ప్రయాణికులకు ఉచిత వైఫై సేవలు కొనసాగుతున్నాయి. అయితే చాలా స్టేషన్లలో జరుగుతున్న నిర్మాణ పనులు, నాసిరకం పరికరాలు వంటి కారణాల వల్ల వైఫై సేవలకు అంతరాయం కలిగింది. దీంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. సమస్యను గుర్తించి త్వరగా పరిష్కరించండి" అని బోర్డు లేఖలో పేర్కొంది. అలాగే ప్రతివారం ఈ మేరకు నివేదిక సమర్పించాలని కోరింది.

## ఆడ్వాణికి అస్వస్థత.. ఢిల్లీలోని అపోలోలో చికిత్స

న్యూఢిల్లీ, జూలై 3: బీజేపీ కురువృద్ధుడు, మాజీ ఉప ప్రధాని లాల్‌కృష్ణ ఆడ్వాణీ అస్వస్థతకు గురయ్యారు. బుధవారం రాత్రి 9 గంటలకు ఆయన్ను న్యూఢిల్లీలోని అపోలో ఆస్పత్రికి తరలించారు. డాక్టర్ వినీత్ ఆధ్వర్యంలోని ప్రత్యేక వైద్య బృందం ఆయనకు చికిత్స అందిస్తోంది. ఆడ్వాణి ఆరోగ్యం నిలకడగా ఉందని ఆస్పత్రి వైద్యులు పేర్కొన్నారు. 96 ఏళ్ల ఆడ్వాణి వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నారు. ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తడంతో జూన్ 26 ఆయన్ను ఎయిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. మూత్ర, హృదయ సంబంధ వైద్యులు సహా పలువురు స్పెషలిస్టు ఆయనకు చికిత్స అందించి మరుసటి రోజే డిశ్చార్జి చేశారు.

## కంగనాపై చెయ్యి చేసుకున్న కానిస్టేబుల్ బదిలీ

న్యూఢిల్లీ, జూలై 3: చండీగఢ్ విమానాశ్రయంలో నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్‌పై చెయ్యి చేసుకున్న సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ కుల్విందర్‌కౌర్‌కు ఊరట లభించింది. ఆమె బెంగళూరు సీఐఎస్ఎఫ్ 10వ రిజర్వ్ బెటాలియన్‌కు బదిలీ అయ్యారు. రైతు ఉద్యమాన్ని కంగనా కించపరిచారంటూ కౌర్ ఆమెను చెంప దెబ్బకొట్టారు. జూన్ 6న ఈ ఘటన జరగ్గా..ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదైంది. తర్వాత సెంట్రల్ ఆర్మ్‌డ్ ఫోర్స్ కౌర్‌పై సస్పెన్షన్ వేటు వేసింది. ఆమెను బెంగళూరుకు బదిలీ చేసినప్పటికీ విచారణ కొనసాగిస్తామని ఓ ఉన్నతాధికారి చెప్పారు.

## బిహార్‌లో కూలిన మరో బ్రిడ్జి

» 15 రోజుల్లో ఏడు...!



పట్నా, జూలై 3 : బిహార్ రాష్ట్రంలో బ్రిడ్జిలు వరుసగా కూలుతూనే ఉన్నాయి. తాజాగా ఈ రాష్ట్రంలోని సివాన్ జిల్లాలో గండకి నదిపై ఉన్న బ్రిడ్జిలో కొంతభాగం బుధవారం ఉదయం కూలిపోయింది. దీంతో 15 రోజుల్లో ఏడు బ్రిడ్జిలు కూలినట్లయ్యింది. దేవ్‌రియా బ్లాక్‌లో మహరాజ్‌గంజ్‌ని పలు గ్రామాలతో అనుసంధానం చేసే బ్రిడ్జి ఇది. అయితే అదృష్టవశాత్తు ఈ ఘటనలో ఎవరికీ ఏమీ కాలేదు. సివాన్ జిల్లాలో 11 రోజుల్లో ఇది రెండో ఘటన. 1982-83 మధ్య కట్టిన ఈ బ్రిడ్జికి కొద్ది రోజులుగా మరమ్మతులు జరుగుతున్నాయని చెప్పారు. అయితే ఆ ప్రాంతంలో భారీ వర్షాలు పడుతుండడంతో గండకి నదిలోకి వరద వచ్చి బ్రిడ్జి బలహీన పడివుండవచ్చని స్థానికులు చెబుతున్నారు.

# భోలే బాబా పరార్!

(మొదటి పేజీ తరువాయి)

ఆయన ఇంకా ఆశ్రమంలోనే ఉన్నారని చెబుతున్నారు. పోలీసుల మాట ఇలా ఉండగా.. తన సత్సంగానికి వచ్చి దుర్మరణంపాలైనవారి కుటుంబాలకు సంతాపం తెలుపుతూ భోలే బాబా ఒక ప్రకటన విడుదల చేశారు. ఫుల్‌రాయ్‌లో సత్సంగానికి తాను వచ్చి వెళ్లిపోయాక కొంతమంది సంఘవిద్రోహ శక్తుల కారణంగా అక్కడ జరిగిన తొక్కిసలాటపై.. తన తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది ఏపీసింగ్ చట్టపరమైన చర్యలు తీసుకుంటారని అందులో పేర్కొన్నారు. ఈ ఘటనపై యూపీ పోలీసులు బుధవారం నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో కూడా భోలే బాబా పేరు లేకపోవడం గమనార్హం. బాధితులు ఇచ్చిన ఫిర్యాదులో ఆయన పేరున్నా.. కేవలం నిర్వాహకుల పేరునే పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పొందుపరిచారు. సత్సంగానికి అనుమతి తీసుకునేటప్పుడు.. 2 లక్షల మందికి పైగా భక్తులు ఈ కార్యక్రమానికి వస్తారని తెలిసినా 80 వేల మంది మాత్రమే వస్తారని పేర్కొంటూ అనుమతి తీసుకున్నారని, భక్తుల సంఖ్యను తక్కువగా చూపించడానికి వారి చెప్పులు, ఇతర వస్తువులను పక్కనున్న పొలాల్లోకి విసిరేశారని, సాక్ష్యాలను దాచే ప్రయత్నం చేశారని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. బాబా వెళ్లిపోయే సమయంలో ఆయన వాహనాల టైరు కింద ధూళి తీసుకునేందుకు కొందరు కిందికి వంగారని, అదే సమయంలో వెనక నుంచి మరికొందరు ఆ ధూళి కోసం ఎగబడడంతో కిందకు వంగినవారంతా నలిగిపోయారని పేర్కొన్నారు. అదేసమయంలో.. బయటకు వెళ్లడానికి ప్రయత్నించిన భక్తులను లాఠీలు ధరించి ఉన్న బాబా భద్రతా సిబ్బంది ఆపేశారని.. ఆ సమయంలో తొక్కిసలాట జరిగి చాలా మంది మహిళలు, పిల్లలు కిందపడిపోయారని.. భక్తులంతా తోసుకుని ముందుకు రావడంతో వారు పైకి లేచే అవకాశం లభించక చనిపోయారని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఈ దుర్ఘటనలో.. పోలీసులు, అధికార యంత్రాంగం తప్పు ఎంతమాత్రం లేదని క్లీన్‌చిట్ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన భోలే బాబా ముఖ్య సేవాదార్ దేవప్రకాశ్ మధుకర్, ఇతర నిర్వాహకులపై.. భారతీయ న్యాయసంహితలోని 105, 110, 126 (2), 223, 238 సెక్షన్ల కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి భోలే బాబాపై పోలీసులు కేసు నమోదు చేయకున్నా.. ఆయనపై గతంలో లైంగిక దాడి, భూకబ్జా సహా పలు కేసులు నమోదయ్యాయి. కాన్పూర్‌లోని బిధ్నూ ప్రాంతంలో ఉన్న కర్సుయి గ్రామంలో ఆయనపై భూకబ్జా కేసు నమోదైంది. 1997 దాకా పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా పనిచేసిన ఆయనపై లైంగిక దాడి కేసు కూడా నమోదైంది. ఆ కేసులో ఆయన కొన్నాళ్లపాటు జైలు జీవితం కూడా గడిపారు. ఆ తర్వాత ఉద్యోగానికి రాజీనామా చేసి బాబా అవతారం ఎత్తారు. సంతానం లేని భోలే బాబా.. తన సమీప బంధువు కుమార్తెను దత్తత తీసుకున్నారు. అయితే, ఆ పాప 2000 సంవత్సరంలో క్యాన్సర్‌తో చనిపోయింది. ఆమెను బతికిస్తానంటూ కొద్దిసేపు ఏదో ప్రయత్నాలు చేశారాయన. కానీ అవి ఫలించలేదు. దీంతో పోలీసులు అప్పట్లో భోలే బాబాపైన, ఆయన అనుచరులపైన డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమెడీస్ యాక్ట్ కింద కేసు పెట్టారు. అయితే, సాక్ష్యాలు సరిగ్గా లేకపోవడంతో కోర్టు వారిపై కేసును కొట్టేసింది. కొవిడ్ సమయంలో.. ఫరూఖాబాద్‌లో 50 మందితో సత్సంగం నిర్వహిస్తానంటూ అధికారుల నుంచి అనుమతి తీసుకుని.. 50 వేల మందితో నిర్వహించిన ఘనత భోలే బాబాది!





మెయిన్‌పురిలో భోలే బాబా ట్రస్ట్ ఎదుట పోలీసులు, ట్రస్ట్ గోడకు బుధవారం ఓ మహిళ ప్రార్థన

### యోగి పరామర్శ..

హత్రాస్ దుర్ఘటనలో మృతుల సంఖ్య 121కి పెరిగింది. మృతుల్లో 108 మందికిపైగా మహిళలు, ఏడుగురు చిన్నారులు ఉన్నారు. ఎక్కువమంది ఊపిరాడక చనిపోయారని ఎటా జిల్లా అదనపు ప్రధాన వైద్య అధికారి డాక్టర్ రామ్‌మోహన్ తివారీ తెలిపారు. మరోవైపు.. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబసభ్యులు ఆయా ఆస్పత్రుల వద్దకు చేరుకుని.. ఫోన్‌లో తమవారి ఫొటోలు చూపిస్తూ, వారి మృతదేహాలు ఎక్కడున్నాయో ఆరా తీస్తున్నారు. కాగా.. యూపీ సీఎం యోగి ఈ దుర్ఘటనపై హైకోర్టు రిటైర్డ్ జడ్జితో విచారణ జరిపించనున్నట్టు ప్రకటించారు. పోలీసు శాఖలో పనిచేసి రిటైరైనవారిని కూడా ఈ విచారణలో భాగం చేస్తామని తెలిపారు. ఈ విషాదానికి బాధ్యులెవరో గుర్తించడంతోపాటుదీని వెనుక కుట్ర కోణాన్నీ దర్యాప్తు చేయిస్తామని, దీనికి కారకులైనవారిపై కఠినచర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. హత్రాస్‌లో జరిగిన తొక్కిసలాటలో గాయపడ్డవారిని ఎటా జిల్లా ఆస్పత్రిలో బుధవారం ఆయన పరామర్శించారు. భోలే బాబా పేరును ఎఫ్ఐఆర్‌లో ఎందుకు చేర్చలేదని విలేకరులు ప్రశ్నించగా.. నిబంధనల ప్రకారం ప్రాథమికంగా ఈ సత్సంగ్ నిర్వహణకు అనుమతులు అడిగినవారిపై కేసు నమోదు చేశామని, క్రమంగా ఈ ప్రమాదానికి బాధ్యులైనవారందరిపైనా కేసు పెడతామని ఆయన స్పష్టం చేశారు. బాధితులను పరామర్శించిన అనంతరం ఆయన ఘటనాస్థలికి చేరుకుని ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఇక.. యూపీ గవర్నర్ ఆనందీబెన్ పటేల్ ఈ ఘటనపై విచారణకు ముగ్గురు సభ్యుల కమిషన్‌ను నియమించారు.

### భోలే బాబా.. రూటే వేరు!



భోలే బాబా అసలు పేరు సూరజ్ పాల్ జాతవ్. యూపీలోని కాస్‌గంజ్ తహశీల్ బహదూర్‌నగర్ గ్రామంలో ఒక సంపన్న దళిత కుటుంబంలో జన్మించిన ఆయన.. సగటు స్వామీజీల్లాగా కాషాయం, రుద్రాక్షమాలల వంటివాటిని ధరించరు. తెల్లచొక్కా, తెల్ల ప్యాంటు, స్నీకర్స్ బూట్లు, తెల్ల టోపీ.. ఒక్కోసారి మాంచిగా ఇన్‌షర్ట్ చేసి టై కూడా ధరించి టిప్‌టాప్‌గా తయారై సత్సంగాలకు వచ్చి ప్రవచనాలు చెబుతుంటారు. మన తెలుగు రాష్ట్రాల్లో పేరొందిన ఓ స్వామీజీలాగా.. భోలే బాబా కూడా తరచుగా తన భార్యతో కలిసి 'మానవ్ మంగళ్ మిలన్ సద్భావన సమాగమ్' పేరిట సత్సంగాలు నిర్వహిస్తుంటారు. ఆధ్యాత్మిక గురువుగా అవతారం ఎత్తిన తొలినాళ్లలో స్వగ్రామంలో తనకున్న 18.5 ఎకరాల భూమిలో ఒక ఆశ్రమాన్ని ప్రారంభించి బోధలు చేసేవారు. క్రమంగా వచ్చే భక్తుల సంఖ్య పెరగడంతో మెయిన్‌పురికి మకాం మార్చారు. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్.. ఇలా పలు రాష్ట్రాల నుంచి భోలే బాబాను చూడ్డానికి, ఆయన పాద ధూళిని నుదుటన ధరించడానికి భక్తులు లక్షలాదిగా వస్తుంటారు. ఆయనకున్న భక్తజనసందోహం సంఖ్య కారణంగా.. ఎన్నికల ప్రచార సమయంలో పలు పార్టీల అధినేతలు సైతం ఆయన్ను కలిసేంతగా భోలే బాబా ఖ్యాతి పెరిగిపోయింది. "జాతవ్ సామాజిక వర్గానికి చెందిన భోలే బాబాకు ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాల్లో లక్షల్లో భక్తులు ఉన్నారు" అని యూపీకి చెందిన పోలీసు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

### లోకం తీరు



## బాబా సిబ్బంది తోసేశారు

» బురద నేలపై పరుగెత్తి జనం జారిపడ్డారు

» హత్రాస్ తొక్కిసలాటకు ప్రధాన కారణాలివే

» సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ నివేదిక

హత్రాస్, జూలై 3: "భోలే బాబా వెళ్లిపోతున్నారు. ఆయన కారు వెళ్లిన దారిలో ధూళి అయినా తీసుకోవాలి" అనే మూఢ భక్తితో ఎగబడిన భక్తులను బాబా భద్రతా సిబ్బంది తోసేయడం.. వానపడి అక్కడి నేలంతా బురద బురదగా ఉండి జారుతుండడం.. హాథ్రస్‌లో తొక్కిసలాటకు కారణమయ్యాయి! 121 మందిని బలిగొన్న ఈ తొక్కిసలాటపై.. సికంద్రరావు సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ జిల్లా కలెక్టర్‌కు ఇచ్చిన ప్రాథమిక నివేదికలో వెల్లడించిన వివరాలివి. ఈ దుర్ఘటన జరిగినప్పుడు తాను అక్కడే ఉన్నానని ఆయన తన నివేదికలో పేర్కొన్నారు. "సత్సంగం జరిగిన చోట దాదాపు 2 లక్షల మంది ఉన్నారు. మంగళవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో భోలేబాబా అక్కడికి చేరుకున్నారు. దాదాపు గంటసేపు సత్సంగం జరిగింది. ఆ తర్వాత.. 1.40 గంటల సమయంలో భోలే బాబా 'ఎటా'కు వెళ్లేందుకు బయటకు వచ్చారు. దీంతో ఆయన్నను దగ్గర్నుంచీ చూసి.. ఆయన పాద ధూళి తీసుకునేందుకు, ఆశీర్వాదం తీసుకునేందుకు భక్తులు పరుగులు తీశారు. ఆయన వాహనంలో వెళ్లిపోతుంటే.. దాని వెనకాల పరుగులు తీశారు. దీంతో బాబా వ్యక్తిగత భద్రతా సిబ్బంది (బ్లాక్ కమెండోలు), సేవాదార్లు వారిని వెనక్కి తోసేయడం మొదలుపెట్టారు. దీంతో వెనకాల ఉన్న కొంత మంది కింద పడిపోయారు. దీంతో.. వెనుక ఉన్నవారు భయాందోళలకు గురై బయటకు వెళ్లడానికి ప్రయత్నించారు. కానీ అక్కడ నేల బురదగా, వాలుగా ఉండడంతో చాలా మంది కిందపడిపోయారు. వారు పైకి లేచేలోపే వెనక నుంచి పెద్ద ఎత్తున జనం వచ్చి వారిని తొక్కుకుంటూ వెళ్లిపోయారు" అని ఆయన తన నివేదికలో వివరించారు.

## తొలిసారి 'విపక్షం'లో బీజేడీ

» రాజ్యసభలో ప్రభుత్వంపై విమర్శలు

న్యూఢిల్లీ, జూలై 3: గత పదేళ్లలో తటస్థంగా, అవసరమైనప్పుడు ఎన్డీయేకి అనుకూలంగా వ్యవహరించిన బిజూ జనతాదళ్ (బీజేడీ) బుధవారం ప్రతిపక్ష పాత్ర దరించింది. మిగతా విపక్షాలతో కలిసి అధికార పక్షంపై విమర్శలు గుప్పించింది. ఇటీవలి ఒడిసా అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో.. 24 ఏళ్ల సుదీర్ఘంగా పాలించిన ఆ పార్టీ ఓటమి పాలైంది. లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క సీటైనా గెలవలేదు. ఇంతకాలం పార్లమెంటులో కీలక బిల్లులకు మద్దతిచ్చిన ఆ పార్టీకి రాజ్యసభలో 9 మంది సభ్యులు ఉన్నారు. బుధవారం ప్రధాని మోదీ ప్రసంగాన్ని బహిష్కరించి ఇతర విపక్షాలతో పాటు వారు వాకౌట్ చేశారు. తమ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వడం లేదని.. ఖనిజాలపై రాయల్టీ పెంచడం లేదని ఆ పార్టీ నేత సస్మిత్ పాత్రా ఆరోపించారు. మరోవైపు, విపక్షాలపై ఏపీకి చెందిన వైసీపీ మండిపడింది. రాజ్యసభలో ఆ పార్టీకి 11 మంది సభ్యులు ఉన్నారు. విపక్షాల ఆందోళనకు వారు దూరంగా ఉన్నారు. ప్రధాని ప్రసంగించేటప్పుడు లోక్‌సభలో ఆందోళనలు చేయడాన్ని ఆ పార్టీ నేత విజయసాయి రెడ్డి ఖండించారు.

## సుధామూర్తికి ప్రధాని ప్రశంస



న్యూఢిల్లీ, జూలై 3: రాజ్యసభలో తొలి ప్రసంగం చేసిన నామినేటెడ్ ఎంపీ, పారిశ్రామిక వేత్త, రచయిత్రి సుధామూర్తిని ప్రధాని మోదీ ప్రశంసించారు. ఆమె దేశ సమకాలీన సమస్యలను ప్రస్తావించారని కొనియాడారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకు బుధవారం ఆయన సమాధానమిస్తూ సుధామూర్తి లేవనెత్తిన అంశాలను ప్రస్తావించారు. ఇందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. సర్వికల్ కేన్సర్‌పై పోరుకు ప్రభుత్వం ప్రత్యేక వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టాలని మంగళవారం ఆమె సూచించారు. పాశ్చాత్య దేశాల్లో గత 20 ఏళ్లగా 9-14 ఏళ్ల బాలికలకు సర్వైకల్ వ్యాక్సిన్ ఇస్తున్నారని చెప్పారు. మన దేశంలో కూడా బాలికలకు వ్యాక్సినేషన్ చేపట్టాలన్నారు. ఆ వ్యాక్సిన్ రూ.1,400కు లభిస్తోందని.. ప్రభుత్వం జోక్యం చేసుకుని కంపెనీలతో మాట్లాడితే రూ.700-800కి తగ్గించవచ్చన్నారు. అలాగే దేశీయ పర్యాటక రంగాన్ని ప్రోత్సహించాలని సుధామూర్తి సూచించారు. ధరల పెరుగుదల, నిరుద్యోగం, రైతుల ఆత్మహత్యలు, మహిళల సమస్యల గురించి కూడా ఆమె ప్రస్తావించారు.

## రాహుల్ ఇంటి వద్ద భద్రత పెంపు

న్యూఢిల్లీ, జూలై 3 : కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ నివాసం వద్ద భద్రతను ఢిల్లీ పోలీసులు పెంచారు. పారామిలటరీ బలగాలు, పోలీసు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఢిల్లీలోని ఆయన నివాసం వద్ద ఆందోళనలు జరిగే అవకాశాలున్నాయన్న నిఘా వర్గాల సమాచారం మేరకు ఈ చర్యలు తీసుకున్నట్టు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. రాహుల్ గాంధీ ఇప్పటికే జడ్ ప్లస్ ఎల్ కేటగిరీ సెక్యూరిటీలో ఉంటున్నారు. బీజేపీ, ఆరెస్సెస్‌పై లోక్‌సభలో సోమవారం రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు వివిధ వర్గాలను ఆగ్రహానికి గురి చేశాయి. కాగా, రాహుల్ గాంధీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీ బీజేపీ నేతలు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు బుధవారం ఆందోళనకు దిగారు.

# అందుకే ఓడించారు

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. అలాంటి వారే ఇలాంటి ప్రకటనలు చేస్తారని దుయ్యబట్టారు. భారతీయ జనతా పార్టీకి రాజ్యాంగం కేవలం అధికరణల సంకలనం కాదని, అది ఒక స్ఫూర్తి అని మోదీ చెప్పారు. ఎమర్జెన్సీలో రాజ్యాంగాన్ని కాంగ్రెస్ పలుమార్లు అవమానించిందని, అనేక సవరణలు చేశారని, అసలు కాంగ్రెస్‌కు రాజ్యాంగమంటే గౌరవమే లేదని చెప్పారు. పశ్చిమబెంగాల్‌లో ఒక మహిళను బహిరంగంగా హింసించినప్పుడు, సందేశ్‌ఖాలీలో లైంగిక దాడులు జరిగినప్పుడు ప్రతిపక్షాలు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్‌ది ఓబీసీ వ్యతిరేక ప్రవర్తన అని, ఓడిపోయే సందర్భాల్లోనే దళితులను పోటీ చేయిస్తుందని ఆయన ఆరోపించారు. ఈ ఎన్నికల్లో మల్లికార్జున ఖర్గే ఎంతో శక్తిమంతంగా పనిచేశారని, బాగా కష్టపడ్డారని, అయినా ఓటమికి నిందను ఆయనే భరించాల్సి వచ్చిందని అన్నారు. ఒక కుటుంబం సురక్షితంగా ఉండేందుకు దళితులు, బీసీలు నిందను భరించాల్సి వస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ దశలో కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే లేచి మాట్లాడేందుకు ప్రయత్నించారు. పలుమార్లు అభ్యర్థించినప్పటికీ రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ఆయనకు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వకపోవడంతో ఇండియా కూటమి సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ఖర్గేకు అవకాశం ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. నినాదాల మధ్యే మోదీ ప్రసంగం కొనసాగించడంతో ప్రతిపక్ష సభ్యులందరూ వాకౌట్ చేశారు. మోదీ అబద్ధాలు చెబుతున్నారని, తాము నిజాలు చెప్పేందుకు ప్రయత్నిస్తుంటే మాట్లాడేందుకు అనుమతించలేదని ఖర్గే మీడియాకు చెప్పారు.



మోదీ ప్రసంగిస్తుండగానే సభ నుంచి వెళ్లిపోతున్న విపక్ష ఎంపీలు



### ప్రతిపక్షాల తీరుపై ధన్‌ఖడ్ ఆగ్రహం

ప్రతిపక్ష నేతల తీరుపై రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి మాట్లాడుతుంటే వాకౌట్ చేయడం ప్రమాదకరమైన సంప్రదాయమన్నారు. ప్రతిపక్ష సభ్యులు రాజ్యాంగాన్ని అవమానించడమే కాకుండా సవాలు చేశారని, వారు చేసిన ప్రమాణాన్ని వారే కించపరిచారని ఆయన వ్యాఖ్యానించారు. రాజ్యాంగాన్ని అపహాస్యం చేశారని, ఇప్పటికైనా వారు ఆత్మపరిశీలన చేసుకోవాలని అన్నారు.

### వారికి నిజాలు వినే శక్తి లేదు

ప్రతిపక్షాలు వాకౌట్ చేయడాన్ని మోదీ తీవ్రంగా విమర్శించారు. అబద్ధాలు ప్రచారం చేసే వారికి నిజాలను వినే శక్తి ఉండదన్న విషయం ప్రజలు గమనిస్తున్నారన్నారు. వారు పెద్దల సభను, సభ మహోన్నత సంప్రదాయాన్ని అవమానపరిచారని తెలిపారు. ఎన్డీయేకు పట్టం కడుతూ 140 కోట్ల మంది భారతీయులు ఇచ్చిన తీర్పును వారు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. అతి సున్నితమైన మణిపూర్ సమస్యను ప్రతిపక్షాలు రాజకీయం చేస్తున్నాయని మోదీ విరుచుకుపడ్డారు. మణిపూర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొల్పేందుకు తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఇప్పటికే అక్కడ హింస తగ్గిందని, అనేక ప్రాంతాల్లో పాఠశాలలు కూడా తెరిచారని చెప్పారు. గతంలో మణిపూర్‌లో పది సార్లు పైగా రాష్ట్రపతి పాలనను విధించారని గుర్తుచేశారు. మణిపూర్ సమస్యను రాజేసిన వారే దాన్ని విస్మరించారని, ఏదో ఒకరోజు మణిపూర్ వారిని కచ్చితంగా తిరస్కరిస్తుందని మోదీ చెప్పారు. మణిపూర్‌లో సామాజిక సంఘర్షణలు ఎప్పటినుంచో జరుగుతున్న విషయం చరిత్ర తెలిసిన వారికి అర్థమవుతుందని, ఈ సంఘర్షణలు లోతుగా ఉన్నాయన్న వాస్తవాన్ని ఎవరూ విస్మరించలేరని ఆయన అన్నారు. సుదీర్ఘకాలం పాలించిన కాంగ్రెస్ హయాంలోనే సమస్య ఏర్పడిందన్న విషయం మరిచిపోరాదని చెప్పారు. మణిపూర్ కల్లోలం ఎన్డీయే హయాంలో ప్రారంభమైంది కాదని గుర్తుచేశారు. శాంతిని పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తున్నామని, హోంమంత్రి అమిత్ షా అక్కడ ఎన్నో రోజులు ఉన్నారని తెలిపారు. మణిపూర్‌లో అగ్నికి ఆజ్యం పోయడం సరి కాదని, రాజకీయాలకు అతీతంగా ఎదగాలని ఆయన కాంగ్రెస్‌కు హితవు పలికారు. కాగా, సీబీఐ పంజరంలో చిలుక లాంటిదని కాంగ్రెస్ హయాంలోనే సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిందని మోదీ గుర్తుచేశారు. కానీ, తాను అవినీతికి వ్యతిరేకంగా చర్యలు తీసుకునేందుకు దర్యాప్తు సంస్థలకు పూర్తి స్వేచ్ఛనిచ్చానని చెప్పారు. దేశ యువత భవిష్యత్తుతో ప్రతిపక్షాలు రాజకీయంగా ఆటలు ఆడుతున్నాయన్నారు. నీట్ ప్రశ్నపత్రాల లీక్ బాధ్యులను కఠినంగా శిక్షిస్తామని ఆయన పునరుద్ఘాటించారు. ప్రధాని ప్రసంగం తర్వాత చైర్మన్ సభను నిరవధికంగా వాయిదా వేశారు.

## 132 సీట్ల బస్సు

» విమానం తరహాలో సౌకర్యంగా సీట్లు

» అందులో 'బస్ హోస్టెస్' సేవలు కూడా

» పైలట్ ప్రాజెక్టుపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ



న్యూఢిల్లీ, జూలై 3: ప్రజారవాణా వ్యయాన్ని తగ్గించడంతో పాటు కాలుష్య రహిత ఇంధన వనరులతో నడిచేలా.. విమానం తరహాలో 132 సీట్లతో కూడిన పొడవైన బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నామని కేంద్ర మంత్రి గడ్కరీ పేర్కొన్నారు. దీనిలో విమానంలో ఎయిర్‌హోస్టెస్ మాదిరిగా 'బస్ హోస్టెస్' ఉంటారని, దీనికి సంబంధించి నాగపూర్‌లో పైలట్ ప్రాజెక్టు చేపడుతున్నామని తెలిపారు. 'ఈ మధ్య నేను చెక్ రిపబ్లిక్ వెళ్లినప్పుడు అక్కడ మూడు బస్సులను కలిపి ట్రాలీ బస్సుగా ఏర్పాటు చేయడం చూశాను. ఇక్కడ కూడా ఇలాంటి పొడవైన బస్సులు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు టాటా సహకారంతో నాగపూర్‌లో పైలట్ ప్రాజెక్టును చేపట్టాం. 132 మంది కూర్చునే విధంగా ఎలక్ట్రిక్ బస్సును రూపొందిస్తున్నాం. దీనికి 40 కి.మీ.కి ఒకసారి చార్జింగ్ పెట్టుకోవాలి. 40 సెకన్లపాటు చార్జింగ్ పెడితే చాలు మరో 40 కి.మీ. ప్రయాణించవచ్చు. నిర్వహణ ఖర్చుకూడా కి.మీ.కి రూ.35 నుంచి రూ.40 మాత్రమే అవుతుంది' అని గడ్కరీ పేర్కొన్నారు.

### విమానం తరహాలో సీటింగ్..

ఈ బస్సులో విమానం తరహాలో సీటింగ్, ఏసీ, సీటు ముందు ల్యాప్‌టాప్ పెట్టుకునే సౌలభ్యం ఉండాలని సూచించాను. ఇందులో 'బస్ హోస్టెస్' ఉంటారు. డీజిల్ బస్సుతో పోలిస్తే దీని నిర్వహణ ఖర్చు 30 శాతం తగ్గుతుందని భావిస్తున్నాం. సోలార్ పవర్‌ను వినియోగిస్తే ఈ ఖర్చు మరింత తగ్గుతుంది' అని గడ్కరీ అన్నారు. ట్రాక్టర్ తయారీదారులు కూడా ఇథనాల్, మిథనాల్, సీఎన్జీతో యంత్రాల తయారీపై దృష్టిపెట్టారని చెప్పారు.

## ఝార్ఖండ్ సీఎంగా మళ్లీ హేమంత్ సోరెన్



రాంచీ, జూలై 03: ఝార్ఖండ్ రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. సీఎం పదవికి చంపయ్ సోరెన్ రాజీనామా చేయగా, జేఎంఎం కార్యనిర్వాహక అధ్యక్షుడు హేమంత్ సోరెన్ మరోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. బుధవారం రాంచీలోని చంపయ్ నివాసంలో సమావేశమైన కూటమి(జేఎంఎం, కాంగ్రెస్, ఆర్జేడీ) ఎమ్మెల్యేలు.. సీఎంగా హేమంత్ మరోసారి పగ్గాలు చేపట్టాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. దాంతో చంపయ్ సోరెన్ గవర్నర్‌కు రాజీనామా సమర్పించారు. అయితే, రాజీనామాను చంపయ్ అవమానంగా భావిస్తున్నట్లు తెలిసింది. దీంతో ఆయన్ను జేఎంఎం కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమించాలని భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. మరోవైపు ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని గవర్నర్‌ను హేమంత్ కోరారు.

## నేడు విద్యాసంస్థల బంద్ నేపథ్యంలో ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు సెలవు

హైదరాబాద్ సిటీ, జూలై 3(ఆంధ్రజ్యోతి): నీట్ నిర్వహణలో జరిగిన అక్రమాలను నిరసిస్తూ యువజన, విద్యార్థి సంఘాలు బంద్‌కు పిలుపునివ్వడంతో గురువారం పలు ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు యాజమాన్యాలు సెలవు ప్రకటించాయి. కేజీ నుంచి పీజీ విద్యా సంస్థల వరకు అన్నింటినీ మూసివేసి బంద్‌కు సహకరించాలని విద్యార్థి సంఘాలు కోరడంతో జేఎన్‌టీయూ పరిధిలోని కొన్ని అటానమస్ ఇంజనీరింగ్ కళాశాల్లో గురువారం జరగాల్సిన సప్లిమెంటరీ పరీక్షలను కూడా వాయిదా వేశాయి. అయితే శుక్రవారం నుంచి జరగాల్సిన పరీక్షలు యథావిధిగా జరుగుతాయని, వాయిదా పడిన పరీక్షలను మళ్లీ ఎప్పుడు నిర్వహిస్తామన్నది త్వరలోనే ప్రకటిస్తామని విద్యార్థులకు, తల్లిదండ్రులకు వాట్సాప్ ద్వారా ఆయా కళాశాలలు సమాచారం అందించాయి. కాగా, విద్యార్థి సంఘాలు బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో తమ పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ హైదరాబాద్ జిల్లా ప్రతినిధులు తెలిపారు.

## నేటి నుంచి ఎప్‌సెట్ కౌన్సెలింగ్

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇంజనీరింగ్ సీట్ల భర్తీకి సంబంధించిన ఎప్‌సెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభం కానుంది. తొలుత నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం గతనెల 27నే కౌన్సెలింగ్ ప్రారంభం కావాల్సి ఉంది. అయితే రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల పరిధిలోని ప్రైవేట్ కళాశాలలకు అఫిలియేషన్ ఇచ్చే ప్రక్రియ కొలిక్కి రాకపోవడంతో కౌన్సెలింగ్‌ను వాయిదా వేశారు. తాజాగా సాంకేతిక విద్యాశాఖ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం.. మూడు దశల్లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. తొలిదశలో భాగంగా జూలై 4 నుంచి 12వ తేదీ వరకు అభ్యర్థులు ఆన్‌లైన్ స్లాట్ బుక్ చేసుకుని ఫీజు చెల్లించాలి. తర్వాత జూలై 6 నుంచి 13 మధ్య ధ్రువపత్రాల పరిశీలన చేసి, జూలై 8 నుంచి 15వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల నమోదుకు అవకాశం కల్పించి, 19న సీట్లు కేటాయిస్తారు. సీటు పొందిన అభ్యర్థులు ఈనెల19 నంచి 23వ తేదీలోపు రిపోర్ట్ చేయాలి. అలాగే జూలై 26 నుంచి రెండో దశ కౌన్సెలింగ్, ఆగస్టు 8 నుంచి మూడో దశ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఆగస్టు 21 నుంచి 28 వరకు ఇంటర్నల్ స్లైడింగ్ పూర్తి చేస్తారు. అప్పటికీ సీట్లు మిగిలి ఉంటే ఆగస్టు 28న స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ చేపడతారు. కౌన్సెలింగ్ కోసం రాష్ట్రవ్యాప్తంగా 36 హెల్ప్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

## పది సర్టిఫికెట్లలో తప్పులు దిద్దుకునే అవకాశం!

పది సర్టిఫికెట్లల్లో విద్యార్థుల వివరాల్లో దొర్లిన తప్పులను సరిదిద్దుకునేందుకు అధికారులు అవకాశం కల్పించారు. మార్చిలో జరిగిన పదవ తరగతి పరీక్షలకు సంబంధించి విద్యార్థులకు ఇప్పటికే మెమోలు, ఇతర సర్టిఫికెట్లను జారీ చేసిన విషయం తెలిసిందే. వాటిలో విద్యార్థులకు సంబంధించిన పేరు, ఇతర వివరాల్లో ఏమైనా పొరపాట్లు జరిగితే వాటిని సరి చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం ఈ నెల 15వ తేదీలోపు సంబంధించి పాఠశాల ప్రధానోపాధ్యాయుల యుడైస్ పోర్టల్‌లో సదరు విద్యార్థికి సంబంధించిన సరైన వివరాలను నమోదు చేయాలని అధికారులు తెలిపారు.

## 'సమ్మక్క-సారలమ్మ ములుగు జిల్లా'కు జై

**» పేరు మార్పునకు ప్రజల అంగీకారం**

ములుగు, జూలై 3: ములుగు జిల్లాకు మేడారం వనదేవతల పేర్లు స్ఫురించేలా సమ్మక్క-సారలమ్మ ములుగు జిల్లాగా నామకరణం చేసేందుకు బుధవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన గ్రామసభల్లో ప్రజలు అందుకు జై కొట్టారు. పంచాయతీ కార్యాలయాల ఆవరణలో ప్రజాభిప్రాయ సేకరణ ప్రత్యేక గ్రామసభలు జరగ్గా.. హాజరైన ప్రజలంతా జిల్లాకు వనదేవతల పేరు పెట్టడం తమకు సమ్మతమేనని స్పష్టం చేశారు. అయితే వెంకటాపూర్ మండలం పాలంపేటలో జరిగిన గ్రామసభలో మాత్రం స్థానికులు భిన్నమైన అభిప్రాయం వ్యక్తంచేశారు. తాడ్వాయి మండలంతోపాటు జాతీయ గిరిజన విశ్వవిద్యాలయం, తుపాకులగూడెం బ్యారేజీలకు ఇప్పటికే వనదేవతల పేరు పెట్టారని, జిల్లాకు రామప్ప పేరును చేర్చి రామప్ప ములుగు జిల్లాగా పెట్టాలని కోరారు.

## యాసంగిలో 48 లక్షల టన్నుల ధాన్యం సేకరణ

హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్‌లో 48 లక్షల టన్నుల వరి ధాన్యం సేకరించి 8,99,546 మంది రైతుల ఖాతాల్లో రూ. 10,547 కోట్లు జమ చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. ధాన్యం కొనుగోలు చేసిన మూడు రోజుల్లోపే రైతులకు డబ్బులు చెల్లించడం ద్వారా పౌర సరఫరాల విభాగం రికార్డు సృష్టించినట్లు వివరించింది.. మార్చి 25న కొనుగోళ్లను ప్రారంభించి.. జూన్ 30 వ తేదీ వరకు కొనసాగించినట్లు తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా 7,178 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి.. 48 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు పేర్కొంది. ఈ ఏడాది 75.40 లక్షల టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేయగా, ప్రైవేటు వ్యాపారులు పోటీ పడి మంచి ధరకు కొనుగోలు చేయడంతో సర్కారీ కేంద్రాలకు తక్కువ ధాన్యం వచ్చిందని వివరించింది.

## నిట్ విద్యార్థికి 88 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 3: క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో వరంగల్ నిట్ విద్యార్థులు సత్తా చాటారు. బెంగళూరుకు చెందిన ఓ ఐటీ కంపెనీలో భారీ ప్యాకేజీలతో నిట్ విద్యార్థులు ఉద్యోగాలు దక్కించుకున్నారు. బీటెక్ ఈసీఈ చదువుతున్న రవిషా అనే విద్యార్థి అత్యధికంగా రూ.88 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం పొందారు. అలాగే వివిధ విభాగాలను చెందిన మరో 12 మంది విద్యార్థులు రూ.68లక్షల చొప్పున వార్షిక వేతనాలతో ఉద్యోగాలు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి మాట్లాడుతూ.. ఈ ఏడాది నిట్ విద్యార్థుల్లో 76 శాతం మందికి క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో ఉద్యోగాలు లభించాయన్నారు.1,483 మంది విద్యార్థులు అర్హత సాధించగా, 1,128 మంది ఉద్యోగ ఆఫర్లు సాధించారన్నారు.

## ఆదాయ వనరుగా పర్యాటక రంగం: జూపల్లి

హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పర్యాటక రంగాన్ని ఆదాయ వనరుగా మార్చడమే లక్ష్యంగా కొత్తగా పర్యాటక విధానం(టూరిజం పాలసీ) ముసాయిదాను రూపొందించినట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఈ ముసాయిదాను సీఎం రేవంత్‌రెడ్డికి సమర్పించి ఆయన సలహాలు, సూచనలకు అనుగుణంగా తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆరు నెలల వ్యవధిలో రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అద్భుతంగా తీర్చిదిద్దనున్నట్టు ఆయన చెప్పారు. ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్య పద్ధతిలో పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేసి ఆదాయ మార్గాలను మెరుగుపరుస్తామని వివరించారు. బుధవారం సచివాలయంలోని మీడియా సెంటర్‌లో జూపల్లి కృష్ణారావు విలేకరులతో మాట్లాడారు. డెస్టినేషన్ వెడ్డింగ్‌లను ప్రమోట్ చేయడానికి సోమశిల, రామప్ప, లక్నవరం, నాగార్జునసాగర్, అనంతగిరి హిల్స్ ప్రాంతాలను అభివృద్ధి చేస్తామన్నారు.

## అన్ని గురుకులాలకు కామన్ టైం టేబుల్

హైదరాబాద్, జూలై 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని గురుకుల పాఠశాలలకు ఇక నుంచి ఒకే తరహా టైం టేబుల్ అమల్లోకి రానుంది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు కలిపి రాష్ట్రంలో మొత్తం ఐదు గురుకుల సొసైటీలు ఉండగా... వాటిలో వేర్వేరు టైం టేబుల్ అమలులో ఉంది. తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు అన్ని గురుకుల పాఠశాలలకు ఒకే తరహా టైం టేబుల్‌ను పాటించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఉదయం 5గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు గురుకుల పాఠశాలలకు కామన్ టైంటేబుల్‌గా నిర్ణయించారు. ఉదయం 5నుంచి 8 గంటల వరకు ప్రార్థన, యోగా, వ్యాయామం, అల్పాహారం ఉంటుంది. ఉదయం 8 నుంచి 12:45 వరకు, మధ్యాహ్నం 2:30 నుంచి 4:30 వరకు తరగతులు ఉంటాయి.

## ఎంపీటీసీలు, జడ్పీటీసీల పదవీకాలం పూర్తి

హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : ఖమ్మం, కొత్తగూడెం జిల్లాలు మినహా రాష్ట్రవ్యాప్తంగా ఇతర అన్ని జిల్లాల ఎంపీటీసీలు, జడ్పీటీసీల పదవీకాలం బుధవారంతో ముగిసింది. గడువు ముగిశాక నెల రోజుల్లోపు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల విషయం ఇంకా తేలకపోవడంతో దాని తర్వాతే ఎన్నికలు నిర్వహించాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉంది. అప్పటి వరకు ఖాళీ అయిన ఎంపీపీ స్థానాల్లో ప్రత్యేక అధికారులను నియమించాలని సీఎస్ శాంతికుమారి ప్రభుత్వం బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఎంపీడీవోకంటే ఒక ర్యాంకు ఎక్కువ ఉన్న ఇతర శాఖల జిల్లాస్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించాలని అందులో సూచించారు.

# ఇంత ఆలస్యంగా వస్తే ఎలా?

**ఆర్ అండ్ బీ షేషీ ఉద్యోగులపై మంత్రి కోమటిరెడ్డి మండిపాటు**

హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): సచివాలయంలోని ఆర్ అండ్ బీ, సినిమాటోగ్రఫీ శాఖకు సంబంధించిన పేషీ, వివిధ విభాగాలను మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చాలా మంది ఉద్యోగులు నిర్ణీత సమయానికి విధులకు హాజరు కాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయ ఉద్యోగులే ఇంత ఆలస్యంగా వస్తే ఎలా ? సమస్యల పరిష్కారం కోసం వందల కిలోమీటర్ల నుంచి వచ్చే సామాన్యుల పరిస్థితి ఏంటీ ? అని ప్రశ్నించారు. బుధవారం ఉదయం 10గంటల సమయంలో సచివాలయంలోని తన ఛాంబర్‌కు వెళుతుండగా పేషీలోని కుర్చీలు సగానికి సగం ఖాళీగా ఉండడాన్ని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి గుర్తించారు. దాంతో పేషీలోనికి వెళ్లిన మంత్రి దాదాపు గంట సేపు అన్ని విభాగాలను తనిఖీ చేశారు. అప్పటికే కార్యాలయంలో ఉన్న ఉద్యోగులతో మాట్లాడి వారి యోగ క్షేమాలను తెలుసుకున్నారు. సమయపాలన పాటించని ఉద్యోగులపై ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఉద్యోగుల సహకారం లేకుండా ఏ ప్రభుత్వం విజయవంతం కాలేదన్నారు. రాష్ట్రాభివృద్ధికి ఉద్యోగులు సహకరించాలని కోరారు. అత్యంత ప్రాధాన్యం కలిగిన సచివాలయ ఉద్యోగులు విధులకు ఆలస్యంగా రావడం భావ్యం కాదని, అందరూ సమయపాలన పాటించాలని సుతిమెత్తగా హెచ్చరించారు.



ఆర్ అండ్ బీ శాఖ పేషీలో మంత్రి కోమటిరెడ్డి

# ఎవ్వర్నీ వదలం

(మొదటిపేజీ తరువాయి)

వచ్చిన కథనాలను హైకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించి.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈమేరకు.. రాష్ట్ర ప్రభుత్వం, డీజీపీ, రాష్ట్రానికి సంబంధించిన అందరు ప్రతివాదుల తరఫునా హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి హైకోర్టులో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేశారు. "ప్రజాస్వామ్య వ్యవస్థ మూలాలను దెబ్బతీసే విధంగా జరిగిన తీవ్రమైన నేరం ఫోన్‌ట్యాపింగ్. దీని ప్రభావం సమాజంపై తీవ్రంగా ఉంది. ఎలాంటి పక్షపాతం లేకుండా.. చట్టానికి లోబడి.. సీనియర్ పోలీస్ అధికారులు సహా ఈ నేరంలో బాధ్యులైన ఏ ఒక్కరిని వదిలిపెట్టకుండా పారదర్శకంగా, క్షుణ్ణంగా దర్యాప్తు చేస్తున్నాం. ట్రయల్ కోర్టులో ఇప్పటికే చార్జిషీట్ దాఖలు చేశాం. కేసులోని కొత్త కొత్త అంశాలపై ఆధారాలు సేకరించడానికి..తదుపరి దర్యాప్తు కొనసాగించడానికి ట్రయల్ కోర్టు అనుమతి తీసుకున్నాం. ఏ చిన్న అంశాన్నీ వదలకుండా ఆధారాలు సేకరించడంతోపాటు నిందితులు, సాక్షుల వాంగ్మూలాలు రికార్డు చేస్తున్నాం. ఇప్పటికీ ఆచూకీ లభించని నిందితుల అరెస్టుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నాం. నిందితులు సీనియర్ పోలీసు అధికారులైన నేపథ్యంలో.. నేరం గురించి విస్తృతమైన అవగాహనతో ఆధారాలు లేకుండా చేశారు. అయినప్పటికీ ప్రొఫెషనల్‌గా ఆధారాలు సేకరిస్తూ చట్టబద్ధంగా చార్జిషీట్ దాఖలు చేశాం" అని కమిషనర్ ఆ అఫిడవిట్‌లో పేర్కొన్నారు. నిందితులు ఉల్లంఘించిన నిబంధనల గురించి వివరించడమే కాక.. ట్యాపింగ్‌కు గురైనవారి పేర్లనూ వెల్లడించారు.

### ఉల్లంఘించిన నిబంధనలు, చట్టాలు

1. ఇండియన్ టెలీగ్రాఫ్ యాక్ట్ 1885: ఈ నిబంధనకు విరుద్ధంగా.. ఎలాంటి సమర్థనా లేకుండా ప్రజా జీవితంలోని పలువురు రాజకీయ నాయకులు, ప్రముఖులకు సంబంధించిన సీడీఆర్ (కాల్ డేటా రికార్డ్), ఐపీడీఆర్ (ఇంటర్‌నెట్ ప్రొటోకాల్ డేటా రికార్డ్), లొకేషన్స్ సేకరించారు. ఏ కారణాలతో వీటిని సేకరించారో? అంత ప్రజాభద్రత, పబ్లిక్ ఎమర్జెన్సీ ఏముందో కారణాలు వివరించలేదు. ప్రజాప్రతినిధులు, పాత్రికేయులు, అధికారులు, వ్యాపారస్తులు, న్యాయాధికారులు, ప్రముఖుల కుటుంబ సభ్యుల వివరాలు సేకరించారు. సుప్రీంకోర్టు తీర్పులు, చట్టాలకు విరుద్ధంగా ఈ పనిచేశారు.

2. ఇండియన్ టెలీగ్రాఫ్ రూల్స్ 419 (ఏ): ఈ కేసులో ఏ-1గా ఉన్న ఐపీఎస్ టి.ప్రభాకర్‌రావు 2020 జూన్ 30న రిటైర్ అయ్యారు. ఆయన రిటైర్ కావడానికి ముందు.. ఫోన్లు, ఇంటర్నెట్ సర్వీసెస్‌లను నిరోధించే డిజిగ్నేటెడ్ అథారిటీగా గుర్తిస్తూ హోంశాఖ కార్యదర్శి ఆదేశాలు జారీచేశారు. అంతేకాక.. రిటైర్ అయిన వెంటనే ఎస్ఐబీ చీఫ్‌గా నియమించారు. టెలీగ్రాఫ్ రూల్స్‌ను ఉల్లంఘిస్తూ రాజకీయ నాయకత్వం ఆదేశాలతో ప్రభాకర్‌రావును ఇంటర్సెప్షన్స్ డిజిగ్నేటెడ్ అథారిటీగా గుర్తించారు.

3. ఇండియన్ టెలీగ్రాఫ్ రూల్స్ ఆధారంగా జారీచేసిన ఎస్‌వోపీ మార్గదర్శకాలలో దేనినీ నిందితులు పాటించలేదు. మార్గదర్శకాల్లో పేర్కొన్న ప్రకారం.. సేకరించిన ఫోన్‌నంబర్ల వివరాలతో మూడు రకాల జాబితాలు తయారు చేయాల్సి ఉండగా.. ఎన్నికల ఫలితాల అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం పడిపోయిందని తెలియగానే జనవరి 4న మొత్తం వివరాలు నాశనం చేశారు.

4. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు వామపక్ష తీవ్రవాదాన్ని తగ్గించడానికి స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబీ)ను ఏర్పాటు చేశారు. అయితే, నిందితులు ఎస్ఐబీకి సంబంధించిన అన్ని నిబంధనలు, మార్గదర్శకాలను తుంగలో తొక్కి.. బీఆర్ఎస్ పార్టీకి రాజకీయ లబ్ధి చేకూర్చడానికి ఎస్ఐబీ వనరులను ఉపయోగించారని కమిషనర్ అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

### ట్యాపింగ్ బాధితులు వీరే..

అఫిడవిట్‌లో తెలిపిన ప్రకారం.. నిందితులు రిలయన్స్ జియో ఇన్ఫోకాం లిమిటెడ్ నుంచి జస్టిస్ కాజా శరత్, ఆయన భార్య మాధవీ గోగినేని వివరాలు సేకరించారు. అలాగే.. ఎనుముల రేవంత్ రెడ్డి, కొండల్ రెడ్డి, తిరుపతి రెడ్డి, వినయ్ రెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఈటల రాజేందర్, ఈటల నితిన్, శివధర్ రెడ్డి, ఏఆర్ శ్రీనివాస్, రాఘవేందర్ రెడ్డి, రొనాల్డ్ రాస్, ధర్మపురి అరవింద్, ఎం.రమేశ్ రెడ్డి, మేఘా శ్రీనివాస్ రెడ్డి, మైనంపల్లి రోహిత్, పీడీ కృష్ణకిశోర్, ఐఏఎస్ దివ్య, తాతినేని శశాంక్, రాజ్ న్యూస్ సునీల్ రెడ్డి, చిలుకా రాజేందర్ రెడ్డి, కె.వెంకటరమణారెడ్డి, ఎన్‌టీవీ నరేంద్రనాథ్, తీన్మార్ మల్లన్న, ఏఎంఆర్ ఇన్‌ఫ్రా మహేశ్వర్‌రెడ్డి, వీరమళ్ల సత్యం, గాలి అనిల్‌కుమార్, రామసహాయం సురేందర్‌రెడ్డి, కుందూరు రఘువీర్ రెడ్డి, మేరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మేరెడ్డి స్వప్నిక, ఈటల రాజేందర్ కెమెరామెన్ ఉదయ్, ఈటల గన్‌మెన్ అంజన్న, కాసాని జ్ఞానేశ్వర్, బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, ఏనుగు రవీందర్‌రెడ్డి, మానాల మోహన్‌రెడ్డి, అనుమాండ్ల నరేందర్ రెడ్డి, పానీఖాన్, కె.మహేందర్ తదితరుల వివరాలు సేకరించారు.

### వారి అరెస్టుకు చర్యలు..

ఈ కేసులో ఏ-1గా ఉన్న టీ ప్రభాకర్‌రావు, ఏ-6గా ఉన్న శ్రవణ్‌కుమార్ రావును అరెస్ట్ చేయడానికి అన్నిరకాల చర్యలూ తీసుకుంటున్నామని కమిషనర్ అఫిడవిట్‌లో కోర్టుకు తెలిపారు. వారు తమ వీసా నిబంధనలకు విరుద్ధంగా అమెరికాలో ఉంటున్నారని.. కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ ఆధ్వర్యంలో ఇంటర్‌పోల్ ద్వారా వారికి బ్లూనోటీస్ జారీచేయడానికి ప్రయత్నిస్తున్నామని.. ఈ మేరకు సీబీఐకి ప్రతిపాదనలు అందజేశామని పేర్కొన్నారు. వారికి వ్యతిరేకంగా నాన్‌బెయిలబుల్ వారంట్లు జారీ అయినందున వారి పాస్‌పోర్టులు రద్దు లేదా స్వాధీనం చేసుకోవాలని రీజినల్ పాస్‌పోర్ట్ అధికారికి ప్రతిపాదనలు అందజేసినట్లు వెల్లడించారు. కాగా.. దీనిపై వివరణ ఇచ్చేందుకు తమకు కొంత సమయం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం కోర్టును కోరింది. బుధవారం ఈ కేసు విచారణ చేపట్టిన చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ టి.వినోద్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం ముందు.. కేంద్రం తరఫున డిప్యూటీ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్ కుమార్ వాదనలు వినిపించారు. రాష్ట్ర పోలీసుల దర్యాప్తు అనంతరం, ఆ వివరాలను పరిశీలించి కౌంటర్ దాఖలు చేస్తామంటూ కోర్టుకు ఒక మెమోను సమర్పించారు. ఇక.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం, అధికారుల దౌర్జన్యాలకు తాము బాధితులుగా మారామని.. తమ వాదనలు సైతం వినాలని పేర్కొంటూ సంధ్య కన్వెన్షన్ ఎస్ శ్రీధర్‌రావు, సిద్దిపేటకు చెందిన హయతుద్దీన్ ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలు చేశారు. వారి వాదనలు విన్న ధర్మాసనం.. 'మీరు ఇంప్లీడ్ కావాల్సిన అవసరం ఏముంది? ఇది మేం సుమోటోగా తీసుకున్న కేసు. కావాలంటే మీరు ప్రత్యేకంగా పిటిషన్లు వేసుకోవచ్చు కదా?"అని ప్రశ్నించింది. ఎందుకు ఇంప్లీడ్ కావాలో తాము వివరిస్తామని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు పేర్కొనడంతో వచ్చే వాయిదాకు చూద్దామని ధర్మాసనం పేర్కొంది. తదుపరి విచారణను 23కు వాయిదా వేసింది.

## 'మధుకాన్'లో కోల్‌కతా పోలీసుల తనిఖీలు

హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : చీటింగ్ కేసులో హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని మధుకాన్ గ్రూప్ ప్రధాన కార్యాలయంలో కోల్‌కతా పోలీసులు బుధవారం సోదాలు నిర్వహించారు. జాతీయ రహదారి నిర్మాణంలో తమకు రావాల్సిన బిల్లులు చెల్లించకుండా రూ. 12.87 కోట్లకు చీటింగ్ చేశారని మెట్రోపాలిటన్ ఇంజనీర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోల్‌కతా బౌబజార్ పోలీసులు 2022లో కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా కోల్‌కతా పోలీసులు బుధవారం మధుకాన్ గ్రూప్ ప్రధాన కార్యాలయంలో సోదాలు నిర్వహించారు. పశ్చిమ బెంగాల్‌లో జాతీయ రహదారి-34 నిర్మాణ పనుల్లో కొంత భాగం మధుకాన్ సంస్థ దక్కించుకుంది. తాము చేపట్టిన రహదారి నిర్మాణ పనుల్ని మధుకాన్ సంస్థ కోల్‌కతాకు చెందిన మెట్రోపాలిటన్ ఇంజనీర్స్ కో-ఆపరేటివ్ సొసైటీకి సబ్ కాంట్రాక్టు ఇచ్చింది. అనంతరం పూర్తిచేసిన పనులకు బిల్లులు చెల్లించాలని మధుకాన్ సంస్థ ప్రతినిధుల్ని పలుమార్లు సంప్రదించినా ఫలితం లేకపోవడంతో మెట్రోపాలిటన్ ఇంజనీర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ ప్రతినిధులు ఎన్‌హెచ్ఏఐను సంప్రదించారు. తమతో ఒప్పందం కుదుర్చుకున్న సంస్థకు బిల్లులు చెల్లించామని సంబంధిత అధికారులు చెప్పడం, మధుకాన్ గ్రూప్ నుంచి ఎంతకీ బిల్లులు రాకపోవడంతో ఇంజనీర్స్ సంస్థ ప్రతినిధులు బౌబజార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో భాగంగా ప్రత్యేక బృందం సోదాలు నిర్వహించి పలు పత్రాలు స్వాధీనం చేసుకుంది. వినయ్ కుమార్, అమర్‌నాథ్‌దాస్, ఏకే సింగ్‌తోసహా మధుకాన్ సంస్థకు చెందిన 10మందిపై బౌబజార్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.


## పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కార్యదర్శిగా లోకేశ్ కుమార్

హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కార్యదర్శిగా రాష్ట్ర అదనపు ఎన్నికల అధికారి డీఎస్ లోకేశ్ కుమార్‌కు ప్రభుత్వం పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించింది. ఇప్పటివరకు ఈ బాధ్యతలు చూస్తున్న ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాను రిలీవ్ చేసింది. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

# కాంగ్రెస్ యువరాజే.. భవిష్యత్తు ప్రధాని

**సభలో ప్రతిపక్ష నేతగా గర్జించిన రాహుల్‌గాంధీ.. ఆయన ప్రశ్నలకు ప్రధాని మోదీ మైండ్ బ్లాంక్ అయింది**

- » పదేళ్లలో ప్రధాని ఒక్కసారైనా ప్రజలను కలిశారా?
- » చంద్రబాబు, నితీశ్ దయ వల్లే ఈ సారి మోదీకి పదవి
- » జోడో యాత్రతో రాహుల్ దేశమంతా పర్యటించారు
- » ఆయనను శక్తిమంతమైన నేతగా ప్రజలు గుర్తించారు
- » రాహుల్ కుటుంబానిది త్యాగాల చరిత్ర.. మోదీది మోసాల చరిత్ర: తూర్పు జగ్గారెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): "దేశమంతా పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్న తర్వాతే యువరాజును చక్రవర్తిగా పట్టాభిషిక్తుడిని చేస్తారు. అదే తీరుగా భారత్ జోడో యాత్రతో దేశమంతా పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్న కాంగ్రెస్ యువరాజు రాహుల్‌గాంధీ పరిపూర్ణత చెందారు. ప్రస్తుతం ప్రధాన ప్రతిపక్ష నేతగా గర్జిస్తూ సభలో ప్రధాని మోదీని వెంటాడుతున్న రాహుల్‌ను ప్రజలు శక్తిమంతమైన నేతగా గుర్తించారు. భవిష్యత్తులో మా చక్రవర్తి.. దేశానికి ప్రధాని రాహుల్ గాంధీనే" అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి అన్నారు. మోదీ ఎంత వద్దనుకున్నా.. రాహుల్ గాంధీని యువ రాజుగానే వర్ణించారన్నారు. రాహుల్ గాంధీ కుటుంబానిది త్యాగాల చరిత్ర అయితే.. మోదీ, బీజేపీది మోసాల చరిత్ర అని దుయ్యబట్టారు. గాంధీ భవన్‌లో బుధవారం జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడారు. యూపీఏ అధికారంలోకి వచ్చినప్పుడే రాహుల్‌ను ప్రధానిని చేద్దామన్న ప్రతిపాదన వచ్చినా.. పాలన, ప్రజా సమస్యలపైన అవగాహన పెంచుకున్నాకే పదవి చేపట్టాలని రాహుల్ భావించారన్నారు. అందుకే.. మన్మోహన్‌సింగ్‌ను ప్రధానిని చేశారన్నారు. యువరాజు పాత్రలో పదేళ్ల పని చేసిన రాహుల్ గాంధీ.. భారత్ జోడో, న్యాయ్ యాత్రల్లో భాగంగా 8 వేల కిలోమీటర్లు పర్యటించారని గుర్తు చేశారు. ప్రజా, సామాజిక సమస్యలను లోతుగా అర్థం చేసుకున్నారని వెల్లడించారు. కానీ, మోదీ మాత్రం గత పదేళ్లలో ఎన్నడూ ప్రజల్ని కలవలేదని.. వారి సమస్యలకు పరిష్కారం చూపలేదని మండిపడ్డారు. రాహుల్‌కు, మోదీకి ఉన్న వ్యత్యాసం ఇదేనని వ్యాఖ్యానించారు. "నల్ల ధనం తెస్తాం.. పేదల అకౌంట్లలో రూ.15లక్షల చొప్పున వేస్తాం.. వంద రోజుల్లో ధరలు తగ్గిస్తాం.. అని చెప్పి అధికారంలోకి వచ్చిన మోదీ.. ఏం చేశారు? పదేళ్లలో అడ్డగోలుగా ధరలు పెంచేశారు" అని దుయ్యబట్టారు. పుల్వామా దాడిని గుర్తు చేస్తూ.. ఎన్నికల ముందు పేలుళ్లు జరగాలి... బీజేపీ గెలవాలన్నదే వారి ఆలోచనన్నారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికలకు ముందు రాముడి కల్యాణం జరగక ముందే గల్లీ గల్లీకి అక్షింతలు వచ్చాయన్నారు. చివరకు రామాలయం ఉన్న అయోధ్యలోనూ బీజేపీ ఓటమిపాలైందన్నారు. చంద్రబాబు, నితీష్‌కుమార్ దయతో మూడో సారి మోదీ ప్రధాని అయ్యారన్నారు. చంద్రబాబు అడిగితే అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వని మోదీ.. చివరికి చంద్రబాబు బలంతోనే ప్రధాని అవ్వాల్సి వచ్చిందన్నారు. పవన్ కల్యాణ్‌ను ముందు పెట్టి.. టీడీపీని కలుపుకొని వెళ్తున్నట్లు బీజేపీ గేమ్ ఆడిందని విమర్శించారు. పార్లమెంటుకు రాహుల్‌గాంధీ.. శివుడి పటంతో వచ్చారని, ప్రధాని మోదీ ఎప్పుడైనా రాముడి చిత్రపటంతో వచ్చారా? అని ప్రశ్నించారు. రాహుల్‌గాంధీ ప్రశ్నలకు మోదీ మైండ్ బ్లాంక్ అయిందని, ఏం చెప్పాలో తెలియక.. రాహుల్‌వి పిల్ల చేష్టలని మాట్లాడుతున్నారన్నారు. రాహుల్ వయసు గురించి మాట్లాడుతున్న మోదీకి.. రాహుల్ గాంధీ నాయకత్వం వహిస్తున్న కాంగ్రెస్‌కు ఉన్నంత వయసు లేదని ఎద్దేవా చేశారు.

## చేనేతలకు చేతినిండా పని

**» కార్మికులెవరూ నిరుత్సాహపడొద్దు: తుమ్మల**

**» చేనేత కార్మిక సంఘాల నేతలతో మంత్రి భేటీ**



హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులు, మరమగ్గాల కార్మికులకు దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూర్చే పథకాలను అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, చేనేత-జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. తెలిపారు. కార్మికులందరికీ చేతినిండా పని కల్పించటమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ఎవరూ నిరుత్సాహపడొద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. బుధవారం సచివాలయంలో చేనేత కార్మిక సంఘాల నేతలతో మంత్రి తుమ్మల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. అన్ని ప్రభుత్వ శాఖలకు సరిపడా వస్త్రాలను టెస్కో ద్వారానే కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందని, ఆ మేరకు టెస్కోకు వివిధ ప్రభుత్వ శాఖల నుంచి రూ. 250 కోట్ల విలువైన బట్ట ఉత్పత్తికి ఆర్డర్లు వచ్చాయని తెలిపారు. టెస్కోకు వచ్చిన ఆర్డర్ల మేరకు ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు ఉత్పత్తి ప్రణాళికను ఇచ్చామని, ఆర్డర్ ప్రకారం ఖరీదు జరుగుతుందని, దీంతో చేనేత కార్మికులకు చేతి నిండా పని దొరికేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. త్వరలో ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తామని ఆయన ప్రకటించారు. ప్రాథమిక చేనేత సహకార సంఘాల్లోని వస్త్ర నిల్వలను తక్షణమే కొనుగోలు చేయాలని చేనేత సంఘాల నేతలు ఈ సందర్భంగా మంత్రికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ శాఖలకు సరఫరా చేసే బట్టతోపాటుగా షోరూమ్‌లలో విక్రయించే వస్త్రాలనూ కొనుగోలు చేయాలని, సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు.



ఖర్గే, రాహుల్, దీపాదాస్, రేవంత్, కేసీ వేణుగోపాల్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన కేకే

## సొంతగూటికి కేశవరావు

**» ఖర్గే, రాహుల్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక**

**» చివరిశ్వాస వరకు కాంగ్రెస్‌లోనే ఉంటా: కేకే**

న్యూఢిల్లీ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ ఎంపీ, సీనియర్ నేత కె.కేశవరావు తిరిగి సొంతగూటికి చేరుకున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు రాహుల్ గాంధీ సమక్షంలో ఆయన హస్తం పార్టీలో చేరారు. బుధవారం సాయంత్రం 10, రాజాజీ మార్గ్‌లోని తన నివాసంలో ఖర్గే.. కేశవరావుకు కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ తదితరులు పాల్గొన్నారు. కేశవరావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పీసీసీ అధ్యక్షుడిగా పనిచేసిన విషయం తెలిసిందే. 2013లో తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలో కేశవరావు కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరారు. కాగా, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంతో కేకే కుమార్తె, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి లోక్‌సభ ఎన్నికలకు ముందు సీఎం రేవంత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కేశవరావుకు ఉన్న అపార అనుభవం తెలంగాణలో కాంగ్రెస్ బలోపేతానికి దోహదం చేస్తుందని పార్టీ అధ్యక్షుడు ఖర్గే ఎక్స్ వేదికగా ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌తోనే తన రాజకీయ జీవితం ప్రారంభమైందని, తన చివరిశ్వాస వరకు కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని కేకే స్పష్టం చేశారు. తన చేరికపై రాహుల్ ఆనందం వ్యక్తం చేసినట్లు చెప్పారు.

## ఏకాభిప్రాయం కుదర్లే!

(మొదటిపేజీ తరువాయి)

ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీలు రెండు దఫాలు సమావేశమై చర్చలు జరిపిన సంగతి తెలిసిందే. ఆ సమావేశాల్లో రూపొందించిన జాబితాలోని పేర్లపై రాష్ట్ర పార్టీ ముఖ్య నేతల అభిప్రాయాలను దీపాదాస్ మున్షీ తీసుకున్నారు. ఖర్గే, రాహుల్‌తో మంగళ లేదా బుధవారం సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దీపాదాస్ మున్షీలు సమావేశమై చర్చించి తుది నిర్ణయం తీసుకుంటారని వార్తలు వచ్చాయి. అయితే బుధవారం ఉదయం వరకూ సీఎం సహా నలుగురికీ ఢిల్లీ నుంచి పిలుపు రాలేదు. బుధవారం రోజంతా అధికారులతో సమీక్షలకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రణాళిక కూడా వేసుకున్నారు. కానీ, బీఆర్ఎస్ ఎంపీ కె.కేశవరావు కాంగ్రెస్‌లో చేరిక సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిని అధిష్ఠానం బుధవారం హుటాహుటిన ఢిల్లీకి పిలిపించింది. మధ్యాహ్నం ఢిల్లీ చేరుకున్న సీఎం.. పార్టీలో కేకే చేరిక తర్వాత ఖర్గే, రాహుల్, కేసీ వేణుగోపాల్‌తో సమావేశమై చర్చలు జరిపారు. పార్టీ అగ్రనేతలతో రేవంత్‌రెడ్డి కొంతసేపు అంతరంగికంగానూ సంభాషించారు. చర్చల్లో మంత్రివర్గ విస్తరణ, పీసీసీ అధ్యక్ష పదవిపై ఇంకా చిక్కుముడులు ఉన్నాయని గ్రహించిన అగ్రనేతలు మరోమారు భేటీ కావాలన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. టీపీసీసీ చీఫ్ నియామకం, మంత్రివర్గ విస్తరణ ఒక దానికొకటి ముడిపడి ఉన్నాయి. దీంతో ఈ రెండు అంశాలపైనా మరోసారి సమావేశమవ్వాలన్న నిర్ణయానికి వచ్చినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వారం తర్వాత భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. కాగా, బుధవారం భేటీ అనంతరం ఖర్గే బెంగుళూరుకు పయనమవగా, కేసీ వేణుగోపాల్ కేరళ వెళ్లినట్లు సమాచారం. ఖర్గే నివాసంలో చర్చల సమయంలో.. పీసీసీ పదవిని ఆశిస్తున్న నేతలు మధుయాష్కీ, మహేశ్‌కుమార్ గౌడ్, సంపత్‌కుమార్, బలరాంనాయక్‌తోపాటు మంత్రివర్గంలో స్థానం ఆశిస్తున్న వాకిటి శ్రీహరి అక్కడే ఉన్నారు. ఇక మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి.. రేవంత్‌కంటే ముందే ఖర్గేని కలిసి వెళ్లిపోయారు.

## ఏఈఈ అర్హుల జాబితా ప్రకటించాలి:కేటీఆర్



హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 1180 ఏఈఈ (సివిల్) పోస్టులకు నిర్వహించిన పరీక్షలో అర్హులైన అభ్యర్థుల జాబితాను ప్రకటించే విషయంలో కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. బుధవారం ఏఈఈ (సివిల్) పరీక్ష రాసిన అభ్యర్థులు నందినగర్‌లోని ఆయన నివాసంలో కేటీఆర్‌ను కలిశారు.. అర్హుల జాబితాను వెంటనే ప్రకటించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు రావాలని వారు కోరిన నేపథ్యంలో కేటీఆర్.. టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డికి ఫోన్ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యర్థులకు అండగా ఉంటామని తెలిపారు. 22 నెలల కిందట ఈ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసి ఆ వెంటనే పరీక్ష నిర్వహణ, సర్టిఫికెట్ల పరిశీలన సైతం గతేడాది సెప్టెంబరు నాటికి పూర్తిచేశామని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే అర్హుల జాబితా ప్రకటించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కాగా, గ్రామ పంచాయతీలకు బిల్లుల పెండింగ్, పారిశుధ్య కార్మికులకు వేతనాల చెల్లింపుపై కొత్త ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని, ఏడు నెలలుగా ఒక్క పైసా కూడా విడుదల చేయలేదని తాజా మాజీ సర్పంచులు ఆరోపించారు. పెండింగ్ బిల్లుల పరిష్కారంపై అసెంబ్లీలో చర్చించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రణీల్ చందర్, తదితరులు కోరారు. ఈ మేరకు వారు బుధవారం హైదరాబాద్‌లో కేటీఆర్‌ను కలిసి డిమాండ్లతో కూడిన లేఖను అందజేశారు

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిపై అధిష్ఠానానికి స్పష్టత

» 'మల్కాజిగిరి' అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి: ఎంపీ ఈటల

న్యూఢిల్లీ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎవరిని ఎంపిక చేయాలనే అంశంపై పార్టీ అధిష్ఠానం స్పష్టతతో ఉన్నదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో నూతన అధ్యాయం రాబోతోందన్నారు. దీనికోసం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు వెళుతున్నానని చెప్పారు. నాలుగు రోజులుగా ఢిల్లీలో కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ, అశ్విని వైష్ణవ్, కుమారస్వామిలను కలిశానని వెల్లడించారు. మల్కాజిగిరి లోక్‌సభ పరిధిలో నూతన కంపెనీలు తీసుకొచ్చి, ఉపాధి కల్పనను పెంచేందుకు చర్యలు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి వసతులు తదితర సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించానని తెలిపారు.

## క్యాబినెట్ కమిటీల్లో కిషన్‌రెడ్డి, రామ్మోహన్‌నాయుడికి చోటు

న్యూఢిల్లీ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం బుధవారం ఏర్పాటు చేసిన క్యాబినెట్ కమిటీల్లో తెలుగు రాష్ట్రాల కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, కింజారపు రామ్మోహన్ నాయుడికి చోటు దక్కింది. రాజకీయ వ్యవహారాల కమిటీలో కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి కిషన్ రెడ్డికి చోటు దక్కగా, రాజకీయ వ్యవహారాలు, పార్లమెంటరీ వ్యవహారాల క్యాబినెట్ కమిటీల్లో కేంద్ర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడికి అవకాశం కల్పించారు. కేంద్రం.. నియామక కమిటీ, వసతి వ్యవహారాల కమిటీ, ఆర్థిక కమిటీ, పార్లమెంటరీ వ్యవహారాల కమిటీ, రాజకీయ వ్యవహారాల కమిటీ, రక్షణ వ్యవహారాల కమిటీ, పెట్టుబడి, అభివృద్ధి వ్యవహారాల కమిటీ, నైపుణ్య, ఉపాధి, జీవనాధార వ్యవహారాల కమిటీలను ఏర్పాటు చేసింది.

## 800 మెగావాట్ల పవర్‌ప్లాంట్‌ను జెన్‌కో ద్వారా నిర్మించాలి: జేఏసీ

హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రామగుండం థర్మల్ ప్లాంట్ స్థలంలో ప్రతిపాదించిన 800 మెగావాట్ల పవర్ ప్లాంట్‌ను జెన్‌కో ద్వారానే నిర్మించాలని పవర్ ఎంప్లాయిస్ జేఏసీ ప్రభుత్వాన్ని కోరింది. రామగుండంలో జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని మూసివేసి.. 540 ఎకరాల స్థలాన్ని సింగరేణికి ఇవ్వొద్దని పేర్కొంది. ఈ మేరకు బుధవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను జేఏసీ కన్వీనర్ రత్నాకర్ రావు, కో-కన్వీనర్ బీసీ రెడ్డి, వైస్ చైర్మన్ అనిల్ కుమార్ కలిసి వినతిపత్రం ఇచ్చారు. 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ థర్మల్ ప్లాంట్ నిర్మించేందుకు అనువైన స్థలం జెన్‌కో వద్ద ఉందని, అవసరమైతే గతంలో బీపీఎల్‌కు కేటాయించిన స్థలాన్ని వెనక్కి తీసుకోవచ్చని సూచించారు. ఆర్థికపరంగా జెన్‌కో సిద్ధంగా ఉంటే పవర్ ప్లాంట్ నిర్మించడానికి ప్రభుత్వం సుముఖంగా ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి పేర్కొన్నారు.

## కవిత జ్యుడీషియల్ కస్టడీ 25 వరకు పొడిగింపు

న్యూఢిల్లీ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి తిహాడ్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జ్యుడీషియల్ కస్టడీని న్యాయస్థానం మరోసారి పొడిగించింది. బుధవారం కవిత కస్టడీ ముగియడంతో ఆమెను వర్చువల్ పద్ధతిలో ఢిల్లీ రౌస్ ఎవెన్యూ కోర్టు ఎదుట హాజరుపరిచారు. ఈ సందర్భంగా కవిత కస్టడీని పొడిగించాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కోర్టును కోరింది. దీంతో ఈనెల 25వ వరకు పొడిగిస్తున్నట్టు న్యాయమూర్తి కావేరి భవేజా స్పష్టం చేశారు. ఇదే కేసులోనే అరెస్టైన ఢిల్లీ సీఎం అర్వింద్ కేజ్రీవాల్, మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా, మరో నిందితుడు వినోద్ చౌహాన్‌ల జ్యుడీషియల్ కస్టడీని కూడా కోర్టు పొడిగించింది. సిసోడియాది ఈనెల 25 వరకు, కేజ్రీవాల్, వినోద్ చౌహాన్‌లది ఈనెల 12 వరకు పొడిగిస్తున్నట్టు న్యాయమూర్తి కావేరి భవేజా స్పష్టం చేశారు.

## పీసీసీ పదవిని బీసీలకు ఇవ్వండి:జాజుల

హైదరాబాద్, జూలై 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ( టీపీసీసీ) అధ్యక్ష పదవి బీసీలకు ఇవ్వాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్.. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు లేఖ రాశారు. రాష్ట్రంలో 60 శాతం మేర బీసీ జనాభా ఉందని, అయినా బీసీలకు మొదటి నుంచి అన్యాయం జరుగుతోందని తెలిపారు. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో ఓసి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉండగా, బీసీ వ్యక్తి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నారన్న విషయాన్ని గుర్తుచేశారు. కనుక ప్రస్తుత పరిస్థితుల్లో బీసీ వ్యక్తికి పీసీసీ అధ్యక్ష పదవిని ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

## శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ముమ్మర తనిఖీలు

» నోవాటెల్ హోటల్, బార్ అండ్ రెస్టారెంట్లలో సోదాలు

శంషాబాద్ రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలోని నోవాటెల్ హోటల్, బార్ అండ్ రెస్టారెంట్లలో శంషాబాద్ జోన్ డీసీపీ రాజేష్, ఏసీపీ కేఎస్‌రావు ఆధ్వర్యంలో బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ..ఎయిర్‌పోర్టులోని బార్ అండ్ రెస్టారెంట్లు, నోవాటెల్ హోటల్‌తోపాటు శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని పలు లాడ్జీలలో అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నాయనే సమాచారంతో తనిఖీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. నోవాటెల్ హోటల్లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు ఏవైనా జరుగుతున్నాయా? అనేవి తెలుసుకునేందుకు పోలీసులు తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఎయిర్‌పోర్టులోని అరైవల్, డిపార్చర్‌లో డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంలతో కూడా తనిఖీలు నిర్వహించారు.

## ఆరుగురు మావోయిస్టు మిలీషియా సభ్యుల అరెస్టు

ములుగు, జూలై 3: ములుగు జిల్లా వెంకటాపురం పోలీసులు బుధవారం ఆరుగురు మావోయిస్టు మిలీషియా సభ్యులను అరెస్టు చేశారు. వారి నుంచి పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 1న వెంకటాపురం మండలం కొత్తపల్లి క్రాస్‌రోడ్డు వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో అక్కడకు వచ్చిన బాడిశ సురేశ్, మడకం సందీప్, గట్టుపల్లి సంతోష్, కట్టం అర్జున్, మడకం రాము, బాడిశ రవి పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని వెంబడించి అదుపులోకి తీసుకుని పోలీసులు తనిఖీ చేయగా 12 జిలెటిన్ స్టిక్స్, ఆరు బ్యాటరీలు, డిటోనేటర్, పదిమీటర్ల ఎలక్ట్రిక్ వైరు, విప్లవ సాహిత్యం లభ్యమైంది. ఇటీవల వెంకటాపురం మండలం బేదంగుట్ట అటవీ ప్రాంతంలో వీరు అమర్చిన మందుపాతర పేలి వెంకటాపురం మండలం వీఆర్‌కే.పురం గ్రామానికి చెందిన దర్ర సునీత గాయపడిందని ఎస్పీ తెలిపారు. ఇదే మండలం తడపాల, చెలిమెల వద్ద, సరిహద్దు అటవీ ప్రాంతంలో పలుచోట్ల బూబీ ట్రాప్స్, మందుపాతరలు అమర్చిన ఘటనల్లో వీరు నిందితులుగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

# 7 మండలాలను ఏపీకి ఇచ్చిందే మీరు

» పదేళ్లు అధికారంలో ఉండి ఏం చేశారు?

» హరీశ్‌పై డిప్యూటీ సీఎం భట్టి ధ్వజం



హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు చెందిన ఏడు మండలాలను ఏపీకి అప్పగించిందే బీఆర్ఎస్ పార్టీ అని ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క అన్నారు. విభజన చట్టంలో ఏడు మండలాల విలీనం అంశమే లేదని, బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాతే కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఆర్డినెన్సు తీసుకొచ్చి ఏపీలో కలిపిందని గుర్తుచేశారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ.. విలీన మండలాలపై ఏం చేసిందని ప్రశ్నించారు. ఏడు మండలాల కోసం పోరాటం చేస్తానంటూ అసెంబ్లీ సాక్షిగా చెప్పిన కేసీఆర్ ఏమయ్యారంటూ నిలదీశారు. ఈ అంశంపై హరీశ్‌రావు కల్లబొల్లి మాటలను ఎవరూ నమ్మే పరిస్థితి లేదన్నారు. ఏపీలో విలీనమైన ఏడు మండలాలు తిరిగి రాష్ట్రానికి దక్కేలా చంద్రబాబుపై ఒత్తిడి తేవాలంటూ హరీశ్ చేసిన వ్యాఖ్యలపై ఆయన ఈ మేరకు స్పందించారు. గాంధీభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో భట్టి మాట్లాడారు. చంద్రబాబు, రేవంత్‌రెడ్డి సహచర సీఎంలే తప్ప గురుశిష్యులు కాదని, ఈ విషయాన్ని రేవంత్‌రెడ్డే స్వయంగా చెప్పారని గుర్తుచేశారు. ప్రజాభవన్‌లో జరగనున్న ఇరు రాష్ట్రాల సీఎంల సమావేశంలో పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలపై చర్చించనున్నారని తెలిపారు. ఏకకాలంలో రూ.2 లక్షల రైతు రుణమాఫీని త్వరలోనే అమలు చేస్తామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై లోతుగా అధ్యయనం చేసి, అమలు చేస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే జాబ్ క్యాలెండర్‌ను ప్రకటిస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో గెలుపు బీఆర్ఎస్ పార్టీదేనని, 15 ఏళ్ల పాటు అధికారంలో ఉంటామన్న కేసీఆర్ వ్యాఖ్యలపై స్పందిస్తూ.. అవి కల్లబొల్లి కబుర్లేనని కొట్టిపారేశారు. ఖమ్మం జిల్లాలో రైతు ఆత్మహత్య చేసుకోవడం అత్యంత బాధాకరమన్నారు. ఆత్మహత్య వెనక ఎవరున్నారనే అంశంపై పకడ్బందీగా దర్యాప్తు జరుగుతోందని, కారకులు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని చెప్పారు. ఈ నెల 6న తెలంగాణ సీఎం ఎ.రేవంత్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో భేటీ కానున్న నేపథ్యంలో సమావేశ ఏర్పాట్లను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బుధవారం పరిశీలించారు. ఆయనతో పాటు సీఎస్ శాంతికుమారి, వివిధ విభాగాల అధికారులు ప్రజాభవన్‌ను సందర్శించారు.

### రైతుభరోసాపై జిల్లాలవారీగా సదస్సులు

రైతుభరోసాపై ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా ఉమ్మడి జిల్లాల వారీగా సదస్సులు నిర్వహించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. ఇప్పటికే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో నిర్వహిస్తున్న రైతు సదస్సులు గురువారంతో ముగుస్తాయి. ఆ తర్వాత జిల్లాస్థాయిలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# జగన్ అక్రమాస్తుల కేసుల్లో రోజువారీ విచారణ

(మొదటిపేజీ తరువాయి)



ప్రత్యేకంగా ఆయా కేసుల విచారణను పర్యవేక్షిస్తోంది. దీంతోపాటు జగన్ కేసులను వేగవంతంగా విచారణ చేపట్టాలని కోరుతూ మాజీ ఎంపీ చేగొండి హరిరామజోగయ్య హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ రెండు పిటిషన్‌లపై బుధవారం చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ టి. వినోద్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాప్రతినిధుల కేసులకు సంబంధించిన కేసుల్లో సంతృప్తికరమైన పురోగతి లేదని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఆయా కేసుల్లో నిందితులకు సమన్లు అందజేసే విషయంలో మరింత సమయం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం తరపున అదనపు అడ్వొకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్ కోరారు. నిందితులకు, సాక్షులకు సమన్లు అందజేసేందుకు చర్యలు తీసుకుంటామని, ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు. ఇందుకోసం డిజిటల్ వ్యవస్థను వినియోగించుకోవాలని హైకోర్టు సూచించింది. ఈ రెండు పిటిషన్‌లపై విచారణను ఈనెల 23కు వాయిదా వేసింది.

### ఇప్పటికైనా కదలిక వచ్చేనా?

ఉమ్మడి రాష్ట్రంలో తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని జగన్ భారీగా అక్రమాలకు పాల్పడ్డారంటూ సీబీఐ, ఈడీలు మొత్తం 20 చార్జిషీట్‌లు దాఖలు చేశాయి. ఈ కేసులపై సీబీఐ కోర్టులో గత 12 ఏళ్లుగా విచారణ కొనసాగుతూనే ఉంది. జగన్, విజయసాయిరెడ్డి సహా ఇతర నిందితులు దాదాపు 130 డిశ్చార్జి పిటిషన్లు దాఖలు చేశారు. వరుస పిటిషన్లు, దానిపై విచారణలు, మధ్యలో సీబీఐ జడ్జిల బదిలీలతో... అసలు కేసుపై విచారణే మొదలు కాలేదు. 2013 నుంచి సీబీఐ కోర్టులో ఏడుగురు జడ్జిలు బదిలీ అయ్యారు. ప్రజాప్రతినిధుల కేసులను హైకోర్టు, సుప్రీంకోర్టులు పర్యవేక్షిస్తున్నా.. వేగంగా విచారణ పూర్తి చేసి.. తీర్పులు ఇవ్వాలని సుప్రీం కోర్టు స్పష్టమైన మార్గదర్శకాలు జారీచేసినా ఇదీ పరిస్థితి. నిజానికి... హైదరాబాద్ సీబీఐ కోర్టులో పెండింగ్‌లో ఉన్న డిశ్చార్జి పిటిషన్‌లను ఫిబ్రవరి 29లోగా పరిష్కరించాలని గతేడాది డిసెంబరులో హైకోర్టు పేర్కొంది. అయితే భారీగా ఉన్న రికార్డులను పరిశీలించడంతోపాటు సాక్షుల వాంగ్మూలాలు రికార్డు చేయాల్సి ఉందని.. 13 వేల పేజీల డిక్టేషన్ సిద్ధం చేస్తున్నందున మరింత గడువు కావాలని సీబీఐ కోర్టు కోరడంతో గడువును రెండునెలలు అంటే ఏప్రిల్ 30 వరకు పొడిగించింది. ఆ రోజున తీర్పు వెలువడుతుందని అంతా భావించగా... తనకు అనారోగ్యం వల్ల తీర్పు వెల్లడించలేకపోతున్నానని జడ్జి ప్రకటించడం సంచలనంగా మారింది. ఆ తర్వాత ఆయన బదిలీపై మరో కోర్టుకు వెళ్లిపోయారు. కేవలం డిశ్చారి పిటిషన్‌లకే దశాబ్దకాలం పడితే.. ప్రధాన కేసులు ఎప్పుడు విచారణకు వస్తాయి? ఎప్పుడు శిక్షలు పడతాయి? అన్న అంశాలు ప్రశ్నార్థకంగా మారాయి.

## ఏపీ టీడీపీ ఆఫీసుపై దాడి కేసులో అప్పిరెడ్డి అనుచరుల అరెస్ట్

రెండేళ్ల కిందట పట్టపగలే టీడీపీ ఆఫీసుపై దాడి

గుంటూరులో ఐదుగురు నిందితులు అరెస్టు

నేడో రేపో లేళ్ల, నందిగం, దేవినేని అవినాశ్ వంతు!?

గుంటూరు, జూలై 3: టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో అరెస్టులు మొదలయ్యాయి. దాడిలో ప్రత్యక్షంగా పాల్గొన్న వారిలో ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వీరంతా వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అనుచరులే. ఈ దాడికి సూత్రధారులుగా భావిస్తున్న లేళ్ల అప్పిరెడ్డి, మాజీ ఎంపీ నందిగం సురేశ్, దేవినేని అవినాశ్‌నూ అరెస్టు చేసే అవకాశమున్నట్లు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. డీజీపీ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఉన్న టీడీపీ కార్యాలయంపై రెండేళ్ల కిందట పట్టపగలే వైసీపీ మూకలు దాడి చేసి విధ్వంసం సృష్టించిన సంగతి తెలిసిందే. నాటి ఘటనపై నేడు పోలీసులు దృష్టి సారించారు. సీసీ టీవీ ఫుటేజ్‌తోపాటు ఇతర ఆధారాలు సేకరించి దాడిలో పాల్గొన్న 63 మందిని గుర్తించారు. వీరిలో బుధవారం ఐదుగురిని అరెస్టు చేశారు. గుంటూరు 30వ డివిజన్ కార్పొరేటర్ వెంకటరెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బత్తుల దేవానంద్, గుంటూరు మార్కెట్ యార్డు డైరెక్టర్ షేక్ ఖాజా మొహిద్దీన్, వక్ఫ్ బోర్డు వైస్ చైర్మన్ షేక్ మస్తాన్ అలియాస్ స్టార్ మస్తాన్, వైసీపీ స్థానిక నేత గిరిలను మంగళగిరి రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై 147, 148, 324, 452, 447, 448, 326, 307 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్టు సమాచారం.

## సవాంగ్ గుడ్ బై

» ఏపీపీఎస్సీ చైర్మన్ పదవికి రాజీనామా

» వెంటనే ఆమోదించిన ప్రభుత్వం

» గౌతం సవాంగ్‌పై అనేక ఆరోపణలు

అమరావతి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ చైర్మన్ పదవికి గౌతం సవాంగ్ బుధవారం రాజీనామా చేశారు. ఆయన రాజీనామాను ప్రభుత్వం వెంటనే ఆమోదించింది. జగన్ ముఖ్యమంత్రి కాగానే గౌతం సవాంగ్‌ను డీజీపీగా నియమించిన సంగతి తెలిసిందే. డీజీపీగా ఆయన పూర్తిస్థాయిలో జగన్ సేవలో తరించిపోయారనే ఆరోపణలున్నాయి. ప్రస్తుత ముఖ్యమంత్రి, నాటి విపక్ష నేత చంద్రబాబుపై రాళ్లు విసిరినా సీరియస్‌గా తీసుకోలేదు. పైగా... 'నిరసన తెలపడంలో అదో భాగం' అన్నట్లు వింత వ్యాఖ్యలు చేశారు. ఇంత చేసినా జగన్ ఆయనను డీజీపీ పోస్టులో కొనసాగించలేదు. 2022లో పక్కకు తప్పించారు. తనకు గౌరవప్రదమైన పోస్టు ఇవ్వాలని కోరడంతో... ఏపీపీఎస్సీ చైర్మన్ పదవి కట్టబెట్టారు. దీని కోసం.. గౌతం సవాంగ్ ఐపీఎస్ కొలువును స్వచ్ఛందంగా వదులుకున్నారు. ఆయన హయాంలో ఏపీపీఎస్సీలో అనేక అక్రమాలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. తెలుగుదేశం ప్రభుత్వం ఇచ్చిన గ్రూప్-1 (2018) నోటిఫికేషన్‌ను గౌతం సవాంగ్ హయాంలో పూర్తిచేశారు. జవాబుపత్రాల మూల్యాంకనాన్ని నిబంధనలకు విరుద్ధంగా ఒకసారి ఆన్‌లైన్‌లో మరొకసారి ఆఫ్‌లైన్‌లో చేశారు. గుంటూరు సమీపంలోని హాయ్‌ల్యాండ్ రిసార్ట్స్‌లో మూల్యాంకనం చేసిన విషయాన్ని గౌతం సవాంగ్ దాచిపెట్టారు. దీనిపై అభ్యర్థులు న్యాయపోరాటం చేయడంతో హైకోర్టు ఆ ఉద్యోగాల భర్తీని రద్దుచేసింది. దీనిపై వైసీపీ ప్రభుత్వం సుప్రీం కోర్టుకు వెళ్లింది. అప్పట్లో ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు దీనిపై సమగ్ర విచారణ చేస్తామని ప్రకటించారు. అయినా సవాంగ్ ఏనాడూ దీనిపై వివరణ కూడా ఇవ్వలేదు. నిరుద్యోగుల భవిష్యత్తును నిర్ణయించే ఏపీపీఎస్సీని సవాంగ్ భ్రష్టుపట్టించారన్న విమర్శలు ఆయనపై వచ్చాయి. దీంతో తప్పని పరిస్థితుల్లో రాజీనామా చేశారు.

## హస్తినలో చంద్రబాబు

» నేడు ప్రధాని, కేంద్ర హోం మంత్రితో భేటీ

» నిర్మల, ఇతర మంత్రులతోనూ సమావేశం

అమరావతి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక చంద్రబాబు నాయుడు తొలిసారి ఢిల్లీ పర్యటనకు వెళ్లారు. బుధవారం సాయంత్రం గన్నవరం విమానాశ్రయం నుంచి బయల్దేరి ఢిల్లీ చేరుకున్నారు. ఆయనతో పాటు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, కొందరు అధికారులు ఉన్నారు. ఢిల్లీ విమానాశ్రయం నుంచి ఆయన నేరుగా అశోకారోడ్‌లోని 50 నివాసానికి చేరుకున్నారు. పార్టీ ఎంపీలకు విందు ఇచ్చారు. గురువారం ఉదయం పదిన్నర గంటలకు ప్రధాని మోదీని చంద్రబాబు కలవనున్నారు. ఈ మేరకు అపాయింట్‌మెంట్ ఖరారైంది. ఆ తర్వాత కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలుస్తారు. శుక్రవారం మధ్యాహ్నం వరకూ ఆయన ఢిల్లీలో ఉంటారు. ఈ మధ్యలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో పాటు పలువురు కేంద్ర మంత్రులతో సమావేశమై రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ ప్రతిపాదనలపై ఆయన చర్చించనున్నారు. ఆర్థికంగా క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న రాష్ట్రానికి కేంద్ర సాయం సాధించడం, రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్ర పథకాల పరిధిలో నిధులు మంజూరు చేయించుకోవడం వంటివి ఎజెండాలో ఉన్నాయి. శుక్రవారం సాయంత్రం ఆయన ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు చేరుకొంటారు. శనివారం హైదరాబాద్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశం అవుతారు.



## కాంగ్రెస్ సర్కారుపై ప్రజలే తిరగబడతారు..

» తొందర్లోనే ఆ రోజు రానుంది: కేసీఆర్

హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): అసంబద్ధ ప్రకటనలు, ప్రజా ఆకాంక్షలకు విరుద్ధంగా పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజు తొందర్లోనే రానుందని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. తమ పిచ్చిచేష్టలతో ప్రజల చేత ఛీ కొట్టించుకుంటున్నారని, ఏడు నెలల్లోనే కాంగ్రెస్ పాలనపై ప్రజలు విరక్తి చెందారని వ్యాఖ్యానించారు. బుధవారం ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో మహబూబాబాద్, మేడ్చల్, నల్లగొండ జిల్లాలకు చెందిన బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలతో ఆయన భేటీ అయ్యారు. ఇందులో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి, బీఆర్ఎస్ నేతలు మధుసూదనాచారి, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, కోటిరెడ్డి, గ్యాదరి కిశోర్, కంచర్ల భూపాల్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, గొంగిడి సునీతారెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు. కొద్దిరోజుల్లో బీఆర్ఎస్ కోసం ప్రజలే టార్చ్‌లైట్ పట్టుకొని వెతుక్కుంటూ వస్తారని, పార్టీ కార్యకర్తలు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ వారికి అందుబాటులో ఉండాలని సూచించారు. ఇప్పటివరకు విజయ ప్రస్థానంలో ఉన్న బీఆర్ఎస్‌కు నిన్నటి ఓటమితో దిష్టి తీసినట్లయిందని, పునరుత్తేజంతో ప్రజాదరణను కూడగట్టాలన్నారు. అలవిగాని హామీలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్.. వాటిని అమలు చేతగాక గిమ్మిక్కులతో ప్రజలను పక్కదారి పట్టిస్తూ పబ్బం గడుపుతోందని విమర్శించారు. తనను కలిసేందుకు కార్యకర్తలు ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో.. ఇకపై వారానికి 2 నియోజకవర్గాల నేతలతో సమావేశమవుతానని వెల్లడించారు.

## ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి లాకర్లను తెరిచిన ఈడీ

పటాన్‌చెరు, జూలై 3: పటాన్‌చెరు బీఆర్ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి లావాదేవీలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు దర్యాప్తును ముమ్మరం చేశారు. సుమారు రూ. 320 కోట్ల మైనింగ్ అక్రమ నగదు లావాదేవీలపై కొన్ని రోజులుగా దర్యాప్తు జరుపుతున్న విషయం తెలిసిందే. ఇటీవల ఆయన ఇళ్లు, కార్యాలయాలపై ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ఆస్తుల పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. పలు బ్యాంకుల్లో ఉన్న అకౌంట్ల వివరాలను సేకరించి నగదు లావాదేవీలను సమీక్షిస్తున్నారు. అదే సమయంలో పలు చోట్ల ఉన్న బ్యాంకు లాకర్లను సీజ్ చేశారు. బుధవారం పటాన్‌చెరులోని ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంకుల్లో ఉన్న పలు లాకర్లను తెరిచి సోదాలు నిర్వహించారు. ఎమ్మెల్యే కుటుంబసభ్యులతో పాటు ప్రధాన అనుచరులు, బినామీలుగా గుర్తించిన వారి అకౌంట్లు, లాకర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు బ్యాంకుల్లో నగదు లభించినట్లు తెలిసింది.



ఏడో బ్లాక్ వద్ద వరద రాకముందు కాఫర్ డ్యామ్

## ఏడో బ్లాక్‌లో దెబ్బతిన్న గ్రౌటింగ్!?

(మొదటిపేజీ తరువాయి)

క్రమంలోనే వరదలు ప్రారంభమవడంతో సాంకేతిక సమస్యలు ఏర్పడినట్లు తెలిసింది. పిల్లర్ల కింద ఇటీవల చేపట్టిన గ్రౌటింగ్ పచ్చిగా ఉండడంతో నీటి ఊటల ద్వారా కిందకు జారి ఉంటుందని భావిస్తున్నారు. దీనికి తోడు బ్లాక్-7కు ఎగువన ఉన్న తాత్కాలిక కాఫర్ డ్యామ్ తొలగించకపోవడంతో అంతర్గతంగా వచ్చే ఊటల ద్వారా గ్రౌటింగ్‌కు దెబ్బతింటున్నట్లు భావించిన అధికారులు రాత్రి పదిన్నర గంటలకు హడావుడిగా కాఫర్ డ్యామ్ తొలగింపు పనులు చేపట్టినట్లు తెలిసింది. దీనిపై నీటిపారుదల శాఖ అధికారులు మౌనంగా ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది. అసలు మేడిగడ్డలో ఏం జరుగుతోందన్న చర్చ మొదలైంది. ఈ విషయమై బ్యారేజీ ఈఈ తిరుపతిరావును సంప్రదించగా.. ప్రస్తుతం బ్యారేజీ వద్ద ఎలాంటి సమస్యా లేదన్నారు. రోజువారీ పనుల్లో భాగంగానే మట్టిని తొలగిస్తున్నట్లు తెలిపారు.

## యువతిపై ఇద్దరు సహోద్యోగుల అత్యాచారం

మత్తుమందు కలిపిన కూల్‌డ్రింక్స్ తాగించి రేప్.. నిందితుల అరెస్టు



మియాపూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విధుల్లో భాగంగా సహోద్యోగులైన ఇద్దరు యువకులతో కలిసి కారులో బయలుదేరిందా యువతి! అప్పటికే ఆమెపై కన్నేసిన ఆ యువకులు పథకం ప్రకారం కారు చెడిపోయిందంటూ మార్గమధ్యలో ఓ చోట వాహనాన్ని ఆపారు. ఆమెకు మత్తు మందు కలిపిన స్వీట్లు తినిపించి.. కూల్‌డ్రింక్స్ తాగించారు. మత్తులోకి వెళ్లగానే ఆమెపై ఒకరి తర్వాత మరొకరు అత్యాచారం చేశారు. బాధితురాలు ఏపీలోని కడప జిల్లాకు చెందిన 25 ఏళ్ల యువతి. డిగ్రీ దాకా చదువుకొని బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కొచ్చింది. మియాపూర్‌లోని ఓ రియల్ ఎస్టేట్ సంస్థలో ట్రైనీ సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా చేరి.. అక్కడే ఓ హాస్టల్లో ఉంటోంది. ఆ సంస్థలోనే.. ఏపీలోని కర్నూలు జిల్లాకు చెందిన జనార్దన్ (26), కడప జిల్లాకు చెందిన సంగారెడ్డి (27) పనిచేస్తున్నారు. సంగారెడ్డికి సొంతంగా కారు ఉంది. ఆ కారులో గతనెల 30న మధ్యాహ్నం యాదగిరిగుట్ట సమీపంలో సంస్థకు చెందిన వెంచర్‌ను చూసేందుకు, అక్కడ ఓ సమావేశానికి హాజరయ్యేందుకు యువతిని వెంటబెట్టుకొని జనార్దన్, సంగారెడ్డి బయలుదేరారు. సమావేశం ముగిశాక రాత్రి తొమ్మిది గంటలకు హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. రాత్రి 10.30కు నిర్మాణంలో ఉన్న ఓ భవంతి వద్ద ఆపారు. ఎందుకు ఆపారు? అని ఆమె ప్రశ్నిస్తే.. కారు చెడిపోయిందని నమ్మించారు. అక్కడే మత్తిచ్చి ఆమెపై ఇద్దరు అత్యాచారానికి ఒడిగట్టారు. తర్వాత ఆమెను అదే వాహనంలో తెల్లవారుజామున మూడింటికి మియాపూర్‌లోని హాస్టల్ వద్ద వదిలేసి వెళ్లిపోయారు. ఈ ఘటనపై స్నేహితుల సహకారంతో బాధితురాలు ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న ఉప్పల్ పోలీసులు, కేసును మియాపూర్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు నిందితులు జనార్దన్, సంగారెడ్డిలను అరెస్ట్ చేశారు.

## 2 'రాష్ట్ర అతిథి గృహాలు'

(మొదటిపేజీ తరువాయి)

వెచ్చిస్తుండగా, ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో నిర్మించే నూతన అతిథి గృహం కోసం రూ.7 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఈ మేరకు వీటి పనులు మొదలవ్వగా, ప్రస్తుతం పిల్లర్ల దశలో ఉన్నాయి. కొత్త గెస్ట్ హౌస్‌ను గ్రౌండ్+2 అంతస్తుల్లో దాదాపు 10 వేల చదరపు అడుగుల విస్తీర్ణం ఉండేలా నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో పచ్చదనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పాటు ప్రహరీ గోడను కూడా నిర్మించనున్నారు. నిజానికి గత ప్రభుత్వం హయాంలో చెప్పుకోదగ్గ స్థాయిలో రాష్ట్ర అతిథి గృహాలను ఏర్పాటు చేయలేదు. ఎవరైనా అతిథులు వచ్చినప్పుడు స్టార్ హోటళ్లలోనే బస ఏర్పాటు చేశారు. రేవంత్ సర్కారు మాత్రం రాష్ట్ర అతిథి గృహాలపై దృష్టిసారించింది. అతిథులను స్టార్ హోటళ్లలో ఉంచాలంటే ఖర్చు భారీగా అవుతుండడంతో పాటు, వారికి భద్రత కల్పించడం కూడా సమస్యగా మారుతోంది. దీంతో ప్రభుత్వ అతిథి గృహాలుంటే ఎలాంటి ఇబ్బంది ఉండకపోగా, భద్రతాపరమైన సమస్యలు కూడా తలెత్తవని భావిస్తోంది. ప్రభుత్వం అతిథి గృహాలను ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో సీఎం క్యాంప్ ఆఫీస్ అంశం తెరపైకి వచ్చింది. గత సీఎం ప్రగతిభవన్ నుంచే కార్యకలాపాలు నిర్వహించగా, ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రం నుంచి కూడా పాలన సాగించారు. దాంతో అప్పుడు పెద్దగా క్యాంప్ ఆఫీస్ గురించి చర్చ లేదు. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రగతిభవన్‌ను ప్రజాభవన్‌గా మార్చి, అందులో కొన్ని భవనాలను డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి సీతక్కకు కేటాయించింది. దీంతో సీఎంకు క్యాంప్ ఆఫీస్ లేకుండా పోయింది. ప్రస్తుతం రేవంత్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసం, సచివాలయం, లేదంటే పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమీక్షలు నిర్వహిస్తున్నారు. అయితే సీఎం క్యాంపు కార్యాలయం కోసమని గతంలో బేగంపేట మెట్రోభవన్, నానక్‌రామ్‌గూడలోని గ్రోత్ కారిడార్ సెంటర్, మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రాలను పరిశీలించారు. వీటిలో క్యాంప్ ఆఫీస్ ఎక్కడ అన్నది ఇప్పటికీ ఖరారు చేయలేదు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో నిర్మిస్తున్న అతిథి గృహాన్ని సీఎం క్యాంప్ ఆఫీస్‌గా వినియోగిస్తారన్న ప్రచారం కూడా ఉంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No. 70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● గురువారం 4 జూలై 2024
diksuchi@andhrajyothy.com


నోయిడాలోని హిందుస్థాన్ కంప్యూటర్స్ లిమిటెడ్(హెచ్‌సీఎల్) టెక్నాలజీస్ - 'టెక్‌బీ' ఎర్లీ కెరీర్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. అభ్యర్థులు ఐటీ ఉద్యోగులుగా రాణించేందుకు, అసోసియేట్స్‌గా ఎదిగేందుకు ఈ ప్రోగ్రామ్ తోడ్పడుతుంది. సంస్థ నిర్వహించే కెరీర్ ఆప్టిట్యూడ్ టెస్ట్(హెచ్‌సీఎల్ క్యాట్), వర్సంట్ టెస్ట్, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. హైదరాబాద్, విజయవాడ సహా నోయిడా, లఖ్‌నవూ, నాగ్‌పూర్, చెన్నైలలో శిక్షణ కేంద్రాలు ఉన్నాయి. ఇంటర్న్‌షిప్ సమయంలో నెలకు రూ.10,000ల స్టయిపెండ్ ఇస్తారు. శిక్షణ పూర్తయిన అభ్యర్థులకు సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్/డిజైన్ ఇంజనీర్‌గా ఉద్యోగావకాశం కల్పిస్తారు. ఆసక్తిగలవారు ఉద్యోగం చేస్తూనే బిట్స్ పిలానీ, ఐఐఐటీ కొట్టాయం, అమిటి యూనివర్సిటీ(ఆన్‌లైన్), కేఎల్ యూనివర్సిటీ, శస్త్ర యూనివర్సిటీలలో చదువుకునే అవకాశం ఉంది. సంబంధిత గ్రాడ్యుయేషన్ కోర్సులకయ్యే ఖర్చును నిబంధనల ప్రకారం సంస్థ భరిస్తుంది.



# హెచ్‌సీఎల్ టెక్నాలజీస్‌లో టెక్‌బీ ప్రోగ్రామ్

**విభాగాలు:**
డెవలప్ అప్లికేషన్స్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, కోడింగ్, టెస్టింగ్ ఇంజనీర్, అనలిస్ట్, ప్రొడక్ట్ అండ్ అప్లికేషన్, డిటెక్టింగ్ బగ్స్ అండ్ రన్నింగ్ డయాగ్నస్టిక్స్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అప్లికేషన్స్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, డిజైన్ ఇంజనీర్, ప్రొడక్ట్ అండ్ అప్లికేషన్ డిజైన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్, వెబ్ సర్వర్ డెప్లాయ్‌మెంట్, ప్రాసెస్ ఆటోమేషన్, సెక్యూరిటీ పాలసీ ఇంప్లిమెంటేషన్

**ప్రోగ్రామ్ వివరాలు:** దీనిని హైబ్రిడ్(ఆన్‌లైన్ సెషన్స్, తరగతి గది బోధన) విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొదట ఐటీ ఫౌండేషన్ అంశాలు బోధిస్తారు. ఐటీ ఫండమెంటల్స్, ఐటీ ప్రొఫెషనల్స్‌కు అవసరమయ్యే అంశాలు వివరిస్తారు. తరవాత ట్రెయినింగ్ ఫర్ జాబ్ సెషన్స్ ఉంటాయి. ఇందులో జాబ్ బేస్డ్ లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, సిమ్యులేషన్స్, కేస్ బేస్డ్ ప్రాక్టికల్ కరిక్యులమ్, పీర్ బేస్డ్ డిస్కషన్స్, లైఫ్ కోచెస్ టూల్స్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తారు. సంస్థకు చెందిన గ్లోబల్ ప్రాజెక్ట్‌లలో ఇంటర్న్‌షిప్ పూర్తిచేయాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్‌కు సంబంధించిన స్టడీ మెటీరియల్‌ను సంస్థ అందిస్తుంది. అభ్యర్థులు సమయానుసారం అసెస్‌మెంట్‌లు, అసైన్‌మెంట్‌లు సబ్మిట్ చేయాలి.

**అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 75 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండో తరగతి /తత్సమాన పరీక్ష (2023/2024) ఉత్తీర్ణులైనవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఐటీ విభాగాలకు మేథమెటిక్స్/బిజినెస్ మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. ఇందులో కనీసం 60 శాతం మార్కులు తప్పనిసరి. ఐఐటీ జేఈఈ మెయిన్ 2023లో కనీసం 80 పర్సంటైల్ సాధించిన అభ్యర్థులు హెచ్‌సీఎల్ కెరీర్ ఆప్టిట్యూడ్ టెస్ట్(హెచ్‌సీఎల్ క్యాట్) రాయనవసరం లేదు. వీరిని నేరుగా వర్సంట్ టెస్ట్, ఇంటర్వ్యూలకు అనుమతిస్తారు.

**ఎంపిక ప్రక్రియ:** అభ్యర్థులు ముందుగా కెరీర్ ఆప్టిట్యూడ్ టెస్ట్(హెచ్‌సీఎల్ క్యాట్) రాయాల్సి ఉంటుంది. దీనిని ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. ఇందులో క్వాంటిటేటివ్ రీజనింగ్(మేథమెటిక్స్), లాజికల్ రీజనింగ్ సంబంధిత ప్రశ్నలు అడుగుతారు. ఇంటర్ స్థాయిలో ప్రశ్నలు ఉంటాయి. ఇందులో అర్హత సాధించిన అభ్యర్థులను వర్సంట్ టెస్ట్‌కు పిలుస్తారు. ఇందులో స్పోకెన్ ఇంగ్లీష్, లాంగ్వేజ్ స్కిల్స్ పరీక్షిస్తారు. తరవాత ఫేస్ టు ఫేస్ ఇంటరాక్షన్ విధానంలో ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తారు.

**ఉన్నత విద్యావకాశాలు:** హెచ్‌సీఎల్ టెక్‌బీ ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులు ఉద్యోగంలో చేరిన తరవాత ఆసక్తి మేరకు పై చదువులు చదువుకోవచ్చు. శస్త్ర యూనివర్సిటీలో మూడేళ్ల బీసీఏ, రెండేళ్ల ఎంసీఏ/ఎమ్మెస్సీ డేటా సైన్స్; బిట్స్ పిలానీలో నాలుగేళ్ల బీఎస్సీ(డిజైన్ అండ్ కంప్యూటింగ్), వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్‌లు(బీటెక్, ఎంటెక్, బీఎస్సీ, ఎమ్మెస్సీ); అమిటి యూనివర్సిటీ(ఆన్‌లైన్)లో మూడేళ్ల వ్యవధి గల బీకాం/బీసీఏ/బీబీఏ/బీఎస్సీ, రెండేళ్ల ఎంబీఏ/ఎంసీఏ; కేఎల్ యూనివర్సిటీలో మూడేళ్ల బీసీఏ; ఐఐఐటీ కొట్టాయంలో ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ కోర్సుల్లో చేరవచ్చు.

- దరఖాస్తు ఫీజు లేదు
- **వెబ్‌సైట్:** hcltechbee.com

---

వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న 6,128 క్లర్క్ పోస్టుల భర్తీకి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలెక్షన్(ఐబీపీఎస్) నోటిఫికేషన్ విడుదల చేసింది. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలైంది. అర్హులైన అభ్యర్థులు జూలై 21లోపు దరఖాస్తు చేసుకోవాలి. ఈ ప్రక్రియలో ఏయే బ్యాంకులు పాల్గొంటున్నాయి. ఎలా దరఖాస్తు చేసుకోవాలి? దరఖాస్తు చేసే ముందు ఏయే అంశాలను గమనంలోకి తీసుకోవాలి? పరీక్ష విధానం ఎలా ఉంటుంది? ఆఫర్ లెటర్ అందుకున్న తరవాత ఉద్యోగంలో చేరబోయే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి? వివరాలు చూద్దాం..!

## ఐబీపీఎస్ క్లర్క్ ఎగ్జామ్ 2024

# ముఖ్యమైన పది అంశాలు

1. ఈ భర్తీ ప్రక్రియలో దేశవ్యాప్తంగా మొత్తం 11 ప్రభుత్వరంగ బ్యాంకులు పాల్గొంటున్నాయి.
2. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఏదైనా బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. వయసు 20 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి. అంటే 1996 జూలై 1 కి ముందు గానీ, 2004 జూలై 1 తరవాత గానీ జన్మించి ఉండకూడదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
3. అభ్యర్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి. కంప్యూటర్ ఆపరేషన్స్/లాంగ్వేజ్‌లో సర్టిఫికెట్/డిప్లొమా/డిగ్రీ కోర్సు చేసి ఉండాలి లేదా హైస్కూల్/కాలేజీ స్థాయిలో కంప్యూటర్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి. అభ్యర్థులకు తాము దరఖాస్తు చేస్తున్న ప్రాంతానికి సంబంధించిన అధికార భాషలో తగిన ప్రావీణ్యం ఉండాలి.
4. పైన పేర్కొన్న అన్ని అర్హతలతో పాటు తప్పనిసరిగా ఉండాల్సిన మరో అర్హత హెల్తీ క్రెడిట్ హిస్టరీ(మంచి రుణ చరిత్ర). ఎంపికైన అభ్యర్థులు ఉద్యోగాల్లో చేరే ముందు సంబంధిత బ్యాంకులు తప్పనిసరిగా క్రెడిట్ హిస్టరీ చెక్ చేస్తాయి. కాబట్టి అభ్యర్థులు సిబిల్ స్టేటస్‌ను అప్‌డేట్ చేసుకోవాలి. ఒకవేళ సిబిల్ స్కోరు అప్‌డేట్ కాని పక్షంలో...ఇంతకు ముందే ఏదైనా బ్యాంకు/సంస్థ నుంచి రుణం తీసుకుని చెల్లించిన అభ్యర్థులు.. సదరు బ్యాంక్/సంస్థ నుంచి నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్(ఎన్‌ఓసీ)ని తీసుకోవాలి. అలా చేయని పక్షంలో ఇచ్చిన ఆఫర్ లెటర్‌ను బ్యాంక్ క్యాన్సిల్ చేసే ప్రమాదం ఉంటుంది.
5. ఇక పరీక్ష విషయానికొస్తే...ఐబీపీఎస్ క్లర్క్ ప్రిలిమ్స్ ఎగ్జామ్‌ని 100 మార్కులకు నిర్వహిస్తారు. ప్రశ్న పత్రంలో 100 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష వ్యవధి 60 నిమిషాలు. ప్రశ్న పత్రంలో మూడు విభాగాలు ఉంటాయి.

| విభాగం | ప్రశ్నలు | మార్కులు | సమయం |
|---|---|---|---|
| ఇంగ్లీష్ లాంగ్వేజ్ | 30 | 30 | 20 నిమిషాలు |
| న్యూమరికల్ ఎబిలిటీ | 35 | 35 | 20 నిమిషాలు |
| రీజనింగ్ ఎబిలిటీ | 35 | 35 | 20 నిమిషాలు |
| **మొత్తం** | **100** | **100** | **60 నిమిషాలు** |

6. అభ్యర్థులు ప్రతి సెక్షన్‌లోనూ ఐబీపీఎస్ నిర్దేశించిన కటాఫ్ మార్కుల మేరకు అర్హత సాధించాల్సి ఉంటుంది. ప్రిలిమ్స్ సాధించిన మెరిట్ మేరకు ఆన్‌లైన్ మెయిన్స్ పరీక్షకు అభ్యర్థులను ఐబీపీఎస్ షార్ట్‌లిస్ట్ చేస్తుంది.
7. మెయిన్స్ పరీక్షను 200 మార్కులకు నిర్వహిస్తారు. మొత్తం 190 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష వ్యవధి 160 నిమిషాలు. ప్రశ్న పత్రంలో నాలుగు విభాగాలు ఉంటాయి.
   - **జనరల్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్:** 50 ప్రశ్నలు - 50 మార్కులు
   - **జనరల్ ఇంగ్లీష్:** 40 ప్రశ్నలు - 40 మార్కులు
   - **రీజనింగ్ ఎబిలిటీ అండ్ కంప్యూటర్ అప్టిట్యూడ్:** 50 ప్రశ్నలు - 50 మార్కులు
   - **క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్:** 50 ప్రశ్నలు - 60 మార్కులు
8. మొదటి రెండు విభాగాల్లో ప్రతి విభాగానికి 35 నిమిషాలు, తరవాత రెండు విభాగాల్లో ప్రతి దానికి 45 నిమిషాల సమయాన్ని ఐబీపీఎస్ నిర్దేశించింది. ఒక వేళ ఏమైనా మార్పులు చేర్పులు ఉన్నట్లయితే ఐబీపీఎస్ ఆ సమాచారాన్ని తన వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతుంది. కాబట్టి అభ్యర్థులు తరచుగా ఐబీపీఎస్ వెబ్‌సైట్‌ను చెక్ చేస్తూ ఉండాలి. ఇక పరీక్ష విధానానికి సంబంధించిన పూర్తి సమాచారంతో కూడిన ఇన్ఫర్మేషన్ హ్యాండ్ అవుట్‌ను ఐబీపీఎస్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
9. ఇక్కడ అభ్యర్థులు గమనించాల్సిన మరో ముఖ్య విషయం ఏమిటంటే.. నెగెటివ్ మార్కింగ్ విధానాన్ని ఐబీపీఎస్ అమలు చేస్తుంది. తప్పుగా గుర్తించిన ప్రతి సమాధానానికి నాలుగో వంతు(0.25) మార్క్ కట్ చేస్తుంది. ఒకవేళ అభ్యర్థి సమాధానం గుర్తించకుండా ఖాళీగా వదిలిపెడితే మార్కుల్లో ఎలాంటి కోత ఉండదు
10. అభ్యర్థులు ఐబీపీఎస్ నిర్దేశించిన కనీస మార్కులు(కటాఫ్) తప్పనిసరిగా సాధించాలి. అయితే ఈ కటాఫ్ మార్కులను రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఆ సమయానికి బ్యాంకుల్లో ఉన్న ఖాళీల సంఖ్యను బట్టి ఐబీపీఎస్ నిర్దేశిస్తుంది. ప్రొవిజనల్ అలాట్‌మెంట్ ప్రాసెస్ పూర్తయ్యే వరకూ మెయిన్స్ మార్కులను ఐబీపీఎస్ వెల్లడించదు.



**ఖాళీలు ఉన్న బ్యాంకులు**
- బ్యాంక్ ఆఫ్ బరోడా
- కెనరా బ్యాంక్
- ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్
- యూకో బ్యాంక్
- బ్యాంక్ ఆఫ్ ఇండియా
- సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
- పంజాబ్ నేషనల్ బ్యాంక్
- యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
- బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర
- ఇండియన్ బ్యాంక్
- పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్

మొత్తం ఖాళీలు: 6,128
ఆంధ్రప్రదేశ్‌లో: 105, తెలంగాణలో: 104
తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:
**తెలంగాణ:** హైదరాబాద్, సికింద్రాబాద్, కరీంనగర్.
**ఆంధ్రప్రదేశ్:** గుంటూరు, విజయవాడ, కర్నూలు, విశాఖపట్నం.

---

# జాబ్ కార్నర్

## టీజీపీఎస్సీలో లీగల్ ఎక్స్‌పర్ట్‌లు

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ).... కాంట్రాక్ట్/కౌట్ సోర్సింగ్ ప్రాతిపదికన టీజీపీఎస్సీ కార్యాలయంలో పనిచేసేందుకు ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాదుల నుంచి కింద పేర్కొన్న సేవల కోసం దరఖాస్తులు కోరుతోంది.

1. లీగల్ ఎక్స్‌పర్ట్: **3 పోస్టులు**
2. సీనియర్ కౌన్సెల్: **1 పోస్టు**

**అర్హతలు:** ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం ఉత్తీర్ణతతోపాటు కనీసం సంబంధిత రంగంలో మూడేళ్ల అనుభవం ఉండాలి.
**వేతనం:** నెలకు రూ.60,000
**దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ దరఖాస్తులను, ధ్రువపత్రాలతో సహా టీజీపీఎస్సీ కార్యాలయంలో అందజేయాలి.
**దరఖాస్తుకు చివరి తేదీ:** 2024 జూలై 15
**వెబ్‌సైట్:** https://www.tspsc.gov.in/



## యూఓహెచ్‌లో నాన్ టీచింగ్ ఖాళీలు

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(యూఓహెచ్)...కింద పేర్కొన్న నాన్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

**గ్రూప్-ఎ పోస్టులు**
1. డిప్యూటీ రిజిస్ట్రార్(డిప్యూటేషన్): **2 పోస్టులు**
2. ఇంటర్నల్ ఆడిట్ ఆఫీసర్(డిప్యూటేషన్): **1 పోస్టు**
3. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(డిప్యూటేషన్)(సివిల్): **1 పోస్టు**
4. సీనియర్ సిస్టమ్ అనలిస్ట్: **1 పోస్టు**
5. అసిస్టెంట్ డైరెక్టర్ ఫిజికల్ ఎడ్యుకేషన్: **1 పోస్టు**
6. అసిస్టెంట్ రిజిస్ట్రార్: **2 పోస్టులు**
7. నెట్‌వర్కింగ్ ఇంజనీర్: **1 పోస్టు**

**గ్రూప్-బి పోస్టులు**
8. సెక్షన్ ఆఫీసర్: **3 పోస్టులు**
9. అసిస్టెంట్ ఇంజనీర్(సివిల్/ఎలక్ట్రికల్): **1 పోస్టు**
10. సీనియర్ అసిస్టెంట్: **3 పోస్టులు**
11. అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్: **1 పోస్టు**
12. సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్: **1 పోస్టు**
13. పర్సనల్ అసిస్టెంట్: **1 పోస్టు**

**గ్రూప్-సి పోస్టులు**
14. టెక్నికల్ అసిస్టెంట్: **1 పోస్టు**
15. జూనియర్ ప్రొఫెషనల్ అసిస్టెంట్: **1**
16. ఆఫీస్ అసిస్టెంట్: **4 పోస్టులు**
17. స్టెనోగ్రాఫర్: **5 పోస్టులు**
18. ల్యాబొరేటరీ అసిస్టెంట్: **4 పోస్టులు**
19. జూనియర్ ఆఫీసర్ అసిస్టెంట్: **14 పోస్టులు**
20. ల్యాబొరేటరీ అటెండెంట్: **4 పోస్టులు**

**అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, 10+2, సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ, నెట్/స్లెట్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
**వయోపరిమితి:** గ్రూప్-ఎ పోస్టులకు 62 ఏళ్లు; గ్రూప్-బి పోస్టులకు 35 ఏళ్లు; గ్రూప్-సి పోస్టులకు 32 ఏళ్లు మించకూడదు.
**ఎంపిక ప్రక్రియ:** రాత పరీక్ష, ట్రేడ్ టెస్ట్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా
**దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
**దరఖాస్తు చివరి తేదీ:** జూలై 19
**వెబ్‌సైట్:** https://uohyd.ac.in/

## ఎండీఎస్ఎల్‌లో అప్రెంటిస్‌లు

ముంబయిలోని మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్... కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
**ట్రేడులు:** డ్రాఫ్ట్స్‌మన్(మెకానికల్), ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, పైప్ ఫిట్టర్, స్ట్రక్చరల్ ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానిక్, వెల్డర్, కార్పెంటర్, రిగ్గర్, వెల్డర్ ఎలక్ట్రికల్.
**అర్హత:** ఖాళీని అనుసరించి ఎనిమిదో తరగతి, పదో తరగతి, ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
**వయోపరిమితి:** 2024 అక్టోబరు 1 నాటికి గ్రూప్-ఎ 15 నుంచి 19 ఏళ్లు; గ్రూప్-బి 16-21 ఏళ్లు, గ్రూప్ సి 14-18 ఏళ్ల మధ్య ఉండాలి.
**దరఖాస్తు రుసుము:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీకి రూ.100. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.
**ఎంపిక ప్రక్రియ:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష, స్కిల్/ట్రేడ్ టెస్ట్, సర్టిఫికెట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా
**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 26
**వెబ్‌సైట్:** https://www.mazagondock.in/

---

## చిట్టీల్స్



# నౌకరు తెలివి

రామాపురంలో ఒక భూస్వామి ఉండే వాడు అతనికితాను అందరికన్నా తెలివైన వాడినని చాలా నమ్మకం. తన దగ్గర పనిచేసే నౌకర్లను, వారి తెలివి తక్కువ పనులను ఎపుడూ హేళన చేస్తూ, తన మిత్రుల ముందు వారిని తిడుతూ ఉండేవాడు. ఒకరోజు తనకు ఓ మిత్రుడు కానుకగా పంపిన కోడికూరను ద్రాక్షారసాన్ని నౌకరు చేత ఇంటికి పంపుతూ నౌకరుతోఇలా చెప్పాడు' ఈ బుట్టలోఉన్నగిన్నెలో ఒక పిట్ట, సీసాలో విషం ఉన్నాయి. జాగ్రత్తగా తీసుకువెళ్లి ఇంట్లో ఇవ్వు, ఆ రెంటి మూతలు అసలు తెరిచి చూడకు ప్రమాదం, పిట్ట ఎగిరిపోతే కష్టం' అన్నాడు. నౌకరు అలా వెళ్లగానే 'విషం అని చెప్పాను కాబట్టి నౌకరు అసలు మూత తెరిచి చూడడు ఎలా ఉంది మన తెలివి' అంటూ నవ్వాడు.

ఆ నౌకరు యజమాని కంటే తెలివైన వాడు. యజమాని ఇలా చెప్పాడంటే అందులో ఏముందో చూడాలి అనుకున్నాడు. దారిలో బుట్టలోపలి గిన్నె, సీసా తెరిచి చూడగా ఘుమఘుమలాడే మంచి కోడి కూర తో పాటు ద్రాక్షారసం కనిపించాయి. ఎంచక్కా ఆ రెంటినీ ఖాళీ చేసి, చెట్టు కింద పడుకుని నిద్ర పోయాడు. సాయంత్రం ఇల్లు చేరిన భూస్వామికి నౌకరు ఇంటికే రాలేదని తెలిసి,అతన్ని వెతుకుతూ వెళ్లాడు అతనికి నౌకరు ఒక చెట్టు కింద పడుకుని, హాయిగా నిద్ర పోతూ కనిపించాడు. ఏమైంది అని అడిగిన యజమానితో నౌకరు 'నేనుబుట్టతలపై పెట్టుకుని నడుస్తూ ఉండగా కాలికి రాయి తగిలి ముందుకు తూలగానే బుట్టలోని పిట్ట ఎగిరి పోయింది, అది తెలిసి మీరు తిడతారన్న భయంతో విషం తాగేశాను కానీ ఎందుకనో నేను బతికే ఉన్నానయ్యా' అన్నాడు. అనవసరంగా అబద్ధం చెప్పి నేనే నష్ట పోయాను కొంచెం జాగ్రత్తలు చెప్పి పంపితే అయిపోయేది అనుకున్నాడు భూస్వామి.


**దారి కనుక్కోండి**












**డైలీ సుడోకు - 349**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 6 | | 8 | | 2 | | | | 7 |
| | 4 | 2 | | | | | 5 | |
| | 9 | | | | 8 | | | 1 |
| 4 | | | 9 | | | | 3 | |
| | | | 7 | | 2 | | | |
| | 6 | | | | 3 | | | 9 |
| 3 | | | 5 | | | | 7 | |
| | 7 | | | | | 5 | 1 | |
| 5 | | | | 1 | | 9 | | 4 |

**సుడోకు - 348 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 2 | 7 | 5 | 8 | 1 | 3 | 4 | 9 | 6 |
| 1 | 4 | 8 | 7 | 6 | 9 | 2 | 5 | 3 |
| 9 | 3 | 6 | 4 | 2 | 5 | 8 | 1 | 7 |
| 8 | 6 | 4 | 1 | 3 | 2 | 9 | 7 | 5 |
| 3 | 9 | 7 | 5 | 4 | 6 | 1 | 2 | 8 |
| 5 | 1 | 2 | 9 | 8 | 7 | 6 | 3 | 4 |
| 4 | 8 | 3 | 2 | 7 | 1 | 5 | 6 | 9 |
| 6 | 5 | 1 | 3 | 9 | 8 | 7 | 4 | 2 |
| 7 | 2 | 9 | 6 | 5 | 4 | 3 | 8 | 1 |

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.